జనవరి-ఫిబ్రవరి 2007
వెల : రు 10/-

అరుణతార

తెలుగు సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక
సంపుటి 25 సంచిక 7 విజయవాడ

సంస్మరణ

వడ్కాపురం చంద్రమౌళి, విజయలక్ష్మి

విప్లవోద్యమంలో పాతికేళ్ల వ్యక్తిత్వం

- వరవరరావు

కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి దగ్గర్లో ఉన్న వడ్కాపురం పెద్ద గ్రామం. బ్రాహ్మణులు, కరణాలు తప్ప అన్ని కులాల వాళ్లు పదులు, ఇరవైల కుటుంబాలకు మించే ఉన్నారు. వెలమలవయితే ముప్పై కుటుంబాలు ఉన్నాయి. చంద్రమౌళి ఆ ఊళ్లో వడ్ల కుటుంబంలో పుట్టాడు. ఆయన తండ్రి, ఇంకా ఆ వృత్తిలోని వాళ్లు కొందరు పెద్దపల్లి ప్రాంతంలోనే వడ్లపనికి పెట్టింది పేరు. ఇప్పుడు శ్రీరాం పాదసాగర్ కాలువ రావడం వల్ల పొలాలకు నీళ్లు అంది గ్రామం పచ్చగానే ఉంది. అంతే కాకుండా కడివెండికివలెనే ఈ గ్రామానికీ పక్కన వాగు ఉంది. ఆ వాగులోనే ఎర్రంరెడ్డి సంతోషరెడ్డిని డిసెంబర్ 10న కడివెండి వాగులో దహనం చేసినట్లుగానే 2006 డిసెంబర్ 30న వడ్కాపురం చంద్రమౌళిని ఆయన సహచరి విజయలక్ష్మిని దహనం చేసారు. ఈ ఇద్దరి చితులకు చంద్రమౌళి తల్లి మణెమ్మ నిప్పు పెట్టింది.

బయటి ప్రపంచానికయితే వడ్కాపురం చంద్రమౌళి అనగానే ఒరిస్సాలో కోరాపుట్ పోలీసు ఆయుధాగారంపై, జైలుపై దాడిచేసి వందలాది ఆయుధాలు ఎత్తుకపోయిన వేలాది మందికి నాయకత్వం వహించి సిపిఐ మావోయిస్టు అగ్రనేతగా వెంటనే గుర్తుకొస్తుంది. బ్రిటీష్ వలసపాలన రోజుల్లో చిటగాంగ్ ఆయుధగారంపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకపోయిన విప్లవకారులకు నాయకత్వం వహించిన సూర్యసేన్, కల్పనాదత్‌లతో ఈ చంద్రమౌళి, విజయలక్ష్మిలను పోల్చిన వాళ్లూ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో నక్సలైట్ పార్టీల చర్చల సందర్భంగా, మావోయిస్టు పార్టీనాయకత్వంతో మాట్లాడడానికి వెళ్లినపుడు స్వయంగా చంద్రమౌళి ఒక రాత్రంతా ఆ దాడిలో వేలాది మంది స్త్రీ పురుషులు ఎంత ఉత్తేజంతో, ఉత్సాహంతో పాల్గొన్నారో, గొంగళ్లలో ఆయుధాలు ప్రతిఒక్కరూ మోయగలిగినన్ని మోస్తూ ఎట్లా ఒక జాతరగా ఆనందించారో కళ్లకు కట్టినట్లు చెప్పాడు.

ఇరవయ్యేళ్ల వెనక్కి పోతే 1987లో ఈ చంద్రమౌళి, మరికొందరు సహచరుల కోసమే తూర్పుగోదావరి జిల్లాలో పీపుల్స్‌వార్ దళం ఆరుగురు ఐఎఎస్ అధికారులను కిడ్నాప్ చేసిన ఉదంతం గుర్తుకొస్తుంది. అందులో ఎస్ ఆర్ శంకరన్ కూడ ఉన్నాడు. కె.జి.కన్నబిరన్‌గారిని మధ్యవర్తిత్వం చేయమని, జైల్లో ఉన్న ఈ చంద్రమౌళిని, మరికొందరు సహచరులను విడుదల చేయాలని డిమాండు పెట్టినపుడు (మొదట అప్పటికి జైల్లో ఉన్న నల్లా ఆదిరెడ్డిని వదిలిపెట్టాలని డిమాండు పెట్టారు గానీ, చివరకు రాజమండ్రి జైల్లో ఉన్న చంద్రమౌళి, ఆయన సహచరులను వదిలితే చాలునన్నారు) ప్రభుత్వం అంగీకరించింది. విడుదలయిన వారిలో మధ్యవర్తిగా మొదట అతనితోనే కరచాలనం చేసి అతని సహచరులను అటువైపు ఎస్ఆర్ శంకరన్ మొదలైన వారిని కిడ్నాప్ చేసిన బృందానికి అప్పగించాను అని గుర్తుచేసుకున్నారు కె.జి.కన్నబిరన్. చంద్రమౌళి ఎన్‌కౌంటర్ వార్త విన్నాక శంకరన్ గారు కూడా 'ఇరవై ఏళ్ల క్రితం ఇతనికోసమే నన్ను నా హచరులను కిడ్నాప్ చేసారు' అని గుర్తుచేసుకున్నారు. అప్పుడు అడవిలో వాళ్లు మమ్మల్ని మర్యాదగానే చూసారు. కాకపోతే కేంద్రంలో హోంమంత్రి బూటాసింగ్ ఎన్టీఆర్ కోరితే కేంద్ర బలగాలను పంపి అడవి మీద బాంబులు వేస్తామన్నపుడు, 'మొదట మీరు, ఆ తర్వాతే మేము అటువంటిదేమైనా ప్రభుత్వాలు తలపెడితే 'ఆదివాసుల అడవి భూమి, సంపదల దోపిడీ గురించి మీకు చాలా బాగా తెలుసట కదా అని వాళ్ళు చెప్పిన వివరాలు నన్ను వినమ్రుణ్ని చేసాయి' అన్నారు. 'మీరు ఎయిటీన్త్ బ్రుమియర్ పాఠం చెప్తారా?' అని అడిగారు. అప్పటికి చంద్రమౌళి అప్పుడప్పుడే తూర్పుగోదావరి అడవుల్లో ప్రవేశిస్తున్నాడనుకుంటాను.

ఇంకా వెనక్కి వెళ్తే 1986 నవంబర్‌లో జగిత్యాలలో డిఎస్పీ బుచ్చిరెడ్డిని పీపుల్స్‌వార్ నక్సలైట్లు చంపారు. మర్నాడే నవంబర్ 7న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నాయకుడు జాపా లక్ష్మారెడ్డిని ఆయన అలుగునూరు (కరీంనగర్ జిల్లా) ఇంట్లో వేకువనే నిద్రలేపి ఒక పోలీసు అధికారి గుండెకు గుండుపెట్టి కాల్చేసాడు. వడ్కాపురంలో చంద్రమౌళి ఇల్లు కూల్చేసారు. ఆయన తల్లి, సోదరులు ఊళ్లో ఉండడం అసాధ్యమై గోదావరిఖనికి బతకడానికి పోయారు. వాళ్లు ఇపుడు గోదావరిఖనిలోనే బతుకున్నారు. చంద్రమౌళి సోదరులు అట్లా వ్యవసాయ జీవితంనుంచి, వృత్తి జీవితం నుంచి బొగ్గగని కార్మికులుగా మారిపోయారు. సికాస ఉద్యమం ఉన్నంతకాలం కార్మికులుగా వాళ్ల జీవితాల్లో నిర్బంధం, నిఘాల సంగతి ఎలా ఉన్నా ఉద్యోగ రీత్యా కనాకష్టంగా ఏమీలేవు. ఓవర్ గ్రౌండ్ కాస్టింగు ప్రవేశ పెడుతున్న ప్రపంచీకరణ విధానాలు మొదలై సినాసపై నిషేధం వచ్చాక బొగ్గు బావుల్లో ప్రమాదాలు పెరిగిపోయాయి. జీవన ప్రమాణాలు పడిపోతాయి. ఏ క్షణాన ఎవరి ఉద్యోగం పోతుందో తెలియని ఒక అభద్రతాభావం తరుముతున్నది.

మళ్లీ చంద్రమౌళి జీవిత ప్రస్థానంలోకి వస్తే ఆయన అంత్యక్రియల రోజు ఆ ఊళ్లో అట్టడుగు వర్గాలు మొదలు అగ్రకులాల దాకా అందరూ 1980ల ఆరంభాలను గుర్తు చేసుకున్నారు. 'పెద్దపల్లి, గోదావరిఖని నుంచి మా ఊరికి రాడికల్ విద్యార్థులు, యువజనులు వచ్చారు. మా ఊళ్లో వెలమాళ్ల పిల్లగాడు పుట్లూరి ప్రసాదరావు, చంద్రమౌళి వాళ్లతో షరీకయ్యారు. మల్లోజుల కోటేశ్వరరావు, ఆయన తమ్ముడు వేణు ఇవ్వాల్టి నుంచి జీతగాళ్ల సమ్మె. జీతాలు పెంచాల్సిందే నన్నారు. రోజంతా చర్చ. సమాధానం కుదరలేదు. సమ్మె కొనసాగింది. జీతాలు పెంచినాకనే సమ్మె ముగిసింది. ఒకటి మాత్రం చెప్పాలి. వాళ్ల ప్రశ్నలకు మా దగ్గర జవాబులేదు' అని గుర్తు చేసుకున్నారు అప్పటి భూస్వాములు. 'జగిత్యాల సిరిసిల్లా పోరాటాలు ప్రధానంగా వెలమ దొరల పెత్తందారీతనానికి వ్యతిరేకంగా ప్రారంభమైనవేనని మీకు తెలుసు. 1980ల దాకా మా ఊళ్లో జగ్గయ్యదొర మొదలైన పెద్దలదే పెత్తనం. కాని అదే ఆఖరు. ఆ కుటుంబాల నుంచే కదా మొట్టమొదలు ఉద్యమంలోకి పోయింది. ఆ తర్వాత వేణుగోపాలరావు ప్రభావంతో చంద్రమౌళి' అని చెప్పారు.

చంద్రమౌళి రాడికల్ ఉద్యమంతో ఆకర్షితుడయి, అందులో చేరిన తర్వాత ఉండగలిగినన్ని రోజులు ఊళ్లో ఉండి చేసిన నిజమైన అభివృద్ధి పనుల గురించి మాత్రం ఊళ్లో ప్రతిఒక్కరూ పోటీపడి చెప్పారు. 'దొరల ఇళ్ల ముందు సుద్దరోళ్లు, ఎట్టోళ్ల సానిపి సల్లడం బందు చేయించారు. ఊళ్లో కాలువలు తవ్వించాడు. స్కూలు గద్దె చూసిన్రు కదా, ఆయనే దగ్గర నిలబడి కట్టించిండు, ఆ గద్దె మీదనే చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చినపుడు సభ పెట్టి మాట్లాడిండు' అని చెప్పారు. ఊళ్లో చంద్రమౌళి, విజయలక్ష్మి శవాలను ఊరేగించి ఈ స్కూలు గేటు ముందే ఆపి, స్కూల్లో సభ పెట్టాము. 'చంద్రబాబును రానిచ్చారేమోగానీ, వైఎస్ఆర్‌ను మాత్రం ఈ ఊళ్లోకి వచ్చి ఈ గద్దెమీదనే నిలబడి మాట్లాడనివ్వకండి' అని చెప్పాం, ఊరి ప్రజలకు మేము.

ఇది ఒక్క చంద్రమౌళి పరిణామము - పరిణతే కాదు. 1978 - 80ల నుంచి 85 దాకా కరీంనగర్‌జిల్లా ఏ గ్రామం నుంచి విప్లవోద్యమంలోకి వెళ్లిన వారి చరిత్ర అయినా ఇట్లాగే ఉంటుంది. విజయలక్ష్మి విషయమే తీసుకుందాం.

(మిగతా మూడో కవర్ పేజిలో....)

KLUA101M137

అరుణతార
సాహిత్యసాంస్కృతిక మాసపత్రిక

2007
జనవరి, ఫిబ్రవరి

263

సంపాదకుడు
సి.ప్రసాద్

మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307,
దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు,
కడప జిల్లా - 516 360.
సెల్ : 98660 21257

సంపాదకవర్గం
పాణి
కృష్ణాబాయి
వి.చెంచయ్య
మోహన్
నాగరాజు

రచనలు పంపవలసిన చిరునామా :
టి. కృష్ణాబాయి
9-19-3
CBM కాంపౌండ్
విశాఖపట్నం - 530 003.

సంపాదక లేఖ

'అభివృద్ధి అంటే సామాజిక పరివర్తన. ఆలోచనకు, ఆచరణకు మధ్య సమన్వయం కుదరాలి. మౌలికంగా ఆ రెండింటి సరళి మారాలి. దీన్ని సాధించడానికి మనకు తెలిసిన దాన్నుంచి బయలుదేరాలి...'

అభివృద్ధి మాయాజాలం గురించి కర్నూలు విరసం సాహిత్య పాఠశాలలో ప్రొ. ఆర్.ఎస్.రావు చెప్పిన మాటలివి

అభివృద్ధి ఒక భావజాలమనీ, మాయాజాలమనీ పాలకులు అమలుచేస్తున్న ఏ అభివృద్ధి పథకాన్ని చూసినా అర్థమవుతుంది. అయినా అభివృద్ధిలోని చీకటి వెలుగులను పోల్చుకోవడానికి వీల్లేని మాయాజాలాన్ని పాలకులు నిరంతరం ప్రజలపై ప్రయోగిస్తూనే ఉంటారు. అభివృద్ధి పథకాల వెల్లువలో ఏది అభివృద్ధి? ఎవరికీ అభివృద్ధి? ఎందుకీ అభివృద్ధి? అనే ప్రశ్నలు వేయజాలని స్థితిని కల్పిస్తుంటారు. కాని పాలకులు ఏ వర్గానికి, ఏ కులాలకు, ఏ ప్రాంతాలకు అభివృద్ధి కావాలో ప్రణాళికా బద్ధంగానే అన్నీ చేస్తుంటారు

పెట్టుబడి అంటేనే అసమ అభివృద్ధి. అది రెండు ప్రాంతాల మధ్య అసమానతలు సృష్టించడమే కాక వెనుకబడిన ప్రాంతాల మధ్య వైమనస్యాలకు కారణమవుతుంది

సామాజిక సంబంధాల్లో మార్పును తీసుకొని వచ్చే ఆచరణ జ్ఞానమే ఈ మాయాజాలాన్ని ఛేదించగలుగుతుంది. అభివృద్ధి ప్రమాణాల్లోని తేడాను, పోటీని గుర్తించి - మనిషి భౌతిక అవసరాలన్నింటినీ తీర్చగలగడమే కాక సృజనాత్మక వికాసానికి దారితీసే నిజమైన అభివృద్ధి ప్రత్యామ్నాయంగా నిలబడుతుంది. ప్రజల శ్రమశక్తిమీద, వివేకం మీద, వాళ్ల ఆచరణ శీలమైన భాగస్వామ్యం మీద ఆధారపడిన అభివృద్ధే ఎక్కడికక్కడ సామ్రాజ్యవాద నమూనాను, భావజాలాన్ని ఎదిరించగలుగుతుంది

ఈ పని చేయడంలో కళలు, సాహిత్యం పాత్ర అపారమైనది

సాహిత్యం అంటేనే నిత్యం చూస్తున్న దానివెనుక చూడలేకపోతున్న దాన్ని, అర్థమైనట్టే ఉండి అర్థం కానిదాన్ని జీవితానుభవంగా మన చైతన్యంలో భాగం చేసే సాధనం. అభివృద్ధి మాయాజాలాన్ని పొరలుపొరలుగా విప్పి లోపల ఏముందో, ఎందుకు అలా వుందో, దాని విధ్వంససారం ఎన్నెన్ని రూపాల్లో విస్తరిస్తున్నదో మన అనుభవాన్నే చైతన్యంగా మార్చే ప్రక్రియ

మళ్లీ ఆర్.ఎస్.రావు అన్నట్టే అభివృద్ధి లక్ష్యంగాలేని అనేక అభివృద్ధి పథకాలను ఏ కుల, వర్గ, ప్రాంత ప్రయోజనాలకోసం పాలకులు సాగిస్తున్నారో ఆ 'అభివృద్ధి' సారాంశాన్ని విప్పి చెప్పే ప్రత్యామ్నాయం ఉంటుందని విశ్వాసం అందివ్వడానికి కళాసాహిత్యాలు పూనుకోవాలి. ఈ సమగ్ర దృష్టి లేకపోతే కళా సాహిత్యాలు అభివృద్ధి పథకాల మంచి చెడ్డల గురించి, కంటికి కనిపించే విధ్వంసం గురించి మాత్రమే చిత్రించి వదిలేసినట్టవుతుంది

ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పటిదాకా మన కళలు సాహిత్యం అభివృద్ధి పథకాల్లోని వ్యక్త విధ్వంస రూపాలను మాత్రమే చిత్రిస్తున్నాయని వినయంగా గుర్తిస్తే అభివృద్ధి మాయాజాలాన్ని ఏ దృక్పథంతో ఎట్లా ఎదుర్కోవాలో నిర్ణయించుకోగలుగుతాం.

విరసం

ఈ సంచిక వెల	:	10 రూ.
సంవత్సర చందా	:	100 రూ.
జీవితచందా	:	1000 రూ.

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి. డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

ఈ సంచికలో...

కథలు
పేజి 3-14
నిషా : మధురాంతకం నరేంద్ర
ఆకాశం అంచులదాకా : సుంకోజి దేవేంద్రాచారి
చష్మా : షఫి
తెలుగోళ్ల దేవుడు : వేంపల్లె షరీఫ్

వల్లంపాటి వెంకటసుబ్బయ్య
జ్ఞాపకాలు - విశ్లేషణలు
పేజి 16-42
సాహిత్య పరిచయాన్ని ఉన్నతీకరించిన వల్లంపాటి : వరవరరావు
వల్లంపాటి స్థానం : పి.రామకృష్ణ
'మరణం ఒక కామా మరణం ఒక కోమా' : సహవాసి
వల్లంపాటి వెంకటసుబ్బయ్య : డా.వి.ఎస్.శ్రీధర్
మహా విమర్శా శిల్పి : వృద్ధుల కళ్యాణరామారావు
వల్లంపాటి గారంటే యెవరు? : మధురాంతకం నరేంద్ర
నేనెరిగిన వల్లంపాటి : ఎ.వి.రెడ్డి శాస్త్రి
రాయలసీమ సాహిత్య చరిత్ర నిర్మాణ ప్రయత్నంలో వల్లంపాటి : పాణి

వల్లంపాటి కథలు రెండు :
రానున్న శిశిరం, బంధాలు
వల్లంపాటి వ్యాసాలు రెండు :
అనువాద కళ - నా అనుభవాలు
'భయం' - ఒక విశ్లేషణ

వ్యాసం
పేజి 43
సినిమాలూ-ప్రబంధయుగం : కొడవటిగంటి కుటుంబరావు

లేఖ
పేజి 44
ఇస్లాంవాదం పై గ్లోబెల్స్ ప్రచారం ఆపండి : సయ్యద్ సాబిర్ హుసేన్

చర్చ
పేజి 45-47
'మూలుగు' నవలలోని మూలుగ : వెన్నెలకంటి రామారావు
'ఆమె తలాక్ అన్నది' పై అభ్యంతరం ఎందుకు? : యస్.హజరత్ అలి

విరసం సాహిత్య పాఠశాల నివేదిక
పేజి 48-59

సైన్స్ వ్యాసం
పేజి 60 - 61
కాలం-అపగాహన-2 : కొడవటిగంటి రోహిణి ప్రసాద్

కవిత్వం
పేజి 62-65
ప్రశాంత్, జి.వెంకటకృష్ణ, 'తాయమ్మ' కరుణ, జూపాక సుభద్ర, ఎం.ఎ.బాసిత్

నవలిక
పేజి 66
శికారి - పాణి

ముఖ చిత్రం :
జనవరి 13, 14 లో జరిగిన కర్నూలు విరసం సాహిత్య పాఠశాల దృశ్యాలు

కథ

☆ మధురాంతకం నరేంద్ర

నిషా

"రాజమండ్రి టేకుతో సోఫాలు జెయ్యమని నువ్వు చెప్పినా నేనొప్పుకోను సార్! ఆ సోఫాలేస్తే మనింటి కే హంగుండదు. సోఫాలు జేస్తే రోజ్‌వుడ్‌తోనే జెయ్యాల.. చూసేదానికి రెడీమేడ్ సోఫాలు మొదుట్లో బాగనే వుంటాయి. అయితే రెండు మూడేండ్లకంతా పాతబడిపోతాయి. యిర్లవై ఘనపడుగులకొయ్యతో దిట్టంగా సోఫాజేసి, పాలిస్ బట్టిస్తే దాని ముందర యీ రెడీమేడ్ సోఫాలు దేనికి పనికొస్తాయి? యిరవయ్యేండ్లయినాంక అవిట్ని అమ్మినా కొయ్యదుడ్డు మళ్ళా చేతిలోకొస్తాది. చెన్నయిలో రెడీమేడ్ సరుకులెన్ని దొరకవు? యెంపీ గౌతమ్ రెడ్డి తమ్ముడు మదనమోహనరెడ్డి చెన్నయిలో యిల్లు గట్టించినప్పుడు కొయ్య వనంతా నాదే! మొత్తం సమత్సరం వాళ్లింట్లోనే పన్లుజేస్తావుండిపోయినాను. తలుపులూ, కిటికీలూ అన్నీ బలార్షాటేకు. ఫర్నీచరు మాత్రం రోజ్‌వుడ్. యెప్పుడైనా చెన్నయికి పోతే వొకడుగు వాళ్ళింటికి పొయ్యి చూసేసిరా! అంతదూరమెందుకు? వాళ్ళ పిన్నమ్మ కొడుకు క్రిష్ణారెడ్డి యిక్కడ్నే విద్యానగర్‌లో యిల్లుగట్టించినాడు. నన్ను తప్ప యింకెవుర్నీ యింట్లోకి జేర్చడు. ఆ సోఫాలూ, తలుపులూ వొకతూరి చూసేసొద్దాంరా! రోజ్‌వుడ్డు బయిటి డిపోల్లో దొరకదు. మావోడొకడు నంద్యాల నించీ తెచ్చిస్తాడు. బ్లాక్‌లో రేటు అడుగు మూడువేలదాంకా వుంటింది. అయినా నష్టంలేదు. రోజువుడ్డంటే బంగారం మాదిరి. రేటు పెరిగేదేగానీ తగ్గేదుండదు..." వుత్సాహంగా చెప్పుకుపోతున్న పరమేశాచారి హడావుడిగా యింటి లోపలికొచ్చిన కుర్రాడికేసి అనుమానంగా చూస్తూ ఆగిపోయాడు.

యెనిమిదడుగుల యెత్తున్న మట్టిమిద్దెలోపల, యినపకమ్ముల నవారు మంచంపైన కూర్చున్న వ్యక్తి ముఖం చిట్లించుకుని చుట్టూ తలతిప్పిచూశాడు.

అస్థిపంజరపు ఎముకల్లా మట్టిమిద్దెవాసాలు కిందికి వంపులు తిరిగిపోయివున్నాయి. మిద్దెపైన వేసిన సుద్దమట్టి చాలా రోజులుగా రాలుతూ వుండడంతో వాసాల మధ్య బొరకలు పడివున్నాయి. యెన్నో సంవత్సరాలుగా సున్నపు పూతను మరచిన గోడలు నల్లబారిపోయి వున్నాయి. వంటగది ద్వారబంధాలకు వొకప్పుడక్కడ తలుపులుండేవన్న సూచనలు సైతం మిగలలేదు. హాలుమూలలో వెదురుకఱ్ఱ దండెంపైన పాతగుడ్డలు చిందరవందరగా వేలాడుతున్నాయి. హాలులో పాతట్రంకుపెట్టెలు రెండు, పేళ్ళు లేసిపోయిన స్టూలు, దానిపైన పాత బ్లాక్ అండ్ వైట్ టీవీ తప్ప మరో వస్తువేదీ లేదు. గోడపైన దేవుడి బొమ్మలున్న కాలెండర్లు రెండూ, వొకపాత ఫోటో వేలాడుతున్నాయి.

"వీడు మా వోడేసార్! కొంచెం అర్జెంటు పనుండాది. యిప్పుడే వచ్చేస్తాను..." అని చెబుతూనే పరమేశాచారి యింట్లోంచే సరసరా బయటి కొచ్చేశాడు. కుర్రాడి చెవుల్లో రెండు మాటలు గొణిగాక గబగబా యింటివెనకున్న అడుగు వెడల్పు సందులో బల్లిలా గోడకతుక్కుని నిల్చున్నాడు. ఆందోళనతో అతడి గుండె డబడబ మని కొట్టుకుంటున్న చప్పుడు అతడికి స్పష్టంగా వినబడసాగింది. సందులో గాలి ఆడకపోవడంతో అతడి వొళ్ళంతా చెమటలు పట్టసాగాయి. పెరడులోంచీ వస్తున్న మురికినీళ్ళు యింటి చుట్టూ తిరిగి వెనక సందులోకి రావడంతో నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది. మురికి నీళ్ళలోంచీ వస్తున్న వాసన ముక్కుల్ని అదరగొడుతోంది.

గోడ వెనకదాక్కున్నా యింట్లో యేం జరుగుతుందో తనకు స్పష్టంగానే కనబడుతున్నట్టుగా అనిపించసాగింది పరమేశాచారికి. కుక్కి మంచంలో కూర్చున్న బాంకీ మేనేజరు యేం జరుగుతోందో అర్థంగాక బిక్కమొహం పెట్టుకుని వుంటాడు. వంటింట్లోంచీ తన భార్య యెంతకూ బయటి కొచ్చి వుండదు. తనను దాక్కోమని హెచ్చరించిన ఆనందాచారి యీపాటికి సందు రెండో వైపు నుంచీ పారిపోయివుంటాడు.

యింటి గడప ముంగిటి నుంచీ చెప్పుల శబ్దం వినవస్తోంది.

"ఆచారెక్కడ?" జగన్నాథం నాయుడిగొంతులో కోపమూ, వుక్రోశమూ పెల్లుబుకుతున్నాయి.

"లేదున్నా! మిషినీ కాడికి పోయినాడు". అది భార్యగొంతు.

"సైకిలు యింటి ముందర్నే వుండాది. మధ్యాహ్నం అన్నానికి గూడా యింటికి రాకుండా ఆమని షెట్లబోతాడు?" జగన్నాథంనాయుడు అరిచాడు.

"కుచ్చోన్నా! వచ్చేస్తాడు" ఆమె గొంతు వణుకుతోంది.

అసలే నల్లగా రాతి విగ్రహంలా కఠినంగా కనిపించే జగన్నాథం నాయుడి ముఖం యిప్పుడెంత ధుమధుమలాతుతూ వుంటుందో పరమేశాచారికి స్పష్టంగా కనబడుతున్నట్టే వుంది. ఆరడుగుల యెత్తున్న అతడి ముందు అయిదడుగులుండే తన భార్య యెలా ముద్దాయిలా నిలబడి వుందో కళ్ళెదుట జరుగుతున్నట్టే అనిపించసాగిందతడికి.

"పనులెగ్గొట్టి మీ యిండ్లల్లో కాపుగాసేదేనా నా పని? అయినా యీ కొంపలో యేడ గుచ్చోమంటావు? ఘనపడుగులు ఘనపడుగులు అంటా యెంత కొయ్యనయినా మింగేస్తావుండాడు గదా! యింట్లోకి రెండు కుర్చీలుగూడా చేసుకోకుండా అంతా తాగి తందనాలాడతా వుండాడా?"

"మా ఆచారికా మాదిరి పాడు అలవాట్లు లేవన్నా! అంతా కండ్లు గుట్టినోళ్ళు చెప్పేమాటలు... నమ్మద్దు...."

"తూ! దొంగనా..."

కోపమొచ్చినప్పుడు జగన్నాథం నాయుడెంతగా వణికిపోతాడో, పాములా యెలా బుసలు గొడతాడో, అప్పుడతడిగొంతెల్లా పెగలదో పరమేశాచారి తలచుకోసాగాడు.

"ఆచారి మీ యింట్లో పనిజేస్తావుండాడా?"

పరమేశాచారి వులిక్కి పడ్డాడు. ఆ గొంతు వినిపించేంతవరకూ అక్కడ యింకా బాంకీ మేనేజరు వున్నాడన్న విషయం అతడికి స్ఫురించలేదు.

"మా యింట్లో గూడా పని జరగతా వుండాది..."

"అది చెప్పు! అందుకే నీకు గూడా యీ సందుల్లో యెతుకులాడతా తిరిగేరాత రాసుండాది. మన గహచారం..." జగన్నాథం నాయుడు అతడిపైన కూడా నిప్పులు కురిపిస్తున్నాడు.

"క్రిష్ణానగర్‌లో మా యిల్లు.... నేను కువ్వంబాదురులో గ్రామీణ బాంకీ మేనేజరు...."

"యింటి పనా? పర్నీచరా?...."

"యింటికి స్లాబు పడింది.. తలుపులూ కిటికీలు జేస్తావుండారు. పనిలో పనిగా ఫర్నీచరు గూడా..."

"ముందు యింటి పని ముగించుకొని యీ మనిషి దగ్గిర్నించీ బయిటపడు... అదురుష్టంబాగుంటే మల్లంక ఫర్నీచరు గురించి చూసుకో... లేకపోతే నా మాదిరిగా అగోరిస్తావు...."

"మీ యిల్లెక్కడ?"

"తుడా ప్లాట్‌లలో... అనుభవంపైన చెప్తావుండాను. యీ దగుల్బాజీ మనిషిపైన వొక కన్ను పెట్టుండు. యింట్లో యామారద్దండి. వీని దగ్గిరుండే ఆచార్లు యింగా పలాతనమైనోళ్ళు. మొన్నొకనాడు యింట్లో మొగోళ్ళు లేంది జూసి తాగేసొచ్చి ఆడోళ్ళతో యేందో కూసినారు. నాతో బెట్టుకుండే గొమ్మునుంటానా? పోలీస్టేషన్లో రిపోర్టిచ్చినాను. వీడెంత? వీని బతుకెంత? చూపిస్తాన్నేనంటే యేందో? పోలీస్టేషన్లో రిపోర్టిచ్చినాను. వీడెంత? వీని బతుకెంత? చూపిస్తాన్నేనంటే యెందో? యిప్పుడు చేసిన తప్పుకు జైల్లో గుచ్చోవాల్ల. యింటికొచ్చి పనీ ముగించాల్ల..."

"యీ మాత్రం దానికి పోలీసుల దాకా ఎందుకులేన్నా! మా కూత దుడ్డు మీ పక్కనే వుండాది గదా! అంతగా అయితే ఇంకో ఆచార్ని పిలుచుకో". పరమేశాచారి భార్య ప్రాధేయపడసాగింది.

నేనే మారకుండా మీదుడ్డే నావక్కుండేట్టుగా జూసుకుంటా వుండంగానే యిట్లుండారు మీరు! ఆడదిగదా అని గొమ్ముమనుండాన్నేను... సాయింత్రం దాంకా చూస్తాను. ఆ మనిషి యింటికొచ్చి పనిలోకి దిగినాడా, సరే! యిప్పటికే పోలీసులు యెతకతా వుండారు. ఆ మనిషికి దాంకోవాలంటే వుండే వొకేవొకతావు మాయిల్లొగటే! యింకేడున్నా పోలీసుకుక్కలు యీడ్చిపారేస్తాయి... అసలే నేను మంచోడ్నిగాదు..." క్రమంగా అతడిగొంతు దూరమవుతున్నట్టుగా వినబడుతోంది.

"వూరోళ్ళు జెప్పే మాటలు యింటా వుంటే నాగ్గూడా బయింగా వుండాది. మీ ఆచారి నన్ను దేంట్లో ముంచతాడో... నేనూ పోతాను..." బాంకు మేనేజరు వెళ్తూ వెళ్తూ యింటి తలుపును విసుగ్గా పక్కకు తోసినట్టున్నాడు. చెదలుపట్టిన తలుపు అరిగిన చిలుకులతో కీసుకీసుమని అరుస్తోంది.

"మా ఆచారి అట్లాంటోడుగాదు... వీళ్ళమాటలు నమ్మద్దుసార్..." ఆమె గొంతు నీరసంగా మూల్గుతోంది. "ఆయిన పలుకుబడుండే మనిషి సా... అయితే పని మొదులుపెట్టినప్పట్నించీ సరింగా కూలీలియ్యటం లేదు. వూరికే పన్లుజేసేదానికి యెవురి వల్లయితింది? వాళ్ళపని పక్కన బెట్టినామేని కడుపుమంటతో తప్పుడు రిపోర్టిచ్చినాడు. పోలీసులు ఆయన మాటే యింటారుగానీ మా మాట యింటారా?..." క్రమంగా పెరుగుతున్న ఆమె గొంతు బాంకుమేనేజరు వెళ్ళిపోతున్నాడన్న విషయాన్ని తెలియజేస్తోంది.

పరమేశాచారి చెవులు రిక్కించి వినసాగాడు. దూరంగా వీధిలో మోటారుబైకు డబడబమంటూ మోగుతోంది.

ముక్కును చేతితో మూసుకుని పిల్లిలా సందులోంచీ బయటికొచ్చి, సందులోంచీ నూరడుగులు నడచి, వీధిలోకి తొంగిచూశాడు. తరువాత పెద్దగా నిట్టూరుస్తూ యింటికి తిరగొచ్చాడు. యింట్లోంచీ కాళీ ప్లాస్టిక్ బిందెతో బయటికెళ్తున్న అమ్మాయి అతడికేసి చూడలేదు.

గోడమీది కాలెండరు వెనకున్నదీ గుడులోంచీ సీసా తీసుకుని మంచపైన కూర్చున్నాడతను. అది పరపరలాడుతూండగా సీసామూత తీసి గడగడమంటూ దానిలోని ద్రవాన్నంతా తాగేశాడు. 'వుఫ్'మని వేడిగాలిని నోటిలోంచీ విడిచిపెడుతూ బీడీ వెలిగించుకున్నాడు.

"వాళ్ళింట్లో యీగలు మూగతా వుండేది వూరంతా తెలుసు. బయిటికి మాత్రం పెద్ద బింకం... యెవురేమారతారా అని యెగజూస్తా వుంటాడు. మద్దిస్తాలనీ, మీటంగులనీ అదనీ యిదనీ కమీషన్లు దండుకుంటాడు. పెద్ద పెద్దోళ్ళ యెనకమ్మటీ తిరిగేది! మిగిల్నోళ్ళదగ్గర రౌడీ మామూల్లు వసులుజేసేదీ... అంగిడోళ్ళ దగ్గిరా, టింబరు డిపోళ్ళ దగ్గిరా తెచ్చిందంతా అప్పే! అయినా తిరిగిచ్చేదుంటేగదా అప్పు? తెచ్చిచ్చిన కొయ్యిట్లాంటిదైనా యెట్నోవొకట్ల వురువులు జేస్తా వుండానని నన్ను యిడిసిపెట్టడు. మాస్టరు సరింగా యీలేదని పనికిపోకబోతే అరస్తాడు. పైగా తప్పుడు కేసులు పెట్టి బెదిరిస్తాడు. అప్పటికి నాకేనా మనుషులు లేంది?"

వంటగదిలోంచీ గిన్నెలు పడుతున్న శబ్దం మాత్రమే వస్తోంది. నీళ్ళ బిందెతో పెరట్లోకెళ్తున్న అమ్మాయికేసి కోపంగా చూస్తూ "పొద్దన్నించీ నీళ్ళు దెచ్చేదేనా పని? యింగచాలు, గుడ్డలేమైనా వుతకాల్నేమోచూడు" అని విసుక్కున్నాడు పరమేశాచారి.

"పోలీసుల దగ్గిర్నించీ తప్పించుకోవాలంటే యింకో యిల్లే లేదంటా వుండాడు జూడు! క్రిష్ణారెడ్డోళ్ళు యింకో పనోడ్ని యింట్లోకి జేర్చరు తెలుసునా?..." కడుపులోకి చేరిన ద్రవం యిప్పుడిప్పుడే తలలోకెక్కుతున్నట్టుగా అనిపించడంతో పరమేశాచారి ముఖంలోకి కొంతకొంతగా వెలుతురు రాసాగింది. "వాళ్ళింట్లో పనులు జేస్తావుండేటప్పుడు పగుల్లో యిల్లంతా నాకే అప్పగించి బయిటికి పొయ్యేటోళ్ళుగదా! యెక్కడిదుడ్డక్కడ్నే, యేడి నగలు ఆడ్నేపడున్నా యేమైనా కనబడకుండాపోయిన్నా? యిప్పటికి గూడా వాళ్ళెప్పుడైనా వేరే వూరికి పొయ్యేటప్పుడు రాత్రుల్లో కావిలిగా నన్ను పడుకోమని జెప్పిపోతారు. ఆ యింట్లో వుండే సోఫాలూ, తలుపులూ, కొయ్యసామగ్రంతా మనం జేసిందేగదా! రేత్రుల్లో పండుకునేటప్పుడు మనషులకంటే బదులుగా అవే మనకు తోడుగా వుంటాయి..."

వీధిలోంచీ మోటారుబైకు శబ్దం వినిపించగానే పరమేశాచారి వులిక్కిపడి పైకి లేచాడు. కాస్సేపలాగే నిలబడి ఆలోచించాక "పోలీసోళ్లు యింటిని కనిపెట్టి వచ్చినా వస్తారు. దానికంటే ముందుగా క్రిష్ణారెడ్డి సారును పట్టుకోవాల... నేను పోతా వుండాను" అని చెబుతూ ఆకుచెప్పులు తొడుక్కున్నాడు.

చుట్టూవున్న యిండ్లు ముందుకు చొచ్చుకురావడంతో మట్టిమిద్దె బయపడి వెనక్కుజరిగినట్టుగా కనబడుతోంది. గోడ పక్కనున్న సైకిలు స్టాండు లాగాడు పరమేశాచారి అరిటి తొక్కల్లా టైర్లు రెండూ తప్పచ్చిగా వున్నాడు సైకిలును బలవంతంగా తోసుకుంటూ గొందిలోంచీ సందులోకొచ్చాడు. నీళ్ళ పంపుదగ్గర వరసగా పెట్టిన ప్లాస్టిక్ బిందెల పక్కన వెలిసిన చీరల ఆడవాళ్ల గుంపు గగ్గోలు చేస్తోంది. వాళ్ళకు పక్కనే సందులోనే కుంపటి మట్టించి యిడ్లీలు చేస్తున్న ముసలావిడ - అంగడిలో నేలపైన్నే గొంతుక్కూచున్న వ్యక్తులు కొందరు ఆవురావురుమంటూ తింటున్నారు. వాళ్ళకు మరికాస్త దూరంలో వో స్త్రీ సామాన్లు తోముకుంటోంది. ఆమెకెదురుగా మరో స్త్రీ అయిదేళ్ళ కుర్రాణ్ణి వీధిలో నిలబెట్టిస్నానం చేయిస్తోంది.

సందుమలుపులో రేకుల బంకు ముందు ఆగాడు పరమేశాచారి. గోడపక్కన నాలుగైదు పాతసైకిల్లున్నాయి. బంకులోపల రకరకాల టైర్లూ ట్యూబులూ కుప్పగా పడివున్నాయి. బంకు ముందు నేలపైన కూర్చుని అల్యూమినియం బేసినులోని నీళ్లలో ట్యూబును ముంచి పంచర్లు వెతుక్కుంటున్న గడ్డంసాయిబు పరమేశాచారిని పలకరించలేదు. కాస్సేపు అతడికేసి విసుగ్గా చూసిన తర్వాత "యీ రెండు టైర్లకూ పంచర్లేసిపెట్టు భాషా! గంటలో వస్తాను" అన్నాడు పరమేశాచారి.

"దీన్ని నాదగ్గిరికి తేవద్దని చెప్పలేదా నీకు?" భాషా ముఖం తిప్పకుండానే సమాధానం చెప్పాడు.

"నీకు షాపుండాది. నేను సైకిలుదెచ్చి పంచెర్లేయమన్నా... నీ ధుడ్డునీకియ్యకపోతే అప్పుడడుగు. మిగిలిన సంగతులు నీకొద్దు..."

"యం ఆర్ పల్లి మునిరెడ్డిని తాగేసేమో అన్నావని కంప్లయింటిచ్చినాడంట! ఆ మనిషి సైకిల్ను తిరిగియ్యలేదని నాదగ్గిరికొచ్చి అడగతా వుండాడు... పోలీసులచుట్టూ తిరిగాల్సిన పనేముండాది నాకు?"

"దానికి సాక్షికం జూపించమను. అనావస్పంగా నామింద కంప్లయింటిస్తే నాకెందుకు బయిం? గుంటలో వస్తాను. పంచర్లేసిపెట్టు..." భాషా యేదో చెబుతున్నా వినిపించుకోకుండా, సైకిలును గోడకానించి పెట్టేసి, ముందుకొచ్చేశాడు పరమేశాచారి.

వీధిలో కార్లూ, మోటారు బైకులూ, ఆటోలూ మనుషులను నడవనివ్వకుండా అటూ యిటూ పరిగెడుతున్నాయి. చిన్న బజారు వీధి పోలీస్టేను ముందు పోలీసొకడు కనిపించగానే చటుక్కున పట్నాలు వీధిలోకి తిరిగేశాడు పరమేశాచారి. అక్కడి నుంచీ పెద్దరోడ్డులలోకి రాకుండా సందుగొందుల్లోంచీ నడుస్తూ కుమ్మర తోపును చేరుకున్నాడు.

నీళ్ళ పైపులు వేయడం కోసం మళ్లీ మళ్లీ తవ్విన రోడ్డు గుంతలు మిట్టలుగా వుంది. పైకి పొర్లుతున్న మురికి కాలువలు దుర్వాసనను వెదజల్లుతున్నాయి. వీధికి రెండువైపులా ముందుకు చొచ్చుకువచ్చిన యిండ్లభాగాలు అనారోగ్యంతో వాచిన శరీరాల్లా వికారంగా కనబడుతున్నాయి. వొక రేకులతలుపు యింటి ముందు ఆగి "దామూ... దామూ..." అని కేకేశాడు పరమేశాచారి.

యింట్లోంచీ "లేడు" అన్న సమాధానం మాత్రం వచ్చింది.

"నేనేరా... నేనేమ్మా!" అంటూ తలుపును తోసుకుని లోపలికడుగేశాడతను. తలుపుకవతల మిద్దెమెట్లకిందున్న బాత్రూంలోంచీ సన్నటి ఆకారమొకటి బయటికొచ్చింది..

"యింత అదురుగుండెలుంటే యెట్ల నెగ్గుకొస్తారా మీరు?" అని

కోపంగా అరిచాడు పరమేశాచారి.

తడిపాదాలు నేలపైన ముద్రల్ని వదలిపెడుతుండగా ముందుకొచ్చిన దామూ "మెల్లింగా మాట్లాడన్నా! యిప్పటికే పోలీసులు రెండుతూర్లు వచ్చిపోయినారు. ఆ పక్కవీధిలోనే కాపుగాసుకోనుండారేమో అని యింట్లోనే ముడుక్కోనుండాను..." అన్నాడు.

"అయినా ఆ మనిషితో లాలూచీకి దిగి నేనురాకపోయినా పనిలోకి దిగతామని చెప్పినాడంట గదా! యింక పోలీసులెందుకొస్సార్లే మీదగ్గిరికి?" అంటూ పరమేశాచారి హాల్లో తడిగా వున్న నేలపై గొంతుక్కూచున్నాడు. దాదాపు పదడుగుల పొడవూ వెడల్పులున్న ఆ పాత మిద్దింటిలోపల గూడులాగున్న వంటగదిలోంచీ "టీ దాగతావాన్నా?" అని అడిగిందొక స్త్రీ.

"అది గూడా చెప్పాల్నా! బిన్నాగా కాంచు" అని కసిరాడుదామూ. పరమేశాచారి బీడీ వెలిగించుకుంటూ... "మూడు దినాలుగా క్రిష్ణారెడ్డిసారు సెల్లులో దొరకలేదు... లేకపోతేనా?..." అని హుంకరించాడు.

"ఆయిన దొరికే లోపల వీళ్ళు మనల్ని బొక్కలోకి తోసేసి కుమ్మి పారేస్తారు. రెండుమూడుతూర్లు వాళ్ళ యెదాన పడినాంక గూడా నువ్వు మారకపోతే యెట్లన్నా! యెవురింట్లోనో పడుండే వురువుల్ని యేదోవొకరకంగా ముగించేసి పోతే సరిపోదా? ఆ మనిషి సరిగ్గా కూలీలు యీడు. నువ్వేమో పనులంతా మట్టసంగానే జరగాలంటావు. మధ్యలో మమ్మల్ని మీరిద్దరూ గుంటికీ మిట్టకూ యీడస్తావుండారు." దామూ భయంతో గొంతు తగ్గించుకుని మాట్లాడసాగాడు.

"మనవేమన్నా అడివిలో వుండామారాదామూ! యెందకట్ల బయపడతావు?" అని కసిరాడు పరమేశాచారి. "యిదేవూర్లో పదేండ్లుగా పనులు జేస్తావుండాను. గృహప్రవేశాలప్పుడు అన్ని యిండ్లోళ్ళూ ప్రియంగా కొత్త గుడ్డలు పెట్టి అంపించినారేగదా! యింతకాలానికి యీ మనిషి నా మీద నిందేసి పోలీస్టేషనెక్కించినాడు. యిన్నేండ్లుగా పనులిస్తావుండాననే యింగితంలేకుండా మీరేమో ఆ మనిషి కాళ్ళమింద పడి నన్ను తొలగదోసుకోని పోతావుండారు. మీ సంగతి జూస్తే ఆ పొద్దు మందుమీంద మన రాజిగాడూ, మునిగాతూ వాళ్ళింట్లో యేందో అడగాసుపని చేసినట్టే అనిపిస్తా వుండాదినాకు..."

"చేతి పనులు చేసేటోళ్లు వొళ్ళులిసినప్పుడు రెండుద రాములేసుకునే దాంట్లో కొత్తేముండాదన్నా! అయినా యెంత నిషాయెక్కినా మనోళ్ళు వొళ్ళుదెలవకుండా పనులుచేసేటోళ్ళు మాత్రం కాదు..."

దామూ భార్య తీసుకొచ్చిన టీ ని చప్పరిస్తూ "అట్లయితే ఆ మనిషితో యెందుకు వొప్పుకోవాల్ల? అట్లాంటోనికి బయిపడి వూరికే పనులెందుకు చెయ్యాల?" అని మండిపడ్డాడు పరమేశాచారి.

"వారం దినాలుగా పనికిపోకుండా దాంకోని తిరగతా వుండాము. నా పెండ్లాం కమ్మలు కుదవబెట్టిన దుడ్డుతో యీవారం దినాలూ లాగినాను. యింక పనిలోకి పోకపోతే జరగదు. వచ్చి పనిలోకి దిగితే కేసు యెత్తేసానని ఆ మనిషి చెప్పంపించినాడు. నీకయితే పెద్ద పెద్దోళ్ళ సహాయం వుండాది. నీ మాదిరి గీత గీసుకొని బతకలేను. భుజంపైన నవకమేసుకోని, వులీ రంపం పట్టుకోని యీవూరికొచ్చినోణ్ణి. యిట్లాంటి అగాయిత్యం ఆసాములు దొరికినప్పుడు వుపాయంగా పని ముగించుకోవాల్ల. టింబరు డిపోల్లో, హార్డువేరు అంగళ్ళల్లో కొంచెం చానాగా కమీషను తీసుకుంటేనే మనకు గిట్టితింది...." దామూ గూడా టీ తాగుతూ చెప్పుకుపోయాడు.

"ఆ మాత్రం వుపాయం నాకు లేకపోలేదు పోరా! మనకు న్యాయంగా యెంత కమీషను రావాల్నో దాంట్లో పైసా తగ్గితే నేనొప్పుకోను" అన్నాడు పరమేశాచారి.

"మనం న్యాయంగా రావల్సిన దుడ్డే తీసుకుంటా వుండామని యే ఆసామైనా వొప్పుకుంటే నాకు జూపించు. అన్నిట్లో వాళ్ళకు తెలవకుండా మొంతమైన కమీషను నొక్కేస్తా వుండామని మనల్ని దొంగల్ని జూసినట్టే చూస్తావుండారు" అంటూ దామూ అడ్డుతగిలాడు.

"అట్లనిజెప్పి పనులు గాకుండానే కూలీ దుడ్డంతా రాబట్టుకునే ఆచార్లేమైనా మిద్దెలూ, మేడలూ గట్టినారేమో చూపించరా నాకు!" అని నిలదీశాడు పరమేశాచారి. "యింతకాలం కష్టపడి సంపాయించిన పేరంతా వొకదినంతో పోంగొట్టుకుంటామా జెప్పు? మా కనగాని పల్లెలో రైతులు యిప్పటికి గూడా వాళ్ళిండ్లలో వుండే బిస పలకలూ, బెంచీలు చూసినప్పుడంతా మాతాతనూ, నాయన్నూ గెవనం జేసుకుంటారు దెలుసునా?...."

"మనం అంత నికార్సుగా బతికేద్చేటట్టుంటే సైకిలుషాపు మునిరెడ్డితో యెందుకు పెట్టుకున్నావన్నా?" దామూ గొంతు కరకుగా పలికింది.

"వాని దగ్గిర అయిదారేండ్లుగా సైకిల్ను బాడిగకు తీసుకుంటానే వుండాను గదరా! రేత్రి బాడిగలకింద నేను గట్టిన దుడ్డుతోనే వాడు రెండు కొత్త సైకిళ్ళు బేరం జేసుకోనుండచ్చు. యేందో పనుల్లోబడి వొకతూరి పద్దైద్దినాలు యింట్లో పెట్టుకుంటే దానికి మున్నూరు గట్టమంటాడా వాడు? ఆ పొద్దు తిక్కరేగి మందుమింద యింటికి పోతావున్నాన్లే! వాడు దార్లో పట్టుకున్నాడు. కోపమొచ్చి యీడ్చి రెండు దెబ్బలేసినానా? వాడు పెద్ద వులావరు మాదిరి పోలీసులకు జెప్పినాడు. అయినా అది వాని సైకిలని జెప్పే సాక్షిక మేముండాది? దాని మిందుండే వాళ్ళ నెంబర్ను యెప్పుడో గోకి పారేసినాను.." పరమేశాచారి గుంభనగా నవ్వసాగాడు.

"అదేన్నా నేను గూడా జెప్పేది! మనకు మంచి పేరెట్లా రాదు... బతికేద్దైనా తెలుసుకోవాల్ల గదా!..." దామూ నిట్టూర్చాడు.

"పేరు సంగతి పక్కన బెట్టురా దామూ!" పరమేశాచారి పైకిలేచి పంచవెనక అంటుకున్న దుమ్మును దులుపుకోసాగాడు. "మనం చెక్కే తలుపులూ, దాల బందరాలనూ జూడు. పాణంలేని కొయ్యల్ని దెచ్చి జోడిస్తే అవి మల్లంక యెంత పాణంతో మిసమిసలాడతాయో జూసినావా? యెవురికోసరమో చేస్తావుండా మనుకోని అడ్డదిడ్డంగా చేస్తే అవి వూనాపం బిడ్డలమాదిర్లై నోరు గొట్టుకోవా? యెవుడి మిందనో కోపం బెట్టుకొని రోగిష్టి బిడ్డల్నికంటారా యెవురైనా? ఆ పాపమంతా మనకే జుట్టుకుంటాది తెలుసునా?..."

దామూ అతడికేసి కళ్ళార్పకుండా చూస్తూ "అవి మనకు కన్న బిడ్డలమాదిరే అయితే అవిటికీ మనకూ సంబంధమే వుండకుండా పోతిందాన్నా? అసలా పొద్దు మందుమింద కండ్లు తిరిగి మనం జేస్తావుండే సోఫాలో కుచ్చున్నాననే గదా ఆయింటోళ్ళు అంత ఆగడం జేసినారు?" అని అడిగాడు.

పరమేశాచారి అతడి మాటల్ని పట్టించుకోకుండా "మీరందురూ నన్ను దిగ్గొలికేసి గట్టుపైన వడేది జూసుకున్నాల్లేరా? అప్పటికి నాకేనా జరుగుబాటుండేది? మూడునెల్లుగా బాడిగ గట్టలేదని యింటి గల్లోడు చుట్టూ తిరగతా వుండాడు. యిస్కూల్లో ఫీజుగట్టలేదని పేరు దీసేసినారని పిల్లోడు నెలగా యింట్లోనే వుండాడు. అయినా నేను మీ మాదిరిగా చేతులెత్తేసే మనిషిగాదు. నేను మంచికి మంచి, చెడ్డకు చెడ్డ...." అని మాట్లాడుతూనే వీధిలో కొచ్చేశాడు. కుమ్మరతోపు వెనక సందులోంచీ పోలీసు క్వార్టర్సు వైపుకు నడచాడు. తలపైకి భయంభయంగా సవకంలాక్కుని బాలాజీ కాలనీ మీదుగా ప్రకాశం రోడ్డులోకొచ్చాడు. రోడ్డు పక్కన ఆటో గేరేజీ పక్కన దాక్కున్నాడు. దూరంగా ఆరు సీట్ల ఆటో కనిపించాక రోడ్డు పైకొచ్చి దాని కడ్డంగా నిలబడ్డాడు. అప్పటికే పదిహేను మందిని యిరికించుకున్న ఆటోలోకి దూరి "విద్యానగర్" అని అరిచాడు. విద్యానగర్ వచ్చేవరకూ ఆటో లోపల మనుషుల మధ్య ముడుక్కున్నాడు. ఆటో డ్రైవర్‌కు నాలుగు రూపాయలిచ్చేశాక విద్యానగర్ దగ్గర దిగి, కాలనీలోకి పరుగులాంటి నడకను సాగించాడు.

కాలనీలో పెద్ద పెద్ద ప్రహరీ గోడల కవతల, పచ్చనిచెట్ల నీడలో భవనాలు మత్తుగా తూగుతున్నాయి. యింకా ఆఫీసులూ, కాలేజీలూ వదలిపెట్టక పోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. కాస్సేపటి తర్వాత పక్కవీధిలోకి

మలుపు తిరిగిన పరమేశాచారి దూరంగా వో యింటి ముందు లారీ నిలబడి వుండడం కనిపించగానే వులిక్కిపడ్డాడు. యెదురింటిలోంచీ యిద్దరు కూలీలు పెద్దమూటను బయటికి తేవడం చూడగానే ముందుకు పరిగెత్తాడు.

వీధిలో మునిసిపాలిటీవాళ్ళ కమ్ములచట్రాల్లోపల కానగ చెట్లు యేపుగా పెరుగుతున్నాయి. కొండరాళ్ళను తొలిచి కట్టిన ప్రహరీగోడ బలంగా వుంది. దాని కోట తలుపుల్లాంటి యినప నగిషీల తలుపుల కవతల విశాలమైన ఖాళీ స్థలంలో మూడంతస్థుల యిల్లు ధీమాగా నిలబడివుంది.

కంగారు పడుతూ ప్రహరీ లోపలికెళ్ళి, పచ్చిక మధ్యలో వరసగా పరిచిన నాపరాళ్ళ బాటలో యింటి వైపుకు వురికాడు పరమేశాచారి. యిద్దరు మనుషులు ఆరడుగుల పొడవున్న రోజ్‌వుడ్ అలమరాను పైకెత్తుకుని యింటిలోంచీ బయటికొచ్చారు.

"యేడికి? యేడికి? కంఠం వణుకుతుండగా ఆదుర్దాగా అడిగాడు పరమేశాచారి.

అలమరా బరువుకింద అపసోపాలు పడుతున్న వాళ్ళిద్దరూ అతడివైపుకు తలతిప్పలేక పోయారు. హాలులోకి అడుగుపెట్టగానే పరమేశాచారి మరింతగా హడలిపోయారు.

పెళ్ళిమండపమంత పెద్దదిగా వున్న డూప్లెక్స్ హాలులోపల సామాన్లన్నీ చిందర వందరగా వున్నాయి. పెద్ద అట్ట పెట్టెల నిండా యేవేవో సామాన్లు కుప్పగా పడివున్నాయి., డైనింగ్ టేబులుపైన దాని కుర్చీలన్నీ సర్దుకుని వున్నాయి. హాలుకు మధ్యలో వుండాల్సిన సోఫాలు రెండూ వాటి మిగిలిన కుర్చీలతో బాటూ వో మూలలో యిరుక్కున్నట్టుగా వున్నాయి. వాటి పక్కన అద్దం బిగించిన తామర పువ్వు ఆకారపు టీపాయ్ దీనంగా చూస్తోంది. డూప్లెక్సు హాలు మేడపైన రోజ్‌వుడ్ బీరువా ముందు కూర్చున్న నడివయస్సు స్త్రీ పెద్దసూట్‌కేసులోకి బట్టలు సర్దుతోంది.

మేడ మెట్లెక్కి, గసబోసుకుంటూ "యిల్లు మారస్తావుండారాక్కా?" అని అడిగాడు పరమేశాచారి.

చుట్టూ పరుచుకున్న పట్టుచీరల మధ్య పెద్ద పెద్ద గోళాలతో తయారు చేసినట్టున్న ఆకారం తలపైకెత్తింది. గుండ్రటి ముఖంలోని నోరు మరింత గుండ్రంగా తెరుచుకుంటూ వుండగా ఆమె వుత్సాహంగా "హైద్రాబాదు" అంది.

"సారుకు ట్రాన్స్వరాక్కా" యేడుపు మొంచుకొస్తూండగా అడిగాడతను.

"ప్రమోషను. రీజనలాఫీసుకు...." అందామె తన్మయంగా.

"యిల్లు బాడిగకిచ్చేస్తా వుండారా?"

"కాదు... అమ్మేసినాం.... అక్కడ జూబ్లీ హిల్స్‌లో మంచియిల్లు తక్కువరేటుకు దొరికింది. అంతా గౌతమరెడ్డన్నే జూసుకుంటా వుండాడు."

"అట్ల జెప్పండి. నేను చెన్నయిలో వాళ్ళింటిపనిజేస్తా వుండేటప్పుడు ఆ అక్క అంటానే వునింది. మన సారుకు తొందర్లోనే ప్రమోషను గ్యారంటీ అనింది." అతడి గొంతులో ఏడుపు జీర బలంగా ముంచుకొస్తుంది.

మా కొడుకు అక్కడ్నే కంట్రాక్టులు జేసుకుంటా వుండాడు. మా అల్లుడుగూడా అక్కడ్నే వుద్యోగం..." వరదనీళ్ళు పడ్డప్పుడు తత్తరించే చెరువులా ఆమె ముఖం వుద్వేగంతో యెగసిపడుతోంది.

"తలుపులూ దాలబంధరాలూ అంతా బలార్షా టేకుతో జేసినాము. షోకేసు రోజువుడ్డు.... యింట్లో వునిడే కప్బోర్డులూ, అలమరాలూ అన్నీ రోజువుడ్డే... బంగారటట్లాయిల్లు. బాడిగకిచ్చుంటే మళ్ళాయెప్పుడైనా మనూరికి వచ్చేసుండచ్చుగదక్కా! యెందుకమ్మేసినారు?" తుఫానులో పంటనంతా పోగొట్టుకున్న వ్యక్తిలా పరమేశాచారి బాధపడసాగాడు.

"బాడిగకిచ్చి, వాళ్ళు యిల్లును సరిగ్గా పెట్టుకోలేదని అంగలార్చేదెందుకు? పైగా అక్కడ యిల్లు కొనుక్కునేదానికి దుడ్డు కూడా కావద్దా!" రంగురంగుల పట్టుచీరలను సూట్‌కేసులో సర్దుతో ఆమె పెదవులు చప్పరించింది.

"సోఫాలూ, డైనింగ్‌టేబులూ, టీపాయిలూ భద్రంగా లారీకెక్కించమని చెప్పినావాక్కా! లేకపోతే వాటికి దెబ్బలు తగిలేను...."

"ప్చ్..." ఆవిడ మరోసారి పెద్దగా పెదవులు చప్పరించింది. "వాటిని యిక్కడ్నే అమ్మేసినాము. యిప్పటికే మూడే లారీల సామానయ్యింది. యీ మాదిరి ఘనంగా వుండే ఫర్నీచర్ను ఆ వూరోళ్ళు చూస్తే నవ్వుకుంటారు. దుడ్డుంటే హైద్రాబాదులో దొరకని ఫర్నీచరా?"

"యెవురికి... యెవురికమ్మేసినారు?" పరమేశాచారికి గొంతు పెగల్లేదు. ఆవిడ తదేక ధ్యాసతో చీరలు సర్దుకోసాగింది. అతను మెట్లుదిగి కింది హాల్లోకి వచ్చాడు. ముఖద్వారం దగ్గిరి తలుపులనోసారి తడిమి చూశాడు. కిటికీ తలుపుల నంతా పలకరిస్తున్నట్టుగా యిల్లంతా తిరిగాడు. మూలకు చిమ్మిన చెత్త మధ్యలో గుంపుగా జరిగిన సోఫాలనంతా తాకి పలకరించబోయాడు. లోపలి గదుల్లోని కప్బోర్డులనూ, టీపాయ్‌లనూ బిక్కమొగమేసుకుని చూశాడు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా మళ్ళీ డూప్లెక్స్ హాలు మెట్లెక్కి "రెడీమేడు ఫర్నీచరింత మన్నికగా వుండదక్కా! మనకోసరమని అక్కరగా జేసిన వురువులు. పనికిరానోళ్ళ చేతిలో పడితే అవిటికి విలువేముంటాది జెప్పు?" అని అడిగాడు.

ఆవిడ సమాధానం చెప్పలేదు.

పరమేశాచారి ఆ మెట్టుపైన్నే మానులా నిలబడిపోయాడు. మెట్లపక్కన అందంగా బిగించిన చట్రాల్లోని అద్దాల గుండా యింటిలోపలి పాలరాతి నేలపైకి పడుతున్న సాయంకాలపు యెండ లేత బంగారంలా ప్రతిఫలిస్తోంది. కింద హాల్లోంచీ కూలీలిద్దరు మరో పెద్ద అట్టపెట్టెను బయటికి మోసుకెళ్తున్నారు.

"అక్కా!" గొంతు పూడుకుపోయి మాటలు స్పష్టంగా పెగలకపోవడంతో పరమేశాచారి మరోసారి "అక్కా!" పెద్దగా పిలిచాడు. ఆమె చీరల మడతలలోంచీ తలపైకెత్తకుండానే యేమిటన్నట్టుగా తలవూపింది.

"అన్న సెల్లుకు మూడుదినాలుగా ఫోనుజేస్తావుండాను యెంగేజీ వస్తావుండాది. యెప్పుడొస్తాడు?"

ఆవిడ రసగుండ్లనూ, చందనం కవర్లనూ సూటుకేసులో సర్దుతూ "యేమో! హైద్రాబాదుకు పొయ్యా పోకముందరే పనెక్కువయ్యిందంట. సామాన్లు లారీ కెక్కించుకొని రమ్మని బాంకి ప్యూన్నే అంపించినారు" అంది.

"అర్జెంటుగా మాట్లాడాలక్కా! పోలీసోళ్ళతో వొకమాట చెప్పి నన్నిడిసి పెట్టమని చెప్పాల..."

"మళ్ళా పోలీసోళ్ళా?" ఆవిడ కోపంగా వురిమి చూసింది. "నెలకొక తూరైనా స్టేషనుకు పోకపోతే తిండి దిగదా నీకు? పోయిన తడవ నీకు బెయిలు దీసిచ్చేదానికి యెన్నితూర్లు తిరగాల్సొచ్చిందో అప్పుడే మర్చిపోయినావా?"

"ఆ జగన్నాథంనాయుడి యింటిపనికి వొప్పుకున్నాంకేగదక్కా, నాకీ అగసాట్లు?" పరమేశాచారి చేతులు నలుపుకుంటూ, యెండుకుపోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకోసాగాడు. "వారం వారం కూలీల మస్టరియ్యకుండా ఆ మనిషి నన్ను పనులు మాత్రం సక్రమంగా జేసేదిలేదని రంపుజేస్తావుండాడు. కూలీ దుడ్డీకపోతే నాదగ్గిరుండే ఆచార్లు గొమ్మునుంటారాక్కా! మేము పనికిపోకపోతే పోలీసు రిపోర్టిస్తా వుండాడు. వూళ్లో అంత పలుకు బడుండే మనిషిని మేము కాతరు జెయ్యలేదని కడుపులో మంట బెట్టుకుంటా వుండాడు...."

ఆమె వోసారి అతణ్ణి వురిమిచూసి మళ్ళీ తన పనిలో తాను తలదూర్చుకుంది.

రెండు నిమిషాలు తటపటాయించాక "నేను మన రెడ్ల యిండ్లలో పన్లయితే సరింగా చేస్తానని వాళ్ళకు కోపమక్కా... మొదుట్నించీ నన్ను వాళ్ళ పార్టీగాదని దబాయిస్తానేవుండాడు..." అన్నాడతను. ఆవిడ ముఖంలో కొంత ప్రసన్నత కనిపించగానే "తాగేసిపోయి వాళ్ళింట్లో రంపుజేసినానని నాపైన కేసుబెట్టినాడు. యిన్న దినాలుగా మనింటికి వస్తా వుండాను. నేను మందు దాగిందెప్పుడైనా జూసినావాక్కా?" ....పోలీసోళ్ళ బయిం పెట్టకపోతే నేను సరింగా పనులు జెయ్యనంట..." అంటూ మరేదో చెప్పబోయాడు. ఆవిడ పైకి లేచి పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

పరమేశాచారి నీరసంగా మెట్లుదిగి కిందిహాల్లో కొచ్చాడు. సోఫాలూ, కుర్చీలూ, టీపాయ్‌లూ, దివాన్‌లు మాత్రం మిగిలిన హాలు ఆదివారంనాటి

కోర్టుహాలులా బోసిపోయివుంది. లోపలున్న షీల్డులూ, బొమ్మలూ తరలిపోవడంతో షోకేసు ముసలి లాయరు పళ్ళూడిపోయిన నోరులా వికారంగా వుంది.

సూట్‌కేసును నెత్తిపైకెత్తుకుంటున్న కూలీతో కృష్ణారెడ్డి భార్య "అన్నీ పట్టుచీరలు... కాబిన్ లోపల పెట్టుకోండి... యేమన్నా అయితే సారు గొమ్ముగుండడు. వొళ్ళుదగ్గిరబెట్టుకోని భద్రంగా అక్కడికి జేర్పించాల.... సరేనా?" అని జరగని పొరబాటుకు పెద్దగా మందలిస్తూ మెట్లుదిగసాగింది. హాల్లోకి వచ్చాక వంటగదిలో సామాన్లు సర్దుతున్న వ్యక్తులకు జాగ్రత్తలు చెప్పసాగింది.

పరమేశాచారి జంకుతూ పాడిదగ్గరగ్గి "అయితే నువ్వు గూడా యిప్పుడే యెలబారిపోతావాక్కా!" అని అడిగాడు.

"నారాయణాద్రికి యింక గంటే టయిముండాది. ఆలోపల సామాన్లంతా లారీ కెక్కించమంటే యీ కూలోళ్ళు పొద్దున్నుంచీ టాలాటోత జేస్తావుండారు..." అందామె విసుగ్గా.

"అయితే రాత్రి నించీ మనింట్లో యెవురైనా కాపలాగా పండుకోవద్దాక్కా! నేనుండేదా?" అని అడిగాడు పరమేశాచారి వినయంగా యేడుపు గొంతుకతో.

ఆవిడ వంటింటిలోంచీ పడకగదిలోకి సరసరా నడుస్తూ "ఖాళీ యింటికి కావిలెందుకు? యిల్లును బేరం జేసిన మనిషి యిప్పుడొస్తాడు. వాని ముగాన బీగాలు పారేసిరమ్మని సారు ఫోను జేసినాడు" అందామె.

"ఫోనా?.... ఫోను...." అని గొణుక్కుంటూ ద్వారబంధం దాటి బయటికొచ్చిన పరమేశాచారి ప్రహరీగోడ పక్కనున్న కుక్కగూడు ఖాళీగా కనిపించడంతో వులిక్కిపడ్డాడు. ఆతురతతో మళ్లీ యింటిలో కొచ్చి "జూలీని గూడా హైద్రాబాదు కంపించేసినారాక్కా!" అని అడిగాడు.

ఆవిడ గసలుబోసుకుంటూ "ఇంగా యేడజూలీ! అది జచ్చిపొయ్యి నాలుగైదు దినాలైపొయ్యింది" అంది.

"అయ్యయ్యో! అయ్యయ్యో" పరమేశాచారి పెద్దగా ఆక్రోశించాడు. "బంగారట్టా కుక్కగదక్కా! నేనింట్లో వుండేంతసేపూ నా కాళ్లెనకాలే తిరగతావునింది".

"నెలగా దానికి వొకటే జరమూ, బేదులూ... అప్పటికీ పనోడి దగ్గిరికిచ్చి వెటర్నరీ ఆస్పత్రికి గూడా అంపించినాను. వారం దినాలు కొట్టకలాడింది. యేంజేద్దాం జెప్పు ఆచారీ! అది హైద్రాబాదుకొచ్చేదానికి అడిగిరాలేదు" చెబుతూనే ఆవిడ మళ్లీ మెట్లెక్కి వెళ్లిపోయింది.

నేలలోకి వేళ్ళు దిగిపోయిన చెట్టులా పరమేశాచారి అక్కడే కాసేపు నిలబడిపోయాడు. తరువాత నీళ్ళు నిండిన కళ్ళతో కుక్క గూడు దగ్గరికి నడిచాడు. గూడులోపలినుంచీ యేవో రెండు కళ్ళు తనకేసి దీనంగా చూస్తున్నట్టు అనిపించగానే అతను నిలువెల్లా వణికిపోయాడు. కిటికీలోంచీ అటువైపుకు తిరిగిన సోఫాలూ, కుర్చీలూ తనకేసి పెడముఖం పెట్టినట్టుగా కనిపించ సాగాయతడికి. ఖాళీ చేస్తున్న యింటిలోంచీ బయటపడిన చెత్తా చెదారం, కాగితం ముక్కలూ తనకేదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్టుగా అనిపించసాగింది.

"వస్తా జూలీ!.... పోతా జూలీ... చెప్పకుండానే యెలబారిపోయినావే నువ్వు!.... ఎంత పనిజేస్తివే నువ్వు!...." గొణుక్కుంటూ, మళ్లీ మళ్లీ వెనుదిరిగి చూస్తూ పరమేశాచారి నడవసాగాడు.

లారీ కాబిన్‌లో బీడీ గాల్చుకుంటూ కూర్చున్న డ్రైవరు క్లీనరునెందుకో బూతులు తిడుతున్నాడు. చలికాలపు యెండ సాయంత్రానికి చల్లబడిపోతోంది. ట్రంకురోడ్డు పైకొచ్చాక వో చెట్టు వెనక దాక్కున్నాడు పరమేశాచారి. దూరంగా ఆరుసీట్ల ఆటో కనిపించాక రోడ్డు పైకొచ్చాడు. ఆటోలో కూర్చున్నాక కాలనీ వైపుకు వెనుదిరిగి చూడడానికి ప్రయత్నించాడు. క్రిక్కిరిసిన తలలమధ్య కాలనీ రోడ్డుగూడా చిన్న తోకచుక్కలాగే కనిపించింది. నాలుగురోడ్ల కూడళ్ళలో ఆటో ఆగినప్పుడల్లా బయటున్న పోలీసు చూపులు తనకోసం కాలిస్తున్నట్టు అనిపించడంతో బల్లిపిల్లలో ఆటోరేకులకు అతుక్కుపోసాగాడు.

బాలాజీ కాలనీ దాటాక ఆటోను ఆపమని గొడవచేసి, "యెక్కడంటే అక్కడ నిలిపితే ట్రాఫిక్కోళ్ళు ఫైన్లేస్తారు" అని మండిపడుతున్న ఆటోడ్రైవరు చేతిలో నాలుగురూపాయలు విసిరేసి, కిందికి వూడిపడ్డాడు. సవకాన్ని తలపైకి లాక్కున్నాక యల్లైసీ కాలనీలోకి నడచాడు. పాత జ్యోతీ తియేటరు మీదుగా అలిపిరి రోడ్డులో కొచ్చి పట్నాలు వీధిలోకి తిరగబోయాడు. అంతలో ఆ ప్రయత్నం మానుకుని అలిపిరికేసి తిరిగాడు. స్విమ్స్ దగ్గరికొచ్చాక వో క్షణం ఆగి, ఆ తరువాత పడమటికి తిరిగి స్విమ్స్ హాస్పిటల్ రోడ్డులో నడవసాగాడు.

పశ్చిమాన్నుంచీ పడుతున్న యెండ పాలిపోయి నీడలు వ్యాపిస్తున్నాయి. రోడ్డులో నడుస్తున్న వ్యక్తులు నిస్సారంగా వున్నారు. స్విమ్స్ హాస్పిటల్ ముందుకొచ్చి సిమెంటు చప్టాపైన రోగులకోసం వచ్చిన వ్యక్తుల మధ్యలో కూర్చున్నాడు పరమేశాచారి.

ఆస్పత్రి చుట్టూ దీనంగా తిరుగుతున్న మనుషుల్ని చూస్తుంటే అతడికెందుకో వూరట కలుగుతున్నట్టుగా తోచింది. చూస్తూండగానే చుట్టూ కరెంటు దీపాలు వెలిగాయి. చీకటి త్వరత్వరగా ముదరసాగింది. పక్కన కూర్చున్న వ్యక్తులు గూడా నీడల్లా కనబడసాగారు. ఆస్పత్రిలోంచీ స్ట్రెచర్‌పైన వచ్చిన శవాన్ని యేడుస్తున్న వ్యక్తులు వానులోకి యెక్కిస్తున్నారు. వాళ్ళను పట్టించుకోకుండా యిద్దరు కుర్ర డాక్టర్లు పక్కనుంచే నవ్వుతూ వెళ్ళిపోతున్నారు.

క్రమంగా ఆస్పత్రి ముందు కూర్చున్న జనం పలచబడి పోసాగారు. పక్కన కూర్చున్న వ్యక్తులు అక్కడే కారియర్లు విప్పి అన్నాలు తిని, అక్కడే నడుములు చేరేసి నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆకలిగా అనిపించగానే కాంటీనుకెళ్ళి అయిదురూపాయలిచ్చి వొక బన్నూ, వొకటీ కొనుక్కున్నాడు పరమేశాచారి. టీలో రొట్టెను ముంచుకుని తింటూ, గోడ గడియారాన్ని చూసి "నారాయణాద్రి కావలి జేరి పొయ్యుంటాది...." అని గొణుక్కున్నాడు. చీకటిలో నీడలా నడుస్తూ అలిపిరి రోడ్డు మీదుగా పాతగోషా ఆస్పత్రిదాకా వచ్చి, తర్వాత అనంత వీధిలోకి మర్లాడు. వీధి నిర్మానుష్యంగా వుంది. యిండ్లలోంచీ టీవీల మ్రోత మాత్రమే వినబడుతోంది. సందులోంచీ తిరిగి, గొందిలోకొచ్చి మట్టిమిద్దెను చేరుకున్నాడతను. మూసుకున్న యింటి తలుపు చెదలు పగుళ్ళలోంచీ చీకటి తెరలా గుడ్డి దీపపు వెలుతురు కనబడుతోంది.

తలుపును నెమ్మదిగా తోసుకుని యింటిలోపలికొచ్చారు పరమేశాచారి. కుర్రాడూ అమ్మాయి గోడపక్కన చాపపైన పడుకుని నిద్రపోతున్నారు. భార్య మాత్రం టీవీలో అతుక్కుపోయి వంకర్లు పోతున్న కార్యక్రమాన్ని కళ్ళుచించుకుని చూస్తోంది.

"యెవురైనా వచ్చిపోయినారా?" అని వీలయినంత తాపీగా అడగతానికి ప్రయత్నించాడతను.

"యిద్దరు.... పోలీసులు" అందామె వుదాసీనంగా.

"అన్నం తిన్నారా?" అని ప్రశ్నించాడతను. ఆవిడ సమాధానం చెప్పలేదు.

పరమేశాచారి వంటగదిలోంచీ రెండు పాత గోనెసంచులు తీసి "సామాన్లు చిన్నాగా సర్దేద్దాం" అన్నడు. ఆవిడ తెల్లబోయి చూసింది.

"రాత్రి రెండుగంటలకు గుంతకల్లు పాసింజెరు.... కదిరికి... మీ అన్న అక్కడ పన్లు చానా వుండాయనీ, ఆ చార్లు సరింగా దొరికేది లేదదీ అంటానే వుండాడు...."

ఆమె నిర్లిప్తంగా పైకిలేచి పాత్ర సామాగ్రినంతా గోతాల్లోకి చేరవేయసాగింది. రెండుగోతాలు నిండే సరికి వంటగది ఖాళీ అయిపోయింది. నిద్రపోతున్న అమ్మాయిని పైకి లేపి దానినెత్తి పైన ట్రంకుపెట్టెలూ, చాపలూ, దిండ్లూ పెట్టిందామె కళ్ళు నలుముకుంటూ పైకిలేచిన కుర్రాడితో "టీవీ యెత్తుకోరా" అని గద్దించాడు పరమేశాచారి. యింటికి తాళం వేశాక, తాళం చెవిని పక్కింటి తలుపుల సందులోంచీ లోపలికి గిరవాటేశాడు. మడిచిన యినపమంచంపైన మూటను పెట్టి రెండింటినీ తలపైకెత్తుకున్నాడు. మరో మూటను పైకెత్తుకున్నాక కుర్రాడితో "స్టూలు గూడా యెత్తుకో!" అంది అతడి భార్య.

కథ

ఆకాశం అంచులదాకా...

☆ సుంకోజి దేవేంద్రాచారి

పెరట్లోని చెట్టుకింద కూర్చొని అంట్లు గబగబా తోముతోంది స్వేచ్ఛ. ఉదయం ఏడుగంటలవుతోంది. చలితో పట్టణం యింకా ముణగదీసుకుని పడుకున్నట్టుంది. రోడ్లమీద జనసంచారం తక్కువగా ఉంది. అప్పుడప్పుడూ వెళుతున్న ఒకటి రెండు వాహనాల చప్పుడు తప్ప నిశ్శబ్దంగా వుంది. మంచు పూర్తిగా తొలగక పోవడంతో మసకగా వుంది.

ముఖంమీద పడుతున్న వెంట్రుకలను కుడిచేతి మణికట్టుతో పైకి తోసుకుని "గిరీ... కూరచూడు. ఉడికి పోయింటే దించెయ్. పాలు చల్లారాయేమో, తోడు వేసెయ్ మరచి పోయామంటే మనం వచ్చేప్పటికి విరిగిపోతాయ్. రేపటికి పెరుగుండదు" అంది స్వేచ్ఛ చేస్తున్న పనిని ఆపకుండానే.

"ఆ పనులన్నీ ఎప్పుడో అయిపోయాయి. షేవ్ చేసుకుంటున్నాను" బదులిచ్చాడు గిరి.

"యింకా నేను స్నానం చేయాల పదిగంటలకంతా వస్తానని చెప్పాను" గొణిగినట్టుగా అంది స్వేచ్ఛ.

అంట్లు తోమేసి బాత్‌రూంలోకి పోయి బ్రష్‌తో పళ్ళు తోముకుంటూ బయటొచ్చింది.

'ఈరోజు పనులన్నీ వాయువేగంతో చేస్తున్నవే' అన్నాడు గిరి

"రాత్రే చెప్పా కదా గిరీ... నేనూ, దుర్గ, ముంతాజ్, కవిత బెస్ట్ ఫ్రెండ్స్. నల్గురం కాలేజ్ డేస్‌లో రూమ్మేట్స్ నేను వాళ్లను చూసి ఆరేళ్ళవుతా వుంది. వాళ్ళు ముగ్గురూ ఈ వూర్లోనే వున్నారంట. నిన్న దుర్గ కనిపించి చెప్పింది. వాళ్ళింటికి పదిగంటలకు రమ్మంది. అక్కడి నుంచి యిద్దరం ముంతాజ్, కవితల యింటికి పోయొస్తాం" ఉత్సాహంగా చెప్పింది స్వేచ్ఛ పళ్ళు తోమడం ఆపి.

"సండే పోయింద కూడదా... ఈరోజు వర్కింగ్‌డే కదా. వాళ్ళు యింటి దగ్గర వుంటారో వుండరో".

'ఎందుకుండరు... వాళ్లేమన్నా నాలాగా జాబ్ చేస్తున్నారా? 'కడుపే కైలాసం, యిల్లే స్వర్గం' అంటారే... ఆరకం.. దానికి తోడు ధనవంతులంట"

"మనం కూడా ధనవంతులమయితే, నువ్వు ఉద్యోగం చేసిండవా"

"ఎందుకు చేసిండను. కేవలం వంటగదికే పరిమితం కాలేను"

"వాళ్ళు ఆర్థికంగా బలవంతులేమోగానీ, మనం మానసికంగా బలవంతులం. బాహ్యమయినవన్నీ కూడా అంతిమంగా ఆనందం కలిగించేది మనసునుంచే. కాబట్టి మనం కూడా బాగా వున్నవాళ్ళమే" అన్నాడు గిరి బాత్‌రూంలోకి స్నానానికి పోతూ.

'ఆ.... మనిషిని మాయచేసే మాటలకేం తక్కువ లేదు" నవ్వుతూ అంది స్వేచ్ఛ.

బాత్‌రూంలోంచి గిరిస్నానం చేస్తున్న చప్పుడు

స్వేచ్ఛ తలపైకెత్తి చెట్టువైపు చూసింది.

ఆకాశం అంచులదాకా వుందా చెట్టు. పచ్చని ఆకులతో, సన్నటి రెమ్మలతో కళకళలాడుతా వుంది. కొన్ని రెమ్మలు చిరునవ్వులు చిందిస్తున్నాయి. కొన్ని ఎలుగెత్తి స్వేచ్ఛగా పాడుతున్నాయి. కొన్ని సత్యశోధనకోసం వాదించుకుంటున్నాయి. అంతిమంగా చెట్టు ఆకాశం అంచుల తాకుతూ తనకు సాటి మరొకటి లేదన్నట్టుగా ఠీవిగా వుంది.

తనాయింటికి వస్తానే ముందు చేసిన పని గిరితో కలిసి యింటి వెనకున్న పిచ్చి మొక్కలను తొలగించడం. తొలగించే క్రమంలో ఆకుపచ్చగా సన్నటి రెమ్మలతో.. అప్పుడే స్వేచ్ఛా వాయువులను పీలుస్తూ, లోకాన్ని పాతగా చూస్తూ, కేవలం మూరడు ఎత్తు మాత్రమే ఉన్న ఆ మొక్కను పీకటానికి ప్రయత్నించాడు గిరి అతనికి సాధ్యం కాలేదు. కానీ తనుమాత్రం మనిషెత్తున్న పిచ్చి మొక్కలను కూడా అవలీలగా పీకేయగలిగింది.

"స్వేచ్ఛా... ఈ మొక్క చూడు... నేలలోంచి రానంటాంది" అన్నాడు.

"కొన్ని మొక్కలు చిన్నవయినా వేర్లు బాగా లోతుకుంటాయి. వుండి పోనీలే

పరమేశాచారి విసుగ్గా తలవిప్పి "వద్దులే! యిప్పటికే టీవీ బరువుగా వుండాది. అది పాతదైపొయ్యింది. పొయ్యిలోకి మాత్రమే పనికొస్తుంది" అని కసురుకున్నాడు.

"పద్దైదేండ్లుగా యింట్లోనే వుండాది. వుండేదొకే స్టూలు... యెత్తుకోనాయినా!" అందామె కోపం ముంచుకొస్తూండగా.

తిరగేసిన స్టూలు మధ్యలో టీవీని అమర్చి, రెండింటినీ తలపైకెత్తుకున్నాడా కుర్రాడు.

నిద్రకుపక్రమిస్తున్న యిండ్ల మధ్యలోంచీ, చీకటిలోనే దాక్కుని నడుస్తూ, తన వెనక ముగ్గురు అనుసరించి వస్తున్నారన్న విషయాన్ని మరచిపోయినట్టుగా వేగంగా నడవసాగాడు పరమేశాచారి. తీర్థకట్టవీధిలో అంగళ్ళు అప్పుడే మూస్తున్నారు. గాంధీ రోడ్డులోని వాహనాలు వన్‌వే ట్రాఫిక్ రూలు తొలగినవేళ గావడంతో రెండువైపులకూ పరిగెడుతున్నాయి. మ్యూజియం పక్క సందులో పగటి పాత గుడ్డల అంగళ్ళు ఖాళీ చేసిన స్థలంలో రాళ్ళూ, గోడలపైన చీలలూ మాత్రమే కనిపిస్తున్నాయి. వుత్తర మాడా వీధిలో టాక్సీలు వరసగా నిలబడి విశ్రాంతి తీసుకుంటున్నాయి. భీమాస్ హోటలు ముందు కార్ల రద్దీ మాత్రం తగ్గలేదు. రైల్వే స్టేషనులోకి వెళ్ళాక, కొత్త బ్రిడ్జీ యెక్కి మూడో నెంబరు ప్లాట్‌ఫాంలో కొచ్చాడు పరమేశాచారి.

ముఖ్యమైన రైళ్ళన్నీ వెళ్ళిపోవడంతో ప్లాట్‌ఫాంపైన మిగిలిన మనుషులు అక్కడే దుప్పట్లు పరుచుకుని నిద్రపోతున్నారు. ప్లాట్‌ఫాం చివరలో చీకటిగా వున్న సిమెంటు బెంచీ ముందు యినప మంచాన్నీ, మూటనూ దించాడు పరమేశాచారి. భార్యతలపైని మూటను దించిపెట్టాక, కుర్రాడి నెత్తిపైని స్టూలును టీవీతో సహా ప్లాట్‌ఫాంపైకి దించాడు.

పిల్లలిద్దరూ సిమెంటు బెంచీపైన సర్దుకుని పడుకున్నారు. భార్య వాళ్ళ కాళ్ళదగ్గర కూర్చుంది. పరమేశాచారి బీడీ వొకటి వెలిగించి, రెండుదమ్ములు లాగాడు. దాన్ని చివరిదాకా తగలేశాక, దానిపీకతో మరోబీడీని అంటించుకున్నాడు.

నోట్లోంచీ పొగ సుళ్ళు తిరుగుతూ బయటికొస్తూండగా "కదిరిలో వుండే టింబరు డిపోలు నేరుగా బల్లార్షానించే లారీలతో టేకును తెప్పిస్తాయి. వాకిటోరకం టేకు..." అంటూ మొదలెట్టాడు పరమేశాచారి. "కిటికీలు జేసినా, తలుపులు జేసినా కుది మట్టంగా మెరుస్తాయి. రోజువుడ్డుగావాలంటే నంద్యాలనించీ బయిం లేకుండా తెచ్చిచ్చేవాళ్ళుండారు. సోఫాలు జేస్తే యాభై యేండ్లయినా అవి కొత్తవిగానే వుండిపోవాల్ల... అసలు టేకూ రోజువుడ్డూ దొరక్కపోయినా యేంలే! ఆ పక్క గండి అడువుల్లో యేపకొయ్య మానావిరిగా దొరికితింది. బాగా చేవెక్కిన యేపకొయ్యతో తలుపులూ దాలబంధరాలు జేస్తే వాటి ముందు మిగిలిన కొయ్యేదైనా బలాదూర్! పనిజేస్తే మట్టంగా దిట్టంగా వుండాలి. లేకపోతే నాకు పనిరాదని వొప్పుకోవాల్ల. చేసిన పనిలో యెవులైనా వక్రంజూపిస్తే తలగొట్టేసినట్టే! దానికంటే మించిన బోగసాట్లేముండాయి? యింటికి టేకు మాన్లు దెప్పించినారే అనుకో! రవంత గద్దు చెక్కను గూడా బీరు పోనీకుండా యేమేం జెయ్యచ్చునో అవన్నీ చెయ్యాల! యెప్పుడో యిరవయ్యి ముప్పయ్యేండ్లు అయినాంక నువ్వు నీ చేతుల్తో చేసిన వురువుల్ని జూసినావే అనుకో! అవ్విట్నే నువ్వు గుర్తు పట్టే కావాల్ల! అసలు నీదాంకా యెందుకు? నీకేగాని చెవులుంటే అవి చాన్నాళ్ళయినాంక నిన్ను చూసిన ఆనందంతో గట్టిగా నీ పేరు పెట్టిపిలిచేది నీకు యినిపించే కావాల్ల!....."

"వస్తా వస్తా యీ మనిషి నాలుగు దరాములేసుకొని వచ్చినట్టుండాడు" అని గొణుక్కుంది పరమేశాచారి భార్య. అతను చీకటి ప్లాట్‌ఫాంపైన నిలబడి పెద్దగా చేతులు తిప్పుతూ మాట్లాడుతూనే వున్నాడు.

*

గిరి" అంది.

అప్పటి నుంచి ఆమొక్కకు రోజా నీళ్ళు పోయడం మొదలు పెట్టింది. ఏడాది దాకా గిరి అంతగా పట్టించుకోలేదు గానీ, ఏపుగా పెరిగే ఆ మొక్కను చూస్తే మొదట ఈర్ష్య కలిగేది. తర్వాత్తరువాత ముచ్చటేసింది. తను కూడా మొక్కకు పాదు చేయడం, అప్పుడప్పుడూ నీళ్ళు పోయడం, యింటికి చుట్టుపక్కల ఎక్కడన్నా పశువుల పేడ వుంటే తెచ్చివేయడం చేస్తున్నాడు.

మొక్కమీద గిరికున్న శ్రద్ధ చూస్తే స్వేచ్ఛకు చాలా ముచ్చటేసేది.

ఆరేళ్ళలో ఆ మొక్క పెరిగి పెరిగీ... ఆకాశం అంచులదాకా ఎదిగింది.

"స్వేచ్ఛా... అది మన చెట్టే. ఎక్కడికీ పోదు. రోజా అలా మెడనొప్పి అయ్యేలా చూడాల్సిన పనిలేదు. స్నానం చేయి. తినేసి పోదాం. నాకు టైమవుతా వుంది". అన్నాడు గిరి.

"ఎంత ఎత్తు పెరిగింది గిరీ... ఆకాశం అంచులను తాకుతుంది కదా. మెడనొప్పయినా సరే, రోజుకు ఒకసారయినా చూస్తే... అదో తృప్తి" చెప్తూ బాత్‌రూంలోకి దూరింది.

గిరికి వెనకా ముందూ ఎవ్వరూ లేరు. తల్లిదండ్రులు కాలం చేసి చాలాకాలమే అయింది. ఆరంకణాల ఆయింటిని మాత్రమే సంపాదించి వెళ్ళారు వాళ్ళు. చాలీచాలని కుటుంబం నుంచి వచ్చింది స్వేచ్ఛ. కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నాడని స్వేచ్ఛకు గిరి అంటే గౌరవం. తనకంటే ఎక్కువ చదువుకుందని గిరికి స్వేచ్ఛ అంటే గౌరవం. తన మాటకు విలువ యిస్తుండటంతో స్వేచ్ఛకు గిరిమీద ప్రేమ. పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోయే స్వేచ్ఛ అంటే గిరికి ప్రేమ.

స్వేచ్ఛ ఐదడుగుల పొడవుంటుంది. చామనఛాయ. చూస్తానే ఆకర్షించేంత అందగత్తెకాదు.

గిరికూడా అంతే... భార్యకన్నా మూడంగుళాల పొడవుంటాడు. చూడ్డానికి చాలా మందిలా మామూలు మగవారిలానే వుంటాడు.

అయితే ఆ యిద్దరి కలయితో వారిలో ఏదో తెలిని ఆకర్షణ.

స్వేచ్ఛ స్నానం చేసి వచ్చేలోపు గిరి రెండు క్యారేజీలు సిద్ధం చేశాడు.

"ఈరోజు నేను లీవు పెట్టాను మరచిపోయావా గిరీ" అంది స్వేచ్ఛ నవ్వుతూ.

"అలవాటులో పొరపాటు... నేను తినేశాను. ఆఫీసుకు టైమవుతా వుంది. బయల్దేరుతాను. రాత్రికి వస్తావు కదా" అన్నాడు గిరి క్యురేజీ సంచిని భుజానికి తగిలించుకుంటు.

"ఈ వూరే కదా... వచ్చేస్తాలే"

"డబ్బు కావాలా...?"

"అవసరం లేదు.. నా దగ్గర ఫైవ్ హండ్రెడ్స్ వున్నాయి"

"ఈనెల మీ అమ్మ వాళ్ళకు పంపలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు గిరి

యిద్దరూ ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్నారు. పెళ్ళయింది మొదలు తన జీతం డబ్బు మొత్తం పుట్టింటికే పంపుతోంది. వయసుడిగిన అమ్మానాన్న, చదువుకుంటున్న తమ్ముడు వున్నారు. యిటీవలే తన చెల్లికి పెళ్ళయింది. బ్యాంకులో లోను తీసి డబ్బు యిచ్చింది. గిరి కూడా కొంత సర్దుబాటు చేశాడు.

"నెలానెలా పాతికా, యాభై మిగిలేది. ఆ మొత్తం ఐదువందలా అరవై అయింది".

"యింటికి తక్కువ పంపావేమో. మీ అమ్మావాళ్ళు యిబ్బంది పడుతుంటారు. నేను వెళ్తున్నాను. వీలయినంత తొందరగా వచ్చెయ్. సాయంత్రం వంట చేసేస్తాలే" చెప్పి యింట్లో నించి బయటపడ్డడు గిరి.

స్వేచ్ఛ కళ్ళు చెమర్చాయి.

తనేమన్నా తప్పు చేస్తోందా అనుకుంది. అదేమాట ఎన్నోసార్లు గిరితో కూడా అంది.

"నీ తప్పేం వుంది స్వేచ్ఛా. భార్యా భర్తల్లో యిద్దరూ సమానమే. చెట్టుముందా విత్తుముందా అంటే సమాధానం చెప్పగలమా? దంపతులు కూడా అంతే. మా అమ్మానాన్న, తోబుట్టువులు వుంటే నా సంపాదన వాళ్ళకోసం ఖర్చు చేయనా? యిప్పుడు నువ్వూ ఆ పనే చేస్తున్నావు. మగవాళ్ళ సంపాదన మాత్రం తనవాళ్ళకోసం ఖర్చు చేయవచ్చు. ఆడవాళ్ళు సంపాదిస్తే మాత్రం వాళ్ళ వాళ్ళకు యివ్వకూడదా? యిదేం న్యాయం? మగవాళ్ళ దయాదాక్షిణ్యం మీదే బతుకుతున్నాం అనే ధోరణి ఆడవాళ్ళలో పోవాలి. యింటిపని కూడా పనే... తామూ భర్తతో సమానంగా కష్టపడుతున్నాం అనే తత్వం ఆడవాళ్ళలో రావాలి. అప్పుడు యిలాంటి ఆలోచనలు ఆడవాళ్ళలో రావు. నా సంపాదన మనకు సరిపోతోంది. నీ సంపాదన మీ అమ్మా వాళ్ళకు పంపడంలో తప్పేముంది?' అన్నాడు గిరి.

అప్పటి నుంచి స్వేచ్ఛ హృదయంలో గిరి హిమాలయంలా పెరిగిపోయాడు. గిరి తనకు పొట్టివాడుగా కన్పించడం లేదు.

స్వేచ్ఛ చీరకట్టుకుని తయారయింది. టిఫిన్ తిని తలుపుకు తాళం వేసి వీధిలోకి వచ్చింది. మళ్ళీ ఒకసారి పెరట్లోని చెట్టును చూసింది. ఆ చెట్టును చూసినప్పుడల్లా తన మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది.

వడివడిగా నడుచుకుంటూ బస్టాపు వద్దకు పోయింది. అక్కడికి కూడా తమ చెట్టు కన్పిస్తా వుంది. అక్కడి నుంచి బస్సులో వెళ్ళింది. దుర్గ యింటికి వెళ్ళేప్పటికి పదిగంటలయ్యింది. చుట్టూ ప్రహరీగోడ వున్న పెద్ద యిల్లది. యింట్లో ఒక్కతే వుంది.

భర్త ఆఫీసుకు పోయాడు.

అత్తామామ గుడికి పోయారు.

రెండేళ్ళ బాబు స్కూలుకు పోయాడు.

యిద్దరూ మాటలు చెప్పుకుంటూ మేడమీదకు వెళ్ళారు.

"అరే... అటుచూడు... చెట్టు కన్పిస్తోందా...?" ఆశ్చర్యంగా అరచినట్టుగా అంది స్వేచ్ఛ.

"ఆఁ... కన్పిస్తా వుంది. చాలా ఎత్తుగా వుందే. నేను యిన్నిరోజులూ గమనించనేలేదే. మీ చెట్టేనా అది" దుర్గ.

"మాదే.. మా పెరట్లో వుంది" బదులిచ్చింది స్వేచ్ఛ.

"అవునా... మా పెరట్లో కూడా వుంది కానీ ఆ చెట్టులాగా పెరగలేదు. దానికి రకరకాల ఎరువులు తెచ్చివేశాం. అయినా అది ఎత్తు ఎదగడం లేదు. రా చూద్దువు" అంటూ యింటి వెనక్కు తీసుకుపోయి చెట్టును చూపించింది దుర్గ.

చెట్టులో కొన్ని కొమ్మలకు బంగారు నగలు వేలాడుతున్నాయి.

కొన్ని వాటికి టీ.వి. ఫ్రిజ్, కూలర్ లాంటివి వేలాడుతున్నాయి.

కొన్ని కొమ్మలను కప్పుతూ వెండి జరీ చీరలు గాలికి కదలాడుతున్నాయి.

చాలా రెమ్మలు, కొమ్మలు తమలోకి తామే ముడుచుకు పోయాయి. దిగులుగా భయం భయంగా పరిసరాలను చూస్తున్నాయి. బాధపడుతున్న దానికి గుర్తుగా కొమ్మలమీద నీటి చారికలు.

"ఆ లేతకొమ్మలకు అంతంత బరువు తగిలిస్తే ఎలా ఎదుగుతుంది చెట్టు" అంది స్వేచ్ఛ.

"అవి లేకుండా ఎలా వుండేది?" ఎదురు ప్రశ్నించింది దుర్గ.

"చెట్టు ఎదగడానికి నీళ్ళు, ఎరువు వుంటే చాలదు. తగినంత సూర్యరశ్మి కూడా కావాలి. మందపాటి పట్టుచీరలతో అలా కప్పేశావే... బంగారు నగలు చూడూ... ఎప్పుడూ అలా వేలాడుతూంటే కొమ్మలు గాలికి కదలాలన్నా దొంగల భయంకాదా? అందుకే అలా ముడుచుకుపోయింది. ఎదగకుండా" వివరించింది స్వేచ్ఛ.

"అవన్నీ లేకుంటే బతకగలమా?" దిగులుగా అంది దుర్గ.

అరగంటసేపు అక్కడ గడిపాక ముంతాజ్ యింటికి పోదామంది స్వేచ్ఛ.

'రాత్రే మావారితో చెప్పాను. ఈ రోజు వద్దని చెప్పారు. యింకోరోజు పోదాంలే'

"యిప్పుడేమయినా పనుందా?"

"పనేం లేదు. అన్నీ పని మనుషులే చూసుకుంటారు..." గొప్పగా చెప్పింది దుర్గ.

"అయితే యింకేం... మీ ఆయన సాయంకాలం వస్తారు. ఆలోపు వచ్చేద్దాంలే పోదాం పదా"

"అమ్మో... మా ఆయన వద్దంటే పోవడమూ... మళ్ళేమైనా వుందా.. పిన్నీసులు తీసుకునేదానికి పక్క వీధికి ఫ్యాన్సీస్టోర్‌కు పోవాలన్నా ఆయన సరేనంటేనే. లేకపోతే నేను పోను..."

"నువ్వే వెళ్ళవా... మీ ఆయన కోప్పడతారని వెళ్ళవా?" ప్రశ్నించింది స్వేచ్ఛ సమాధానం చెప్పకుండా తలదాచుకుంది దుర్గ.

"యిల్లు వదిలి బయట ఎప్పుడైనా వెళ్లావా?"

"ఓ... ఎందుకు పోను... బాబును స్కూలు దగ్గర దింపుతాను. తీసుకొస్తాను. అత్తామామలు అప్పుడపుడూ గుడికి తీసుకెళ్తారు." తెచ్చి పెట్టుకున్న సంతోషంతో జవాబిచ్చింది దుర్గ.

దుర్గను తమ యింటికి ఆహ్వానించింది. ముంతాజ్. కవితల చిరునామాలు తీసుకుని తనే బయల్దేరింది స్వేచ్ఛ.

ముందుగా కవిత యింటికి పోయింది.

తను యింటి దగ్గర లేదు. కవిత కూడా ఉద్యోగం చేస్తోందట. సాయంకాలం యింటికొస్తుందని ఆమె అత్త చెప్పింది.

వాళ్ళు పెరట్లోని చెట్టును పరిశీలనగా చూసింది.

చెట్టు చాలా పొట్టిగా వుంది.

పండిపోయిన ఆకులే ఎక్కువున్నాయి. నీళ్ళూ, ఎరువూ తగినంత అందడం లేదేమో. కొన్ని కొమ్మలు ఎండిపోతున్నట్టు వున్నాయి. దాదాపు అన్ని కొమ్మలకు ఏవో కాగితాలు వేలాడుతున్నాయి ఆకుల మాదిరిగా.

'ఆకుల్లా వుండే ఆ కాగితాలేంటండి' అడిగింది స్వేచ్ఛ.

'మా కోడలి పే స్లిప్‌-మ్మా... ఆ ఎర్రకాగితం మాత్రం నగలది డబ్బు అవసరం అయి తన నగలను బ్యాంకులో పెట్టాం. అదీ ఆ కాగితం ఆ చెట్టు తనదే. అందుకే తన వస్తువులన్నీ అక్కడ జాగ్రత్త చేసుకుంటుంది.' అంది కవిత అత్త.

ఆ చెట్టుకు కాస్త ఎడంగా మరో చెట్టుంది. గిడసబారిన చెట్టు. నగలు, టీ.వి., ఫ్రిజ్ లాంటివి చెట్టు కొమ్మలకు వేలాడుతున్నాయి. అయితే అందులో కాస్త జీవం కన్పిస్తోంది. కవిత చెట్టంతగా ఎండిపోయిలేదు.

'అది నా చెట్టేనమ్మా. మా పెండ్లయి యిన్నేండ్లయినా అట్లే వుంది. మా కోడలి చెట్టే మేలు. ఎండి పోయేటిగా వున్నా దీనికన్నా ఎత్తుంది.' చెప్పింది కవిత అత్త.

ఔనా! అన్నట్టు తలవూపి యింటి ముందుకొచ్చింది స్వేచ్ఛ.

తనతోపాటు వచ్చిన పెద్దావిడకు ఆకాశం అంచులను తాకుతున్నట్టున్న తమ చెట్టును చూపించి "అక్కడే నండీ మేముంటున్నది. ఆ చెట్టు మా పెరట్లోదే. కవిత వస్తే నేను వచ్చి పోయానని చెప్పండి. ఒక్కసారి మా యింటికి తప్పకుండా రమ్మని చెప్పండి. వీలయితే మీరు కూడా రండీ". చెప్పి ముంతాజ్ యింటికి బయలుదేరింది స్వేచ్ఛ.

తను వెళ్ళేప్పటికి ముంతాజ్ యింటిలోనే వుంది.

తలుపులన్నీ మూసుకుని బెడ్‌రూంలో కూర్చుని చీరకు చేతిపని చేసుకుంటోంది.

స్వేచ్ఛను చూసి చాలా సంతోషించింది. గలగలా మాట్లాడింది.

"ఉక్కగా వుందివే" అంటే పెరటి తలుపు తీసింది ముంతాజ్.

పెరట్లోని చెట్టును చూడగానే ఆశ్చర్యపోయింది స్వేచ్ఛ. లేతకొమ్మలు అంతకుముందే ఎవరో నరికేసినట్టున్నారు.

"ఎవరు ఆ కొమ్మలు నరికేశారు' అడిగింది".

"యింకెవరు... మా ఆయనే. చెట్టునాదే. ఎక్కువ ఎత్తు ఎదగడం ఆయనకు యిష్టంలేదు. చిగుర్లు లేస్తానే గిల్లేస్తాడు. ఆయన కంట్లో పడకుండా ఎదిగిన రెమ్మలుంటే, ఏదో ఒకరోజు యిలా నరికేస్తాడు. యిది మామూలే" అంది సాధారణ విషయం అన్నట్టుగా ముంతాజ్.

కాసేపు పాతజ్ఞాపకాలను కలబోసుకున్నారు.

యింటికి బయల్దేరేముందు "యింటిముందుకు రావే.. మాయింటి దగ్గరున్న చెట్టును చూపిస్తాను. ఎప్పుడయినా అటేపు వచ్చినపుడు మా యింటికి వద్దురు' అంది స్వేచ్ఛ.

"యింటి ముందుకు రానులే... నా బురఖా ఉతికి కమ్మిమీద వేసినా అరలేదింకా" అంది ముంతాజ్.

"మేడమీదకు పోదాంపా"

"యింత వరకు నేను మేడమీదకు పగటిపూట పోలేదు. ఆయన్తోపాటు రాత్రుల్లో పోతానంతే" అంది ముంతాజ్.

"యిప్పుడు మీ ఆయన లేరుగదా?"

"ఆయన లేకపోయినా... చుట్టు పక్కలా వుండేది మా వాళ్ళే... సాయంత్రం యింటికి వస్తానే ఆయనకు చెప్తారు. అనవసరంగా గొడవలు" అంది భయంగా ముంతాజ్.

"పగటిపూట ఎప్పుడయినా యింటి ముందుకు వచ్చినప్పుడు, టౌనంతా పరిశీలనగా చూడు ఆకాశం అంచులను తాకుతాన్నెట్టు ఒక చెట్టు కన్పిస్తుంది. అదే మేముండే యిల్లు. అటువైపు వచ్చినపుడు మా యింటికి రావడం మరచిపోవద్దు" అని చెప్పి తమ యింటికి బయల్దేరింది స్వేచ్ఛ.

యింటికి వచ్చేంత దూరం. చుట్టూ యిళ్ళ వద్ద పెరళ్ళలోని చెట్లను గమనించింది. ఏ ఒక్క చెట్టుకూడా తమ చెట్టంత ఎత్తులేదు.

యిల్లు చేరేప్పటికి నాలుగు గంటలయింది.

గిరి వచ్చేలోపు వంట చేసేసింది. పెరట్లో చెట్టుకింద కుర్చీ వేసుకుని 'నీలిమేఘాలు' కవితా సంకలనం చదువుతూ కూర్చుంది.

లైటు వెలగడంతో తలెత్తి చూసింది. పెరటిగుమ్మం వద్ద గిరి.

"ఎప్పుడొచ్చావ్... చీకటయింది. లైటు వేసుకోకుడదా. తక్కువ వెలుతుర్లో చదివితే కళ్ళు దెబ్బ తింటాయి" అన్నాడు గిరి.

"చాలా సేపయింది వచ్చి" అంది స్వేచ్ఛ.

గిరి బట్టలు మార్చుకుని, ముఖం కడుక్కుని వచ్చాడు. మంచం తెచ్చి పెరట్లో వేశాడు. ఈ లోపు స్వేచ్ఛ కాఫీ కలుపుకుని రెండు కప్పుల్లో తెచ్చింది. కాఫీ తాగాక తను తెచ్చిన మల్లెలను మంచంమీద వేసి మాలకట్టడం మొదలు పెట్టాడు.

స్వేచ్ఛ తన మిత్రురాళ్ళగురించి గలగలా మాట్లాడుతోంది

"చెప్పనేలేదు.. వాళ్ళు ధనవంతులన్నవే.. ఎంతుంది వాళ్ళదగ్గర?" ప్రశ్నించాడు గిరి.

ఆకాశం అంచులదాకా వున్న చెట్టును చూసింది కాసేపు.

మాలకడుతున్న గిరిని చూసింది.

"మనమే వున్నవాళ్ళం గిరీ... వాళ్ళు మనకు ఎందులోనూ సాటిరారు"

ఆ మాటలన్నపుడు స్వేచ్ఛ కళ్ళలో ఆనంద బాష్పాలు.

ఆకాశం అంచులదాకా వున్న చెట్టు ఆకుల సందుల్లోంచి నెలవంక వాళ్ళనే చూస్తుంది.

*

రచయితలకు విజ్ఞప్తి

అరుణతారకు రచనలు పంపండి.

కథలు, కవిత్వం, పుస్తక సమీక్షలు, విమర్శా వ్యాసాలు, సామాజిక రాజకీయ సిద్ధాంత వ్యాసాలు, యితర భాషల్లోనుండి తెలుగు పాఠకులకు అవసరమైన అనువాదాలు పంపించండి.

అరుణతారలో అచ్చవుతున్న రచనలపై ఉత్తరాలు రాయండి. రచనలను మెచ్చుకునే ఉత్తరాలకంటే గుణదోషచర్చలు చేయగల ఉత్తరాలు పత్రిక ప్రమాణాలు పెంచుతాయి. పాఠకుల విమర్శనాత్మక ఉత్తరాలు పత్రికా నిర్వహణకూ తోడ్పడుతాయి.

మీ రచనలు అరుణతార సాహిత్య, సిద్ధాంత స్థాయిని పెంచుతాయని నమ్ముతూ -

- సంపాదకవర్గం

కథ

☆ షఫీ

చష్మా

మాసిన చొక్క. చినిగిన చొక్కా గళ్ల నుంచి వెండి మేఘంలా మెరుస్తున్న దేహం. ఎత్తు.... ఎత్తుకు తగ్గలావు. అరేబియన్ ఇసుక ఎడారిలా ఎర్రని ఒంటి ఛాయ.

'అరబ్బు నవాబులా ఉన్నాడు పిలకాయ. కారు కందెన పూసుకొని కార్ల కింద పొర్లాడాల్సినోడు కాదని షెడ్డులో పని చేయించుకోడానికి వచ్చేవాల్లు చెప్పే మాటలు మళ్లీ మళ్లీ ఎంటాడేవి. అరబ్బు దేశాలు కలల్లో కలవరపెట్టేవి'.

'బూమ్మా! పిలకాయ రాజౌతాడు. పెద్ద చెవులున్నోల్లు దేశాల్నేలుతారని వీధిలోకొచ్చే సుద్దరోల్లామె చెప్పిందని అమ్మ ఎప్పుడూ చెప్తూ ఉండేది. ఇక మామలు గోర్బచేవ్... గోర్బచేవ్ అని రష్యా అధ్యక్షుడితో పోల్చేవాల్లు. చాన్నాల్లదాక గోర్బచేవ్ అంటే ఎవరో తెలిసేదికాదు. నన్ను ఆట పట్టిస్తున్నారని అలిగి దూరంగ ఎల్లిపోయేవాన్ని'.

రిపేరు చేద్దామని కారు కింద దూరి ఏకంగ నవాబు కలల్లో విహరిస్తున్న వాడు చేతికేదో కరెంటు షాకనిపించడంతో ఒక్కసారిగా భూమ్మీదికొచ్చేశాడు. షెడ్డులో ఒంటరిగా ఉన్నప్పుడు పనిలోపనిగా ఇలా పగటికలల్లో మునగడం షరీఫ్‌కు మామూలే. మొన్నటిదాక రేష్మా ఊహల్లో ప్రేమదేశంలో విహరించిన మనసు ఇప్పుడు అరబ్బు దేశాల్ని కలవరిస్తాంది.

* * *

ప్రొద్దుటూరుకు ఒకవైపు మెకానిక్ షెడ్లతో 'జబ్బార్ షెడ్లు' ఉన్నాయి. జబ్బార్ షెడ్లలో చాలావరకు అంగల్లన్నీ ముస్లింలవే. అందుకేనేమో ఈ ఏరియాను జబ్బార్ షెడ్లు అంటారు. ప్రతి షెడ్డులోనూ మాసిన గుడ్డలతో, చేతులకూ ముఖానికి కందెన పూసుకొని ఒక్క ముస్లిం పిలకాయైనా ఉంటాడు. ఈ ఊరి ముస్లిం పిలకాయల జీవితం టీ అంగల్లలోనో, మెకానిక్ షెడ్డుల్లోనో, పూలమార్కెట్టుల్లోనో వికసిస్తాంది. వీరిలో ఎలిమెంటరీ స్కూల్లోనే చదువుకు సలాం చెప్పిన వాళ్లూ ఉన్నారు. పల్లెల్నుంచి వచ్చి ఇలా పనిలో చేరిన వాళ్లూ ఉన్నారు.

పల్లె నుంచి ప్రొద్దుటూరుకు వలస వచ్చిన కుటుంబాల్లో షరీఫ్ తల్లిదండ్రులదీ ఒకటి. బామర్దులు సౌదీకెల్లి అద్దాల మేడలు కట్టారని, తన పిల్లలూ సౌదీకెలితే తామూ సుఖంగా బతకొచ్చనే ధీమాతో మమ్మదు పల్లెటూరు నుండి ప్రొద్దుటూరుకు మకాం మార్చాడు.

ముగ్గురు పిల్లల్నీ తలా ఒక పనిలో చేర్పించాడు. ముగ్గుర్లో పెద్దోడు షరీఫ్. పది పాసై ఎమ్మే.. గిమ్మే దాకా చదవాలని ఎంతో కోరిక. పట్నం వచ్చింతర్వాత తన కోరిక తీర్తుందని అనుకున్నోడు ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు.

ఆ ఆదివారం శాశ్వతంగా తన చదువుకు ఎగనామమౌతుందని ఎప్పుడూహించనేలేదు.

ఎప్పటిలా ఆదివారం సాయంకాలం టివీలో సినిమా చూడ్డానికి పక్క వీధిలోనే ఉండే చాచీ వాళ్ల ఇంటికి తమ్ముల్లతో ఎల్లాడు షరీఫ్. నాన్న ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఉండాలనే రూలులాంటి భయం పిల్లల్నెప్పుడూ ఎన్నాడుతుండేది. సినిమా అయిపోయింతర్వాత భయంభయెంగానే ముగ్గురూ ఇళ్లు చేరారు. నాన్న ఇంట్లో లేకపోడంతో సినిమా చూసిన తృప్తి మిగిలిందన్పించింది. మమ్మదు రావడంతో అందరూ భోజనాలు ముగించారు.

పొద్దన స్కూలుకెల్లాలి కదా! ఓసారి పుస్తకాలు తిరగేద్దామని కూచ్చున్నాడు షరీఫ్.

"అరే! షరీఫ్ " నాన్న పిలవడంతో పుస్తకం పక్కన పెట్టి "క్యా బా" సందేహిస్తూ ఎల్లాడు షరీఫ్.

"బేటా! సమాసే షెక్షా మామూకే షెడ్ కో జానా. కామ్ సికా బోల్కే బోలుం. జాకే మెకానిక్ కామ్ సిక్లే."

'హా... జాతుం అనాల్నో, నై... పడ్లేతుం' అని నాన్న మాటకు ఎదురు చెప్పాల్నో తెలియని స్థితి షరీఫ్‌ది.

"బా" ఇక మాట పెగల్లేదు.

"అజీ! ఏసాల్ హోజానేదో. క్యా ఉత్నీ జల్దీ" మధ్యలో తల్లి ఖాతూన్.

"అరే! జల్దీకి బాత్నై. ఆజ్ ఖాశిం మిలా. ఏ మహినా ఆఖర్మే ఫిర్ సౌదీకో జాతాకతే. బడేకో మెకానిక్కామ్ సికా బోల్యా. మై జానేకే బాద్ ఇజా భేజ్తుమ్ బోల్యా."

ఆ మాట చెప్తూ తనకూ ఒక సౌదీ బామర్ది ఉన్నందుకు ఒకింత గర్వం ప్రదర్శిస్తున్నట్లు మమ్మదు కళ్లు పైపైకి ఎగిసాయి.

బామర్దుల్ని ఎప్పుడూ తనకంటే తక్కువగా భావించే మమ్మదు, ఇజా పంపిస్తానని చెప్పడంతో భార్య ముందు ఖాశిం దౌలత్ను పొగడకుండా ఉండలేక పోయాడు.

"తూ దేఖ్తీ హైనా! చార్సాల్ పహ్లే తేరా భాయ్ కైసాథా. బాఖయ్ కర్కే సౌదీ గయా. ఆజ్దేఖ్ కిత్నా బడా మహెల్ భన్యా."

అట్టా సౌదీకల పెంకుల్లో నుంచి జాలువారిన వెన్నెల్లా ఆ ఇంట్లో ప్రసరించింది. షరీఫ్ చదువు మీద అమావాస్య చీకట్లు కమ్ముకొని మెకానిక్ షెడ్లో చేరాడు.

బంధువుల్లో, వీధిలో సౌదీ వెళ్లొచ్చిన వాళ్లు అరబ్బు ఎడారి అందాల్ని చెప్తుంటే ఆ ఎడారుల్లో ఒయాసిస్సుల్ని అందుకోవాలనే కోరిక షరీఫ్‌లో బలపడేది. వెన్నెల్లో మెరుస్తున్న ఎడారిలా కందెన మరకల్తో రెండేళ్లుగా మెరిసి మురిసి పోతున్నాడు.

* * *

షెడ్డులో రిపేరు ముగించుకొని కారు యజమానికోసం ఎదురుచూస్తున్నాడు షరీఫ్.

సాయంకాలం నీరెండ నల్లని కారు అద్దాలపై పడి ప్రతిబింబిస్తాంది. షడ్డుల్లో పనిచేసే పిలకాయల్లాగే కందెన్ని పూసుకొని, రాసుకొని నేల సైతం నల్లగా ఉంది.

ఢబీ.... ఢబీ

టకా.... టకా శబ్దాలతో

పని సరిగా చేయలేదని ఉస్తాదు చేతిలో స్పానరు ఎక్కడో కాళ్లకో, చేతులకో తగిలి మూలుగుతున్న బాల్యంతో

వస్తూ పోతున్న బండ్ల పొగతో

షెడ్ల మధ్యలో తడికెలతో కట్టుకున్న మసీదు నుంచి ఐదుపూటలా ఇనబడే అజాతో.... జబ్బార్ షెడ్ల వాతావరణం ఊరికి ఒకవైపు వెలసిన సెట్టింగు వాడలా ఉంది.

ఈరోజు రంజాన్ నెలవంక కనబడ్తాది. రేపట్నుంచి రోజాలు మొదలౌతాయి.

రంజాన్ మాసానికి సన్నద్ధమౌతున్నట్లు... వంగిన మసీదు తడికెలకు పోట్లు వచ్చాయి. మసీదు ఆవరణలో ఉజా చేసుకోడానికి కొత్తగా నాలుగు మట్టికుండలు నీళ్లతో నిండినాయి.

షరీఫ్ ఉస్తాదు కూడా రంజాన్ మాసం తయారీలో ఉన్నాడు. మద్యాన్నం ఇంటికెలుతూ, సాయంకాలం నుండి అంగడి బంద్ చేస్కోని ఇంటికెళ్లమన్నాడు.

ఈరోజుతో తన ప్రేమ వయసు సమచ్చరం నిండుతాది. నెలవంకను

చూసి రేష్మా ముఖాన్ని చూడాలి... మనసులో ఆ ఊహ మెదలగానే షరీఫ్ ముఖం నిండుచంద్రునిలా ఎంతగా ఎలిగిపోయిందో.

* * *

మమ్మదు కుటుంబంలాగానే నజీరు కుటుంబం ఒనిపెంట నుంచి ప్రొద్దుటూరుకు వలసొచ్చింది. నజీరు సౌదీకెళ్లి సంపాయించిన డబ్బులతో మమ్మదు ఇంటికి ఎదురుగా ఒక ఇళ్లు కొని స్థిరపడ్డాడు.

భర్త మళ్లీ సౌదీకెళ్లడంతో నజీరు భార్య గౌసియా తన ఇద్దరు పిల్లల్తో ఉంటాంది. పాప పేరు రేష్మా. మసీదు ఎనకున్న ఉర్దూ బడిలో తొమ్మిద్దాక సదివించి ఆడపిల్లకు సదువెందుకు, అమ్మకు తోడుండమని ఇంట్లో కూచోబెట్టి సౌదీకెళ్లాడు నజీర్. చిన్నవాడు జావేద్. ప్రైవేటు స్కూల్లో ఎనిమిది సదువుతున్నాడు.

అరబ్బు దేశాల్లో రంజాన్ ఎలాగుంటాదో ఎవరైనా చెప్తే ఇనిందేకాని, ఖాదర్ హుసేన్ మసీదు వీధుల్లోలాగానే ఉంటుందనిపించేది షరీఫ్‌కు.

ఆరోజు రంజాన్ నెలపొడుపు కోసం అందరూ మిద్దెలెక్కి ఎదురుచూస్తున్నారు. ఎదురింటి మిద్దెమీద గౌసియా మామి, పక్కన రేష్మా నిలబడి ఉన్నారు. వీధిలో ఇరుగూ పొరుగూ వారిని మాము, మామీ అని పిల్చడం పిలకాయలకు అలవాటు.

తలమీద దౌనీ కప్పుకొన్న రేష్మా ముఖం సాయంకాలం బంగారు కాంతిలో పసుపూ ఎరుపూ మిలిత వర్ణంలో ఎలిగిపోతాంది.

అప్పుడే మసక మబ్బుల బుగ్గలపై ఎవరో సుతారంగా చిటికనేలితో వంకర గీసినట్లు రంజాన్ నెలవంక. గాలి వాటుకు దౌనీ చెదిర్తే ముసుగు చాటు రేష్మా బుగ్గలాగుంది.

రోజురోజుకూ పెరుగుతున్న నెలవంకలా షరీఫ్ మనసులో ఎన్నో తెలియని మార్పులు. రేష్మాను మళ్లీ మళ్లీ చూడాలని, తజ్వీ స్మరించినట్లు రేష్మా పేరును తన పెదాలకే ఇనబడేళ్లా ఉచ్చరించడం...

అలా తెలియని భావంతో కళ్లు కలపడంతో ప్రారంభమై మాటలు కలపడం దాకా వచ్చింది. ఇఫ్తార్‌కు పలహారం ఇవ్వడానికి వచ్చిన రేష్మాను పలకరించడం... సేమియా గిన్నెతోపాటు తనచేతి మునివేలి స్పర్శను ఆస్వాదించడం... ఒక్కోక్కప్పుడు ఇఫ్తార్ సమయమవగానే రేష్మా కోసం దర్వాజాలో ఎదురు చూడ్డంతో రంజాన్ మాసం ముగిసింది.

ఈద్ రోజు ఉస్తాద్ మాము ఇచ్చిన నూర్రూపాయల్తో రేష్మాకు ఏమి కానుక ఇవ్వాలా? అని తెగ ఆలోచించి, చేతికి గాజులు, ఇష్టమైన జడకు కుచ్చులు తీసుకొచ్చాడు షరీఫ్.

పండగ నమాజు తర్వాత అమ్మాను, బాబాను కలిసి ఈద్ ముబారక్ చెప్పడానికి రేష్మా, షరీఫ్ ఇంటికి రానే వచ్చింది. ఒకచేతిలో సేమియా గిన్నే, మరో చేత్తో తలమీద దౌనీ సర్దుకుంటూ ఇంట్లో అడుగుపెడ్తున్న రేష్మా చిన్నప్పుడు బుడినానీ చెప్పిన కథల్లోని పరీలా అన్పించింది షరీఫ్ కళ్లకు.

దర్వాజాలో అడుగు పెట్టగానే "అస్సలాము అలైకుమ్" అని అందర్నీ ఒకేసారి పలకరించి, ఈద్‌ముబారక్ చెప్తూ ఖాతూన్ కాళ్లు ముక్కడానికి వంగింది రేష్మా.

"అరే బేటా! ఏ క్యా కర్తేహో! పావ్ పడ్నా నై" అంటూ రేష్మా భుజాలు పట్టుకొని లేపి తన గుండెలకు హత్తుకొని "అల్లా తుఝే బడీ ఉమర్ దో!" అంటూ దీవించింది ఖాతూన్.

రేష్మాను చాప మీద కూచోబెట్టి సేమ్యాలు తీస్కరావడానికి పొయ్యి కాడికెళ్లింది ఖాతూన్.

దర్వాజాకు పాత పరదా ఏలాడ్తాంది. ఉతికి కట్టినట్టున్నారు. గాలి దూరడానికన్నట్టు పరదాకు చిన్న చిన్న కిటికీల్లా చిల్లులు పడున్నాయి. పొగపట్టిన గోడలు సున్నం పూసినా ఇక మెరవలేమన్నట్టు మెరుస్తున్నాయి. పొయ్యి సెగకు మాడిపోయినట్లున్న పెంకుల్లో నుంచి అరవై క్యాండిల్ల బల్బు ఏలాడ్తాంది. కరెంటు బిల్లు మోగుతాదేమోనని ముప్పై క్యాండిల్ల ఎలుగుతో మూల్గుతాంది.

ఖురాన్, హదీస్, గ్యారా మంజాలీస్ ఇంకా ఏవో ఉర్దూ పుస్తకాలున్న గూటికి పరదా కట్టి ఉంది. గూటికి అటూ ఇటూ రెండు పటాలు. ఒకదాంట్లో ఖురాన్ ముందు దువా చేస్తున్న పిలకాయ, ఇంకోదాంట్లో రెక్కలొచ్చిన గుర్రం దేహంతో స్త్రీ ఫోటో ఉంది.

"మీఠా లే బేటీ!" రేష్మా చేతికి సేమ్యా గిన్నె అందించి, ఇనామ్ ఇవ్వడానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేనందుకు ఆలోచిస్తాంది ఖాతూన్

'పూచేంగె బోలేతో షర్మే ఉనోబి నహీ. ఖాకె బహార్ నికల్ గయే. ఈద్కే దిన్ బచ్చోంకో దేనేకో పైసే దేవ్ బోలేతో సునే.. సునేనినాద్ ఘర్సే చలే గయే.' అని తన అసహాయతకు బాధపడ్తూ..."బేటా! షరీఫ్ హివ్వా" అని కొడుకును పిలిచి "ఉస్తాద్ దియేసో పైసే క్యాతో హేతో దే బేటా" చేతులు పిసుక్కుంటా అడిగింది.

నూర్రూపాయల్లో అరవై రూపాయలు మిగిల్తే పది తన జేబులో ఏస్కొని ఐదు పదికాయితాలు అమ్మ చేతిలో పెట్టాడు షరీఫ్.

తెల్లని పంజాబీ డ్రస్సులో కుప్పపోసిన ఎన్నెల్లా ఉన్న రేష్మా పక్కగా కూర్చోని "బా సౌదీసే భేజేసో డ్రస్సు ఏచ్ క్యామా" డ్రస్సును చేతితో తడుముతూ అంది ఖాతూన్.

"ఏ బార్ పైసే నహీ బోల్కే అమ్మీకో సాడీ, ముఝే, ఛోటేకో ఏక్ ఏక్ జోడా కప్డే భేజే" నాన్న సౌదీ నుండి తనకు డ్రస్సు పంపినందుకు సంబరపడ్తూ చెప్పింది రేష్మా.

మూడు నెల్లగా అరబు డబ్బులివ్వకపోడంతో దోస్తుల దగ్గర అప్పు చేసి పండక్కి భార్యా బిడ్డలకు తలా ఒక జత బట్టలు పంపించాడు నజీర్.

దూరపు కొండలు నునుపని తెలిసినా సౌదీకెల్లకుండ ఉండలేని స్థితి. అరకొర చదువులు. నేర్చుకున్న పనితో సొంతంగా అంగల్లు పెట్టుకోవాలన్నా, వ్యాపారం చేసుకోవాలన్నా పెట్టుబడి కావాలి. పెట్టుబడి పెట్టినా ఇప్పటికే పాత్కొనిపోయిన వాళ్లతో పోటీపడి నెగ్గుకరాగలమనే ధీమా ఉండదు.

తెలివున్నోడు నీళ్లని ఏటాడ్తా పొలాల్ని ఆక్రమిస్తుంటే ముస్లింలు ఎడారుల్లో బతుకునెతుక్కుంటున్నారు. ఆ వెదుకులాటలో భార్యా బిడ్డల్నొదిలి, అప్పో సొప్పో చేసో ఉన్న గూటినే తాకట్టు పెట్టో దినార్ను తగ్గిర్తో ఢీకొడ్తున్నారు.

రూపాయి ఇయ్యలేని ధీమా ఎడారిలో ఒయాసిస్సులా దినార్లో కనబడ్తాంది.

వచ్చి చాలాసేపు కావడంతో "అమ్మీ దేక్తీ హతీ" అంటు లేవబోయింది రేష్మా.

"లే బేటీ తేరా ఇనామ్" తన చేతిలోని ఒక పదికాయితం రేష్మా చేతిలో పెట్టి "తేరే మామూ అభీ బహార్ గయే" అని తన పరదాచాటు అశక్తతను చెప్పుకుంది ఖాతూన్.

'తను తెచ్చిన తోఫా రేష్మాకు ఎలా ఇయ్యాలి?' షరీఫ్ మనసు కొట్టుకుంటాంది.

'అమ్మీ కానీ మామీ కానీ చూస్తే? ఒకేల తను తీసుకుంటాదో లేదో?' షరీఫ్ మనసును గుచ్చుతున్నట్టు ఎన్నో ప్రశ్నలు.

ప్రేమ ఆపాటి ధైర్యం ఇస్తాది కదా! ఆ ధైర్యంతోనే రేష్మాకంటే ముందుగా ఇంట్లో నుంచి వచ్చి దర్వాజాలో నిలబడ్డాడు షరీఫ్.

ఇంట్లోంచి తిరిగివస్తున్న రేష్మాతో "ఈద్ ముబారక్" అని చేయి అలానే పట్టుకొని, తన ప్యాంటు జేబులో నుంచి ప్యాకేట్ తీసి రేష్మా చేతిలో పెట్టాడు షరీఫ్.

"క్యాహే యే?" తీసుకోడానికి సందేహించింది రేష్మా.

'దిల్ హై! ప్యార్కా తోఫా హై!' అంటూ నాలుక్కర్చుకొని, "ఇనామ్ హై" స్వీకరించమని కళ్లతో ప్రాధేయపూర్వకంగా చూసాడు షరీఫ్.

సిగ్గుతో వాలిన కళ్లతో తేలిక మందహాసం ఎదజల్లుతూ ప్యాకేట్‌ను దౌనీలో దాచుకొని గబగబా గేటుతీసుకొని ఎల్లిపోయింది రేష్మా.

మర్నాడు షెడ్డుకెల్తూ మదిలో ఏదో ఊహించుకొని ఎదురింటి గేటు ముందర సైకిల్ గంట కొట్టాడు షరీఫ్. ఊహించినట్టే తనిచ్చిన గాజులు, జడకుచ్చులతో గేటుదాకొచ్చి నిలబడింది రేష్మా. ఆరోజు మొదలు షెడ్డుకు పోతూ, ఇంటికొస్తూ గంట కొట్టడం, రేష్మను దర్శించుకోడం రోజువారీ రివాజుగా మారింది.

* * *

మళ్లీ రంజాన్ మాసం వచ్చింది.

పాస్పోర్టు, ఇజా రెడీగున్నాయి. పండగ అయిపోంగానే సౌదీకెళ్లాలి. షరీఫ్ సౌదీకెల్తున్నాడన్న విషయం తెల్సినప్పట్నుండి నిండు పౌర్ణమిలా నవ్వుల వెన్నెల్ని కుర్పించిన రేష్మా ముఖం ఒక్కసారిగా తేజోరహితంగా మారిపోయింది.

రేష్మా అంగీకారం కోసం ఎన్నో విధాలుగా ప్రయత్నించి చూసాడు షరీఫ్.

రేష్మా అమ్మ పక్కింటికో లేదా ఆసార్ వీధిలో ఉన్న అమ్మమ్మ ఇంటికో ఎల్లినప్పుడు, ఏ వారానికో పదిరోజులకో దొరికే ఫోను అవకాశం కూడా ఇప్పుడు రేష్మా అలకలకు, షరీఫ్ బుజ్జగింపులకే సరిపోతాంది.

"ముఝె ఛోడ్కే జానోకో..... ముఝె ఛోడ్కే జానోకో" అని ఈరోజు మద్యాన్నం షెడ్డుకు ఫోను చేసి ఎంతగా ఏడ్చింది రేష్మా.

"అరే! కా జాతాహూ... దోసాల్ హీనా..... సబర్ కరో!" షరీఫ్ ఓదార్పు. రేష్మాను వదిలెల్లాలంటే తనకూ బాధగానే ఉంది.

'నా ఆశలన్నీ రేష్మానే . నా వర్తమానం, భవిష్యత్తూ అన్నీ నా చాంద్కా టుక్డా...... రేష్మానే. కానీ సౌదీకెల్తున్నది రేష్మాను శాస్వతంగా తనదాన్ని చేసుకోడం కోసమే కదా'.

ఒకటి రెండేళ్లుండి సంపాయించుకొని తన కాళ్లమీద తను నిలబడ్తే పెళ్లికి రేష్మా వాళ్లింట్లోనూ అభ్యంతరం చెప్పరని షరీఫ్ ధీమా.

రేష్మాను ఎంతగా ప్రేమించాడు! రేష్మాను పొందాలంటే సౌదీనీ అంతే ప్రేమించాడు.

తనకూ ఒక ఇల్లు కావాలి. పెకుంటిల్లు కాస్తా సౌదీ దయవల్ల స్లాబుమిద్దె ఏస్కోవాలని షరీఫ్ కోరిక.

అరబ్బు డబ్బులే లేకుంటే ఖాదర్ హుసేన్ మసీదు వీధులన్నీ ఎప్పటిలా బోదకొట్టాల్తోనే ఉండేవి.

"హాఁ.... దోసాల్! దోసాల్మే కుచ్బీ హోసక్తా!" ఈవత్తల్నుండి రేష్మా దిక్కారం.

ప్రేమంటే టీవీలో వచ్చే సీరియల్లు, సినిమాల్లో చూడ్డమే. కానీ జీవితానుభవంలోకి వచ్చేసరికి రేష్మాలో తెగింపునిచ్చింది. నాలుగ్గోడల మధ్య పరదాచాటు కలలు కాస్తా ఇప్పుడు ప్రేమలోకంలో స్వేచ్ఛగా విహరించాలనుంది.

అవును ప్రేమ... ఒక సుందర స్వేచ్ఛ. ఆ స్వేచ్ఛ ఆవతలి మనిషి ప్రేమకు లోబడి ఉంటుందన్న విషయం రేష్మాకు ఈ జన్మకు తెలిసే ఆస్కారం లేదు.

అంత అలకలోనూ "అజీ...అజీ ఏక్బాత్. ఆజ్ రంజాన్కా చాంద్ దిఖేగా. షెడ్సే జల్దీ ఆనా" అని ఫోను పెట్టేస్తూ రేష్మా చెప్పిన మాట షరీఫ్ను నిలువ నియ్యెడంలేదు. ఇంటికెల్లాలని, రేష్మా ముఖంలో నెలవంకను చూడాలని మనసు తొందరపెడ్తాంది.

తడికెల మసీదు నుండి మగ్రీబ్ అజా ఇనబడ్తాంది.

అంతలోనే కారు ఎజమాని సుబ్బారెడ్డి తమ షెడ్డువైపుగా వస్తూ కనబడ్డాడు. అది చూసి షరీఫ్ పాత గుడ్డతో కారు అద్దాలపై పేరుకున్న దుమ్మును తుడుస్తూ వచ్చిన సుబ్బారెడ్డితో "వైరింగంతా చెడిపోయిందన్నా. ఈసారికి పని జరుగుతాది. కాలిపోయిన బల్బులూ మార్చినా. మొత్తం నూటయాభై ఐందన్నా" అని రిపేరు ఖర్చులు చెప్పాడు.

"ఏందబ్బీ అంత ఇవరాలు చెప్పాల్నా. ఇంతైందంటే కాదంటానా."అంటూ కూలితో కలిపి రెండు వందకాయితాలు చేతికందించాడు సుబ్బారెడ్డి.

సుబ్బారెడ్డి కారు తీస్కపోడంతో సామాన్లన్నీ సర్ది, షెడ్డుకు తాళమేసి తనూ సైకిల్పై ఇంటికి బయల్దేరాడు.

షరీఫ్ సైకిల్ ఖాదర్ హుసేన్ మసీదు వీధిలోకొచ్చేసరికి పిలకాయలంతా హుషారుగా కేరింతలేస్తూ కనబడ్డారు. వీధిలో అందరి ముఖాలు రంజాన్ నెలవంకను చూసిన ఆనందంతో ఎలిగిపోతన్నాయి. ఖాదర్ హుసేన్ మసీదు డెకరేషన్ లైట్లతో నక్షత్రాల్ని పొదివినట్లు మెరిసిపోతాంది.

ఇంటికాడికి రావడంతోటే షరీఫ్ చూపులు ఎదురింటి గేటువైపు ఆశగా చూసాయి. నెలవంకను చూసి మిద్దెపై నుండి వస్తున్న రేష్మా కన్పించింది. ఈసారి రేష్మా ముఖం నిరుకి నెలవంకలా లేదు. తనని చూస్తున్న ఆ చూపుల్లో ముందటి కాంతీ లేదు.విషాదంపై కప్పిన పరదాలా ఓ నవ్వు విసరి ఇంట్లోకెల్లిపోయింది రేష్మా.

నెలవంక నిండు చంద్రునిలా విచ్చుకుంటుంటే రంజాన్ మాసం గడుస్తున్నకొద్దీ రేష్మా ముఖం కుంచించుకపోతాంది.

అయ్యిందన్నట్లుగా ఈసారి రంజాన్ పండగ గడిచింది.

* * *

ఆరోజు రానే వచ్చింది.

రాత్రి పదిగంటలకు యర్రగుంట్ల నుంచి ముంబాయికి రైల్లో పోయి, అన్నుంచి సౌదీకు ఇమానంలో ఎల్లాల్సి ఉంటాది.

పొద్దన్నుంచి ఇల్లంతా సందడి సందడిగా ఉంది. బంధువులూ, వీధిలో వాళ్లు సౌదీలో ఉన్న తమ పిల్లల్ని కలవమని చెప్పి, పిలకాయలకు తంగేడుపల్లి మిఠాయి, జాబులూ ఇచ్చిపోతన్నారు.

ఖాతూన్కు కొడుకు సౌదీకెల్లి లెక్క సంపాయించుకొస్తాడని ఓవైపు ఆనందంగా ఉన్నా, కొడుకును ఆంతదూరం పంపిస్తున్నందుకు తల్లిప్రేమ కల్లలో నీటిపొరల్ని కమ్మేస్తాంది.

ఎనిమిది గంటలైంది. ఇషా నమాజుకోసం మసీదు నుంచి అజా ఇనబడ్తాంది.

బట్టలూ, తనక్కావల్సిన సామాన్లన్నీ ఒక బ్యాగులో సర్దుకొని, రైల్లో తినడానికని అమ్మ చేసిన చపాతీలు ఒక ప్లాస్టిక్ కవర్లో పెట్టుకున్నాడు షరీఫ్.

ఏవో జ్ఞాపకాల్ని ఎతుక్కుంటా ఇల్లంతా అటూ ఇటూ తిరుగుతన్నాడు. ఇంట్లో తనకు సంబంధించిన ప్రతి వస్తువునూ తడిమి తడిమి చూస్కుంటున్నాడు.

ఎదురింట్లోని టేప్రికార్డు నుంచి ఏదో హిందీ పాట తేలికగా వినబడ్తాంది. ఆషాభోంస్లే అనుకుంటా. ప్రియుడికోసం విరహంతో పాడుతున్న పాట. తనను సంబోధిస్తూ రేష్మా పాడుతున్నట్లుగానే ఉంది. గుండె బరువెక్కినట్లుగా ఉండి నేల జారిపోతుందా అన్పించింది షరీఫ్కు.

భారంగా నడుస్తూ తల్లి కాడికెల్లి పాదాల్ని మొక్కాడు షరీఫ్. ఉబికొస్తున్న కన్నీళ్లను అదిమిపట్టి కొడుకును గుండెలకు హత్తుకొని "హిమ్మత్సే హో బేటా. జానేకే బాద్ ఫోన్ కర్. ఖత్తా దాల్తాహో" అని ధైర్యం చెప్పింది ఖాతూన్.

ఇద్దరు తమ్ముల్లనూ చెరో సంకలోకి తీస్కోని కౌగలించుకున్నాడు. తండ్రి తోడురాగా, బ్యాగు భుజానికేస్కోని పెద్ద తమ్ముడితో రైలెక్కడానికి యర్రగుంట్లకు బయల్దేరాడు షరీఫ్.

* * *

సౌదీలో ఇమానం దిగేసరికి ఏర్పోర్టులో ఖాశీం వచ్చి ఉన్నాడు. టాక్సీ మాట్లాడి షరీఫ్ను తీస్కోని అరబ్ ఇంటికి బయల్దేరాడు ఖాశీం.

విశాలమైన రోడ్లు, పలచని జనం, జనవరిలోనే మండుతున్న ఎండల్లో సౌదీ అద్భుతంగా ఆశ్చర్యంగా అన్పించింది షరీఫ్కు.

చివరకు టాక్సీ ఒక పెద్ద బంగ్లా ముందు ఆగింది. ఆ బంగ్లా పక్కాగా విశాలమైన రేకుల షెడ్డు. ఆవరణలో రెండు పెద్ద పెద్ద కార్లున్నాయి.

షరీఫ్ బ్యాగుల్ని షెడ్డులో ఒక వారగా ఉన్న చిన్న రూములో పెట్టిరమ్మన్నాడు ఖాశీం. తర్వాత ఇద్దరూ అరబ్బును కలవడానికి బంగ్లాలోకెల్లారు.

ఆఫీసులాంటి ఒక రూములో యాభై ఏళ్ల బలసిన శరీరంతో పైనుంచీ

☆ వేంపల్లె షరీఫ్

తెలుగోళ్ల దేవుడు

కథ

"ఏంది తెలుగోళ్ళ దేవుణ్ణి... ఆడ బెట్టినారే... దూదేకులోళ్లా.... ఏంది మీరు..." - అంది పాలు పోయడానికి వచ్చిన పక్కింటి పార్వతమ్మ టీవీమీద ఉన్న వెండిబొమ్మను చూసి.

"అవును నిజమే అది తెలుగోళ్ళ దేవుడే..."

అంతకు మునుపు గౌసియా వాళ్లమ్మ కూడా వచ్చి అర్చిపోయింది. "మానంగా, మట్టంగా ఆ బొమ్మను అణ్ణుంచి తీ... లేదంటే మర్యాద పోతుంది..." - అని.

గౌసియ పట్టించుకోలేదు. ఆ బొమ్మలో అందరికీ తెలుగోళ్ల దేవుడు కనబడుతుంటే గౌసియాకు మాత్రం తన ఆరేళ్ల కూతురు మున్నీ కనబడుతోంది. కానీ పార్వతమ్మ దూదేకులోళ్లతో పోల్చేసరికి గౌసియాకు కోపం వచ్చింది. సాయిబులు దూదేకులోళ్లను తక్కువగా చూస్తారు. దాన్ని ఆసరా చేసుకుని పార్వతమ్మలాంటి వాళ్లు సెటైర్లు వదిలి ఆనందిస్తుంటారు. అది తెలియని సాయిబులు ఇలా రోషం తెచ్చుకుంటారు.

"మేము దూదేకులమైంది... సాయిబులమైంది... తెలీదా నీకు చిన్నప్పట్నుంచి చూచ్చాండావే..." అంది కసురుకున్నట్టుగా గౌసియా పాలగిన్నె అందుకుని.

"నాకు తెల్సులే గౌసియా! ఊరికే అంటాండా గానీ... ఆ వెండిబొమ్మ నీ కూతురు స్కూల్లో గెల్చింది కదూ..." అంటూ నవ్వుకుంటూ వెళ్లిపోయింది పార్వతమ్మ.

సూదితో పొడ్సినట్టే పొడ్సి మళ్లా పైకి ఏమీ తెలీనట్టుగా "అబ్బ... నొప్పి పుడుతాండాదా..." అని వెక్కిరించినట్టుగా అయింది పార్వతమ్మ వాలకం గౌసియాకి. పాలగిన్నె వంటగదిలో పెట్టింది. నిజానికి కాఫీ పెట్టుకుని తాగాలనుకుంది. కానీ మనసు ఒప్పలేదు. తిరిగి హాల్లోకి వచ్చింది. టీవీపై ఉన్న వెండిబొమ్మను తదేకంగా చూసింది. అందుల్లో తెలుగోళ్ల దేవుడు నింపాదిగా కూర్చోని వెక్కిరిస్తున్నట్టుగా అనిపించింది.

దేవుడు ఎవరికైనా దేవుడే కానీ ఈ బహుమతుల మీద కూడా దేవుళ్ల బొమ్మలు ఎందుకో" - ఆమెకు అర్థం కాలేదు. అసలు మున్నీని తెలుగోళ్ల బళ్లో చేర్చడమే తప్పేమో అనుకుంది. తెలుగోళ్ల చదువు చెప్పించడమే పొరపాటేమో అని పశ్చాత్తాప పడింది.

ఇంతవరకూ ఎప్పుడూ ఆమె అలా అనుకోలేదు. పైగా ఆమెకు తెలుగంటే అభిమానం. ప్రాణం. టీవీలో వచ్చే తెలుగు అక్షరాలను చదవాలని ఆత్రం. తెలుగు రానందుకు బాధ కలిగేది.

గౌసియా ఉర్దూ చదువుకుంది. స్కూలుకెళ్లి కాదు. వాళ్ల వీధిలోని వస్తాద్‌బీ దగ్గర. ఆ మహానుభావురాలు గౌసియాతో అంట్లు తోమించేది. ఇల్లు ఊడిపించేది. అన్ని పనులూ చేయించుకుని అలీఫ్ - బే లు చెప్పి పంపించేది. వచ్చేటప్పుడు బుర్ఖా, వెళ్లేటప్పుడు బుర్ఖా, బుర్ఖా కళ్లకు నల్లగా అడ్డు తగిలేది. అందమైన ప్రపంచాన్ని, అందమైన వెలుగుని స్పష్టంగా చూడనిచ్చేది కాదు. తల కూడా కుడి, ఎడమలకు తిరిగేది కాదు.

వెంట తమ్ముడుండేవాడు. ఇంటి నుంచి తోడ్కోని వస్తాద్‌బీ దగ్గర వదిలేవాడు. ఆమె చదువు అయిపోయాక తిరిగి వెంట తీసుకొచ్చేవాడు. ఆమె ఉర్దూ చదువు అలా సాగింది. ఏదో ఒకటి చదువుకుంది - మంచిదైంది కదా... అనుకుందామంటే ఇంటా - బయట అంతా తెలుగు, లేదంటే ఇంగ్లీష్ - ఉర్దూతో ఏం పని? అన్నట్టు తయారైంది పరిస్థితి. చివరికి పేపర్ ముక్క కూడా ఉర్దూలో చదవడానికి రాయలసీమలోని చాలా టౌన్లలో దొరకదు. చదువుకున్నా

కింది దాకా తెల్లని దుస్తుల్లో కూచోనున్నాడు అరబు. ఇద్దరూ అరబ్బుకు సలాం చేసి లోనికి ప్రవేశించారు.

షరీఫ్ ఇజాను అరబ్బుకు చూపించి ఏదో అరబీలో మాట్లాడాడు ఖాశీం.

అరబ్బులతో ఎలా మసలుకోవాలో, ఏ ఏ పనులు చేయాలో చెప్పి, ఏమైనా అవుసరముంటే తనకు ఫోను చేస్తుండమని సెల్ నెంబరిచ్చి షరీఫ్‌ను షెడ్డులో ఉన్న రూములో వదిలి ఎల్లిపోయాడు ఖాశీం.

మెకానిక్ పనికోసమని వచ్చిన షరీఫ్‌కు ఎడారిలో ఖర్జూర తోటమాలిగా ఉండాల్సివచ్చింది. 'నేను వచ్చిన పని ఇదికాదు' అని అరబ్బును ప్రశ్నించలేని నిస్సహాయత షరీఫ్‌ది.

ఇండ్లు తాకట్టుపెట్టి తెచ్చిన డబ్బులతో సౌదీకు రావడంతో 'పని ఏదైతేనేమి లెక్కిస్తే సరి' అని రాజీపడ్డాడు.

షరీఫ్ పడ్తున్న ఎడారి కష్టాల్ని చూసి సానుభూతి చూపడం తప్ప ఖాశీం కూడా ఏమీ చేయలేకపోయాడు.

నెలంతా ఖర్జూర తోటను చూసుకుంటూ నెల చివర్న రూముకొచ్చేవాడు. నెలజీతం తీస్కోని ఇంటికి పంపించడం, మిగల్చుకున్న దాంతో ఇంటికీ రేష్మాకూ ఫోను చేస్తుండేవాడు షరీఫ్.

ఇట్లా సంవత్సరం తీరిపోయింది. బాకీ ఇంకా తీరనేలేదు.

నెలజీతం తీస్కాని రేష్మాకు ఫోను చేసాడు షరీఫ్. ఆవైపు నుంచి మగ గొంతు ఇనబడింది. నజీరు మామ సౌదీ నుంచి వచ్చినట్లున్నాడు. ఏమి మాట్లాడాలో తెలియక ఫోను పెట్టేసాడు.

కాసేపాగి మళ్లీ ఫోను చేసాడు. మళ్లీ అదే గొంతు.... రేష్మా ఫోనెత్తకపోడంతో నిరాశగా...."మామూ! మై సామ్నే ఘర్వాలోంకా బచ్చా షరీఫ్. అమ్మీకో బులావో బాత్కర్నా" అన్నాడు.

షరీఫ్ ఫోను చేసాడని గౌసియా పిలవడంతో కొడుకుతో మాట్లాడ్డానికి పరుగున వచ్చింది ఖాతూన్. ఫోను తీస్కోగానే "సలాం అలైకుమ్ అమ్మీ" నీరసంగా ఇనబడింది షరీఫ్ గొంతు.

"క్యా బేటా అచ్చిత్రా హైనా?" కొడుకు గొంతులో తచ్చాడిన విషాదజీరను ఒడిసిపట్టిన తల్లి హృదయం.

"బా ఔర్ బచ్చే కైసే హైమా" ఏదో అడగాలని మరేదో పలికిన షరీఫ్ గొంతు.

"హమే సొబ్ అచ్చిత్రా హై బేటా! ఏ సాల్ హోతో ఘర్కే పైసే మిత్జాతీఁ. తూ క్యా హైవత్ ఖానోకో" ఖాతూన్ ఓదార్పు.

కొడుకును ఇక ఇంటికొచ్చేయమని చెప్పాలనుంది ఖాతూన్‌కు. కానీ ఇంటి తాకట్టు గుర్తు రావడంతో ఒక్కసారిగా కళ్లు చెమ్మగిల్లాయి.'అప్పుచేసి బిడ్డను పంపానా?... బిడ్డను పంపి అప్పుచేసానా తెలీడం లేదు. బిడ్డ కష్టమంతా అప్పు బుడ్డనీకే సరిపాయ. సౌదీ... సౌదంటూ కలవరిస్తుంటారు. దినార్ తగ్గేర్కీ భూక్ మిరాతాకీ నైకే మాలూమ్ నై. మాకే పేట్కీ తడప్కో కెత్నే ఆఁసువోఁసే సంభాలూఁ'

....

....

ఖాతూన్ ఇంకేమీ మాట్లాడకపోవడంతో,"అమ్మీ మై హతుం, ఖుదాహాఫీజ్" అని ఫోను పెట్టేస్తూ "గౌసియా మామీకో, రేష్మాకో, గల్లీవాలోంకో మేరా సలాం సునావో" తల్లితో చెప్పాడు షరీఫ్.

తల్లి నుంచి ఊహించని సమాధానం. "బేటా తురేు మాలూం నైనా, రేష్మాకి షాదీ హోగియా. సాస్కే ఘర్ జాకో హై".

తను ఏమి విన్నాడో షరీఫ్‌కు అర్థంకాలేదు. ఆలోచనలు గడ్డకట్టుకపోయాయి. నోట మాట పెగల్లేదు. కనచూపు మేరా అంతా ఎడారే... ఎడారి. ఈ ఎడారిలో చెమ్మలు కనబడ్డం కాదు, తన హృదయంలో చెమ్మసైతం కనబడ్డంల్యా.

ఇప్పుడు దేహమే అణువణువూ రేణువై ఇసుక కుప్పలా ఉంది. *

కూడా గౌసియాలాంటి వాళ్ళు నిరక్షరాస్యులుగా ఉండి పోవాల్సిందే.

తన గతి తన కూతురు మున్నీకి పట్టకూడదనుకుంది గౌసియా. టీవీలో పేర్లు ఎంత వేగంగా వెళ్లినా తన కూతురిని టకటకా చదివేలా తయారు చేయాలనుకుంది. బస్సు బోర్డులు కూడా తన కూతురు ఊది పారేయాలనుకుంది. తెలుగులో చదివి, ఇంగ్లీష్‌లో మాట్లాడి ఊళ్లేలాలనుకుంది.

లేక లేక పుట్టిన కూతురు మున్నీ. ఆమె అభ్యున్నతిని అంతగా ఆశించడంలో తల్లిగా ఆమె తప్పుకాదు.

భర్త చాన్‌బాషాను ఒప్పించి ఎట్టకేలకు తన మున్నీని దగ్గర్లో ఉన్న 'వెంకటేశ్వర విద్యామందిర్'లో చేర్పించింది. పేరు ఏదైతేనేమి తన బిడ్డకు చదువురావాలనుకుంది గౌసియా. ఒక్క మున్నీనే కాదు - గౌసియాలాగా ఆలోచించేవాళ్లందరి పిలలూ తెలుగు స్కూళ్లలో చదువుకుంటున్నారు. వాళ్ల ఇచ్చే డ్రెస్సులు వేసుకుని, వాళ్లిచ్చే బెల్టులు పెట్టుకుని సరస్వతి మాత వల్లో బీబీలై కదులుతున్నారు.

స్కూల్లో చేర్పిన నాలుగు రోజులకే "అమ్మీ.... ఇస్కూల్ డ్రెస్..." అంది మున్నీ. మారు మాట్లాడకుండా చాన్‌బాషాకు చెప్పి రెండు స్కూల్ డ్రెస్సులు కుట్టించింది. స్కూలు డ్రెస్సుల్లో కళకళలాడుతూ తోటి పిల్లలతో కలిసి మున్నీ వెళ్తుంటే గౌసియా చూసి ఎంతో ఆనందించింది. తన ఆశలు అప్పుడే నెరవేరినట్టుగా ముచ్చట పడింది. ముద్దుల మున్నీపై మరిన్ని ముద్దులు కురిపించింది.

స్కూలు వాళ్లు ఇచ్చిన ఐడెంటిటీ కార్డులో వేంకటేశ్వరుని బొమ్మ ఉంది. ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. స్కూలువాళ్లు యిచ్చిన బెల్టులో వేంకటేశ్వరుని బొమ్మ ఉంది. ఎవరికీ తప్పనిపించలేదు. అసలు స్కూలు పేరే తెలుగుదేవుడు పేరైనప్పుడు - చదివే చదువే తెలుగైనప్పుడు ఇలాంటి చిన్న చిన్నవన్నీ ఎవరు పట్టించుకుంటారు. అందుకే ఎవరూ పట్టించుకోలేదు.

కానీ చివరికి వాళ్ళిచ్చే బహుమతుల్లో కూడా దేవుళ్ల బొమ్మలు కనిపిస్తుంటే గౌసియాకు బాధ కలిగింది.

మొన్న ఆగస్టు - పదిహేను పురస్కరించుకుని స్కూల్లో చాక్లెట్లు పంచారు. ఆ చాక్లెట్‌పై మాత్రం దేవుళ్ల బొమ్మలు లేవు. సంతోషం - అనుకుంది.

అంతకు ముందు పెట్టిన పరుగుల పోటీల్లో మున్నీ ఫస్ట్ వచ్చింది. ఆటల్లో కూడా మున్నీ బెస్ట్ అవుతున్నందుకు గౌసియా సంతోషించింది. మున్నీకొచ్చిన బహుమతిని టీవీ మీద అందంగా పెట్టి వచ్చిన వాళ్లందరికీ తన కూతురు ప్రతిభ గురించి చాటింది.

ఒకరిద్దరి కామెంట్లు వినేంతవరకు కూడా బహుమతిగా ఇచ్చిన మెమెంటోలో ఉన్న వేంకటేశ్వరుడి బొమ్మ ఆమెను అంతగా బాధించలేదు. బహుమతి - బహుమతే. తనకూతురి ప్రతిభను మెచ్చి ఒక చిన్న చెంచా ఇచ్చినా గౌసియా సంతోషంగా స్వీకరించేది. కానీ దేవుని బొమ్మ ఉన్న మెమెంటో ఇచ్చి తెగ ఇబ్బంది - పెడుతున్నారు అనుకుంది.

అదే వీధిలోని జైతూన్‌బీ ఆపా కూతురు రుబీనా కూడా అదే స్కూల్లో మున్నీతోపాటే చదువుకుంటోంది. రుబీనా కూడా చాలా తెలివైన పిల్లా. అప్పుడే ఎక్కాలన్నీ ఒప్పజెప్పేస్తోంది. సుమారైన తెలుగు పేర్లు పలికేస్తోంది. ఆ - రుబీనాకు కూడా మొన్న స్కూల్లో పాట పాడినందుకు బహుమతిచ్చారు. కానీ జైతూన్‌బీ ఆపా దాన్ని ఎప్పుడూ బయట పెట్టలేదు. లోపల బీరువాలో పెట్టేసింది. మున్నీకొచ్చిన బహుమతిని తాను టీవీపై పెట్టడం చూసి రుబీనా కూడా తన బహుమతిని షోకేజ్‌లో పెట్టమని ఒక్కటే గోల చేస్తోందట. జైతూన్‌బీ ఆపా ఫోన్ చేసి మొన్న విషయం చెప్పింది. అప్పటికీ గౌసియాకు 'బుడ్డి' వెలగలేదు. ఇప్పుడర్థమైంది. స్పష్టంగా అర్థమైంది. జైతూన్‌బీ ఆపా రుబీనా కొచ్చిన బహుమతిని బీరువాలో ఎందుకు పెట్టిందో...! ఇంకా నయం పడేయలేదు - మెంటల్ది - అంతపనైనా చేయగలదు. రుబీనా ఇంకా మొండిపట్టు పడితే దానికి నాలుగు తగిలించి బిస్కెట్టయినా ఇప్పిస్తుందేమో కానీ ఆ బహుమతి విషయంలో మాత్రం రాజీపడేలా లేదు - అవున్లే తానైనా ఎన్నిసార్లు రాజీపడుతుంది. ఎన్నింటికి రాజీ పడుతుంది - చాన్‌బాషా వచ్చాక విషయమంతా వివరించాలనుకుంది గౌసియా. అనిర్ణయంతో మనసు కాస్త కుదుటపడేసరికి వెళ్లి కాఫీ పెట్టుకుని తాగింది.

***

సాయంత్రం ఆరుగంటలైంది. ట్యూషన్ నుంచి మున్నీని తీసుకుని ఇంటికొచ్చాడు చాన్‌బాషా. అప్రయత్నంగానే టీవీమీద కళ్లేసి 'వెండిబొమ్మ ఏదీ?' అన్నాడు.

"తీసి పడేశాను..." - అంది గౌసియా కసిగా.

"తీసిపడేశావా? ఎక్కడా?" - అరిచినంతపని చేశాడు చాన్‌బాషా.

"కంగారు పడకండీ... బీరువాలో పెట్టాలెండీ...!"- అంది మళ్లీ కొంచెం గొంతు తగ్గించి, సావధానంగా మాట్లాడటమే మంచిదనుకుంది గౌసియా.

"ఏం ఎందుకని...! అది చూస్తే ఏడుస్తుందేమో...!" - అన్నాడు చాన్‌బాషా మున్నీని ఉద్దేశించి. మున్నీ తండ్రితో ఇంట్లోకి వచ్చినట్లే వచ్చి మళ్లీ బయటికి పరిగెత్తింది ఆడుకోవడానికి.

"ఏడిస్తే నాలుగు తగిలించేది" అంది గౌసియా.

"ఏం... ఎందుకొచ్చిందంటా... అంతకష్టం-" అన్నాడు చాన్‌బాషా.

"ఏం మీకు తెలియదా... దానిమీద తెలుగోళ్ల దేవుని బొమ్మ ఉంది. అందరూ అరుచ్చాండారు. మొన్న మా అమ్మ అరిచింది. ఇప్పుడు పక్కింటి పాలాయమ్మ పార్వతమ్మ... అర్చింది...." - అంది.

"ఎవరైనా సాయిబులు ఇంటికొస్తే ఏమనుకుంటారు." - అంది మళ్లీ - తానే సమస్య తీవ్రత చాన్‌బాషాకు అర్థం కావాలని.

"కరెక్టే.... కానీ ఏంచేయలేం కదా" అన్నాడు చాన్‌బాషా.

ఏంచేయలేం ఏంటీ.... ఆ స్కూల్లో కేవలం తెలుగోళ్ల పిల్లోళ్లకే సదువు సెబ్తాండారా.... సాయిబులకూ చెప్పడం లేదా.... సాయిబులు కూడా తెలుగు నేర్చుకుంటాండారు కదా. మళ్ల సాయిబుల పేర్లు ఎందుకు పెట్టరు. చివరికి సాయిబూల టీచర్ స్కూలు నడుపుతాన్నా గూడా... ఏ తెలుగుపేరో పెట్టుకోవాలా... లేదంటే స్కూలు జరుగదు. స్కూలుకు పిల్లల్ని పంపరు. ఇయన్నీ ఎందుకండీ... అందరూ కల్సి చదువుకునే స్కూళ్లకు - దేవుళ్ల పేర్లు లేకుండా ఏ మామూలు పేర్లో పెట్టొచ్చుకదా... మతాన్ని తెలిపే పేర్లు ఎందుకు. పువ్వుల పేర్లు, చెట్లపేర్లు, ప్రకృతి పేర్లు స్కూళ్లకు పెట్టి వాళ్లిచ్చే బెల్టుల్లో, స్కూలు డ్రస్సుల్లో, బహుమతుల్లో అచ్చెయ్యొచ్చు కదా...! ఎక్కడ చూసినా ఈ దేవుళ్లగోల ఏంటి?" - గౌసియా ఆవేశంగా చెప్పుకుంటూ వెళ్తోంది.

చాన్‌బాషా ఆలోచనలో పడ్డాడు. గౌసియా ఎంత తెలివిగా ఆలోచిస్తోంది. గౌసియాకున్న బుద్ధి చదువుకున్న వాళ్లకు, చదువు చెప్పేవాళ్లకు ఎందుకు లేదు. స్కూలు వాళ్లు ఇచ్చే వస్తువుల్లో మతాలు తెలిపే గుర్తులు లేకుండా జాగ్రత్త పడమని వెంకేశ్వర విద్యామందిర్‌లో పనిచేసే తన స్నేహితుడు రామిరెడ్డికి చెప్పాలా. రామిరెడ్డి మంచోడు. తన మాట వింటాడు.

"ఆపు ఇక నీ సోది. రేపెల్లి నేను స్కూల్లో మాట్లాడతా..." - అన్నాడు చాన్‌బాషా ఆరుబయటకు నడుస్తూ.

"మీరొక్కరే వెళ్తే వింటారా.... ఏంటి?... ఆ స్కూల్లో ఎవరెవరు సాయిబుల పిల్లకాయలు చదువుకుంటాండారో... వాళ్లందర్నీ తోడు తీసుకెళ్లండి...." అంది గౌసియా.

"మళ్లీ చాకులాంటి సలహా ఇచ్చిందిది..." అని ఆశ్చర్యపోయాడు చాన్‌బాషా. అవును ఒకరు చెప్పిన మాట కంటే పదుగురు చెప్పిన చెప్పిన మాటకే విలువ ఎక్కువ.

"ఇలా బహుమతుల్ని, పిల్లల ప్రతిభల్ని బీరువాల్లో పెట్టి బిగించిన తల్లిదండ్రులూ... మేల్కోండి... వస్తున్నా...!" - అనుకుంటూ మొదట జైతూన్‌బీ ఆపా ఇంటికే నడిచాడు చాన్‌బాషా.

*



వల్లంపాటి

జ్ఞాపకాలు - విశ్లేషణలు

సాహిత్య పరిచయాన్ని ఉన్నతీకరించిన వల్లంపాటి

☆ వరవరరావు

సాహిత్య విమర్శలోగానీ, కవిని అంచనా వేసేటప్పుడు గానీ కవి హృదయం అనే మాట వాడడం త్రిపురనేని మధుసూధనరావుకు ఇష్టం ఉండేది కాదు. హృదయం అనే మాట భావవాదుల కల్పన అని ఆయన అనుమానం అనుకుంటాను. శరీరం, ఇంద్రియాలు, బుద్ధి - దానికి ఆకారమైన మెదడు అనూ, మనసు అనూ వాటికి మించి అంటే అంగ నిర్మాణానికి మించి ఆంగి కదినుసింకేదో ఉన్నదని ఆయన అంగీకరించేవాడు కాదనుకుంటాను. భావాలు, ఊహలు, ఉద్వేగాలు, ఆవేశాలు - ఇవన్నీ ఆంగిక క్రియకు బయట ఎట్లా సాధ్యమనేది ఆయన ప్రశ్న, కేతవరపు రామకోటి శాస్త్రితో రసం విషయంలో ఆయన చేసిన చర్చలో పేచీపడ్డది ఈ కారణం వల్లనే.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య చనిపోయినపుడు 'ఆంధ్రజ్యోతి'లో పి.రామకృష్ణ రాసింది చదివి ఏడ్చేసాను. ఆయన చనిపోయాడని తెలిసిన వెంటనే వాసిరెడ్డి నవీన్ ఫోన్ చేస్తే దుఃఖం రాలేదు. మా ఇద్దరికీ ఈ మరణం ఇంత వేగంగా రానున్నదని తెలిసినందువల్ల కావచ్చు. వెంకటసుబ్బయ్య గారి కొడుకు ప్రసాద్‌ను పలకరించినప్పుడు ఎట్లా పలకరించాలి అని ఇబ్బంది పడ్డాను. ఆయన ముందు ఫోనోలోనైనా స్థిమితంగా కనిపించాలని ప్రయత్నించాను గనుక కావచ్చు దుఃఖం రాలేదు. కాని ఎందుకో పి.రామకృష్ణ ఆ చిన్న జ్ఞాపకం చదువుతుంటే అట్లా కన్నీళ్లు కారిపోయాయి. బహుశా ఒక సాహిత్య జీవి గురించి మరొక సాహిత్య జీవి సహృదయ స్పందనవల్ల అది సాధ్యమైందేమో.

అప్పుడొక విచిత్రమైన ప్రశ్న వెంకటసుబ్బయ్యగారికే వేయాలనిపించింది. ఆ ప్రశ్న నేను త్రిపురనేని మధు గురించి పైన రాసింది. తడుముకోకుండా వెంకటసుబ్బయ్యగారు ఏం చెప్పేవారంటే, 'సృజనాత్మక రచనల్లో హృదయ స్పందనలు, కవిహృదయాలు వంటి ఉదార విషయాలు టిఎంఎస్ మా బోటి వాళ్లకు వదిలేసాడయ్యా. సాహిత్యంలో సర్జరీ అవసరమైన కేసులు ఆయన తీసుకున్నాడు' అని.

సాహిత్య విమర్శ ప్రక్రియను కార్యరంగంగా ఎంచుకున్నాక కూడ చివరిదాక కొనసాగిన సాహిత్య సృజనకారుడు వెంకటసుబ్బయ్య. అందుకే ఆయన సాహిత్య విమర్శ మృదువుగా ఉండి స్పష్టంగా ఉంటుంది. ఉదారంగా ఉండి ప్రోత్సాహకంగా ఉంటుంది. పొగడ్తగా ఉండదుగానీ ఎప్పుడూ వెన్ను తట్టడంగా ఉంటుంది. అభిప్రాయాలు నిష్కర్షగా ఉండవని కాదు - కేంద్ర సాహిత్య అకాడమీ సాహిత్య విమర్శకు ఆయనకు అవార్డు ఇచ్చినప్పుడు ఇచ్చినవాళ్ళు ఆధునికానంతర సాహిత్యంలోకి కొత్తగా ప్రవేశించినవాళ్లు. సాహిత్య విమర్శలో చెల్లుబాటు ఆధునికానంతర సాహిత్య విమర్శకు ఉన్నది కాబట్టి ఆయన మౌనంగా స్వీకరిస్తే సౌకర్యంగా ఉంటుందని మొహమాట పడలేదు. తనదగ్గర ఉన్న పరికరాల మేరకు, తనకు తెలిసిన మార్క్సిస్టు ప్రమాణాల మేరకు తాను మార్క్సిస్టు సాహిత్య విమర్శా మార్గాన్నే ఎంచుకున్నానని, విశ్వసిస్తున్నానని వినయంగానైనా నిర్ద్వంద్వగానే చెప్పాడు.

సాహిత్య విమర్శలో - ముఖ్యంగా కల్పనా సాహిత్య విమర్శలో వెంకటసుబ్బయ్యకు అనుకూలమైన అంశాలు - పుట్టపర్తి నారాయణాచార్యుల శిష్యరికం, కవిత్వం, కథ, నవల, సాహిత్య విమర్శల పట్ల సమానమైన ప్రేమ, చివరిదాకా సృజనాత్మక రచనలను అన్ని ప్రక్రియల్లో తెలుగు, ఇంగ్లీషు భాషల్లో నిరంతరం చదివే వ్యసనం - అంతే సమానంగా రెండు భాషల్లో సాహిత్య విమర్శను కూడ చదవడం. బహుశా మదనపల్లిలో ఆయన ఇంటి కిటికీలను అన్నివైపులా ఎప్పుడూ తెరచి పెట్టుకొని ఉండే వాడనుకుంటాను, - భౌతికంగానూ, మనసా. కథలు, నవలలు రాయడంతో ప్రారంభించి, పుట్టపర్తి నారాయణాచార్యుల 'శివతాండవం' మొదలయిన కవిత్వ ప్రశంసతో కొనసాగించి ఆయన కథా, నవలా సాహిత్య విమర్శ దగ్గర స్థిరపడడం ఆయనకొక సమగ్ర దృష్టినిచ్చింది.

కొడవటిగంటి కుటుంబరావు సామాజిక, సాహిత్య విశ్లేషణలు ప్రారంభించాక, ఉద్దేశపూర్వకంగానే కాల్పనిక రచనలు చేయడం వదిలేసినట్లుగా (శ్రీశ్రీ 'మహాప్రస్థానం' చదివి కొ.కు. తాను కవిత్వరంగంలో ప్రత్యేకించి చేయవలసింది ఏమీ లేదనుకున్నాడు. ఆయన అన్న కొడవటిగంటి వెంకటసుబ్బయ్య మంచి కవిత్వం రాసి కొద్దికాలానికే ఏమయిపోయాడో 'వైతాళికులు' కవితా సంపుటం తర్వాత ఎవరికీ తెలియదు) రాయలసీమలో తన తర్వాత కథలు, నవలలు రాస్తున్న వాళ్ళ మీద భరోసాతో వెంకటసుబ్బయ్య కాల్పనిక రచనలు వదిలి, ఒక కర్తవ్యంగా సాహిత్య విమర్శను ఎంచుకుంటున్నాడు. అది తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసింది.

సంపాదకుడు, సాహిత్య విమర్శకుడు రచయితలతో వ్యక్తిగత పరిచయాలు పెంచుకోవద్దు అని నమ్మేవాడు సాహిత్య విమర్శకుడుగా నాకు చాలా గురి ఉన్న మా మిత్రుడు జె.సి. ఇరవై ఆరేళ్ళు సంపాదకుడుగా ఉన్నందువల్ల కావచ్చు నాకు విరసం బయట ఉన్న సాహిత్య విమర్శకులతో కొందరితో అసలు ప్రత్యక్ష పరిచయమే లేదు. ఉదా. రాచమల్లు రామచంద్రారెడ్డి. విరసం ఏర్పడక పూర్వం ఆర్.ఎస్. సుదర్శనంతోగానీ, జి.వి.సుబ్రహ్మణ్యంతో గానీ ఉన్న పరిచయం కొనసాగలేదు. వెంకటసుబ్బయ్యగారిని తొమ్మిదో దశాబ్దం ఉత్తరార్థంలో అనుకుంటాను మొదటిసారి చూసాను, విన్నాను, అప్పటికాయన రాసిన సాహిత్య విమర్శ తక్కువమీ చదవలేదు. కీసరగుట్టలో జరిగిన విరసం కథల వర్క్‌షాపులో మొదటిసారి ఆయనను చూసాను. హైదరాబాదు యూనిట్ అది ఏర్పాటు చేసింది. ఆయన కథా రచన శిల్పంపై పాఠం చెప్పాడు. మాండలికం పేరుతో రాస్తున్నదంతా మాండలికం కాదనే ఉద్దేశంతో అనుకుంటాను ఆయన మాండలికంలో రాయడం గురించి చేసిన వ్యాఖ్యాలకు మాండలికాన్ని వ్యతిరేకిస్తున్నాడనిపించి ఆయనతో పేచీ పడ్డాం కూడ. మొదటి పరిచయం, విరసంలో మొదటి అనుభవం ఆయనకేమంత హాయిగా లేకపోవచ్చు. ఆ సాయంత్రం సికిందరాబాదు స్టేషన్‌దాకా బస్సులో కలిసి ప్రయాణం చేసి దిగి విడిపోయాం, అంతే.

మళ్లీ 2005 ఏప్రిల్ 30న వాసిరెడ్డి నవీన్ ఆయన నాకు తన 'ఆధునిక రాయలసీమ సాహిత్య సామాజిక సాంస్కృతిక విశ్లేషణ' కొత్తగా వచ్చిన పుస్తకం ఇమ్మన్నారని ట్రెయిన్‌లో ఇచ్చాడు. కొన్ని నెలలు గడిచిపోయామో. ఆ పుస్తకం తీసుకొని చదువుతూ పూర్తి చేస్తున్న రోజుల్లో నందిగం కృష్ణ ఫోన్ చేసాడు. వెంకటసుబ్బయ్య గారికి క్యాన్సర్ - హైదరాబాదులో నోబుల్ ఆసుపత్రికి తీసుకవస్తున్నారని. ఆయనను నోబుల్ ఆసుపత్రిలో చేర్చిన మధ్యాహ్నమే నేను, కృష్ణ వెళ్లి కలిసాం.

ఇద్దరిలోనూ ఏం పని చేసిందో తెలియదు, చిరకాల మిత్రులు ఎంతో నిర్మొహమాటంగా సాహిత్యం గురించి మాట్లాడుకున్నట్లుగా సాహిత్యం గురించి మాట్లాడుకున్నాం. అప్పటికే చదువుతున్న ఆయన పుస్తకం గురించి కూడ మాట్లాడాను. వర్తమాన సాహిత్యం దగ్గరికి వచ్చే వరకు ప్రాచీన సమాజ సాహిత్యాల వలె విమర్శ పరికరాలను నిశితంగా ఉపయోగించలేదని చెప్పాను. కొంత జాబితా చెప్పడం, కొంత ఉదారత్వం ఉన్నాయన్నాను. బహుశా ఆయన ఇంక బతకడు అనే భావన వల్ల ఏర్పడిన వాతావరణం నుంచి ఆయన సహచరిని, కొడుకును బయట పడేయాలని ఆయనా, నేనూ కూడబలుక్కొని సాహిత్య చర్చలో పడ్డామా - కావచ్చు. మేమున్నంత సేపూ కొడుకు ప్రసాదు ధారాపాతంగా ఏడుస్తూనే వున్నాడు. వెంకటసుబ్బయ్యగారేమో నిక్షేపంగా ఉన్నవానిలా మాట్లాడుతున్నాడు. రెండు గంటలకు పైనే అక్కడ కూర్చున్నాం. డా.రవీంద్రనాథ్‌ను కలిసాము. అప్పటికే బెంగళూరు, హైదారాబాదులో ఉన్న సాహిత్య ప్రేమికులయిన ప్రముఖులందరూ వెంకటసుబ్బయ్యగారిని

వల్లంపాటి స్థానం

☆ పి.రామకృష్ణ

రా.రా.(రాచమల్లు రామచంద్రా రెడ్డి) తన 'అలసిన గుండెలు' కథా సంపుటి రెండో ముద్రణ పీఠికలో శిల్ప ప్రాధాన్యతను గురించి వివరిస్తూ, తాను శిల్పం కోసమే కొన్ని కథలు రాసినట్టు చెప్పారు. ఆ పుస్తకాన్ని నేను సమీక్ష చెయ్యాలన్నది తన కోరిక అయినట్టు, పుస్తకంతోపాటు ఉత్తరం పంపారు. బహుశా, నాకంటే పనికి మాలిన సమీక్షకు కుడి చేతిలో ఆ పుస్తకం పడకుండా వుండేందుకు ఆయనలా రాసి వుండొచ్చు. సమీక్షకు ముందు ఆ అభిప్రాయంపై (శిల్పం కోసమే కథలు రాశాననడం గురించి) ఆయనతో చర్చించాలనిపించింది. "కథా నిర్మాణంలో శిల్పానికి ప్రాధాన్యత వుందన్నంతవరకూ అర్థమవుతుంది. శిల్పం కోసమే కథ రాయడమనేది మాత్రం అర్థం కావడం లేదు. మీకు ఇటువంటి అభిప్రాయం వున్నట్టు నేను ఊహించనుకూడా లేదు. కథలో శిల్పం వుంటుంది కానీ, శిల్పంలో కథ వుంటుందా?" ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, నేను రా.రా.కు ఉత్తరం రాశాను. పుస్తకాన్ని సమీక్షిస్తే, మీ అభిప్రాయంతో వ్యతిరేకించవలసి ఉంటుంది.... అని కూడా రాశాను. అందుకు ఆయన జవాబిస్తూ శిల్పం గురించి ఇప్పటి రచయితలు ఏ మాత్రం తెలుసుకోకుండానే కథలు రాస్తుండటం వల్ల ఆ మోతాదులో చెప్పవలసి వచ్చిందంటూ, నా పుస్తకాన్ని సమీక్షించమని కోరాను కానీ, నన్ను వ్యతిరేకించవద్దని కోరలేదుగా... అని రాశారు. ఔరా.... రా.రా! అనుకున్నాను.

ఇప్పుడు రా.రా.ను గురించి ఎందుకు చెప్పినట్టు? వల్లంపాటికీ, రా.రా.కూ ఎక్కడన్నా సంబంధం వుందా? పుట్టపర్తిని విమర్శించిన రా.రా.కూ, ఆరాధించిన వల్లంపాటికీ సంబంధం ఎక్కడుంది? ఒక్కచోట ఉందను కుంటున్నాను. ఎక్కడో చెబుతాను. తెలుగులో దాదాపు మొట్టమొదటి మార్క్సిస్టు విమర్శకుడుగా గుర్తింపు పొందిన రా.రా. శిల్పం గురించి ఆ విధంగా చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. మార్క్సిస్టు దృక్పథంలో సాహిత్యాన్ని పరిశీలిస్తాడనుకునే వల్లంపాటి వరుసగా కథాశిల్పం, నవలా శిల్పం, విమర్శనాశిల్పం వెలువరించడం కూడా అలాగే ఆశ్చర్యం కలిగించింది. 'విమర్శనా శిల్పం' అనే సరికి నా ఆశ్చర్యం ఆలోచనగా మారింది. రాల్ఫ్‌ఫాక్స్ 'నవల - ప్రజలు' వ్యాసాలను అనువదించిన వల్లంపాటి ఈ శిల్పం చిక్కులో చిక్కుకొని పోవడమేమిటి? సాహిత్యమూ, సాహిత్య పరిశీలనా అంతా శిల్పమే అంటున్న వారికి మార్క్సిస్టు దృక్పథం ఉన్నట్టు అనుకోవచ్చునా? ఈ విధంగా ఆలోచిస్తే, మార్క్సిస్టు దృక్పథంవేరు, మార్క్సిస్టు దృక్పథం మీద గౌరవమూ, విశ్వాసమూ కలిగి వుండటం వేరు... అని తెలిసింది. వల్లంపాటిని, మార్క్సిస్టు దృక్పథం మీద గౌరవమూ, విశ్వాసమూ కలిగిన రచయితగా, విమర్శకుడుగా, వ్యక్తిగా నేను భావిస్తున్నాను.

నిజానికి వల్లంపాటి 'విమర్శనా శిల్పం' నేను చదవలేదు. విమర్శను శిల్పం పరిధిలో కుదించడం మార్క్సిస్టు విమర్శకుడెవరూ చెయ్యరనుకుంటున్నాను. అంతేగాదు, కథాశిల్పం, నవలా శిల్పం గురించి ఆయవ చెప్పినవి కూడా సంప్రదాయవిమర్శకులు చెబుతూ వచ్చినవే. కథా సంవిధానం, క్లుప్తత, పాత్రలు, అనుభూతి ఐక్యత, సంఘర్షణ, నిర్మాణ సౌష్టవం... (కథా శిల్పం) వీటిని గురించి చేసిన హెచ్చరికలూ, చెప్పిన మెలకువలూ శిల్పవాదులు చెబుతూ వచ్చినవే. కథా వస్తువును గురించి వల్లంపాటి చెప్పనేలేదని కాదు, చెప్పారు.

"జీవితం నుంచీ రచయిత కథా వస్తువును ఎన్నుకోవడంలోనూ, దాన్ని చిత్రించడంలోనూ అతని భావజాల ప్రభావం తప్పకుండా వుంటుంది. రా.వి.శాస్త్రి, కొ.కు, కా.రా.లు సామ్యవాదులు కాకపోతే వారి ఇతివృత్తాలు మరో విధంగా వుండేవి" (కథా శిల్పం)

రచయిత భావజాలాన్ని బట్టి ఇతివృత్తం వుంటుందనుకున్నప్పుడు, వస్తువును ఎన్నుకోవడంలోనూ, చిత్రించడంలోనూ, రచయిత భావజాల ప్రభావం తప్పకుండా వుంటుందనుకున్నప్పుడు, వస్తువుకు అనుగుణమైన శిల్పాన్ని ఎన్నుకోడా? వస్తువు ఎన్నికలోనూ, దాని చిత్రణలోనూ రచయిత భావజాలం ఉన్నప్పుడు, ఆ చిత్రణలో శిల్పం ఉండదా? విడిగా వున్న శిల్పభాగాలను చిత్రణలో కలుపుకోవలసి వుంటుందా? వస్తువు ఎన్నికలో, చిత్రణలో రచయిత భావజాలమే లక్ష్యనిర్దేశం చేస్తుందంటే, భావజాలానికి శిల్పాన్ని మించిన ప్రాధాన్యత వున్నట్టే కదా! ఇంకో రకంగా ఆలోచించినా, భావజాలం శిల్పం కంటే ముఖ్యమైనదని గ్రహించవచ్చు. శిల్పవాదం చెప్పిన జాగ్రత్తలన్నిటినీ పాటించి, సామాజిక వ్యతిరేకమైన కథరాస్తే, అంగీకరించవచ్చా?

కాపాడుకోవడం ఎంత అవసరమో ఆయనకు చెప్పినట్లున్నారు. స్వయంగా ఆయనకూ వెంకటసుబ్బయ్యగారి వ్యక్తిత్వమూ, విలువ ఏమిటో తెలుసుననుకుంటాను. అయితే ఆయన డాక్టరు కూడ కనుక కేవలం మన ఆకాంక్షలే ఆయనను బతికించలేవని కూడ తెలుసు. ఆ మాటే చెప్పకతప్పలేదు. ఆయన కొడుక్కి మేం డాక్టర్ రవీంద్రనాథ్‌తో మాట్లాడాక ఏమి భరోసా యిచ్చినా ఏదో సమయంలో ఇంక వల్లంపాటి లేడనే వార్త వినాల్సి వస్తుందనే మానసికంగా సిద్ధపడ్డాం. ఆరోజు నాకు రెండు విషయాల్లో అయ్యో కాలం మించిపోయింది కదా అనిపించింది.

ఒకటి - ఆయన పుట్టపర్తి గురించో, కథాశిల్పం గురించో, నవలా శిల్పం గురించో రాసినపుడు కలిగిన అభిప్రాయాలు అప్పుడే ఆయనతో చర్చించి ఉండవలసింది. దాని నుంచే వచ్చే రెండో ప్రయోజనం - అట్లా చర్చించి ఉంటే ఆయన రాయలసీమ సాహిత్య చరిత్రను సామాజిక నేపథ్యంనుంచి విశ్లేషించాలనుకున్నపుడు అటువంటి సంభాషణ ఒకటి ఎక్కువ ఉపకరించి ఉండేది.

వెంకటసుబ్బయ్య గారు తన విమర్శ ద్వారా తెలుగు కథా శిల్పాన్ని మెరుగుపరిచే ప్రయత్నం చాలా చేసారు. అయితే వర్తమానంలో రాస్తున్న చాలా మంది ఆయన శిల్పం గురించే చెప్పున్నాడనుకున్నారు గానీ ఆయన ఆ శిల్పాన్ని ఎంచుకునేది మౌలికమైన ఇతివృత్తం అని గాఢంగా నమ్మాడని అనుకోవడం లేదు. కుందుర్తి వచన కవిత గురించి మాట్లాడినపుడయినా, వల్లంపాటి శిల్పం గురించి మాట్లాడినపుడయినా ఇద్దరూ అవగాహన, దృక్పథం, ప్రయోజనం గురించి తపనపడి రూపం గురించి మాట్లాడారని ప్రక్రియలమీదనే కేంద్రీకరిస్తున్న వాళ్లు తీవ్రంగా పట్టించుకుంటున్నారా? సందేహమే. వల్లంపాటి గారికి- ఎవరికి చెప్పాలి, ఏం చెప్పాలి అనే విషయంలో సందేహాలు లేవు. తన వలెనే సమకాలీనంగా రచనలో జీవించదలిచిన ఎవరైనా సామాజిక చైతన్యంతో వస్తువును ఎంచుకుంటారనే ఆశించాడు. అందుకని ఎట్లా చెప్పాలనే విషయంపై తన అధ్యయనాన్నీ, పరిశీలనను తనకంటే తర్వాతి తరానికి అందించాలనుకున్నాడు.

సాహిత్య విమర్శకుడంటే న్యాయమూర్తి వలె కక్షిదారులకు సమదూరంలో ఉండేవాడు కాదు. చేతిలో త్రాసు పట్టుకొనో, దండం పట్టుకునో కూర్చునే వాడు కాదు. తానుకూడ ఒక సృజనకారునివలె సాహిత్య సముద్రంలో దూకి ముత్యాలను వెలికి తెచ్చి, వాటి విలువ తెలిసి పరిచయం చేసేవాడు.

సాహిత్య విమర్శ పాఠకులకు సాహిత్యాన్ని పరిచయం చేయడంకన్నా మించిన అపూర్వ కార్యమేదో చేయదు కాని ఈ పరిచయం చేసే క్రమంలోనే అటు రచయితకు, ఇటు పాఠకునికి అందులో చెప్పిన విషయాల మధ్యన దాగి ఉన్న శక్తినీ, బలహీనతలనూ పరిచయం చేసి అటు రచయితలో రచనా శక్తినీ, ఇటు పాఠకులలో వివేచనా శక్తిని పెంపొందిస్తుంది.

వల్లంపాటి అందువల్లనే సృజనాత్మక రచయితల వెంట ఉండే పరిచయకర్త కర్తవ్యాన్ని ఎంచుకున్నాడు. పరిచయాన్ని ఉన్నతీకరించే సాహిత్య విమర్శనా పద్ధతిని కేవలం రచనలోనే కాదు, వ్యక్తిత్వంలోనూ ఒక సంస్కృతిగా అలవరచుకున్నాడని ఆయనతో ఆఖరిసారి సంభాషణలో నాకనిపించింది. *

అంగీకరించ అంటే, అప్పుడూ శిల్పాన్ని మించిన ప్రాధాన్యత రచయిత భావజాలానికున్నట్టే గదా! ఆ అంశాన్ని అంగీకరిస్తూనే, రచయిత భావజాలం (రచనా లక్ష్యం) కళాత్మకంగా వుండాలంటాడు వల్లంపాటి.

"రచయిత ఉద్దేశం ఎంత గొప్పదయినా కావచ్చు. అది రచనలో కళాత్మకంగా వ్యక్తం కానంతవరకూ దానికి విలువలేదు. ఈనాడు తెలుగు సాహిత్య విమర్శలో 'ఉద్దేశ భ్రమ' (ఉద్దేశం మంచిదైతే చాలనుకోవడం, అంటే వస్తు ప్రాధాన్యత) చాలా ప్రముఖంగా కనిపిస్తోంది. విమర్శకుడు ఆ భ్రమలో పడకుండా వుండాలంటే ఉద్దేశం కళగా మారే క్రమాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది.".

అందుకోసం వల్లంపాటి శిల్పం సీరీస్‌ను వెలువరించినట్టు అనుకోవాలి. శిల్పం గురించి తెలుసుకోకుండా కథలు రాస్తుండటం వల్ల, శిల్ప ప్రాముఖ్యత గురించి చెప్పవలసి వచ్చిందని రా.రా. అంటే, ఉద్దేశ భ్రమను తొలగించాలన్న ఉద్దేశంతో, ఉద్దేశాన్ని కళగా మార్చే క్రమాన్ని (అంటే, శిల్పమే) వల్లంపాటి చెప్పాడు. ఇదిగో... ఈ పోలిక కోసమే మొదట రా.రా.ప్రస్తావన తెచ్చింది. అయితే, ఒక భ్రమను తొలగించడానికి మరొక భ్రమను నెలకొల్పడమే ప్రత్యామ్నాయమా? ఇదీ ఆలోచించవలసింది. శిల్పాన్ని 'భ్రమగా' చెప్పవచ్చా? ఇది ఆ ఆలోచనలో పుట్టుకొచ్చే ప్రశ్న.

సృజనాత్మక కళతో సహా ఏ కళలోనైనా నైపుణ్యం సాధించటానికి కొన్ని మెలకువలు నేర్చుకోవడం అవసరం. ఆ మెలకువల్ని అనుభవం ద్వారా నేర్చుకుంటారు. పుట్టుకతో కులమూ, వర్గమూ నిర్ణీతమయ్యే సమాజంలో, కళ పుట్టుకతో వస్తుందిగానీ, నేర్చుకుంటే వచ్చేది కాదనే నమ్మకం వ్యాపిస్తుంది. ఆ నమ్మకం ఎవరికి అనుకూలిస్తుందో చెప్పనవసరం లేదు. అయినా, పుట్టుకతో ఏదీరాదనీ, ఏదైనా నేర్చుకుంటేనే వస్తుందనే వాస్తవం సమాజంలో నిరూపితమవుతూ వుంటుంది. అప్పుడు, కళని జనసామాన్యానికి అందుబాటులో లేకుండా చేసేందుకు 'కళ' చుట్టూ 'మిస్టరీ' చేరుతుంది. శిల్ప ప్రాముఖ్యతని చెప్పడంలో 'మిస్టరీ' ఏదీ లేదు, రచయిత చెప్పదలచుకున్నది పాఠకునికి చేరేందుకు శిల్పం తోడ్పడుతుంది... అనవచ్చు. అందుకు అభ్యంతరం వుండదు. అయితే, తను చెప్పదల్చుకున్నది పాఠకునికి అర్థమయ్యేట్టు ఎలా చెప్పాలి అన్నది రచయిత తన అనుభవం ద్వారానే తెలుసుకుంటాడు. శిల్పం చూసుకుని ఎవరూ రచనలు చెయ్యరు. మొదట అంత బాగా రాయలేని రచయితలు తర్వాత బాగా రాయగలగడానికి కారణం ఇదే. మార్క్సిస్టులు వస్తువును కప్పివేసే పొగమంచు లాంటి శిల్పానికి మితిమీరిన ప్రాముఖ్యతనివ్వరు.

వల్లంపాటికి మార్క్సిజం పట్ల గౌరవమూ విశ్వాసమూ వుండేదనడానికి ఆయన ప్రారంభదశని మినహాయిస్తే, మరణం వరకూ నిర్వహించిన సాహిత్య కార్యక్రమమంతా సాక్ష్యమిస్తుంది. వ్యక్తులతో, సంస్థలతో ఆయన ఏర్పరచుకున్న స్నేహాలూ, సంబంధాలూ కూడా ఆ విషయాన్నే నిరూపిస్తాయి. సాహిత్యానికి సంబంధించినంతవరకూ నిర్మొహమాటంగా వ్యవహరించారు.

"నేను గౌరవించే రచయితల్లో కూడా తప్పులని నేను భావించిన వాటిని ఎత్తి చూపటానికి సంకోచించలేదు. అలాగే యువ రచయితల్లో కనిపించిన మంచిని మెచ్చుకోవటానికి సందేహించలేదు" వల్లంపాటి తెలిసిన వారికి అవి ఏమాత్రం అతిశయోక్తులు అనిపించవు. అలాగే నేనూ వల్లంపాటిని గురించిన నా అంచనాను 'సెంటిమెంట్'కు తావులేకుండా ఎత్తి చూపడానికి సంకోచించ రాదనుకున్నాను. వల్లంపాటి సాహిత్య జీవితమంతా మార్క్సిస్టు దృక్పథంలో నడచినట్టు చెప్పలేముకానీ, మార్క్సిజంపై సడలని విశ్వాసంతోనే సాగిందని చెప్పవచ్చు. ఆర్.ఎస్.సుదర్శనంపై విమర్శలు చేసిన నాటి నుంచీ ఇటీవలి వరకూ ఏ రచయితయినా తెలిసో తెలీకో మార్క్సిస్టు వ్యతిరేకతని వ్యక్తం చేసినప్పుడల్లా స్పందిస్తూవచ్చారు.

ఒకప్పుడు నేను అసలైన మార్క్సిస్టునని చెప్పుకున్న వాళ్ళు, ఆ తర్వాత సొంతకారణాలతో నాకు మార్క్సిజం మీద నమ్మకం పోయిందని సిద్ధాంత మార్పిడిలో ముఖం దాచుకున్నప్పుడు, జీవితాంతం మార్క్సిజం పట్ల నమ్మకంతో ఉండటాన్ని గొప్ప వ్యక్తిత్వంగా గుర్తించకతప్పదు. తనను తాను గొప్పవాడుగా, బోధకుడుగా, తన అభిప్రాయాలు మరెవరూ ప్రశ్నించరానివిగా భావించిన వ్యక్తిత్వం కాదు అది. ప్రజాస్వామ్య సంస్కృతికి చెందిన వ్యక్తిత్వం అది. తన చివరి రచన అయిన 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం, సామాజిక సాంస్కృతిక విశ్లేషణలో' తన అభిప్రాయాలపై చర్చ జరగాలనీ, పొరపాట్లను ఎత్తిచూపితే సవరించుకుంటాననీ చెప్పిన సంస్కృతి అది.

వల్లంపాటి అదీ. ఆయన స్థానం అక్కడుందని అనుకుంటున్నాను.

*

స్వీకారం

జగడం
బోయ జంగయ్య,
బోజ పబ్లికేషన్స్,
5-9-214, మన్యం చెలక, నల్లగొండ.
వెల : 100/-

జననేత్రం
జెట్టి జైరాం కవిత్వం,
కవి భారతి ప్రచురణ,
1-1-651, ఆర్.కె.నగర్, అనంతపురం.
వెల : 30/-

పానాది
ఎం.డి.అహ్మద్ కవిత్వం.
ప్రచురణ : మంజీర రచయితల సంఘం
1-12-29/20,
అజయ్ కాలని, మెదక్
వెల : 30/-

పతంజలి కథలు
తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి,
86-4-16/1, వాడ్రేవునగర్,
రాజమండ్రి.
వెల : 100/-

బాలలు జాతీయ సంపద
రచన : వి.ఎస్.కమల,
తరిమెల నాగిరెడ్డి ఎడ్యుకేషన్ సొసైటి ప్రచురణ
జనశక్తి నగర్, వేదాయపాలెం, నెల్లూరు -4.
వెల : 15/-

అసుర సంధ్య
మాల్కం ఎక్స్ ఆత్మకథ
రచయిత : అలెక్స్ హాస్
తెలుగు : యాజ్ఞ వెల : 25/-
హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ
ప్లాట్ నం. 85, బాల్లాజీనగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్-67.

తూరుపు
కళింగాంధ్ర కవిత్వం,
సంపాదకులు - అరుణ్ బవేర వెల :60/-
శ్రీచమన్
అన్ని పుస్తకాల షాపుల్లో దొరుకుతుంది.

మానవ సమాజం
నిన్నా - నేడూ - రేపూ,
రంగనాయకమ్మ రచన
స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్, వెల : 80/-
76,లేక్‌సైడ్ కాలని, జూబ్లిహిల్స్ పోస్ట్,
హైదరాబాద్ - 500 033

మల్లెరేకు
కథా సంపుటి, వెల : 50/-
రచయిత : వేంపల్లి అబ్దుల్ ఖాదర్
కొత్తపేట ఎక్స్‌టెన్షన్
కలికిరి, చిత్తూరు జిల్లా.

"మరణం ఒక కామా, మరణం ఒక కోమా"

☆ సహవాసి

జనవరి తొలి రెన్నాళ్లు జనం కేరింతల మధ్య ముగిశాయి.

కొత్త సంవత్సరం కొంగ్రొత్త ఆశలు ఆనందాల ఉత్సవ కోలాహలం కొంత సద్దు మణగింది.

జనవరి మూడు - పొద్దుట ఇంకా నిద్ర మంచం మీంచి దిగకముందే ఫోన్ మోగింది. అయిన వాళ్లెవరో ఆలస్యంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి ఫోన్ చేస్తుండవచ్చనుకున్నాను. తాపీగా ఫోనెత్తాను. అవతలివైపు నుంచి ఆదుర్దా నిండిన గొంతు .... "వల్లంపాటి వారు పోయారు మామయ్యా ! ఇప్పుడే కబురందింది" మా వియ్యంకుడి కుమారుడు ప్రసాదు.

నాకు నోరు పెగల్లేదు. క్షణకాలం స్తబ్దుణ్ణయ్యాను. పాతికేళ్ళ పై చిలుకు స్నేహానుబంధం వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారితో. ఆయన గొంతు మరిక వినబడదు ... కరచాలనానికి ఆ స్నేహ హస్తం ముందుకు రాదు.

డిశంబరు 8న బెంగుళూరు నుంచి మదనపల్లికి వల్లంపాటి తిరిగివచ్చినట్లుగా మా ప్రసాదు ఉత్తరం ద్వారా నాకు తెలిసింది. టీచర్స్ కాలనీకి వెళ్ళి ఆయనని పరామర్శించి వచ్చినట్లు రాస్తూ అదే జాబుతో Herbal Remedy for Cancer అన్న కరపత్రం జతపర్చి పంపాడు. Papua New Guinea నుంచి ఫాదర్ రోమనో నుంచి అందిన సమాచారం అది. మదనపల్లిలోని ఓ సిస్టర్ డాక్టర్‌తో ఆయన తన ప్రయోగానికి సంబంధించిన సమాచారం పంచుకునే క్రమంలో ఆ కరపత్రం కాపీలు ఒకటి రెండు అందాయి. ఒక కరపత్రాన్ని వల్లంపాటికిచ్చి ప్రయత్నం చెయ్యమని తను కోరానన్నాడు. "మందులతో పాటు మనోధైర్యంతో జబ్బును ఎదుర్కొన్నప్పుడే ఫలితం ఉత్సాహజనకంగా వుంటుంది" అని తను రాశాడు..

అశనిపాతంలా హఠాత్తుగా విరుచుకుపడ్డ వ్యాధితో ఆయన ధైర్యం విలోలమై వుండవచ్చని తనకు అనిపించిందట! ఆర్థికపుష్టి లేని తనలాంటి వానికి రాకూడని ఖరీదైన జబ్బది ! ఇంకా ఎక్కాల్సిన ఎత్తులు ఎన్నో వున్నాయి. గెలవాల్సిన పోరులు మిగిలిపోయాయి. ఇంకా కనీసం రెండు పదుల వయస్సయినా ముందున్నది. భవిష్యత్తు వుంది ... సాహిత్యానికి మరెన్నో సేవలు చేయాలి ... వికసించిన ప్రతిభ యింకా సౌరభాలు గుబాళించాలి .... యిలాంటి ఆశావహ స్థితిలో కేన్సర్ రూపంలో కారుమబ్బు కమ్ముకోవడం ఎవరికైనా దుస్సహమే. రాహువు సూర్యుణ్ణి కబళించినట్లుగా, కథకుడు, నవలాకారుడు, సాహిత్య విమర్శకుడు, అనువాదకుడు, ఆలోచనా జీవి, అన్నిటినీ మించి ఎందరికో అభిమాన రచయిత, ఆత్మీయ మిత్రుడు వల్లంపాటిని ఆ వ్యథార్త వ్యాధి వేధించి వేధించి బలిగొన్నది. గ్రహణం విడుస్తుంది. సూర్యబింబం మళ్ళీ పూర్వ తేజస్సుతో జాజ్వల్యమానంగా వెలుగుతుంది. వల్లంపాటి భౌతికంగా మన కళ్ళ కనబడడు గానీ స్మృతి పథంలో మెదుల్తూనే వుంటాడు. ఆ గళం మూగవోయినా ఆ కలం చిందులకు చిరాయుర్దాయం వుంది.

సంజీవదేవ్ మాటలు గుర్తొస్తున్నాయి - "మరణించిన మిత్రులను గురించిన విషాదాన్ని మరింత ఎక్కువగా మనస్సులో దాచి వుంచుకోరాదు. వెంటనే పోగొట్టుకోరాదు. రెండూ అవాంఛనీయాలే! దానంతటది దూరమై పోయేదాకా మనసులో వుంచుకోవాలి. దూరమై పోతుంటే దగ్గరకు లాగరాదు.

***

చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకాలోని కుగ్రామం రొంపిచెర్లలో జన్మించిన వల్లంపాటి వెంకట సుబ్బయ్యతో నా పరిచయం చిత్రంగా జరిగింది. నాకు స్నేహితులు, బంధువు, ఆత్మీయులు శ్రీ సి.కె. నారాయణ రెడ్డి, రొంపిచెర్ల ప్రాంతం వారే. వల్లంపాటి వారి కుటుంబంతో శ్రీ సి.కె. కుటుంబానికి అనాది నుంచీ అనుబంధం వుండేది. సి.కె.తో చక్కటి చెలిమి, సాన్నిహిత్యం వున్న నాకు మొట్టమొదట వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారి తండ్రి గారితో పరిచయమైంది. దరిమిలా వెంకట సుబ్బయ్య గారితో పరిచయమైంది. పరిచయం స్నేహంగా మారింది. అది అంతరంగ స్నేహంగా పరిణతి చెందింది.

1983 జనవరిలో ఇ.హెచ్.కార్ రాసిన "వాట్ ఈజ్ హిస్టరీ" అన్న పుస్తకాన్ని "చరిత్ర అంటే ఏమిటి?" అని తెలిగించారు. ఆ గ్రంథాన్ని అనువదించడానికి ఆయన చాలా శ్రమించారు. హైదరాబాదు బుక్ ట్రస్టు వారు దానిని ప్రచురించారు. ఆ అనువాదానికి శ్రీ బిపిన్‌చంద్ర 'పరిచయం' రాశారు. అది హైదరాబాదు చేరడం కొంత ఆలస్యమైంది. దానిని తిరిగి వల్లంపాటికి పంపి, తెలుగు చేయించి ప్రచురించడానికి సమయం లేదు. వల్లంపాటి అనుమతితో బిపిన్‌చంద్ర 'పరిచయం' నేను తెలిగించాను. మా యిద్దరి మధ్య సౌహార్దానికది ఆనవాలుగా గుండెల్లో పదిలంగా వుంటుంది.

మదనపల్లి వెళ్లినప్పుడల్లా మేం కలవకుండా వున్న రోజు లేదు. ఒకసారి దాదాపు పదిహేను రోజులు మదనపల్లిలో ఏకబిగిన గడపాల్సి వచ్చింది. ప్రతిరోజూ సాయంత్రం ఊరిబైటికి వాహ్యాళి వెళ్ళేవాళ్ళం. పుట్టపర్తి నారాయణాచార్యుల వారి శివతాండవం చదువుతుంటే వల్లంపాటి ధారణాశక్తి ఆశ్చర్యపర్చేది. విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' ఆయనకిష్టం. శ్రావ్యంగా చదివే వారు. దుర్భిక్షం రాయలసీమ జనం బతుకుల్లో నింపిన దుఃఖాన్ని ఆయన వర్ణిస్తుంటే కళ్ళు చెమ్మగిల్లేవి. అవకాశాలను బట్టి, రాజకీయ ప్రయోజనాలను బట్టీ పార్టీలు మార్చుతూ వుండే ఫ్యాక్షన్ గుంపులంటే తనకి ఎంత అసహ్యమో! "గాయపడిన దేవత" లో ఆయన ఫ్యాక్షన్ కుటుంబాలు రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం పిల్లల్ని ఎలా బలిపశువుల్ని చేస్తాయో వర్ణించాడు. అలాగే "బండి కదిలింది" (1991) అన్న కథ సీమ జీవితంలోని ఒక ప్రధానాంశమైన కరువును గురించిన కథ. కరువు సమాజాన్ని ఆర్థికంగా ప్రభావితం చేయడంతో పాటు మానవ సంబంధాల్ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తుందో చిత్రించిన కథ అది.

సృజనాత్మక నవల, కథా రచయితగా సాహిత్య జీవితానికి ఫుల్‌స్టాప్ పెట్టి వల్లంపాటి సాహిత్య విమర్శను చేపట్టాడు. నవలా శిల్పం, కథా శిల్పం - యీ రెంటిలో కళింగాంధ్ర మొదలుకొని అటు చిత్తూరు దాకా ట్రెండ్ సెట్టర్స్‌గా పేరుపొందిన రచయితల నవలలు, కథల్ని నిజాయితీగా నిర్వికారంగా సమీక్షించాడు. ఆఖరికి తన రచనను సైతం వదలిపెట్టలేదు. 1974 లో రాసిన "మమతలు - మంచుతెరలు" లో తానెక్కడ తప్పుదారి పట్టిందీ నిర్మొహమాటంగా విమర్శించుకున్నాడు. ఫ్యూడలిజం ఊడలు దిగిన రాయలసీమలో జరిగిన ఓ కథలో ఆర్థిక సంబంధాలను చిత్రించకుండా ఫ్యూడలిజాన్ని చిత్రించడం సాధ్యం కాదన్న అంశాన్ని విస్మరించడం తాను చేసిన తప్పిదం అని ఆయన గ్రహించాడు. గ్రహించక పూర్వం రచయితగా సెంటిమెంటల్ సంబంధాల మీద దృష్టిని కేంద్రీకరించాడు. "రాయలసీమలో ఆధునిక సాహిత్యం - సామాజిక సాంస్కృతిక విశ్లేషణ" అన్న తన తాజా పుస్తకంలో యీ విషయాన్ని పాఠకుల ముందుంచాడు. ఈ పుస్తకం మీద ఆరోగ్యకరమైన చర్చ జరగాలని వల్లంపాటి వాంఛించాడు. చర్చ యిప్పుడిప్పుడే మొదలై ఊపందుకోనున్న సమయంలో ఆయన లంగరెత్తారు. 2007, జనవరి 2 సాయంత్రం ఆయన ప్రాణనౌక జీవిత తీరాన్ని విడిచిపెట్టింది. *

వల్లంపాటి వెంకట సుబ్బయ్య

(1937 - 2007)

☆ డా.వి.ఎస్.శ్రీధర్

తెలుగు సాహిత్య లోకంలో విమర్శకుడుగాను, అనువాదకుడు గాను పేరుపొందిన శ్రీవల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు జనవరి 2వ తేదీన కన్నుమూశారు. ఆయన కన్నడ దేశంలో కూడా చాలా మంది సాహితీవేత్తలకు తెలిసిన వాడే. తెలుగు కన్నడ సాహిత్యాల నడుమ ఒక వారధిలా ఉండిన వెంకటసుబ్బయ్యగారు ఇక్కడి ఆయన మిత్రులకు వి.వి.గా పరిచయం. మోకాటి చిప్పకు జరిగిన ఆపరేషన్ సమయంలోనే ఆయనకు క్యాన్సర్ ఉందని తెలిసి ఆయన అభిమానులు ఆఘాతం చెందారు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా ఉండే వి.వి.గారు కూడా ఒక రకంగా కుంగిపోయారనే చెప్పాలి. అయితే ఆ వ్యాధి సాహిత్యంలో ఆయనకున్న ఆసక్తిని కుంగదీయలేదు. ఆయనను పరామర్శించడానికి వెళ్ళిన నాతో ముఖ్యంగా సాహిత్యానికి సంబంధించిన విషయాలే మాట్లాడారు. ఇటీవలనే ప్రకటింపబడ్డ 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం - సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ' అన్న పుస్తకాన్ని నాకిచ్చి ఆ విషయం గురించే ఎక్కువసేపు చర్చించారు. ఆయనలో ఇంకా మిగిలివున్న విషయాలన్నీ రాతరూపంలో వ్యక్తీకరించడానికి సాధ్యపడుతుందో లేదోనన్న అనుమానం ఆయన్ను బాధించింది. చింతించవలసిన విషయం ఏమిటంటే ఆయన అనుమానమే నిజమైంది. ఆయన మనసుకు ఊరట కల్పించడానికి ఆయన పుస్తకాలను కాస్త దూరం జరిపి మంచి సంగీతం వినండని చెప్పి కొన్ని టేపులు ఇచ్చి వచ్చాను.

కవితలు, కథలు రాయడంతో ప్రారంభమైన ఆయన సాహిత్య కృషి విమర్శా క్షేత్రంలో స్థిరంగా నిలిచింది. ఒక్క మార్క్సిస్టు సిద్ధాంతమే కాక ఇతర ఆధునిక సిద్ధాంతాల పైన కూడా మంచి పట్టు సంపాదించారు. అయితే ఆయనది ముఖ్యంగా మార్క్సిస్టు పంథా. తెలుగు సాహిత్యం, చరిత్ర, సంస్కృతిని లోతుగా అధ్యయనం చేసిన వి.వి.ఎప్పుడూ శుష్క పండితుడు కాలేదు. రేమండ్ విలియమ్స్, టెర్రి ఈగిల్టన్ మొదలైన మార్క్సిస్టు విమర్శకులను చదివినందువల్ల ఆయన సైద్ధాంతికబద్ధతలో పిడివాదం అంధానుకరణ కనబడదు. కన్నడ సాహిత్య విమర్శనూ చాలినంతగా చదువుకున్న వి.వి.గారికి ఇక్కడ మార్క్సిస్టు విమర్శ అంతగా లేని కొరత వెలితిగానే కనబడేది. కన్నడ విమర్శా లోకంలో పెద్ద పేరైన డి.ఆర్.నాగరాజ్‌ను మెచ్చుకుంటూనే ఆయన విమర్శా పద్ధతుల పట్ల తనకున్న అభ్యంతరాలను, సందేహాలను వెలిబుచ్చేవారు. ప్రముఖ కన్నడ కథకుడైన దేవనూరు మహాదేవ వి.వి. మెచ్చుకొన్న మరొక రచయిత. మహాదేవ గ్రామీణ కన్నడంలో రాసిన 'ఒడలాళ'ను తెలుగులోకి అనువదించడానికి ఆయన ఆ నవలను ఇతరులతో చదివించి, చర్చించి అర్థం చేసుకున్నారు.

'కథా శిల్పం' తెలుగు కథ ఒక ప్రక్రియగా రూపొందుతున్న క్రమాన్ని, దాని స్వరూపాన్నీ వివరించే గ్రంథం. ఇది వెంకట సుబ్బయ్యగారికి విమర్శా లోకంలో ఒక సుభద్రమైన స్థానాన్ని సంపాదించిపెట్టింది. ఆయన సైద్ధాంతిక బద్ధత, విశ్లేషణా సామర్థ్యం ఈ పుస్తకంలో స్పష్టంగా ప్రకటమవుతాయి. 1996-97లో తెలుగు విశ్వవిద్యాలయం ఈ గ్రంథాన్ని ఉత్తమ విమర్శా గ్రంథంగా పరిగణించింది. 1999లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభ్యమయింది. ఆ తర్వాత ఇదే ధాటిలో ఆయన విమర్శా శిల్పం గురించిన మరొక్క గ్రంథం కూడా రచించారు.

వి.వి.గారు పరిణతి సాధించిన ఇంకొక క్షేత్రం అనువాదం. తస్లీమా నస్రీన్ రాసిన వివాదాత్మకమైన నవల 'లజ్జా' నుంచి ఇ.హెచ్.కార్ (What is History) వరకూ ఆయన అనువాద కృషి వ్యాపించింది. రొమిలా థాపర్ రచనలను కొన్నిటిని కూడా అనువదించారు.

ఒక ప్రాంతపు రాజకీయ పరిస్థితి, చరిత్రకూ అక్కడి సాహిత్య కృతుల వస్తు, రూపాలకూ ఉన్న అవినాభావ సంబంధాన్ని పరిశీలించి రాయలసీమ ప్రాంతపు సాహిత్యాన్ని గురించిన విమర్శా గ్రంథాన్ని ఆయన మార్చి, 2006లో ప్రకటించారు. ఈ ప్రాంతంలోని ఆధునిక సాహిత్యంలో చిలుక పలుకులు, కోయిల పాటలు, ఆత్మాన్వేషణపు కసరత్తులూ, వ్యక్తి కేంద్రితమైన అస్తిత్వ వాదం మొదలైన పోకడలు కనబడక పోవడానికి కల కారణాలను ఆయన ఒక విమర్శకుడిగా, చారిత్రక దృక్పథంతో పరిశీలించారు. రాయలసీమ ప్రజల జీవితానికీ, వేరే ప్రాంతాల ప్రజల జీవితానికీ ఉన్న వ్యత్యాసం వల్లనే ఇక్కడి భాషా సాహిత్యాలు కూడా విభిన్నంగా ఉంటాయన్నది ఆయన ఖచ్చితమైన అభిప్రాయం.

భారతీయ సాహిత్యాన్ని పూర్తిగా ఒకటే మూసలో పోసి అఖండత్వాన్ని ఆపాదించి 'భారతీయ కావ్య మీమాంస'ను రూపొందించే ప్రయత్నాలకంటే ఈ దేశంలోని వివిధ ప్రాంతాలు, భాషల వైవిధ్యత ప్రాతిపదికగా ఆయా సంస్కృతులను, సాహిత్య ప్రక్రియలను, కృతులను విమర్శించాలన్నది ఆయన దృక్పథం. ఇదే దృక్పథంతో ఆయన రాయలసీమ సాహిత్యాన్ని గురించి చేసిన అధ్యయనం ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

ఇదే దిక్కులో ఇంకా లోతైన విమర్శ చేయాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తించాడు. మన దేశంలోని వివిధ భాషల్లో వెలువడిన సాహిత్యకృతుల తులనాత్మక అధ్యయనంతో పోల్చితే ఆ భాషల్లోని విమర్శా గ్రంథాల గురించిన తులనాత్మక అధ్యయనం దాదాపు లేదనే చెప్పాలి. ఉదాహరణకు ప్రముఖ కన్నడ రచయిత దేవనూరు మహాదేవ కృతులు తెలుగు సాహిత్య విమర్శ దృష్టిలో ఎలా కనబడతాయి? అదే విధంగా రాయలసీమ రచనలను కన్నడ విమర్శకులు ఎలా బేరీజు వేస్తారు? ఇక్కడి ఉద్యమాలకూ సాహిత్యానికి ఏదైనా సంబంధం ఉన్నదా? ఉంటే దాని లక్షణమేమిటి? ఇటువంటి ప్రశ్నలను గురించి వెంకట సుబ్బయ్యగారితో విపులంగా చర్చించే అవకాశం, ఆయన మరణం వల్ల ఇక మీదట ఉండదన్నదే చాలా బాధాకరమైన విషయం. అంతే కాకుండా రెండు భాషల సాహిత్య విమర్శకూ పెద్ద నష్టం కూడా.

జాతీయ స్థాయిలో అవార్డులందుకున్నా అవి వెంకటసుబ్బయ్యగారిలోని వినమ్రతను, సరళతను ప్రభావితం చేయలేదు. ఎప్పటిలాగే అందరితోనూ కలుపుగోలుగా స్నేహంతో ఉండేవారు. 'నా తర్వాత నాకు కాదు, నా రచనలకు, అభిప్రాయాలకు ప్రాముఖ్యతనివ్వండి' అనేవారు.

పద్యాలను చదివేటప్పుడు వాటిని అనుభవించి సుశ్రావ్యంగా చదివేశక్తిగల వెంకటసుబ్బయ్యగారు అల్లసాని పెద్దన దగ్గరినుంచి శ్రీశ్రీ వరకు ఉన్న ప్రముఖ కవుల పద్యాలను అలాగే ఒప్పజెప్పేవారు. 'నువ్వు ఈసారి వచ్చినప్పుడు నా కవితలను చదువుతాను' అని ఆయన అన్నమాట నిజంకాకపోవడానికి నా అలసత్వమే కారణం. ప్రస్తుతానికి ఆయన గళం విప్పి పాడిన శ్రీశ్రీ కవిత 'పోదాం, పోదాం పైపైకి' నా చెవుల్లో మార్మోగుతున్నది.

తెలుగు : ఎన్. రమేశ్

కన్నడ వార పత్రిక 'లంకేశ్' సౌజన్యంతో

“ మహా విమర్శా శిల్పి- వల్లంపాటి వెంకట సుబ్బయ్య”

☆ వృద్ధుల కళ్యాణరామారావు

వల్లంపాటి వెంకటసుబ్బయ్య సుప్రసిద్ధ మార్క్సిస్టు సాహిత్య విమర్శకులు. సాహిత్య సురభి సంస్థ విశాఖపట్నంలో ఓ రెండేళ్ళ క్రితం ఆయనతో ఓ ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించింది. ఆ సంస్థ కార్యనిర్వాహక సభ్యులలో ఈ వ్యాసకర్త మాత్రమే మార్క్సిస్ట్. మిగతా వాళ్ళలో కొందరికి మార్క్సిజం అంటే ఏ మాత్రం తెలీదు. కొందరికి తెలీకపోవడమే కాక ద్వేషం కూడా ఉన్నవాళ్ళు. ఈ సంస్థ సభలకు వచ్చేవాళ్ళలో ఎనభై శాతం సంప్రదాయ సాహిత్యాభిమానులు. వల్లంపాటి వారికి ఈ విషయం ముందుగా తెలియజేశాను. ఆ రోజున ఆయన ఓ పది నిముషాల ముందుగా తాను మాట్లాడుతానని తరువాత ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించమనీ చెప్పారు. ఆయన ప్రసంగంలో తన పాఠశాల గురువులు సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యుల గూర్చి, ఆయన ద్వారా తనకు కల్గిన సాంప్రదాయ సాహిత్య పరిచయం గూర్చి చెప్పారు. తరువాత ముఖాముఖీ కార్యక్రమం మొదలుపెట్టాము. రెండు గంటలు జరిగింది. చాలా మంది సాహితీ వేత్తలు సాహిత్య విమర్శ గురించి వివిధ ప్రశ్నలు వేశారు. వల్లంపాటి వారి నిబద్ధతకు భంగం కలుగకుండా, ప్రశ్నలు అడిగిన వాళ్ళని నొప్పించకుండా సమాధానాలు చెప్పారు. చాలా సంఘర్షణాత్మకంగా ఉంటుందనుకున్న కార్యక్రమం చాలా ప్రశాంతంగా జరిగింది. సనాతన సాంప్రదాయవాదుల్లో ఒక ఆలోచనను రేకెత్తించింది. పురాతన సాహిత్యాన్ని మార్క్సిస్టు దృష్టితో ఎలా బేరీజు వెయ్యడం, కథ, నవల మొదలయిన వాటిని మార్క్సిస్టు దృక్పథంతో ఎలా విమర్శించడం మొదలయిన విషయాలు చాలా చక్కగా వివరించారు. ముఖ్యంగా ఆయన వ్యక్తిత్వం చాలామందిని ఆకర్షించింది. ఆనాటి నుంచీ ఆయనతో అడపాదడపా ఫోనులో సంభాషిస్తూనే ఉన్నాను. ఇంతలోనే ఆయన కాలధర్మం. మంచి సాహిత్య విమర్శకు పెద్ద వెనుకడుగు.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు “సాహిత్య వ్యాసాలు” పుస్తక ప్రచురణ సందర్భంగా ఆయన గూర్చి వ్రాస్తూ ఇలా చెప్పారు ...

“మార్క్సిస్టు విమర్శకుల్లో సిద్ధాంతాలు చెప్పేవాళ్ళు ఎక్కువ. సిద్ధాంతాలను అన్వయించి సాహిత్య విమర్శ చేసే కొద్దిమందిలో వొకరు వల్లంపాటి. విమర్శకు కొంత సంస్కారం కావాలి. విమర్శ అన్నది గంభీరమైన సామాజిక బాధ్యత. విమర్శ నాజూకైన పువ్వులా కనిపించే నిశితమైన ఆయుధం. దాన్ని సున్నితంగా ఎలా వాడాలో తెలిసిన వ్యక్తి వల్లంపాటి. ... రచనను వదిలేసి రాజకీయాలు ప్రస్తావించే విమర్శకులకూ, రాజకీయ అంశాలు ఉండరాదనే అకడమిక్ విమర్శకులకూ మధ్యే మార్గం అవలంబించే వారు వల్లంపాటి వెంకట సుబ్బయ్య”.

పై వాక్యాలతో పూర్తిగా ఏకీభవిస్తూ, ఆయన రచించిన కొన్ని పుస్తకాలను స్థూలంగా ఈ వ్యాసంలో సమీక్షిస్తున్నాను.

1) నవలా శిల్పం - 1989 లో రచించిన పుస్తకం. ఇది ఆరు అధ్యాయాలుగా విభజించబడింది. ‘సాహిత్య ప్రక్రియగా నవల’, ‘నవల - ప్రధానాంగాలు’, ‘నవల - కథనం’, ‘నవల సాహిత్యంలో శైలి’, ‘నవలా సాహిత్యం - వర్గీకరణ’ మరియు ‘ఉపసంహారం’ ఇందులోని అధ్యాయాలు.

నవల పుట్టుక గూర్చి చెపుతూ, ‘సాహిత్య ప్రక్రియలు సమకాలీన సామాజిక పరిస్థితులలో నుంచి మాత్రమే ఉద్భవిస్తాయి. అందుచేత సాహిత్య ప్రక్రియల పుట్టుకనూ, పరిణామాన్నీ చారిత్రకంగా మాత్రమే అధ్యయనం చేయవలసి వుంటుంది’ అన్నారు. రాజరిక - జమీందారి భూస్వామ్య సంస్కృతిలో మహాకావ్యాలు పుట్టుకొస్తాయని, అందులోని పాత్రలన్నీ సమాజంలో ఒదిగిపోయిన వ్యక్తులని, అందులో ఘర్షణకు అవకాశం ఉండదని అన్నారు. అయితే తరువాత వచ్చిన పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామ్య భావన, వ్యక్తికి అంతకుముందు లేని గౌరవాన్ని, ప్రాధాన్యాన్ని తెచ్చిపెట్టింది. రాజాస్థానాల సాహిత్యంలోని అవాస్తవిక పలాయన తత్వం మీద వాస్తవికత చేసిన తిరుగుబాటు నవల. పాశ్చాత్య దేశాలలో సాహిత్యం అసహజత్వం నుండి సహజత్వం వైపుగా, రాజాస్థానాల నుండి సామాన్యుడి వైపుగా, పాండిత్య ప్రకర్షణ నుండి జీవిత చిత్రణ వైపుగా, ఛందోబంధాల నుండి తేటైన వచనం వైపుగా ప్రయాణం చేసింది. ఈ పరిణామాల సంపూర్ణ వికాసమే ఆంగ్ల సాహిత్యంలో మొదటి నవలా రచయితగా చాలామంది పేర్కొనే డేనియల్ డీఫో (1659-1731) నవలలు. నవలా చరిత్రలో ఒక భాగం. మానవ జీవిత పరిణామమే చారిత్రక ప్రస్థానం.

మానవ జీవితంలో వచ్చే మార్పులే చరిత్రలో దశలు. ఇలాంటి చారిత్రక పరిణామ క్రమం తెలుగు నవలా ప్రాదుర్భావంలో కనిపించడం కష్టం అంటారు వల్లంపాటి. ఆంగ్ల నవలను చూసేదాకా తెలుగు రచయితలు నవలలను రాయలేదు.

కవిత్వం మీద వచనం చేసిన తిరుగుబాటు నవల. తిరుగుబాటు ప్రధానంగా మౌలికంగా ఛందస్సు మీద. నవలలో వాస్తవిక భాష వాడతారు. వాస్తవిక జీవితం చిత్రించబడుతుంది.

ప్రతి మంచి నవలా రచయితకు స్పష్టమయిన సామాజిక తాత్విక విశ్వాసాలుంటాయని వల్లంపాటి అంటారు. అతని మాటల్లో చెప్పాలంటే :..

“ ఎలాంటి విశ్వాసాలు లేని నవలా రచయిత కంటే ఏదో ఒక విశ్వాసం ఉన్న నవలా రచయితే జీవితాన్ని మరింత లోతుగా చూడగలడు, జీవితం ఎలా ఉందని మాత్రమే కాక, అలా ఎందుకుందో కూడా చెప్పగలడని మనం గుర్తుంచుకోవడం మంచిది ... ఎలాంటి విశ్వాసాలు లేకపోవడానికి చాలా కారణాలున్నాయి. విశ్వాసాలను కలిగించే తత్వ శాస్త్రాలను గురించీ, సామాజిక, మనస్తత్వ సిద్ధాంతాలను గురించీ తెలియకపోవడం, తెలిసినా వాటిని నమ్మే సాహసం లేకపోవడం ఆ కారణాలలో ప్రధానమయినది. దేని మీదా విశ్వాసం లేకపోవడం వ్యాపార దృష్టికి సంకేతం కూడా”.

నవలల్లోని ప్రధానాంగాలైన కథ, కథా వస్తువు, పాత్రలు, నేపథ్యం గూర్చి విపులంగా చర్చించారు ఈ పుస్తకంలో.

‘తరువాత ఏం జరిగింది’ అనే ప్రశ్నకు సమాధానమే ‘కథ’. ఈ కథ ఏం చెపుతుంది అనే ప్రశ్నకు సమాధానం ‘కథా వస్తువు’. కథా వస్తువును భరించే వారు, కథను నడిపించేవారు పాత్రలు. ‘కథ’, ‘కథా వస్తువు’, ‘పాత్రలు’ మొక్కలైతే, ‘నేపథ్యం’ నేల వంటిది. నేపథ్యాన్ని వాతావరణం, లేక బ్యాక్‌గ్రౌండ్ అని కూడా పిలువవచ్చు. అనేక ప్రసిద్ధ రచయితల నవలలను ఉదహరించి వాటిలో వివిధ అంగాల గూర్చి విపులమైన చర్చ చేశారు ఈ పుస్తకంలో.

కథనం గూర్చి కూడ విపులమైన చర్చ ఉంది ఈ పుస్తకంలో. ‘కథను ఎవరు చెప్పాలి’ అన్న ప్రశ్న ప్రతి రచయితను తికమక పెడుతూ ఉంటుంది. దీన్నే దృష్టికోణం అంటారు. సర్వసాక్షి దృష్టి కోణం, ఉత్తమ పురుష దృష్టికోణం, ప్రథమ పురుష దృష్టి కోణం, నాటకీయ దృష్టి కోణం అని నాల్గు విభాగాలుగా ఈ అంశాన్ని వివరించి ప్రసిద్ధ నవలలను ఉదహరించారు.

కథాకథనం గూర్చి కూడ చర్చ ఉంది. ‘వాస్తవిక కథా కథనం’ (అంటే

మితిమీరిన అలంకారికత, నైరూప్యత, అసంభావ్యత, కాకతాళీయత, ప్రతీకలు లేని కథనం), 'ఫాంటసీ' (అవాస్తవికంగా ఉంటూనే వాస్తవికతను ఆవిష్కరించడం), అంతరార్థ కథనం (లివిగిరీ) మొదలైన కథన శిల్పాల గూర్చి సోదాహరణంగా చర్చించారు. ఇవేకాకుండా 'లేఖా కథనం', దినచర్య కథనం, చైతన్య ప్రవంతి కథనం ! న్యూస్ రీడ్ కథనం గూర్చి కూడా చర్చించారు.

'మెలో డ్రామా' (సంచలనాత్మక సాహిత్యం) 'కొసమెరుపు' లాంటి పద్ధతుల గూర్చి చెపుతూ అవి చవకబారు పద్ధతులని చెప్పారు. 'ఓ హెన్రీ' కథల గూర్చి చెపుతూ ఏ మాత్రం మంచి ప్రయోజనం లేని, పాఠకులని ఆశ్చర్యపరచటం మాత్రమే ప్రయోజనంగా గల కథలుగా వల్లంపాటి అభివర్ణించారు. 'కొసమెరుపు' వేరు, 'కొసమలుపు' వేరు అని చెపుతూ, 'కొసమలుపు' పాఠకుణ్ణి కొత్త ఆలోచనా మార్గంలోంచి మళ్ళించి, కథా వస్తు మీద కాంతిని ప్రసరింప చేస్తుందని అన్నారు. 'మపాసా' కథలు 'కొసమలుపు' ని కలిగి ఉంటాయి.

నవలా సాహిత్యంలో 'శైలి' ని గూర్చి కూడా విపులమైన చర్చ ఉంది పుస్తకంలో. అలాగే 'భాష' ను గూర్చి కూడా. విశ్వనాథ, రావిశాస్త్రి, కుటుంబరావు, బుచ్చిబాబు, శ్రీపాద, చలం మొదలైన రచయితల శైలి, భాషల గూర్చి సోదాహరణమైన చర్చ ఉంది.

నవలా సాహిత్యాన్ని వర్గీకరిస్తూ (1) సమాజ ప్రధానమైన నవల, (2) వ్యక్తి ప్రధానమయిన నవల, (3) తాత్విక నవల, (4) రాజకీయ నవల, (5) చారిత్రక నవల మొదలయిన వాటిని చర్చించారు.

నవల భవిష్యత్తు గూర్చి జోస్యం చెప్పడం మంచి పద్ధతి కాదంటూనే, అది భవిష్యత్ కాలం మీద ఆధారపడి ఉంటుందన్నారు. మన దేశంలో రాబోయే సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాల మీద ఆధారపడి మన నవల భవిష్యత్తు ఉంటుందన్నారు.

2) కథా శిల్పం - ఈ పుస్తకం 1995 లో వల్లంపాటి రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి కూడా 1999 లో దీనిని ప్రకటించారు. మంచి కథకు నాల్గు లక్షణాలు ఉండాలన్నారు. అవి (1) క్లుప్తత (గ్రావిటీ), (2) అనుభూతి ఐక్యత (యూనిటీ ఆఫ్ ఇంప్రెషన్), (3) సంఘర్షణ (కాన్ఫ్లిక్ట్) మరియు (4) నిర్మాణ సౌష్ఠవం (ప్లాట్)

నవల ఒక జీవితాన్ని చూపిస్తే, కథ ఒక జీవన శకలాన్ని చూపిస్తుందన్నారు. మంచి కథకులని ఉదహరిస్తూ వాళ్ళ లోపాల్ని, చాపల్యాలని కూడా ఎండగట్టారు.

కథాంగాలు, కథా కథనం గూర్చి 'నవలా శిల్పం' పుస్తకంలో లాగానే చర్చ చేస్తూ ప్రసిద్ధ కథకుల కథలను సోదాహరణంగా చూపించారు.

పాశ్చాత్య కథా పరిణామం, తెలుగు కథా పరిణామాన్ని కూడా చర్చించారు. ఈ పుస్తకం రాయడానికి ప్రోత్సాహం, సలహాలు ఇచ్చిన వారిలో కా.రా. మాస్టారు, వివి సమూర్తి, కవన శర్మ, వాసిరెడ్డి నవీన్ ఉన్నారని వల్లంపాటి ముందు మాటలో చెప్పారు. ఈ పుస్తకం నవలా శిల్పం కంటే హెచ్చు దుమారం లేపింది. తెలుగు నేలలో ముఖ్యంగా కథకులు హెచ్చు సంఖ్యలో ఉండటం, అందులో చాలా మంది మంచి ప్రమాణాలను పాటించకపోవడం ఈ పుస్తకం చూసిన తరువాత భుజాలు తడుముకోవడం దానికి ప్రధాన కారణం. కొన్ని కథలలో కథాశిల్పం లోపించడానికి ఉదాహరణలు ఇస్తూ ఆయన ప్రసిద్ధ కథకుల కథలనే ఎన్నుకొన్నాడు. కథలు రాసే వాళ్ళూ, చదివేవాళ్ళూ, విమర్శకులూ కూడ శ్రద్ధగా చదవవలసిన పుస్తకం ఇది. తెలుగులో కథానికల మీద వచ్చిన విమర్శా గ్రంథాలలో నాణ్యత దృష్ట్యా అత్యుత్తమ గ్రంథం ఇది.

3) విమర్శా శిల్పం - ఇది 2002 లో రాసిన పుస్తకం.

"సాహిత్య విమర్శా సిద్ధాంతాన్ని గురించి ఒక పుస్తకం రాయాలన్న కోరిక పదిహేను సంవత్సరాల తరువాత ఇప్పుడు తీరుతోంది. ఎంతో క్లిష్టమయిన విషయాన్ని గూర్చి ఇది ప్రాథమిక గ్రంథం మాత్రమే అని నాకు తెలుసు. నా అధ్యయనమూ, ఆలోచన ఈ గ్రంథాన్ని దాటివెళ్ళలేక పోయాయి. దీన్ని దాటివెళ్ళడం ఇతరుల బాధ్యత!" అని మొదటే విన్నవించుకొన్నారు వల్లంపాటి. అయితే పుస్తకం చదివితే అది కేవలం అతని అహంకార రాహిత్యాన్ని, మర్యాదను మాత్రమే సూచిస్తుందనిపిస్తుంది. ఈ పుస్తకం అచ్చులో కేవలం 128 పేజీలు మాత్రమే. కాని నాణ్యత దృష్ట్యా అతను చివర ఉదహరించిన చాల గ్రంథాల కంటే ఎంతో ఉన్నతమైందనిపిస్తుంది.

పుస్తకంలో ఐదు అధ్యాయాలున్నాయి. 1) జీవితం - సాహిత్యం - సాహిత్య విమర్శ, 2) సాహిత్య విమర్శ - విభిన్న ధోరణులు, 3) భారతీయ సాహిత్య మీమాంస - కొన్ని మౌళిక భావనలు, 4) పాశ్చాత్య సాహిత్య మీమాంస - కొన్ని మౌలిక భావనలు, మరియు 5) అత్యాధునిక సాహిత్య విమర్శ - సమన్వయ మార్గం .... అనేవి ఆ అయిదు అధ్యాయాలు.

జీవితంలోంచి సాహిత్యం పుడుతుంది. సాహిత్యం లోంచి సాహిత్య విమర్శ పుడుతుంది. కాబట్టి సాహిత్య విమర్శ జీవితంలోంచే పుట్టిన సాహిత్యంలోంచే పుట్టిన అంశం అంటారు వల్లంపాటి. సాధారణంగా సాహిత్య విమర్శ సాహిత్యాన్ని, సాహిత్యం జీవితాన్నీ ప్రభావితం చేసుకుంటాయి. అయితే ఒక్కొక్కసారి, అరుదుగా, సాహిత్య విమర్శ ప్రభావం సరాసరి జీవితం మీద పడుతుంది. మార్క్స్, ఎంగెల్స్, రూసో, వాల్టేర్ మొదలైన సామాజిక తత్త్వవేత్తలు రాసిన సాహిత్య విమర్శ ప్రభావం ఆనాటి జీవితం మీద ఎలాంటి ప్రభావాన్ని చూపించిందో కొంతమంది వేధావులు సోదాహరణంగా చూపించారు.

విమర్శకుడికి సామాజిక శాస్త్ర, మనస్తత్వ శాస్త్ర సిద్ధాంత పరిజ్ఞానం ఉండాలి. అలాగే భారతీయ వేదాంతం, మార్క్సిజం, అస్తిత్వ వాదం, ఫ్రాయిడ్, అడ్లర్, యూంగ్‌ల మనస్తత్వ శాస్త్ర సిద్ధాంతాలు, స్త్రీ వాదం, దళిత వాదం మొదలయిన వాటి పరిజ్ఞానం కూడ సాహిత్య విమర్శకు అవసరం అని వల్లంపాటి అంటారు.

ఈ పుస్తకంలో చర్చించిన విషయ బాహుళ్యం చూస్తే వల్లంపాటి విషయ పరిజ్ఞానం, పరిశీలనా శక్తి ఎంతటిదో మనకు అర్థం అవుతుంది. ఆశ్చర్యపరుస్తుంది. ముఖ్యంగా భారతీయ సాహిత్య మీమాంస గూర్చి ఒక సంప్రదాయ పండితుని కంటే హెచ్చు పరిచయం ఉన్నట్లు అనిపిస్తుంది. విశ్వ విద్యాలయ స్థాయిలో సాహిత్య విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా ఉండవలసిన పుస్తకం ఇది.

సాహిత్య వ్యాసాలు : ఈ పుస్తకం 1997 లో ప్రచురించబడింది. 'భారతి', 'అభ్యుదయ', 'అరుణతార', 'ప్రజా సాహితి', 'రజత రంజని', 'వేకువ', 'ఆహ్వానం', 'రచన, 'సాహిత్య నేత్రం' ... మొదలైన పత్రికలలోని వల్లంపాటి వ్యాసాలు ఇందులో ముద్రితాలు. మొత్తం 16 వ్యాసాలు. సాహిత్య విమర్శ గూర్చి 5 వ్యాసాలు, రాయలసీమ సాహిత్య సామాజిక, ఆర్థిక విశ్లేషణ గూర్చి ఒక వ్యాసం, తెలుగు కథ మరియు తెలుగు నవలల గూర్చి రెండు వ్యాసాలు కూడా ఉన్నాయి. విశ్వనాథ 'వేయి పడగలు' గూర్చి, కుటుంబరావు కథల గూర్చి, రావిశాస్త్రి నవలల గూర్చి, కారా కథల గూర్చి, బీనాదేవి కథల గూర్చి ప్రత్యేక వ్యాసాలున్నాయి. ప్రతీ వ్యాసం ఆలోచింపజేసేదిగా ఉంది.

మొత్తం మీద వల్లంపాటిని తెలుగు సాహిత్య విమర్శకులలో అత్యంత నిబద్ధత కలిగిన విమర్శకుడుగా చెప్పుకోవచ్చు. 'నేనెందుకు రాస్తున్నాను' అనే ప్రశ్న ప్రతీ రచయిత వేసుకోవాలి అన్న రావిశాస్త్రి సిద్ధాంతాన్ని వల్లంపాటి పూర్తిగా సమర్థిస్తారు. మార్క్సిస్టు విమర్శకులలో అత్యంత సంయమనం కల్గిన మహానుభావుడు. ఆయన లేని లోటు ఎప్పుడు పూరించలేనిది.

*

వల్లంపాటి గారంటే యెవరు ?

☆ మధురాంతకం నరేంద్ర

దాదాపు నలభై సంవత్సరాల క్రితం జరిగిన సంగతి. మా స్వంత వూరు దామల్ చెరువు అనే గ్రామంలో వోనాటి రాత్రి యేడు గంటల సమయం. వరండాలో వాలుకుర్చీలో కూర్చున్న వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారు పుట్టపర్తి నారాయణాచార్యుల వారి 'శివతాండవం' రాగయుక్తంగా చదువుతున్నారు. పక్కన బెంచీ పైన గోడకు ఆనుకుని కూర్చున్న మా నాన్నగారు మధురాంతకం రాజారాం గారు వింటూ తలాడిస్తున్నారు. అప్పటికే యేడెనిమిదేళ్ళ వయస్సున్న పిల్లలమైన మేము హాల్లో కూర్చుని, అర్థంగాకపోయినా 'శివతాండవం' లోని నాదలయకు వివశులమై వింటున్నాం. వున్నట్టుండి కరెంటు పోయింది. వూరంతా చీకటి కమ్ముకొంది. సన్నగా పొడుగ్గా వుండే మా యింటి కాచివరలో, వంటగదిలో పని చేసుకుంటూ వున్న మా అమ్మ, కరెంటు పోయాక గూడా, చీకటిలో సైతం ఆగకుండా వెలువడుతున్న 'శివతాండవాన్ని' విని, ఆశ్చర్యపడుతూ వరండాలోకొచ్చి, "చీకట్లో యెలా చదువుతున్నారన్నా?' అంటూ వల్లంపాటి గారిని ప్రశ్నించింది. "యీ పుస్తకమంతా నాకు నోటికొచ్చు. నేను రాక్షసుణ్ణమ్మా!" అన్నారాయన. వల్లంపాటి గారిని తలచుకున్నప్పుడల్లా నాకు జ్ఞాపకమొచ్చే తొలి విషయం అది.

చిత్తూరు జిల్లాలో వుత్తరం వైపున విసిరేసిట్టుండే రొంపిచెర్ల అనే గ్రామంలో పుట్టిన వల్లంపాటి గారు, చిన్నతనం నుంచీ యెప్పుడూ సులభంగా సాధ్యపడే విషయాలపైన ఆసక్తి చూపెట్టే వారు కారు. పని యెంత కష్టతరమైతే ఆయనకంత యిష్టం. యెంతో రాక్షస సాధన చేసిన తరువాత గానీ పట్టుబడని అంశాలంటేనే ఆయనకు మక్కువ. యెలిమెంటరీ స్కూల్లో సెకండరీ గ్రేడు అధ్యాపకుడిగా వృత్తిని ప్రారంభించిన ఆయన ముందుగా జిల్లా కేంద్రమైన చిత్తూరును చేరారు. మొదట ఆయన నటుడిగా తన కళాజీవితాన్ని ప్రారంభించారు. యేదో నాటకం రిహార్సల్‌లో ఆయన అభినయాన్నీ, వుచ్చారణనూ గమనించిన మా నాన్నగారు, ఆయనను పక్కకు తీసుకెళ్ళి సాహిత్యరచనను చేపట్టవలసినదని సలహాయివ్వడాన్ని ఆయన యెప్పుడూ జ్ఞాపకం చేసుకుంటూ వుండేవారు.

1967 లో తాను రాసిన 'చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర' అనే చిన్న పుస్తకంలో మా నాన్న గారు యిలా రాశారు: "చిత్తూరు జిల్లాలో పోతుగడ్డగా పేరుపడిన వాయిల్పాడు తాలూకా రొంపిచెర్ల నుంచీ వచ్చిన రచయిత వల్లంపాటి వెంకటసుబ్బయ్య. కొత్తనీటికి చేప యెగబడినంత సహజంగా అతడు సాహిత్య ప్రపంచంలోకి సాగివచ్చాడు. ప్రాచీనమా? ఆధునికమా? పద్యమా? గద్యమా? ఆంధ్రమా? ఆంగ్లమా? అన్న మీమాంసకు తావులేకుండా రసవంతంగా కనిపించిన ప్రతి పద్యాన్నీ, ప్రతి వాక్యాన్నీ తన స్మృతుల భోషాణంలో పదిలపరచుకున్నాడు. మనిషిలో మనుషుల్లాగా, వెంకటసుబ్బయ్యలో పాఠకుడు, కథకుడు, నవలాకారుడు, సాహిత్య విమర్శకుడు పోటీలు వేసుకుని పెరగసాగారు. అతనిలోని పాఠకుడు వృకోదరుడు. అతనిలోని నవలాకారుడు పరిశీలనా చక్షువు. అతనిలోని సాహిత్య విమర్శకుడు అత్యంత నిష్ఠురవాది. సాహిత్యమే ఆరో ప్రాణంగా బతికిన వ్యక్తిని రెండు మూడు మాసాల యేకాంతవాసం తరువాత యేదైనా వరం కోరుకొమ్మంటే, వెంకటసుబ్బయ్యతో వొకరోజు గడపాలని కోరుకుంటాడు. కనిపించిన క్షణం నుంచీ, సాగనంపేదాకా అచ్చంగా సాహిత్యం గురించి మాట్లాడడం వెంకటసుబ్బయ్య ప్రత్యేకత. వెంకటసుబ్బయ్య కాలంలో ముప్పాతికవంతు ఆయన వుద్యోగ కార్యకలాపాలకే సరిపోయింది. మిగిలిన పాతిక వంతులో మళ్ళీ ముప్పాతిక వంతు సాహిత్యాధ్యయనంలో గడచిపోయింది. యింకా మిగిలిన కొద్దిపాటి కాలంలో ఆయన రాయగలిగింది చాలా తక్కువ... అయితే యేండ్లకూ, పూండ్లకూ అయినా గొప్ప రచన వొకటి చేయగలిగితే చాలులెమ్మన్నది వెంకటసుబ్బయ్య లాంటి రచయితల ఆశయం".

యెప్పుడో నలభై సంవత్సరాల క్రితం, తాను తన ముప్పయ్యేళ్ళ వయస్సులో యెలా వుండేవారో, వల్లంపాటి గారు చివరి వరకూ అలాగే వున్నారు. మొదట్లో నవలలు రాయడం ప్రారంభించగానే ఆయన నవలలకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పోటీల్లో బహుమతులొచ్చాయి. కానీ ఆయన నవలలు రాయడం మానేసి కథలు రాయసాగారు. యింతలో ఆయన ఆసక్తి చదువులపైకి మర్లింది. ఆంగ్ల సాహిత్యంలో ప్రయివేటుగా యెమ్మే చేశాక యెఫ్.ఐ.పీ ప్రోగ్రాం కింద ఆయన సెంటర్ ఫర్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ (సీఫెల్, హైదరాబాదు) వెళ్ళి లింగ్విస్టిక్స్‌లో యెమ్.లిట్. చేశారు. ఆయన సాహితీ జీవితం పైన సీఫెల్ చాలా ప్రభావాన్ని చూపెట్టింది. అప్పట్లో తనతో బాటూ చదువుకున్న రెడ్డి శాస్త్రి గారి లాంటి మిత్రుల్నీ, మీనాక్షీ ముఖర్జీ, రాజీవ్ తారానాథ్‌ల వంటి అధ్యాపకులనూ ఆయన యెప్పుడూ ఆనందంగా గుర్తు చేసుకుంటుండే వారు.

అప్పట్లో వల్లంపాటి గారి పరిశోధనకు పర్యవేక్షకుడిగా వుండిన రాజీవ్ తారానాథ్ టి.యస్.యిలియట్ పైన మౌలికమైన పరిశోధన చేసిన వ్యక్తి. ఆయన గొప్ప సరోద్ విద్వాంసుడు కూడా! వొకనాటి అర్థరాత్రి ఆయన తన చుట్టూ చేరిన కొందరు విద్యార్థి మిత్రుల కోసం రెండు మూడు గంటలు సంగీతం వినిపించాడట! గానం ముగియగానే ఆయనకు చెప్పలేనంత ఆకలి వేసిందట. ఆ వేళప్పుడు హోటళ్ళెక్కడ వుంటాయి? సీఫెల్ నుంచీ తార్నాకా వెళ్ళి, యెవడో హోటలు వాణ్ణి బతిమాలి, షట్టరు తీయించి, దొరికిన ఆహారాన్ని కడుపునిండా దట్టించాడట ఆయన. యీ వుదంతాన్ని చెబుతున్నప్పుడల్లా వల్లంపాటి గారు తన్మయులై పోయేవారు. యే పని చేసినా దానిలో పూర్తిగా యిష్టమూ, ధ్యాసా, పాషన్ (Passion) వుండాలనే వారు ఆయన. "నన్ను కవిని గాదంటే నేనంతగా బాధపడను. అయితే పండితుణ్ణి గాదని అంటే మాత్రం నా ప్రాణం ఫిలవిలలాడిపోతుంది" అని చెబుతూ, యేదోవొక భాషనో, కొత్త పుస్తకాన్నో ముందు పెట్టుకుని దాన్ని ఆమూలాగ్రంగా మథించే పుట్టపర్తి వారి పట్టుదలను వల్లంపాటి గారు యెప్పుడూ జ్ఞాపకం చేసుకుని స్ఫూర్తిని పొందేవారు.

మనుషుల్ని ప్రేమించడంలోనూ ఆయనకు అటువంటి తదేక నిష్ఠ వుండేది. ఆయన బహుకుటుంబీకుడు. ఆయనకు తన తండ్రంటే యెంతో గౌరవం. చిన్నతనంలోనే సంసారపు కాడిని తన భుజాల పైకెత్తుకున్న వాడాయన. తమ్ముళ్ళకూ, చెల్లెళ్ళకు చదువులు చెప్పించి, పెళ్ళిళ్ళు చేశాడు. తన బాధ్యతలన్నింటినీ చిరునవ్వుతో పంచుకున్న భార్య పద్మగారి పట్ల ఆయనకెంతో గౌరవం. తన కొడుకు ప్రసాద్ గణిత శాస్త్రంలో అభిరుచిని పెంచుకోవడం ఆయనకెంతో యిష్టమైన విషయం. యెక్కడో జైపూర్‌లో వుండే పెద్దమ్మాయి దగ్గరికి తరచుగా వెళ్ళి వస్తుండేవారు. చిన్నమ్మాయి వుండే బెంగుళూరు నగరాన్ని తన రెండవ స్వగ్రామంగా భావించేవారు. కౌటుంబికమైన బాధ్యతలు కొన్ని తగ్గి వుంటే ఆయన యింకా యెంతో సాహిత్య సృజన జేసి వుండే వారు గదా అనిపిస్తుంది. ఆ మాట అంటే ఆయన మాత్రం "కుటుంబం ప్రాథమిక సమాజం. సామాజిక బాధ్యతలను నిర్వహించడం కూడా ముఖ్యమే గదా!" అనేవారు.

తొలినాళ్ళలో సంప్రదాయ సాహిత్యాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేసిన వల్లంపాటి గారికి కొన్ని వందల పద్యాలు నోటికొచ్చు. వివిధ కవులు వివిధ రకాలుగా పద్యాలు యెలా చదువుతారో నటించి చూపెట్టేవారు. ఆ రోజుల్లో ఆయన 'శివతాండవం' తో బాటు విద్వాన్ విశ్వం "పెన్నేటి పాట", విశ్వనాథ "ఋతుసంహారం" కావ్యాలను యెక్కువగా చదివేవారు. నవలలూ, కథలూ రాసిన తొలిదశకూ, విమర్శకుడిగా యెదిగిన మలిదశకూ మధ్య ఆయన చదువూ, వుద్యోగమూ దాదాపు పది సంవత్సరాల వ్యవధిని తెచ్చాయి.

వివిధ రచయితల పైన విమర్శనాత్మక వ్యాసాల్ని రాయడంతో ఆయనలోని విమర్శకుడు క్రమంగా బయటికొచ్చాడు. పొగడ్త, లేకపోతే తెగడ్త

మాత్రమే విమర్శగా పరిగణించబడే రోజుల్లో ఆయన గొప్ప డిటాచ్‌మెంట్‌తో వ్యాసాలు రాశారు. తనకెంతో యిష్టమైన రావిశాస్త్రి రచనల గురించి రాస్తున్నప్పుడు గూడా, ఆయనకు ప్రతీకల పైన వుండే వ్యామోహం, ప్లాట్ (Plot) కు యెలా అడ్డంకిగా అవుతూందో చూపెడతారాయన.

తన సాహితీ జీవితం వామపక్ష భావజాలం వైపుకు మొగ్గడానికి సి.కె. నారాయణ రెడ్డి గారి ప్రభావమే కారణమని ఆయన చెప్పేవారు. గార్డన్ చైల్డ్ "చరిత్ర అంటే ఏమిటి?", కార్ "చరిత్రలో యేం జరిగింది? పుస్తకాలను సికె గారే వల్లంపాటి గారి చేత అనువదింపజేసి ప్రచురించారు. తరువాత రాల్ఫ్ ఫాక్స్ "నవల-ప్రజలు", తస్లిమా నస్రీన్ "లజ్జ"లను అనువదించారు. ముందుగా ఆయన "నవలాశిల్పం" వెలువరించారు. 1990 ప్రాంతంలో ఆయన "కథాంగాలు" అనే చిన్న వ్యాసం రాశారు. తరువాత దాన్ని విస్తృతీకరించి "కథాశిల్పం" రాశారు. ఆ పుస్తకానికే ఆయనకు 1999లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. తెలుగు సాహిత్య విమర్శను గూడా అదేరీతిలో పరిచయం చేయడం కోసం రెండు మూడేళ్ళు పరిశ్రమించి "విమర్శాశిల్పం" రాశారు. ఆ పుస్తకాన్ని గూడా విశాలాంధ్ర ప్రచురణాలయమే ప్రచురించింది. అయితే ఆ పుస్తకాన్ని తెలుగు పాఠకులూ, విమర్శకులూ సక్రమంగా చదివి స్పందించలేదని ఆయన బాధపడేవారు.

మదనపల్లెకు యెప్పుడు వెళ్ళి వచ్చినా మా నాన్నగారు ఆ వూళ్లో కంచిలో వున్నట్టుగా రెండు మదనపల్లెలు (శివకంచి, విష్ణుకంచి లాగా) వున్నాయని అనేవారు. ప్రముఖ సాహితీ విమర్శకులు ఆర్.ఎస్. సుదర్శనం గారు గూడా అక్కడే వుండేవారు. విష్ణుకంచిలోని విష్ణువులా సుదర్శనం గారు భక్తవత్సలుడే అయినా భక్త సులభుడు గాడు. అయితే వల్లంపాటి గారు భోళాశంకరుడి లాంటి వ్యక్తి. ఆ వూరికి అప్పుడు వెళ్ళే సాహితీ ప్రియులందరూ వాళ్ళిద్దరినీ కలవడం ముఖ్యమైన పనిగా భావించేవారు. దృక్పథంలో సామ్యం లేకపోయినా సుదర్శనం గారంటే వల్లంపాటి గారికి యెంతో గౌరవముండేది. తనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించిన రోజున యాదృచ్ఛికంగా యేదో సమావేశంలో పాల్గొనడం కోసం తిరుపతికొచ్చిన వల్లంపాటి గారిని వొక విలేఖరి మామూందే యింటర్వ్యూ చేశాడు. "యింకా యీ బహుమతిని అందుకోవడానికి అర్హత వున్న వ్యక్తులు - ముఖ్యంగా విమర్శనా రంగంలో - యెవరైనా వున్నారా?" అని అతడు అడిగాడు. "యెందుకు లేరు? మా వూళ్ళోనే సుదర్శనం గారున్నారు గదా!" అన్నారు ఆయన. సుదర్శనం గారు తన తొలినాళ్ళలో రాసిన "సాహిత్యంలో దృక్పథాలు" అన్న విమర్శనా గ్రంథం చాలా మౌళికమైనదని వల్లంపాటి గారు చెప్పేవారు.

ప్రపంచ సాహిత్యంలో యేం జరిగినా దాని ప్రతిఫలనం మదనపల్లెలో కనిపించేది. యేదైనా విశేషం జరిగినప్పుడల్లా, ఆ విషయాన్ని గురించి కనీసం ఫోనులోనైనా చర్చించే వీలుండేది. యెప్పుడైనా రెండు మూడు నెలలు కనిపించకపోతే, ఆయనే మిత్రులను వెతుక్కుంటూ వెళ్ళేవారు. కలిసినప్పుడల్లా కొత్త పుస్తకాలను గురించిన వివరాలే మాటాడేవారు. యెదుటివాళ్ళు బాగుందన్న పుస్తకాన్నల్లా సంపాదించి చదివేవారు. తాను చదివిన మంచి పుస్తకాన్నల్లా, చదువుతాడని నమ్మకమున్న వ్యక్తికి యిచ్చి, బలవంతంగానైనా చదవమని చెప్పేవారు. ఆయన ఆధునికులలో ఆధునికుడు. సమకాలీన సాహితీ సిద్ధాంతాలనంతా జాగ్రత్తగా చదివిన వాడు. వొక కొట్టు గూడా లేకుండా ఆయన రాతప్రతి అచ్చు పుస్తకమంత అందంగా వుండేది. యేదైనా వుపన్యాసం యివ్వవలసి వస్తే ఆయన శ్రద్ధగా ప్రిపేరయి, కాగితాల్లో నోట్సు రాసుకొచ్చేవారు. సాహిత్యాన్ని ప్రభావితం చేసే సాంఘిక శాస్త్రాల అధ్యయనమంటే ఆయనకెంతో యిష్టం. శారీరక దారుఢ్యాన్ని పెంచే ఆటలంటే గూడా ఆయనకిష్టం. యువకుడిగా వున్నప్పుడు హాకీ ఆడేవారట! టీవీలో క్రికెట్ మ్యాచ్‌లు చూడ్డం గూడా ఆయనకిష్టమే ! అయితే యే విషయంలో గానీ "అవుట్‌సైడ్ ది ఆఫ్ స్టంప్" ఆడ్డం మాత్రం ఆయనకు నచ్చేది గాదు.

ఆలోచనా జీవిగా వల్లంపాటి గారు గిరిగీసుకొని కూర్చున్న వ్యక్తి గాడు. ఆయన మనస్సు కిటికీలు యెప్పుడూ తెరుచుకునే వుండేవి. అందుకే ఆయన మనస్సు యెప్పుడూ శుభ్రంగా, చురుగ్గా వుండేది. చివరి రోజుల్లో ఆయన శరీరానికి అనారోగ్యం వచ్చినా, ఆయన మానసికారోగ్యం మాత్రం చెక్కు చెదరలేదు.

డిసెంబరు నెల 23 వ తేదీ, శనివారం, అనారోగ్యంతో వున్న వల్లంపాటి గారిని మిత్రులతో బాటు కలవడానికి వెళ్ళినప్పుడు ఆయన చాలా బలహీనంగా కనిపించారు. అయినా పడుకునే రెండుగంటల సేపు సాహిత్యం గురించే మాట్లాడారు. 1975 తరువాత తెలుగుకథ వస్తురీత్యా తప్పితే, శిల్పమూ శైలుల రంగంలో పెద్దగా సాధించిందేమీ లేదని బాధపడ్డారు. "మీ కథాశిల్పమూ, నవలా శిల్పమూ, విమర్శా శిల్పమూ పూరీ జగన్నాథుడి ఆలయంలోని విగ్రహాల్లా అసంపూర్తిగా వుంటాయి. సాకల్యంగా చెప్పడానికి ప్రారంభించి, సగం దూరం వచ్చాక, యీ తెలుగు వాళ్ళకింత చాల్లే అనుకుని మానేసినట్టుగా అనిపిస్తుంది" అంటే "నిజమే! అలాగే అనుకున్నాను" అంటూ నవ్వేశారు. మీ "రాయలసీమలో ఆధునిక సాహిత్యం - సాహిత్య సామాజిక విశ్లేషణ" మాత్రం పరిపూర్ణంగా కనిపిస్తోంది. అయితే మీరింకా మీ మాగ్నంవోపస్ బాకీ వున్నారు. త్వరగా కోలుకుని బాకీ తీర్చండి" అంటూంటే ఆయన కళ్ళల్లోకి పెద్ద వెలుతురు వచ్చింది. "తప్పకుండా ... యీసారి కలిసినప్పుడు ఆ సంగతే చర్చిద్దాం" అన్నారాయన.

యింతలో కాలసముద్రుడు మరో గొప్ప నావను ముంచేసాడు. వల్లంపాటి గారు తన మాగ్నంవోపస్ రాసి బాకీ తీర్చలేకపోయారు. తిరిగొస్తున్నప్పుడు ఆయన నన్ను వెంటనే కొరియర్‌లో పంపమని ఆదేశించిన సదాశివ గారి 'యాది', 'సరగీత శిఖరాలు' నా టేబుల్ పైన్నే దయనీయంగా కనబడుతున్నాయి. వల్లంపాటి వారు యెంతో ఆదరంతో నాకిచ్చిన యెడ్వర్డ్ సయీద్ యింటర్వ్యూల పుస్తకమూ, డిహెచ్ లారెన్స్, వర్జీనియా వుల్ఫ్ జీవిత కథలూ, గ్రాహం గ్రీన్ 'ది హార్ట్ ఆఫ్ ది మాటర్" యింకా చదవలేదేమని నన్ను ప్రశ్నిస్తూనే వున్నాయి. కొందరు లేని ప్రపంచం యెప్పుడూ వెలవెలబోతూనే వుంటుంది. మరణించాక మనుషులేమవుతారో యెవరికీ తెలియదు. అయితే మరణించిన తర్వాత మన ఆప్తులు కొందరు, యెక్కడో మనకు తెలియని లోకాల్లో, తాఫీగా కూర్చుని, తమకిష్టం వచ్చిన విషయాలను గురించి మాట్లాడుకుంటూ వుంటారేమోనన్న వూహ మాత్రమే యిప్పుడు వూరట కలిగిస్తోంది.

*

స్వీకారం

తెలుగు కథకి జేజే!
సంకలనం : నాగరాజు, వెల : 300/-
అభినవ ప్రచురణలు
5-1-70, వరదరాజనగర్, తిరుపతి.

ది గిఫ్ట్ పాకెట్ (ఇంగ్లీషు నవల)
జయంతి పాపారావు, వెల : 200/-
39-7-41/3, మురళినగర్, విశాఖపట్నం - 7.

ఆధునిక భేతాళ కథలు
రావు కృష్ణారావు వెల : 20/-
అన్ని పుస్తకాల షాపుల్లో దొరుకుతుంది.

పెత్తనం
మల్లీశ్వరి కథలు, వెల : 40/-
స్నిగ్ధబుక్స్, మురళీనగర్, విశాఖపట్నం.

మహా ధిక్కార స్వరాలు
కట్టా భగవంతరెడ్డి కవిత్వం, వెల : 30/-
6/3-558, రామగిరి, నల్లగొండ.

నేనెరిగిన వెంకటసుబ్బయ్య

☆ ఎ.వి.రెడ్డి శాస్త్రి

CIEFL లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా చెయ్యడానికి 1977 లో నాకు అవకాశం వచ్చింది. అక్కడే నాకు వెంకట సుబ్బయ్యతో పరిచయం. అతను కూడా మదనపల్లె బీసెంట్ థియొసాఫికల్ కాలేజి నుంచి డిప్లమా చేయడానికి డెప్యుటేషన్ మీద వచ్చేరు. అప్పట్లో CIEFL ఎందరో మేధావుల సంగమ ప్రదేశంలా వుండేది. మహారాష్ట్ర నుంచి మిళింద్ మాల్షే అనే సంగీత విద్వాంసుడు, తమిళనాడు నుంచి విజయ క్రిష్ణన్ అని మరో వీణా విద్వాంసుడు, ఆలీ అక్బర్ ఖాన్ అనుంగు శిష్యుడు రాజీవ్ తారానాథ్ ('వంశవృక్ష' లాంటి సినిమాలకి సంగీతం సమకూర్చినవాడు). కె.పి. మోహనన్ (తదుపరి కాలంలో డాక్టరేట్ చేస్తూనే, నోమ్‌ఛామ్‌స్కీ Syntactic Structure సిద్ధాంతానికి మార్పులు, చేర్పులు సూచించిన మేధావి), ప్రొఫెసర్ ఎస్.వి. ప్రధాన్ (కెనడాలో డాక్టరేటు తీసుకున్న గొప్ప సాహితీ విశ్లేషకుడు), ఢిల్లీ మేధావి సోమనాథ్, ఇప్పుడు స్త్రీవాద విశ్లేషకులైన సుశీతారు, వసంత కన్నబిరాన్, కేరళ నుంచి వచ్చిన చాకు లాంటి అమ్మాయి షీలా బాస్టియన్, ప్రొఫెసర్ బాలా (ఫొనెటిక్స్‌లో నిష్ణాతుడు, విద్యార్థులంటే ప్రాణం పెట్టే ఆత్మీయత), రాస్నా బాట్లీవాలా (అమెరికాలో డాక్టరేట్ చేసి వచ్చింది. ఎంత మంచి వ్యక్తో వర్ణించనలవి కాదు. మోనాలిసా లాగ వుండేది), ప్రమోద్ మీనన్, మోహనరాజ్, ప్రొఫెసర్ శశికుమార్, ప్రొఫెసర్ హెచ్.ఎన్.ఎల్. శాస్త్రి (మూర్తీభవించిన వాత్సల్య స్వరూపం), ప్రొఫెసర్ బి.కె.దాస్, ఢిల్లీ మేధావి సోమనాథ్, గోవింద నిహలానీ కజిన్ పారూ నిహలానీ లాంటి ఎందరెందరో మేధావులు వుండేవారప్పుడు. ప్రతిరోజూ సాహిత్య, భాషా విషయాల్లో ఎన్నో సంచలనాత్మకమైన చర్చలూ, వాదోపవాదాలు. 'సీఫెల్‌కి పోటీగా మేమున్నాం' అని ఉస్మానియా నుంచి ప్రొఫెసర్ రాధేశ్యామ్, ప్రొ॥ ఇజాక్ సెక్యీరా, ప్రొ॥ వెంకటాచారి, ఆంగ్ల సాహిత్య భీష్మ పితామహుడి లాగా ప్రొ॥ శివ్ కె కుమార్ - ఇలా ఎంత మంది మేధావులనీ! వీరందరితోనీ వెంకట సుబ్బయ్యకి సాన్నిహిత్యం. వెంకట సుబ్బయ్యంటే వారందరికీ గౌరవం. ఆంగ్ల సాహిత్య మథనం చేసిన మేధావుల ప్రభావం వెంకటసుబ్బయ్యని విమర్శకుడిగా తీర్చిదిద్దిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆయన జీవితంలో అధ్యయనం చేసిన మిగిలిన సాహిత్యమంతా ఒక ఎత్తు అయితే, ఆయన సీఫెల్‌లో గడిపిన రెండు సంవత్సరాల్లోని చదివిన, నేర్చిన, సముపార్జించిన జ్ఞానమే ఎక్కువ. ఆయన్ని సాహిత్య విమర్శ వేపుకి మళ్ళించిన ఘనత సీఫెల్‌దే.

ఉస్మానియా యూనివర్శిటీ కేంపస్‌లోనే, సీతాఫల్‌మండి స్టేషన్‌కి దగ్గర్లో వుంది సీఫెల్. సికింద్రాబాదులో గోదావరి ఎక్స్‌ప్రెస్ దిగి ఉదయాన్నే సీఫెల్ కేంపస్ చేరుకున్నాను. మీరు ఫలానా రూంలో వుండండి అని సూపరింటెండెంట్ గౌడ్ చెప్పేడు. రూం బాయ్ దశరథ్ నా సామాను అందుకుని రూంకి దారితీసేడు. రమాకాంత్ సాహు, మరో ఢిల్లీ స్కాలర్‌తో పాటు నేను ఆ రూంలో వుండడం. పలు భాషలు మాట్లాడే పలు ప్రాంతాల వాళ్ళు - మనవాళ్ళు లేరే అనే ఫీలింగుతో ఉక్కపోస్తున్నట్టుండేది. క్రమేపీ పరిచయాలు పెరిగాయి. తెలుగువాళ్ళం ఆరుగురిమి తేలాం. ఒకనాఢు వుదయం ఫలహారం టేబుల్ దగ్గర వెంకట సుబ్బయ్య గారు పరిచయమయ్యారు. ఇద్దరం విడదీయరాని జంటలా కలిసిపోయాం. ఇంతలో మరొక సహధ్యాయి తారసపడ్డాడు - విశాఖపట్నం వాడు, యం. అప్పారావు అని. చాలా తెలివైనవాడు, చురుకైన వాడూను. అప్పారావుని వెంకట సుబ్బయ్య ఆరాధించేవారు. జీవితాన్ని హాయిగా అనుభవించాలనే తత్వం అప్పారావుది. మా ఇద్దరికి సంరక్షకుడిగా వుండేవాడు.

వెంకటసుబ్బయ్య చెప్పుకొచ్చేరు - తను రాయలసీమ వాడిననీ, కథలూ అవీ రాస్తుంటానని, అవి చాలా మట్టుకు అచ్చు అయాయనీను. పొంగిపోయేను ఆ మాట విని. తన కథా సంకలనం ఇచ్చేడు. చదివేను. ఐడియలిజం, వీరారాధన కనిపించేయన్నాను. 'మా గ్రామాల్లో ఫ్యూడల్ వ్యవస్థ ఇంకా చెక్కు చెదరకుండా పూర్వం లాగే వుందయ్యా. నేను రాసింది అక్షరాలా నిజం. అది వీరారాధన కాదు'', అన్నాడు. ఇవన్నీ అయ్యేక నేను అప్పట్లో రాసిన 'గేదె' కథ చూపించేను. 'చాలా బాగుంది. దీన్ని యిలా చిత్తు కాగితాల్లో వదిలేయకండి. అది సరే గాని నాతోరండి వెళదాం' అన్నారు. ఎక్కడికో చెప్పకుండా, బయల్దేరేం. నారాయణగూడా చౌరస్తా ! 'వెంకటేశ్వర' కి ఎదురు వరుసలో ఓ విశాలమయిన ఇరానీ హోటల్. అక్కడ సాహితీ మిత్రులు చాలా మంది ఒక టేబిల్ చుట్టూ కూర్చుని ఏవో చర్చిస్తున్నారు - చాయ్ చప్పరిస్తూ. వారెవ్వరూ నాకు తెలీదు. ఒక మధ్యవయస్కుడు ఖద్దరు బట్టలు, పంచెకట్టుతో కాస్త జబర్దస్తీగా కనిపించేడు. నిర్ద్వంద్వంగా, కాస్త దురుసుగా తన అభిప్రాయాలు చెప్తున్నాడు. నా చూపుల అర్థం గ్రహించి 'ఆయన గజ్జెల మల్లారెడ్డి గారు' అని మెల్లగా చెప్పేరు వెంకట సుబ్బయ్య. మల్లారెడ్డి గారు ప్రస్తావించిన అంశం మీద మరొకాయన మాట్లాడేడు. రాచమల్లు రామచంద్రారెడ్డి గారట. తర్వాత రాంభట్ల క్రిష్ణమూర్తి గారు, ఏటుకూరి ప్రసాద్, దేవరాజు మహారాజు, కాచినేని రామారావు - ఇలా చాలా మంది మాట్లాడేరు. వెంకట సుబ్బయ్య కూడా తన అభిప్రాయం వెలిబుచ్చేరు. 'వీచిక' పత్రిక రాబోయే సంచిక విషయం మాట్లాడుతున్నారు. సమావేశం ఇంచుమించు అయిపోవస్తుంటే వెంకట సుబ్బయ్య నన్ను అందరికీ పరిచయం చేసి నేను కథలు రాస్తాననీ, ప్రస్తుతం రాసిన కథ బాగుందనీ దాన్ని వీచికలో వెయ్యగలరేమో ఆలోచించమని కథని ఏటుకూరి ప్రసాద్ గారికి ఇచ్చేరు. 4, 5 రోజుల తర్వాత ఆయన వెంకట సుబ్బయ్యకి కబురు చేసేరు - సంపాదక మండలి (రారా, గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల ఇత్యాదులన్నమాట) ఏకగ్రీవంగా ఆమోదించి నా కథని 'వీచిక' లో వేయడానికి నిర్ణయించేరని. ఆ విధంగా వల్లంపాటి నన్ను సాహిత్య దిగ్గజాలకి పరిచయం చేసేరు.

మరోనాడు రాంభట్ల ఇంటికి పోదాం పదండి అన్నారు వల్లంపాటి. ఆయన ఇల్లు బాగ్‌లింగంపల్లిలో వుండేది. అప్పటికింకా ఆ ప్రాంతం అడవి లాగే వుండేది. రాంభట్ల ఇంటివెనకాతల అడవి వున్నట్టే అనిపించేది. రాంభట్ల, వెంకట సుబ్బయ్య ఫ్రాయిడ్ గురించీ, ఆయన 'టోటెమ్ & టబూ' గురించి సుదీర్ఘంగా చర్చించడం నాకు బాగా గుర్తు. అయితే నాకు ఫ్రాయిడ్ గురించి ఏం తెలీదు. అందుకని నిశ్శబ్దంగా కూచుని ఆలకించేను. మరోనాడు 'సహవాసి' అనే ఉమా మహేశ్వరరావు గారి దగ్గరికి వెళ్ళేం. ఆయన అప్పుడు 'ఈనాడు' లో పనిచేసేవారు. ముగ్గురం కలిసి బాంక్‌స్ట్రీట్‌లో వున్న బార్‌కి వెళ్ళేం. నాకు మద్యం ముట్టుకునే అలవాటు లేదు. వాళ్ళిద్దరూ బీరు పుచ్చుకున్నారు. కొద్దిగానే తీసుకున్నా చాలా సేపు మాట్లాడుకున్నారు వాళ్ళిద్దరూ. నాది ప్రేక్షకపాత్రే. ఆయన చాలా గొప్పవాడనీ, సాహిత్యం మీద వల్లమాలిన అభిమానమనీ వల్లంపాటి చెప్పినట్టు గుర్తు.

ఒకనాడు పొద్దునే వచ్చి "ఇవ్వాళ సాయంత్రం శేషేంద్ర శర్మ గారింటికి వెళ్తున్నాం" అని చెప్పేడు. ఆటోలో నాంపల్లి చేరుకుని పాన్‌మండీలో వున్న శేషేంద్ర గారి ప్యాలెస్ చేరుకున్నాం. చూడగానే అది 'ముత్యాలముగ్గు' లోని ప్యాలెస్ అని పోల్చేను. 'అవును అదే. శేషేంద్ర గారి శ్రీమతి రాజ్‌కుమారి ధనరాజ్ గారి భవంతి' అన్నాడు వల్లంపాటి.

మమ్మల్ని సుఖంగా వుండే ఆసనాల్లో కూర్చోబెట్టి తాగడానికి టీయో, కాఫీయో ఇచ్చేరు. ఒక అరగంట గడిచాక మరో విశాలమైన మందిరంలోకి వెళ్ళేం. అప్పుడే స్నానం చేసి, సువాసనలు వెదజల్లుతూ శేషేంద్ర సుఖాసీనులై వున్నారు. మమ్మల్ని చిరునవ్వుతో ఆహ్వానించేరు. కుశల ప్రశ్నల తర్వాత, సాహిత్యం గురించి సుదీర్ఘంగా వివరించేరు. మధ్యలో రాజ్‌కుమారి వచ్చి కూర్చుని అడపా దడపా ఇంగ్లీషులో తన అభిప్రాయాలు చెప్తుంటే, ఆమెని చేత్తో వారిస్తూ శేషేంద్ర ధారా ప్రవాహంలా తన అభిప్రాయాలు మెత్తగా మంద్రస్థాయిలో చెప్పుకుపోయేరు. మధ్యలో స్కాచ్, నా కోసం లిమ్కా. సంభాషణలు ముగిసే సరికి రాత్రి పది దాటింది. అప్పుడు భోజనాలు - వెండి పాత్రల్లో, పూరీలు, కూర, అన్నం, పెరుగు. రాత్రి పన్నెండు దాకా కబుర్లు సాగాయి. "ఇప్పుడెక్కడికి వెళతారు? ఉండిపోగూడదూ" అన్నారు. ఫర్వాలేదు

వెళ్ళిపోతాం' అని నాంపల్లి దాకా నడిచి అక్కడ ఆటో చేసుకున్నాం. నడుస్తున్నప్పుడు 'నన్ను కాస్త పట్టుకో రెడ్డి శాస్త్రీ - స్కాచ్ ప్రభావం ఇంకా తగ్గినట్టులేదు" అన్నాడు వెంకట సుబ్బయ్య. ఇంతకీ ఆయన తాగింది ఓ గుక్కెడు కంటే ఎక్కువ వుండి వుండదు. అలవాటు లేనివాళ్ళకి ఆ మాత్రం చాలేమో - ఆవలి ఒడ్డుకి తీస్కెళ్ళి పడెయ్యడానికి !

సీఫెల్‌లో సహాధ్యాయులతో చాలా స్నేహంగా వుండేవాడు వెంకట సుబ్బయ్య. అయితే కొంతమందితో వాదనక్కూడా వెనకాడేవాడు కాదు. ముఖ్యంగా భోజనాల బల్లల దగ్గర. అక్కడ అతని చికాకు స్పష్టంగా బయటపడేది. అతి శుభ్రంగా సుతారంగా తినేవాడు వెంకట సుబ్బయ్య. వేళ్ళతో తప్ప అరచేతికీ మండకీ నాక్కుంటూ ఆబగా తినేవాళ్ళంటే అతనికెంత చికాకో! అలా తినే మనుషుల దగ్గర కూర్చుని తినడం అతనికి పడేది కాదు. లేచి మరో దగ్గిరికి వెళ్ళిపోయేవాడు. క్రమేపీ నేను, వెంకటసుబ్బయ్య, అప్పారావు - ముగ్గురం ఒక బల్ల దగ్గర కూర్చుని తినడం అలవాటయింది. మమ్మల్నీ, మా తిండిని చూసి ఉత్తరాది వాళ్ళు, ఒరియా వాళ్ళు జడుసుకునేవారు. గుంటూరు ఆవకాయ పిండి రక్తంలా ఎర్రగా వుంటుంది కద. అది కలిపిన అన్నం ఎలా తింటారా అని వాళ్ళ ఆశ్చర్యం ! పనిగట్టుకుని కాఫీయే తాగేవాళ్ళం - టీ మనది కాదు, ఉత్తరాది వాళ్ళది అని. అయితే అక్కడ కలిపే కాఫీ మహా చీదరగా వుండేది - అందుకని క్రమంగా మేమూ టీకే అలవాటు పడ్డాం. ఒకసారి ఆవకాయ సీసాలన్నీ నిండుకున్నాయి. ఏం చేయాలి? అప్పుడెందుకో మా ఆవిడ హైద్రాబాద్ వచ్చింది. ఆవిడ పర్యవేక్షణలో నాలుగు హార్లిక్స్ సీసాల నిండుగా దోసావకాయ పెట్టుకున్నాం - మోండా మార్కెట్‌కి వెళ్ళి రెడీమేడ్ మిక్స్ తెచ్చుకుని.

ఒకనాడు తెలుగు ఎకాడమీకి తీసుకువెళ్ళాడు వెంకట సుబ్బయ్య. పోరంకి దక్షిణామూర్తి గారినీ, మంజుశ్రీ గారిని కలిసేందుకు. పరిచయం చెయ్యగానే దక్షిణామూర్తి గారు నన్ను కావలించుకున్నంత పని చేసేడు. 'వీచిక' లో నా కథ చదివేడట. ప్రాంతీయ మాండలికాల గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేసిన వ్యక్తి కదా ఆయన. నా శ్రీకాకుళ గ్రామీణ మాండలికం ఆయన్ని బాగా ఆకట్టుకుంది. అదే బాణీలో కథలు కట్టవలసిందిగా ప్రోత్సహించేరు. అక్కడ నాకు తెలిసిన మరో గొప్ప మిత్రుడు కనబడ్డారు - పాశం చెన్నకేశవ రెడ్డి గారు. ఆయన బహుసామ్యులు. సినారె దగ్గర పిహెచ్‌డి చేస్తున్నారప్పుడు. ఆయన్ని నాకు కన్నసామి గారు పరిచయం చేసేరు. కన్నసామి మా కాలేజి నుంచి ఎఫ్.ఐ.పి. మీద హైదరాబాదు వచ్చి సినారె దగ్గరే పరిశోధన చేస్తుండేవారు. సినారెకి కన్నసామి మీద వల్లమాలిన ప్రేమ. కన్నసామి నిజంగా గొప్ప మేధావి, సంగీత విద్వాంసుడు, జ్యోతిషశాస్త్రంలో దిట్ట. ఆయన 19వ ఏట రాసిన 'మహారుద్రీయం' నాటకం ఆంధ్రా యూనివర్శిటీ వారు బి.ఏ.కి నాటకంగా నిర్ణయించేరు. కన్నసామి అప్పటికింకా బి.ఏ. పాస్ కాలేదు. తదుపరి ఆయన బి.ఏ. పరీక్షకి వెళ్ళి తను రాసిన నాటకం మీద తనే వ్యాసాలు రాసేడు - పరీక్ష నిమిత్తం. అంతటి మేధావి తనకి వచ్చిన అవకాశాలన్నింటినీ దుర్వినియోగం చేసుకున్నాడు.

విచిత్రం ఏమిటంటే కన్నసామికి వెంకట సుబ్బయ్యంటే గిట్టేది కాదు, అతన్ని చూస్తే వెంకట సుబ్బయ్యకి చికాకు. విచారించవలసిన విషయమేమిటంటే రిటైరయిన రెండు సంవత్సరాలకే కన్నసామి కన్నుమూసేడు. నోటి కేన్సరు వ్యాధితో. అంతటి మేధావి వల్ల ప్రపంచానికి ఏ మంచీ జరగలేదు.

ఒకనాడు ఓ అర్జంటు వుత్తరం వచ్చింది నాకు. మా పూర్వ విద్యార్థి ఒకరు హైదరాబాదులో పెద్ద వుద్యోగం చేస్తుండేవాడు. అతనికీ అతని కుటుంబానికి నేనంటే వెర్రి అభిమానం. అతని భార్య నన్ను బాబాయ్ అని పిల్చేది. ఆ అమ్మాయి భర్త చేస్తున్న మోసాలు తనింక సహించలేననీ 1, 2 రోజుల్లో తన ఆత్మహత్య విషయాన్ని నేను వింటానని రాసింది. ఆ వేళ కాలేజిలో కొన్ని పీరియడ్లు ఎగ్గొట్టి నేనూ వెంకటసుబ్బయ్య పరిగెత్తేం. ఆ అమ్మాయి వాళ్ళిల్లు కాచిగూడ రైల్వేస్టేషన్‌కి ఆవతల వుండేది. రైలు పట్టాలు దాటి ఆదరాబాదరా ఇల్లు చేరేం. ఆ అమ్మాయి ఏ అఘాయిత్యం చేయలేదు అప్పటికి. కాని భోరున ఏడుస్తూ కథంతా చెప్పింది. వెంకటసుబ్బయ్య ఆమెని వూరడించేడు. మాటల సందున ఆమె పుట్టిల్లు చిత్తూరు జిల్లాలోనేనని తెలిసింది. మరింకేముంది జిల్లా అభిమానం కురిపించేరు వెంకటసుబ్బయ్య. ఆ అమ్మాయి అఘాయిత్యానికి పాల్పడాలనే వుద్దేశ్యాన్ని విరమించుకుంది. ఆ భార్యాభర్తలిద్దరూ పిల్లాపాపల్తో సుఖంగా వున్నారిప్పుడు. అదంతా వెంకట సుబ్బయ్య చలవే !

సీఫెల్‌లో వున్న కాలమంతా మేం కొత్త పుస్తకాలు చదవడంలోనూ, సామాజిక సాహిత్య చర్చలు చేయడంలోనూ, విమర్శకుల ప్రసంగాలు వినడంలోనూ గడిపేశాం. పరీక్షలకి మేం పెద్దగా విలువ యివ్వలేదు.

అయితే నిస్సంశయంగా నేను చెప్పగలిగిన సత్యం - వెంకట సుబ్బయ్య సాహిత్య విమర్శ వైపు వెళ్ళడానికి దోహదపడిన ప్రబలశక్తి సీఫెల్.

Craft of fiction (Peray Lubbock), understanding poetry, understanding fiction (Cleanth Brooks) నవల, నాటకం, కవిత్వాల మీద Marjorie Boulton రాసిన ప్రామాణిక పుస్తకాలు, Erich Aucaboch రాసిన ఉద్గ్రంథం MIMESIS, Archetypal Criticism (Northrop Erye), New Critics, Neo Aristotelians, Mark Schorer's Technique as Discovery - Marxist Criticism, George Lukacs - వీళ్ళందర్నీ సీఫెల్‌లో క్షుణ్ణంగా చదివి ఆకళింపు చేసుకున్న మేధావి వెంకటసుబ్బయ్య. తను శ్రద్ధాసక్తులతో పఠించిన విషయాన్నంతట్నీ మనకి తన విమర్శనా సాహిత్యాంశాల ద్వారా తెలియపర్చేరు.

విశ్వనాథ సత్యనారాయణ గారంటే ఆయనకి సదభిప్రాయం లేదు. కాని నవలాకారుడుగా అతని వైశిష్ట్యాన్ని మనం కాదనడానికి వీల్లేదని విశ్వనాథ మీద వ్రాసిన ఒక సుదీర్ఘ వ్యాసంలో స్పష్టం చేసేడు వెంకట సుబ్బయ్య.

వెంకటసుబ్బయ్య గారు రాసే విధానం ఒక మహాద్భుతం. తను రాయాలనుకున్న అంశానికి సంబంధించినదంతా క్షుణ్ణంగా చదివి, మనసులో అట్టిపెట్టుకునేవాడు. అతని మాటల్లోనే చెప్పాలంటే అతనిది ఫోటోగ్రాఫిక్ మెమొరీ. అప్పుడు ఏకధాటిగా రాసేవాడు.

చిత్తుప్రతులు అలాంటివి వుండేవి కాదు. మొదటి ప్రతే అచ్చుకి. శిల్పి చెక్కినట్టుగా వుండే దస్తూరి. స్పష్టమైన ఆలోచన. స్పష్టమైన ఎక్స్‌ప్రెషన్. మెలికలు, పడికట్టు మాటల ముసుగులో దాక్కునే వ్యక్తి కాదు వెంకట సుబ్బయ్య. మాట్లాడినప్పుడు ఎంత కుండ బద్దలు కొట్టినట్టు తన అభిప్రాయాలు చెప్పేవాడో, రాసేటప్పుడు కూడా అదే స్పష్టతతో రాసే వాడు. బహుశా నిర్దుష్టమైన రచనా శైలిని అతను రారా నుంచి స్వీకరించాడేమో.

పుట్టపర్తి నారాయణాచార్యుల వారంటే విపరీతమైన భక్తి. ఆయన 'శివ తాండవం' నుంచి ఎన్నెన్ని పద్యాల్ని వినిపించేవారో.

ఎక్కడి మదనపల్లె, ఎక్కడి శ్రీకాకుళం ! అయినా మేం ఇరువురం చివరిదాకా మంచి మిత్రులుగా మిగిలాం. నా కాలు విరిగి వెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు రెండుమార్లు ఆస్పత్రికి వచ్చి గంటల తరబడి నా దగ్గర కూర్చుని ఎన్నెన్ని విషయాలు చెప్పేరో ! వరంగల్‌లో స్పాట్ వాల్యుయేషన్‌కి వెళ్ళినప్పుడు - నేరెళ్ళ వేణుమాధవ్‌ని ఒప్పించి, కాంప్‌లో సాయంత్రం మిమిక్రీ ప్రోగ్రాం యిప్పించి అందరి ప్రశంసలు పొందేరు. అక్కడికివచ్చిన లెక్చరర్లనందర్నీ రెండు బస్సుల్లో రామప్ప దేవాలయానికి తీసుకెళ్ళేరు.

అలనాటి ఆప్తమిత్రుడు వెంకట సుబ్బయ్య తన జీవన ప్రయాణాన్ని ముగించేస్కొని - రైలు ఎక్కేసేరు. సికింద్రాబాదు స్టేషన్లో అతను ఎక్కవలసిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సాయంత్రం నాలుక్కే బయలుదేరేది. నన్ను గోదావరి కోసం ప్లాట్‌ఫారం మీదే ఒదిలేసి మీరు వెళ్ళిపోతున్నారు ముందుగా అనేవాడిని. జీవితంలో కూడా అదే జరిగింది. ముందుగా వెళ్ళిపోయేరు. .

వెంకటసుబ్బయ్యా ! నువ్వు మరేదేనా లోకం అంటూ వుంటే ఆ అడ్రసు తెలియపరచు - నువ్వు పదే పదే అడుగుతూండే వాడివే Cleanth Brook's Understanding Poetry - ఆ పుస్తకాన్ని పట్టుకుని నీ దగ్గరకు వచ్చేస్తాను.

పాశ్చాత్య సాహిత్య విమర్శనా రీతులతో సరిపోలిస్తే మనం ఎంతో వెనుకబడివున్నాం. వాటన్నిటినీ అతను క్రమేపీ పరిచయం చేస్తాడని ఆశపడుతూ వుండేవాడిని. సాహిత్యానికి సంబంధించిన ఏ జటిలమైన, టెక్నికల్ విషయాన్ని అయినా అతన్ని అడిగితే చక్కగా చెప్తాడని బలంగా నమ్మేవాడిని. ఇక యిప్పుడు మరెవర్ని అడగడం? *

☆ పాణి

రాయలసీమ సాహిత్య చరిత్ర నిర్మాణ ప్రయత్నంలో వల్లంపాటి

హైదరాబాదులో విరసం ఏర్పాటు చేసిన సాహిత్య విమర్శా సదస్సుకు (సెప్టెంబర్ 2004) వచ్చినప్పుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య - రాయలసీమ సాహిత్యం మీద ఒక పుస్తకం రాస్తున్నట్టు చెప్పారు. సీమ సమాజ సాహిత్యాల మీద ఎవరైనా సమగ్ర కృషి చేస్తే బాగుండు అనుకుంటున్న నాకు - ఆ పనికి వల్లంపాటి పూనుకోవడంతో ఈ తరం రాయలసీమ రచయితలకు, సాహిత్య విద్యార్థులకు యిన్నాళ్ళకు ఓ ప్రామాణిక అధ్యయన పుస్తకం అందుబాటులోకి వస్తోందిగదా అని సంతోషమైంది.

ఈ పని వల్లంపాటిగారే చేస్తే బాగుంటుందనుకోవడానికి ఒక కారణం ఉంది. రాయలసీమ ఆధునిక సాహిత్యాన్ని వివరించాలనుకున్నా సంప్రదాయ సాహిత్యంతో లోతైన పరిచయం ఉండి, దాన్ని ఆధునిక దృక్పథంతో విశ్లేషించగలగాలి. ఎందుకంటే రాయలసీమ సాహిత్యానికి సంప్రదాయంలో ఉన్న బలమైన పునాదులు అలాంటివి. ఆ పునాదుల్లో కదలబారిన ఆధునిక చైతన్యాన్ని గుర్తించి, అర్థం చేసుకొని, సంప్రదాయంలోనూ దాగి ఉన్న పలుచని ప్రాంతీయ జీవన స్పర్శను కలిపి చదివి సాహిత్యానుభవం పొందగలిగిన వారికే ఈ పని సాధ్యం అవుతుంది. ఈ అధ్యయన, దృక్పథ పటిమ ఉన్నందువల్లా; ముఖ్యంగా రాయలసీమ సాహిత్యంలో ఆధునిక పరిణామాలు ప్రారంభమైన కాలానికి ప్రతినిధి అయినందువల్లా వల్లంపాటిగారే ఇలాంటి మహత్తర బాధ్యత నెత్తికెత్తుకోగలిగారు.

దేనిమీదైనా వారం-వారం పేజీ, అరపేజీ రాసి మర్నాడే అచ్చులో చూచుకునే స్వభావం, సౌకర్యం లేనివారు కావడం వల్ల కొన్ని సంవత్సరాలపాటు శ్రమ చేసి ఈ పుస్తకాన్ని రాయగలిగారు. రచనపట్ల కేంద్రీకరణలో ఆయన చాలాఅరుదైన ఉదాహరణ. కొన్ని విడి వ్యాసాలు, ముందుమాటలు, సమీక్షలు రాసిఉన్నా నవలా శిల్పం, కథాశిల్పం, విమర్శాశిల్పం పుస్తకాలను తన పరిధిలో సమగ్రంగానే రాయడానికి ప్రయత్నం చేశారు. ఈ ఒరవడి వల్లనే 220 పేజీల 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం - సామాజిక సాంస్కృతిక విశ్లేషణ' మనకు అందివ్వగలిగారు.

***

రాయలసీమ చారిత్రక చిత్రం, సామాజిక - ఆర్థిక చిత్రం అనే రెండు వ్యాసాలతో మొదలై 'సాహిత్యంలో రాయలసీమ చైతన్యం ప్రారంభానికి అటు, ఇటు' అనే వ్యాసం తరువాత కవిత్వం, నవల, కథ, విమర్శ ప్రక్రియల్లో రాయలసీమ చైతన్యాన్ని వివరించే వ్యాసాలున్నాయి. చాలా క్లుప్తంగా రాసిన 'తొలిపలుకు'లో 'స్థానిక జీవిత చైతన్యంతో రాయలసీమ కవులూ, రచయితలూ, విమర్శకులూ చేసిన సాహిత్య కృషిని అధ్యయనం చేయడం ఈ చిన్న పుస్తకం ఉద్దేశ్యం. అందుచేత ఈ పుస్తకానికి కొన్ని పరిమితులు వాటంతట అవే ఏర్పడ్డాయి' అన్నారు. యిది పుస్తక రచనకు ఆయన నిర్దేశించుకున్న చట్రాన్ని తెలియజేస్తుంది. స్థానిక జీవిత చైతన్యాన్ని ప్రభావితం చేసే, నిర్దేశించే సామాజిక రాజకీయ ఆర్థిక పునాదిని వివరించడానికి మొదటి రెండు వ్యాసాల్లో ప్రయత్నం చేసారు. ముఖ్యంగా మొదటి వ్యాసంలో చరిత్రలో రాయలసీమను గుర్తించే ప్రయత్నం ఉన్నది. దీంతో పోల్చుకుంటే వివరణాత్మకంగా, అన్వేషణాపూరితంగా రెండో వ్యాసం ఉన్నది. రాయలసీమను ఒక ప్రాంతంగా గుర్తించేదానికి ఉన్న అవకాశాల్లో మొట్టమొదట భౌగోళికంగా 'చరిత్రలో చాలా కాలంపాటు ఒక పెద్ద సామ్రాజ్యంలో ఒక చిన్న ప్రాంతం' కావడం అన్నారు. భౌగోళిక ప్రత్యేకతలతోపాటు చారిత్రకంగా పాలనా పరంగా ఉన్న ప్రత్యేకతలు, సాంస్కృతికం, ఆహార అలవాట్లు, భాష - మాండలికం, ఆర్థిక పరిస్థితి, కరువులు, వర్షపాతం, నీటిపారుదల, సాగుభూమి, తిండిగింజల ఉత్పత్తి, విద్యా, ఉద్యోగ అవకాశాలు వగైరాల ఆధారంగా రాయలసీమ సామాజిక ఆర్థిక చిత్రాన్ని రూపుకట్టించారు. 'రాయలసీమకు ఒక ప్రత్యేక చరిత్ర లేక పోయినా, ప్రత్యేకత ఉన్న చరిత్ర మాత్రం ఉంది' అనే సూత్రీకరణ చేశారు.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య

ఈ చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకతల ఆధారంగా ప్రాంతీయతను నిర్వచించే ప్రయత్నంలో 'దేశకాలాల స్పృహ ప్రాంతీయతా స్పృహ' (పేజీ : 40) అన్నారు. ప్రాంతీయత అనే భావన చుట్టూ ఉన్న చిక్కుల గురించి ఆయనకు ఎరుక ఉన్నప్పటికీ ఈ సూత్రీకరణ పూర్తి సంతృప్తికరం కాదు. 'ప్రాంతీయత'లో 'దేశ కాల స్పృహ' ఒక విలువైన భావన మాత్రమే. మనిషి తన గురించి, తనలాంటి సమూహం గురించి దేశకాల నిర్దిష్టతలోనే ఆలోచించి, గుర్తించగలడు. ఒక చిన్న భౌగోళిక ప్రాంతంలో ఉన్నవాళ్ళకు తాము ప్రాంతీయులమని, ఆ పక్కనే ఉండేవాళ్ళ తమకు ప్రాంతేతరులనే గుర్తింపుతో తమకు - యితరులకు ఉండే తేడాను చెప్పుకుంటూ ఉంటారు. ఈ గుర్తింపుకు యింకో కారణం- ఆరోజుల్లో యితర ప్రాంతాల గురించి చాలా తక్కువగానే తెలిసే అవకాశం ఉంటుంది. కాబట్టి తమను తాము 'ప్రాంతం' అనే స్పృహతోనే గుర్తించుకోక తప్పదు. యింత సాధారణార్థంలో దేశకాలాల స్పృహ ప్రాంతీయతగా మానవ జీవితంలో కొనసాగుతూ ఉండవచ్చు. కాని, ఆధునిక పాలనా విధానాల్లో, వ్యూహాల్లో మార్కెట్ ప్రయోజనాల రీత్యా అసమ అభివృద్ధి ప్రవేశించాక ప్రాంతీయత అనే గుర్తింపు సంక్లిష్టమై పోయింది. తెలుగు ప్రజలు ఒక జాతిగా గుర్తింపు పొందడానికి వెనుక రెండు మూడు వందల ఏళ్ల సుదీర్ఘమైన చారిత్రక, రాజకీయార్థిక, సాంస్కృతిక పరిణామాల నేపథ్యంలో ప్రాంతీయత అనే భావన అనేక ప్రత్యేకతల రీత్యా, కారణాల రీత్యా క్లిష్టమైపోయింది. స్థలకాలాల స్పృహ ఆధునిక అర్థంలో నిర్దిష్టమైన నిర్వచనాలను తయారు చేసుకొనే క్రమంలో ఒకేజాతిలోని భిన్న భౌగోళిక ప్రాంతాల మధ్య ఏర్పడిన అసమానతలు - వాటి వెనుక తమ ప్రాంత సామాజిక, సాంస్కృతిక వారసత్వంలోని సొంత ముద్రల అన్వేషణ కలగలిసి ప్రాంతీయ చైతన్యంగా వికసించింది. ఈ మొత్తాన్ని స్థలకాల స్పృహ అన్నామంటే మరీ సరళంగా, సింపుల్‌గా చెప్పినట్టవుతుంది.

దేశకాలస్పృహ ప్రాంతీయత అనే నిర్వచనం యిచ్చిన వల్లంపాటి 'మత భావజాలానికి అంకితమైపోయిన ప్రాచీన సాహిత్యంలోజాతీయతకే స్థానం తక్కువ. ప్రాంతీయతకు దాదాపుగా స్థానమే లేదు. ప్రాచీన మహాకవులు- దాదాపుగా అందరూ దేశకాలాల స్పృహను నిరాకరించారు' (పేజినం.44) అనీ, నైతికతకూ, ఉన్నతాదర్శాలకూ, సామాజిక బాధ్యతకూ దూరమైన సాహిత్యంలో 'స్థానికత'(Nativity) ఉండదు. నేటివిటీని తిరస్కరించిన రచయితకు మరింత సూక్ష్మమైన ప్రాంతీయత దృష్టిపథంలోకే రాదు. పందొమ్మిదవ శతాబ్దం చివరి వరకూ తెలుగు సాహిత్యంలో యిలాంటి పరిస్థితి కొనసాగింది (పేజి నం.50) అనీ అంటారు.

ప్రాచీన సాహిత్యానికి సంబంధించి యిది ఆసక్తికరమైన పరిశీలనే గాని చర్చించాల్సిన అంశాలు యిందులో చాలా ఉన్నాయి. బహుశా ప్రాచీన

సాహిత్యంలో ప్రాంతీయత లేకపోవడానికి సాహిత్య యితివృత్తంలో, రచయితల సామాజిక నేపథ్యంలో కారణాలు వెతకవచ్చనుకుంటాను. యితివృత్తం ఇతిహాసాలకూ, పురాణాలకు సంబంధించింది అయినప్పుడు - వల్లంపాటి ప్రస్తావించినట్టు మూల భారతంలోలేని వేంగిరాజ్య వర్ణన నన్నయ అనువాదంలోకి వచ్చిన పద్ధతిలో తప్ప అంతకుమించి ప్రాంతీయత ప్రతిబింబించే భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక అంశాలకు చోటు దొరకడం కష్టమే. రెండోది, ప్రాచీన కవులు- ముఖ్యంగా రాజాశ్రయంలో ఉన్నవాళ్ళలో దాదాపుగా అందరూ బ్రాహ్మణులే కాబట్టి వారి సామాజికత కూడా ప్రాంతీయతను గుర్తించడానికి ఆటంకం అయి ఉంటుంది. ప్రజా జీవితంలో సాధారణార్థంలోనైనా ఉండే దేశ కాల స్పృహ బ్రాహ్మణ కవి పండితులకు కలిగే అవకాశం ఉంటుందా? సందేహమే. వల్లంపాటి ఊహించినట్టు ధూర్జటి రాజాశ్రయం నుండి బైటపడ్డాక రాసిన రచనల్లో కరువు వర్ణన కనిపించడం కూడా యిందువల్లనే కావచ్చు. రాజరికంతో సహా ఆనాటి ఆధిపత్య వ్యవస్థలపట్ల నిరసన ప్రకటించిన ఆస్థానేతర సాహిత్యకారుల్లో ప్రాంతీయ జీవితం, భాష గొప్పగా కనిపించడానికి వాళ్ళ యితివృత్తం, సామాజికనేపథ్యం కారణం అయి ఉంటుందని ఊహించడం కష్టమేమీ కాదు. అందుకే వేమన, వీరబ్రహ్మం లాంటి వాళ్ళలో ప్రాంతీయత అంత ప్రస్ఫుటమైంది.

తమ ప్రాంతం - బైటి ప్రాంతం అనే పరిగణ పాతరోజుల నుండే ఉన్నా; దేశము, కాలము అనేవి కూడా మనిషి గుర్తింపుకు, ఉనికికి సంబంధించిన ప్రమాణాలుగా మొదటి నుండీ ఉన్నా ఆ దేశకాలస్పృహ, మనం అనుకుంటున్న ప్రాంతీయత ఒకటి కాదు. ప్రాచీన రచయితను కాల్పనికావేశం, మత భావజాలం ఎంత ప్రభావితం చేసినా, తమ చుట్టూ తమకు తెలిసిన భౌతిక, భౌగోళిక, సాంస్కృతిక అంశాలు వాళ్ల రచనల్లోకి వచ్చి ఉండవచ్చు. ముఖ్యంగా ప్రాంతం అంటే ఆ రోజుల్లో వాళ్లు జీవించిన, చూచిన ప్రాంతమే. వాళ్లెంత ఊహాలోకాన్ని చిత్రించినా అందులోకి వాళ్ళ చుట్టూ ఉన్న వాస్తవ ప్రాంతం రాకుండా పోలేదు. దాన్ని ప్రాంతీయ స్పృహఅనీ, కనీసం దేశకాలస్పృహ అని అనగలమా? ధూర్జటి కవిత్వంలోని కరువు వర్ణనలో, 1930లలో, 40లలో రాయలసీమ నుండి వచ్చిన కావ్యాలలోని స్థానిక కరువు చిత్రణలో ప్రాంతీయ స్పృహ ఒకే విధంగా ఉన్నదని చెప్పడం వీలు కాదు. అట్లాగే జాతీయతకు ప్రాచీన సాహిత్యంలో స్థానం దొరకలేదనీ, స్థానికత (నేటివిటి) కంటే ప్రాంతీయత మరీ సూక్ష్మమైందనే వల్లంపాటి అభిప్రాయాలను చర్చించవలసి ఉన్నది.

***

ఈ పుస్తకంలో 'రాయలసీమ చైతన్యం - ప్రారంభానికి అటు, ఇటు' అనే వ్యాసం వల్లంపాటి ప్రతిభకు నిదర్శనం. ప్రాంతీయత భూమికగా స్థానిక జీవిత చైతన్యం సాహిత్యంలో వ్యక్తమవడానికి పడిన సంఘర్షణను యిందులో ఎత్తి చూపించారు. అక్కడి నుండి దాని సాహిత్య వ్యక్తీకరణ ఎట్లా జరిగిందో 'ఆధునిక కవిత్వంలో రాయలసీమ చైతన్యం' అనే వ్యాసంలో చూపించారు.

'ఇరవైవ శతాబ్దం ఉదయించిన తరువాత వచ్చిన కవిత్వం' అన్న అర్థంలో ఆధునికకాలంలో వచ్చిన కవిత్వాన్ని పరిశీలిస్తున్నట్టు చెప్పుకున్నారు. తెలుగుజాతి 'ఆధునిక కాలం' లోకి ప్రవేశించాక రాయలసీమ కవిత్వంలో ప్రాంతీయత కోసం వల్లంపాటి చేసిన అన్వేషణ సహజంగానే ప్రాంతీయతను అలవర్చుకోవడానికి, ఆధునికతను అనుభవంలోకి తెచ్చుకోవడానికి రాయలసీమ రచయితలు పడిన సంఘర్షణను తెలియజేస్తుంది. యిది వస్తువులోని ప్రాంతీయ స్పృహ మాత్రమేగాక ప్రక్రియలో, రూపంలో, భాషలో కూడా ప్రవేశించింది. స్థలకాల స్పృహ, ప్రాంతీయ చైతన్యం ఆధునికతలో భాగం అనుకుంటే ఆ అర్థంలో ఆధునికత రాయలసీమ కవిత్వంలో ప్రాంతీయ జీవిత ప్రతిఫలనం రూపంగా ప్రారంభమైంది.

వల్లంపాటి రాయలసీమలో 'ఆధునిక కవిత్వం' అని మళ్ళీ దానికి కాల సంబంధమైన వివరణ యివ్వడం వల్ల- తర్వాత్తర్వాత తాను అందివ్వబోయే విశ్లేషణ మామూలుగా మనం చెప్పుకొనే 'ఆధునిక సాహిత్యం' అనే చట్రంలో వొదిగే అవకాశం లేదనే ఎరుక ఆయనకు ఉన్నట్లు తెలుస్తుంది. ఇలాంటి విషయాల్లో ఆయన ఎంత జాగ్రత్తగా ఉంటారో అందరికీ తెలిసిందే. ఈ వివరణ రాయలసీమలో ఆధునికత గురించి ఆలోచించడానికి ప్రేరణ కావడం విశేషం.

తెలుగు జాతి ఆధునిక యుగోదయంగా గుర్తించిన కాలంలో ఆ ఆధునిక క్రమంతో సంబంధంలేని రచనలు రాయలసీమ నుండి రావడాన్ని ప్రత్యేకంగా పరిగణించాలి. అవి నాటికీ నేటికీ రాయలసీమలో కొనసాగుతున్న పండిత సంప్రదాయానికి ప్రాతినిధ్యం వహించే రచనలే అయి ఉంటే ప్రత్యేకంగా చెప్పుకోనవసరం ఉండేదికాదు. కానీ పండిత సంప్రదాయంలోనే సీమ ప్రాంతీయ జీవనస్పర్శ పలుచగానో, ప్రగాఢంగానో ఉండటాన్ని విడివిడి రచనల వరుసగా (అందులోనూ ఎంత ఖాళీ ఉన్నదీ వల్లంపాటి దశాబ్దాల లెక్కన వివరించారు) కాక స్థానికమైన ఒక సమాజ సాహిత్య చలనంగా గుర్తిస్తే కొత్త విశ్లేషణలకు అవకాశం ఉండవచ్చు. యిలాంటి సూత్రీకరణ ప్రత్యేకంగా లేకపోయినా సీమ సాహిత్యంలోని నిర్దిష్టమైన, విశిష్టమైన పరిణామ స్వభావం తేటతెల్లమయ్యే పద్ధతిలో ఈ వ్యాసం సాగింది.

అందరికీ తెలిసిన కట్టమంచి రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణం' (1900), రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ 'పెనుగొండ', పుట్టపర్తి నారాయణాచార్యుల 'పెనుగొండలక్ష్మి', 'మేఘదూతం' మొదలైన రచనలతోపాటు పెద్దగా గుర్తింపుకు నోచుకోని రచనల గురించి, పూర్తిగా విస్మృతిలోకి జారిపోయిన రచనల గురించి లోతైన పరిశీలన చేసి పై మూడు, నాలుగు కావ్యాల తర్వాత ప్రాంతీయ చిత్రణ షదునెక్కిన క్రమాన్ని వివరించారు. ముసలమ్మ మరణం, పెనుగొండ, పెనుగొండ లక్ష్మి కావ్యాల పరిమితులను కూడా గుర్తింపజేశారు. 1900 ల్లోనే తెలుగు భాషా సాహిత్యాల్లో ముసలమ్మ మరణం - కావ్యం మొదలు, ముగింపులు మంగళకరంగా ఉండాలనే అలంకార శాస్త్ర నియమాలకు భిన్నమైన ముగింపు యివ్వడం, వస్తువు ప్రాంతీయం కావడం అనే ఆధునిక విలువలను ప్రకటించుకున్నదని చెప్పారు. రాయలసీమ పలుకుబళ్ళు కూడా కావ్యభాషలోకి వచ్చి ఉండవచ్చుగాని రూపంలో, భాషలో ప్రాచీనత్వాన్ని బలంగా పలికిన కావ్యం యిది. రాయలసీమ కవిత్వంలో స్థానికత కోసం, ఆధునికత కోసం కట్టమంచి దగ్గర ప్రారంభించడం ఎంత ఉచితంగా ఉంటుందో, ఆ తర్వాతికాలంలో కూడా జటిలమైన సంప్రదాయ పునాదిపై సాగిన స్థానిక స్పృహ పెనుగులాటకు కూడా అదే ఒక వొరవడిని, వారసత్వాన్ని అందించిందేమో ఆలోచించక తప్పదు. పెనుగొండ, పెనుగొండలక్ష్మి కావ్యాల్లోనే కాదు, రాయలసీమ ప్రాతినిధ్యకావ్యం అయిన పెన్నేటిపాటలో కూడా సంప్రదాయంతో ప్రాంతీయ స్పృహ సలిపిన సంఘర్షణ కనిపిస్తుంది.

బళ్ళారి శ్రీనివాసరావు 'గంజికేంద్రము' ఖండిక, భైరవపురెడ్డి నారాయణరెడ్డి రాసిన 'రాయలసీమ రైతు', కుంటిమద్ది శేషశర్మ 'అనిలసందేశం' సంప్రదాయ దృష్టికోణాన్ని, కావ్యరూపాన్నీ నిలబెట్టుకుంటూనే ప్రాంతీయతను ఎట్లా పలికిందీ వల్లంపాటి చాలా సోదాహరంగా వివరించారు. ప్రాంతీయత ఊసులేని కావ్యాలు నేటికీ రాయలసీమలో వస్తుండవచ్చుగాని వీటి మధ్యనే సంప్రదాయ దృక్పథం - జన జీవన వాస్తవికత పరస్పరం కలసి, కలహించుకొని, సంఘర్షించుకొని అందులోంచే ప్రాంతీయతాస్వరాన్ని వినిపించిన తనదైన చరిత్ర రాయలసీమ సాహిత్యానికి ఉన్నది. వల్లంపాటి ఒక్కోచోట గ్రంథసమీక్ష అనదిగిన స్థాయిలోకి వెళ్ళిపోయి సవివరంగా చెప్పిన విశ్లేషణ ఈ విభిన్నత్వాన్ని ప్రతిపాదిస్తోంది.

***

భాష, రూపం విషయంలో సాగిన ఈ సంఘర్షణను నవలా ప్రక్రియవైపు నుండి కూడా చూడగలిగితే ఆశ్చర్యం కలుగుతుంది. కందుకూరి వీరేశలింగం'రాజశేఖర చరిత్ర'కన్నా ఆరు సంవత్సరాల ముందు అచ్చయిన (1872) నరహరి గోపాలకృష్ణమ శెట్టి 'శ్రీ రంగ రాజ చరిత్ర' గురించి వల్లంపాటి

నిష్కర్ష ప్రకటించారు. ప్రపంచ సాహిత్యంలో ఆధునిక ప్రక్రియగా నవలను గౌరవిస్తారు. తొలి తెలుగు నవల రాజశేఖర చరిత్రకాదు, శ్రీరంగ రాజ చరిత్ర అని వాదించదల్చుకున్న వాళ్లకు వల్లంపాటి వివరణాత్మక సమాధానం చెప్తూ 'శ్రీ రంగరాజ చరిత్రను ఆధునిక నవలగా కానీ, తెలుగులో మొదటి నవలగాగాని పరిగణించడానికి వీల్లేదు' అని తేల్చేశారు. యిప్పుడు రాష్ట్రంలో ఉన్న వాతావరణంలో తమ ప్రాంతమే తొలి నవలకు ప్రాణం పోసిందని రాయలసీమ వాళ్ళెవరైనా అంటే ఆశ్చర్యపోనవసరం లేదేమో! పైగా సాహిత్య చరిత్ర పునర్నిర్మాణం పేరుతో దీనికి కావలసిన వాదన రంగరాజ చరిత్ర చుట్టూ అల్లుకొని కూడా ఉంది. కానీ వల్లంపాటి 'ఈ గ్రంథం వచనంలో ఉండటం ఒక్కటే అందులోని నవలా లక్షణం' అన్నారు. బహుశా పద్యం మాత్రమే సాహిత్య రూపం అనే బంధనాల్ని ఛేదించడం మినహా దాని సార్థకత ఏమీ లేకపోవచ్చు.

యింకొంచెం ముందుకు వెళ్ళితే 1925లో రేనాటి వీరుడు అనే చారిత్రక నవలను జమ్ములమడుగుకు చెందిన కలపటాల జయరామారావు రాశారు. 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికంటే ముందే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటు, 1844 ఫిబ్రవరి 22న 2000 మంది ప్రేక్షకుల సమక్షంలో అతని ఉరితీత మొదలైన ఘట్టాల ఆధారంగా రాసిన నవల యిది. ఆనాటి ఆచార వ్యవహారాలు, ముఠారాజకీయాలు, కరువు మొదలైన స్థానిక చిత్రణ ఉన్న శక్తివంతమైన నవల అంటూనే వల్లంపాటి దాని పరిమితులూ, లోపాలు విస్పష్టం చేశారు. అనేక విషయాల్లో రచయిత అభివృద్ధి నిరోధక భావజాలాన్ని ప్రకటించుకున్నాడని, భాష విషయంలో కూడా ప్రాచీన దృక్పథమేనని అంటారు.

ఈ రెండు వచన రచనలు రాయలసీమ అచంచల సంప్రదాయ పద్య వారసత్వంలో మినహాయింపు. యిట్లాంటివి యింకొన్ని కూడ దొరకవచ్చు కాని యివి ఎట్లా మినహాయింపు అయ్యాయి, ఏ మేరకు అయ్యాయి? అనే ప్రశ్నలు ఎదుర్కోక తప్పదు. 1870లోనే రాయలసీమలో 'నవల' రాయడానికి ప్రయత్నం జరిగినా అది నవల కాలేకపోయింది. మళ్ళీ అర్ధ శతాబ్దానికి గాని యింకో నవల రాలేదు. 'రేనాటి వీరుడి' గురించి ఆలోచిస్తే ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే సాయుధరూపంలో వలసవాదానికి ఎదురైన ధిక్కారం రాయలసీమలో ఏ ప్రభావాన్ని వేసింది? ప్రజా సంచలనాలకు అదేమయినా ప్రేరణగా నిలిచి వారసత్వాన్నిచ్చిందా? అనే సామాజిక, ఉద్యమ సంబంధమైన ప్రశ్నలు కూడా ఎదురవుతాయి. సాహిత్యంలో కూడా అనేక పరిమితులలో కూడిన మినహాయింపుగా ముందుకొచ్చినా అవి యధాతథ స్థితిపట్ల, సంప్రదాయ దృక్పథం పట్ల తెగతెంపులు చేసుకోలేని రీతిలోనే ఘర్షణ పడ్డాయి. పద్యం నుండి వచనానికి వచ్చినా, సంస్కృత యితిహాసాల, మహాకావ్యాల అనువాద కార్యక్రమం నుండి వాస్తవ జీవన స్థితిగతుల స్పృహలోకి మళ్ళినా సంప్రదాయ ప్రాబల్యం మాత్రం నిలిచే ఉన్నదని రుజువౌతుంది.

ఎందుకంటే, కట్టమంచి రామలింగారెడ్డికి మద్రాసు ఇంగ్లీషు చదువులు ప్రేరణ యిచ్చినా, నరహరిగోపాలకృష్ణమ సెట్టికి ఆనాటి వైస్రాయ్ లార్డ్‌మేయో బెంగాలీ ఆచారవ్యవహారాలు చిత్రించిన నవలకు బహుమతి యివ్వడం స్ఫూర్తినిచ్చినా రాయలసీమ సమాజ అంతర్గత స్థితిగతులతో వీటికి సంబంధం లేదు. బైటి ప్రభావాలతో నిమిత్తంలేని, వాటి నిర్ణయాత్మకతకు లోబడని స్వీయక్రమం ఒకటి రాయలసీమకు ఉన్నదని తెలుస్తుంది.

1800 నుండి వలసపాలన తీసుకొని వచ్చిన పాలనాపరమైన, ఆర్థికపరమైన మార్పులు మద్రాసు ప్రెసిడెన్సీలోని యితర ప్రాంతాల్లో కంటె రాయలసీమలో విభిన్నంగా జరిగాయి. వలసవాద ప్రయోజనంలో ప్రాంతాలను బట్టి విధానాలుండటం, దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా వాటి అమలు స్వభావం ఉండడం సహజం. అయితే రాయలసీమకు ఆర్థికంగా, సాంస్కృతికంగా తనదైన సొంతదనం రూపొందిన కాలం అదే. తెలుగుజాతి సాధించిన ఆధునిక క్రమం గురించి మనం యిచ్చుకొనే చారిత్రక రాజకీయార్థిక విశ్లేషణలో వొదగని పరిణామాలు. రాయలసీమలో జరిగాయి. వలస పాలనకు వెనుకటి చరిత్ర పూర్వ రంగం అనుకున్నా, ఆ తర్వాత నూట యాభై ఏళ్ళలో పాలనాపరంగా బ్రిటీష్ ఏలుబడిలో ఉన్న మిగతా తెలుగు ప్రాంతానికంటే విభిన్నత్వం రాయలసీమలో చోటు వేసుకుంది. దీనికి స్థానిక సమాజ అంతర్గత వ్యవస్థలు ఎంత కారణం, వలసవాద దోపిడీ ప్రయోజనాలకు అనుగుణమైన పద్ధతులు, వివక్షలు ఎంతవరకు కారణం అనేవి నిర్ధారణ కోసం ఆ దిశగా కూడా ఆలోచించకతప్పదు. ఈ నేపథ్యమే రాయలసీమలో ఆధునికత వికాసక్రమాన్ని తీర్చిదిద్దింది.

***

వల్లంపాటి గారయితే సామాజిక సాహిత్యరంగాల్లో బ్రిటీష్ అధీనంలో ఉన్న మిగతా తెలుగు ప్రాంతాలతో పోల్చుతూ అక్కడా,ఇక్కడా జరిగిన పరిణామాలకు కారణాలు వెతికారు. యిది మంచి పద్ధతే. సాంఘిక సంస్కరణోద్యమాలు. రాజకీయ ఉద్యమాలు, సాహిత్యోద్యమాలు, వచన ప్రక్రియలు, వ్యవహారిక భాష కోస్తా ప్రాంతంలో వలె రాయలసీమలో కొనసాగలేదని హేతుపూర్వకంగా వివరించారు. యిది చదివాక- దీన్ని ఇంకోవైపు నుండి చూడలేమా? అనే ఆసక్తి తలెత్తుతుంది. ఉమ్మడిగా వలసపాలనలో కొనసాగడం అనే సారూప్యత మినహా మిగతా తెలుగు ప్రాంతంతో సంబంధంలేని ప్రత్యేకత్వంవైపు నుండే దీన్ని పరిశీలిస్తే ఎట్లా ఉంటుంది? రాయలసీమ ఆర్థిక సాంస్కృతిక పరిణామాలను ఇక్కడి స్వీయక్రమంలో సమాజపు అంతర్గత పొరలలోపలి నుండి వివరించి - ప్రాంతీయ స్పృహను, ఆధునిక చైతన్యాల్ని చారిత్రకంగా నిర్మించే ప్రయత్నం చేస్తే రాయలసీమ వాస్తవిక దృశ్యం కనిపించవచ్చు.

అంటే 1910లో ఉత్తరాంధ్ర నుండి తొలి కథరావడాన్ని, అప్పటికే వ్యవహారిక భాషా ఉద్యమం ప్రభావశీలంగా ఎదగడాన్ని, 1930 - 40ల కల్లా మధ్య కోస్తాలో సుప్రసిద్ధ నవలలు రావడాన్ని రాయలసీమతో ఎందుకు పోల్చాలి? ఇలాంటి పోలిక అంతిమంగా వలసపాలకుల, స్వపాలకుల సంస్కరణ వ్యూహాలను, స్వభావాలను, వివక్షలను వివరించడానికి, విమర్శించాడనికి ఒక పద్ధతిగా ఉపయోగపడవచ్చుకానీ అదంతా చరిత్రలో భాగం. చరిత్ర యింకోలా ఉండి ఉంటే...? అనుకోవాల్సిందేగాని అలాంటి అవకాశం చరిత్రే యివ్వలేదు. చరిత్ర కల్పించిన ఈ నిర్ణయం వల్ల రాయలసీమ గురించిన అధ్యయనం ఏదైనా చరిత్రలో నిరంతర తులనాత్మక రూపంలో సాగక తప్పడంలేదు. ఉత్తరాంధ్ర అయినా రాయలసీమ అయినా ఈ పరిశీలనాచట్రాన్ని తప్పించుకోజాలవు. దీంతోపాటు రాయలసీమ స్వీయక్రమం వైపు నుండీ చూస్తే వలసపాలకుల భూ - రెవెన్యూ విధానంపట్ల స్థానిక సమాజమెట్లా ప్రతిస్పందించి ఉంటుంది. 150 ఏళ్ళ వలసపాలన వివిధ దశల్లో అమలయిన సంస్కరణలు, పాలనా పద్ధతులు కనీసం నాలుగైదు తరాల ప్రజల మనోభావాలమీద, ఆలోచనా రీతులమీద, సాంస్కృతిక స్థాయి మీద ఎలాంటి ప్రభావం వేసి ఉంటాయి. ఆ జీవిత సంఘర్షణలోంచి కొత్తదనం ఏఏ విషయాల్లో ఎట్లా పొటమరించి ఉంటుంది దీనిమీద బైటి ప్రభావాల మోతాదు ఎంత అనే ఆలోచనలు కొత్త అన్వేషణా మార్గాలుగా ఉపయోగపడతాయి.

ఈ కోణంలో వల్లంపాటి పరిశీలనల్లో రెండు విలువైనవి ఉన్నాయి. '1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడే వరకూ రాయలసీమ సామాజిక జీవితంలో కూడా చలనం చాలా తక్కువేనని చెప్పక తప్పదు. అక్షరాస్యత చాలా తక్కువగా ఉండటం చేత సామాజిక ఊర్ధ్వచలనం నామమాత్రంగా ఉండేది' అనీ, 'రాష్ట్రావతరణ వరకూ రాయలసీమ వంటరితనాన్ని అనుభవించింద'నీ అన్నారు. మొదటిది - లోపలినుండైతే, రెండోది - బైటి సమాజాల సంబంధాన్ని తెలియజేసేది.

1950లలో రాయలసీమ ఊర్ధ్వ చలనం మరీ మందకొడిగా ఎందుకుందో స్థానిక సమాజంవైపు నుండి చూడాలి. దీన్ని ప్రభావితం చేయలేని బైటి

సంబంధాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. రాయలసీమలోని మిగతా పట్టణాలకంటే బళ్ళారికి ఒక ప్రత్యేకత ఉండేది. వల్లంపాటి అయితే బళ్ళారిని రాయలసీమ సాంస్కృతిక రాజధాని అన్నారు. అదిగాక, ఆనాటికి రాయలసీమకు అందుబాటులో ఉన్న నగరం మద్రాసు మాత్రమే. అక్కడికి ఉన్నత చదువులకు వెళ్ళినవారు, కొత్త గాలులను పీల్చుకున్న వారు రాయలసీమ సమాజాన్ని ప్రభావితం చేయలేకపోయారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో సినిమా రంగంలో స్థిరపడినవారు రాయలసీమ తిరిగిచూడలేదు. వల్లంపాటి అయితే 'అలాంటి కొద్దిమంది సంపన్న యువకులు రాయలసీమను మర్చిపోయారు' అని కూడ అన్నారు. యిలాంటి అనేక కారణాలవల్ల ఆంధ్రరాష్ట్రం ఏర్పడే వరకూ సువిశాల పాలనాధికారం కింద ఉన్నా రాయలసీమ ఒంటరితనాన్ని అనుభవించింది. మద్రాసు రాష్ట్రంలో ఉన్నందువల్లనే ఉన్నత చదువులకు అవకాశం దొరికినా, బైటి ప్రాంతాలను కలిపే రైలు మార్గం వచ్చినా, సంప్రదాయ జలవనరులతో పాటు కె.సి. కెనాల్ లాంటివి వచ్చినా యివన్నీ కలిసి- దేశంలోని యితర ప్రాంతాల్లోకి ఆధునికత ప్రవేశించిన పద్ధతిలోనైతే రాయలసీమలో ఆరంభం కాలేదు. ఆధునికతను ప్రోదిచేసే అనుకూలతలు, వాటి ప్రభావాలు కనిపించినా మౌలికంగా లోపలి నుండి ఊర్ధ్వచలనానికి దారి తీయగల అంతర్గత పరిణామాలు లేకపోవడంవల్ల, కనీసం బైటి నుండి అలాంటి చోదక క్రియ జరగకపోవడం వల్ల రాయలసీమ తనదైన మార్గాన్ని ఎంచుకున్నట్టయింది.

***

ఇరవైవ శతాబ్ది ప్రారంభంలో మిగతా తెలుగు ప్రాంతంలో వలె రాయలసీమలో 'ఆధునిక' గాలులు వీచకపోయినప్పటికీ ఆ కాలంలో వచ్చిన సాహిత్యం నుండి వెలికితీయవలసినవి ఏమున్నాయో ఎప్పటికైనా పరిశోధన జరిగితే రాయలసీమలో ఆధునికత ప్రవేశించిన తీరు గురించి, సంధి దశ గురించి స్థానికమైన విశ్లేషణ యిచ్చినట్లవుతుంది. స్వీయక్రమం అనేమాట రాయలసీమ మొత్తాన్ని ఉద్దేశించి అనడమేగాని ఆంధ్రరాష్ట్రం ఏర్పడే వరకూ, ఆ తర్వాత చాలాకాలం వరకూ నాలుగుజిల్లాల్లో ఒక జిల్లా సాహిత్య ప్రభావం యింకొక జిల్లా మీద ఎంత వరకు ఉందనేది కూడా సందేహమే. స్థూలంగా చాలా సారూప్యతల ఆధారంగా రాయలసీమ సాహిత్య పరిణామక్రమాన్ని, ప్రాంతీయ చైతన్య క్రమాన్నీ, ఆధునికత ఆవిర్భావాన్ని నిర్ధారించవచ్చు.

దీనికి అవసరమైన చాలా పరిశీలనలను వల్లంపాటి ముందుకు తెచ్చారు. నిజానికి ఈ పుస్తకం చదవడం ప్రారంభించాక అక్కడక్కడ రచయిత రాయలసీమ సాహిత్య చరిత్ర నిర్మించే ప్రయత్నం చేస్తున్నారా? అనిపిస్తుంది. తొలిపలుకులో చెప్పుకున్నట్టు వివిధ రచయితల సాహిత్యకృషిని అధ్యయనం చేయడం, వివరించడమే అయినా సాహిత్య చరిత్ర రచనకు అవసరమైన ముడిసరుకు మాత్రమే కాక, దానికి కావలసిన పరిశీలనలూ, అంచనాలూ, అక్కడక్కడా సంవిధానమూ అందించారు.

నవలా ప్రక్రియ గురించిన వ్యాసం నుండి లోతైన, సునిశితమైన సాహిత్య సమీక్షరూపంలోనే పుస్తకం సాగిపోతుంది. ఒక్కో నవలలో వివరంగా ప్రాంతీయ చైతన్యం ప్రతిఫలించిన తీరును వివరించడమేకాక శిల్ప, నిర్మాణ చర్చ కూడా చేశారు. దృక్పథ చర్చ కూడా నడిచింది. సీమ నవల గురించి మాట్లాడుతూ 'రాయలసీమలో ఆధునిక నవల మధ్యతరగతి జీవిత చిత్రణతోనే ప్రారంభమైందనడానికి సందేహంలేదు. అంతేకాదు. అది కొంతకాలం మధ్య తరగతి ఆదర్శాలనూ, సెంటిమెంట్లనూ దాటి ముందుకు సాగలేదు' అన్నారు. యిది నవలకే కాక, కథకు కూడా కొంత వర్తించేదే. వచన ప్రక్రియల ఆవిర్భావం, మధ్యతరగతి యితివృత్తం, దృక్పథం యివి కూడా రాయలసీమలో ఆధునికత ప్రత్యేకతలను సూచిస్తాయి. బహుశా 1950 - 60ల నాటికి అంతర్, బహిర్ శక్తుల ప్రభావాల పర్యవసానమైన సీమ సమాజ పరిణామంలో ఒక మధ్యతరగతి వచన ప్రక్రియల్లో వ్యక్తీకరణ సామర్థ్యాన్నీ, వాటిని చదవడం ద్వారా సాహిత్యానుభవాన్ని పొందగల సాంస్కృతిక స్థాయినీ అందుకోగలిగింది. ఇంచుమించుగా నవల, కథ ప్రక్రియల ప్రవేశం ఇలాంటి సామాజిక చలన సన్నివేశంలోగాని సాధ్యం కాలేదు.

కథా ప్రక్రియ గురించిన అధ్యాయంలో వల్లంపాటి యింకో మాట అంటారు.'రాయలసీమలో కట్టమంచి రామలింగారెడ్డి వంటి మేధావులూ, పండితులూ ఉద్భవించారు. భారతదేశంలోని ఆధునిక విద్యాలయాలలోనూ, విశ్వవిఖ్యాతమైన బ్రిటీష్ విశ్వవిద్యాలయాలలోనూ చదువుకున్నారు. ఆధునిక తత్వశాస్త్రాలను ఆకళింపు చేసుకున్నారు. విద్యారంగానికి చెందిన పెద్ద పెద్ద పదవులను అలంకరించారు. కానీ సాహిత్య సంవేదనలో మాత్రం సమకాలీనతనూ, ఆధునికతనూ ఒంటబట్టించుకోలేకపోయారు' అని. చివరిమాట ముఖ్యమైనది. సంప్రదాయ సాహిత్యంలో అవకాశంలేని అంశం ఇది. సమకాలీనత, ఆధునికతలను సాహిత్య సంవేదనలో గుర్తించడం, అదీ వచన ప్రక్రియల్లో గుర్తించడం సమాజ సాంస్కృతిక స్థాయిని సూచిస్తుంది. 1950ల నాటికి ప్రధానంగా వచన ప్రక్రియల్లో వెల్లడయిన మధ్యతరగతి భావజాలం కూడా రాయలసీమ సమాజంలోకి ప్రవేశించిన ఆధునికత ప్రత్యేకతను పరిమితిని, తెలియజేస్తుంది.

***

1970లలో సంప్రదాయం నుండి మరికాస్త ఎక్కువగా ప్రాంతీయత వైపు, ఆధునికతవైపు రాయలసీమ సాహిత్యం మొగ్గింది. మధ్యతరగతి భావజాలం నుండి ప్రాంతీయ గ్రామీణ జీవన వాస్తవికతలోకి చేసిన ప్రయాణం 80లలో ఉధృతమైంది. గత పాతికేళ్లలో రాయలసీమలో వ్యక్తమయినంత స్థానిక చిత్రణ, ప్రాంతీయ చైతన్యం బహుశా ఇతర ప్రాంతాల సాహిత్యంలో కనిపించకపోవచ్చు. కానీ రాయలసీమ ప్రాంతీయ వాదం అనేది ఒక వాదంగా రూపొందకపోవడం విచిత్రం. కథ, నవలాప్రక్రియల్లో రాయలసీమ ప్రాంత జీవితంలోని వైరుధ్యాల స్వభావం ఎట్లా చిత్రితమైందో ఇటీవలి సమాజ చరిత్రలో భాగంగా వల్లంపాటి విశ్లేషించి ఉండాల్సింది.

ఈ దృష్ట్యా రాయలసీమ సాహిత్య చరిత్రను రూపొందించవలసిన అవసరాన్ని ఈ పుస్తకం బలంగా ముందుకు తీసుకొని వచ్చింది. ఆ పని మామూలుగా అలవాటైన వరుసక్రమాన్ని జాబితా వేయడం కాకుండా రాయలసీమ చారిత్రక, రాజకీయార్థిక ప్రాతిపదికలమీద, ఆయా రంగాల్లో రాయలసీమ ప్రత్యేకతల పునాది మీద జరగాలి. తెలుగు జాతిలో వేర్వేరు ప్రాంతాల స్వీయ క్రమాల ఆధారంగా వాటి ప్రత్యేకతలను నిలిపి ఉంచే చట్రాన్ని తయారుచేసుకొన్నప్పుడే తెలుగు సాహిత్య చరిత్రను సమగ్రంగా పునర్నిర్మించగలం. దానికి అవసరమైన ఒక ముఖ్యమైన ప్రయత్నంగా ఈ పుస్తకం నిలిచిపోతుంది.

చివరగా- ప్రక్రియా విభాగాల్లో కవిత్వం గురించి, అంతకంటే కూడా నవల గురించి వల్లంపాటి చాలా సోదాహరణంగా వివరించారు గాని, కథలో మొదలైన వేగం విమర్శలోకి వచ్చేసరికి మరీ ఎక్కువైపోయింది. బహుశా వేరు వేరు సందర్భాల్లో ఆయన విడిగా వ్యాసాలు రాసినందువల్లనేమో కథ గురించి అంత వివరంగా ఈ పుస్తకంలో రాయదలుచుకోలేదు. వల్లంపాటిలాంటి వాళ్ళకే రాయడం సాధ్యమయ్యే రాయలసీమ విమర్శా ప్రస్థానాన్ని ఎందుకో హడావిడిగా ముగించారు. 1970ల నుండి వచ్చిన సాహిత్యాన్ని విశ్లేషించేటప్పుడు దృక్పథ సంబంధమైన సమస్యలపై కేంద్రీకరణ తగ్గి పొగడ్తలు ఎక్కువైంది. సామాజిక, సాంస్కృతిక పరిణామాలతో అన్వయించి అంచనా ఇవ్వడం కూడా తక్కువైంది.

రాయలసీమ సమాజ సాహిత్యాల గురించి అనేక నిక్షిప్తాలను తవ్వితీయడంతోపాటు, ప్రాంతీయత గురించి, రాయలసీమలో ప్రాంతీయ చైతన్య వికాసం గురించి, ఆధునికత క్రమం గురించి - మొత్తంగా భవిష్యత్తులో నిర్మాణం కావలసిన రాయలసీమ సాహిత్య చరిత్రకు ప్రేరణనిచ్చే ఆలోచనలను పూసగుచ్చిన ఈ పుస్తకం తెలుగు జాతికి వల్లంపాటి చివరి కానుక కావడం అన్నిటికన్నా విషాదం. *

వల్లంపాటి కథలు రెండు :

రానున్న శిశిరం

భక్తరంజని వినాలని రేడియో పెట్టాను ... 1977వ సంవత్సరం .... గర్ గర్ ... ఆగష్టు నెల ..... పదేహేనవ తేది.... ఉదయం....నిలయంలో సమయం సరిగ్గా ఆరుగంటలు.

ఈ రోజు స్వాతంత్ర్యదినం. సుకన్య పుట్టి పాతిక పాతిక సంవత్సరాలు.... అబ్బో ఎంతకాలం.... ఎంత దూరం!

జైల్లో ఉన్న రోజుల్లో ఒక్కొక్క క్షణం శవజాగరణం చేసిన రాత్రిలా గడిచేది.

ఇప్పుడు ? సంవత్సరాలు క్షణాలుగా గడిచిపోతున్నాయి....

సుజాలాం, సుఫలాం, మలయజ శీతలాం !

వందేమాతరం .. భారతమాత సుజల, సుఫల !

వీధి కుళాయి దగ్గర అమ్మలక్కల పోరాటం అప్పుడే రాజకీయాల స్థాయిని అందుకుంది. మా వీధికది మలయమారుత రాగం "సుజలాం...."

"ఏమండీ కాఫీ...."

సీత వైపు చూశాను. ఓర్పు రూపెత్తిన సీత ! అమాయకత్వం నిష్కాపట్యం తేమగల మనసు ముప్పేటగా అల్లుకున్న నా బ్రతుకు జడ సీత !

.... తీసుకున్నాను. సీత చేసిన కాఫీ సీత మనస్సులా ఉంది ...

వీధంట ఒక గుంపు బిచ్చగాళ్ళు వెళ్తున్నారు. రాత్రి ఊరి బయట నాగరికులకు దూరంగా, నాగుపాములకు దగ్గరగా బ్రతికి ఉదయాన్నే క్షేమంగా ఊళ్ళో కొస్తున్నారు. చింపిరి తలలు, పుసి కారుతున్న కళ్ళు, ఎముకల గూళ్ళలా ఉన్నారు భావిభారత పౌరులు. "సుఫలాం"

" ఈ రోజు ఏం చేయమంటారు"? ప్రశ్నించింది సీత

"ఎందుకు"

"అమ్మా పట్టెడన్నం ఎట్టు తల్లీ !" చంకలో ఏణ్ణర్థం పిల్లాడితో ఒక భారతమాత నిలబడి ఉంది.

"వందేమాతరం, వందేమాతరం, వందేమా తరం"

సీత ఒక దోశడు బియ్యం వేసి వచ్చి "చెప్పండి" అన్నది

ఏమీ వద్దు"

"ఇవాళ....."

"అందుకే వద్దంటున్నాను"

సీత కళ్లలో ఆశ్చర్యం!...

"శ్రీశైల మల్లికార్జున విభో తన సుప్రభాతం", రేడియోలో బృందగానం.

క్షణం తటపటాయించి సీత వెళ్ళిపోయింది

శ్రీశైల మల్లికార్జునుడు నిద్ర లేవటమే లేదు ....

కానీ సుకన్య లేచింది..... ఇంకా నిద్ర వదలని కళ్ళతో, ఇంకా నిద్రలేవని మల్లికార్జునుడ్ని ఈర్ష్యతో చూస్తూ మత్తుగా మేడమెట్లు దిగుతోంది.

"అపుడే నిద్ర లేచావా తల్లీ !"

"హౌను ణాణ్ణా హిప్పుడే ళేచాణు," సుకన్య గొంతులో ఆవులింత, నిద్ర తలంబ్రాలు పోసుకున్నాయి.

పేపరు కుర్రాడు విసిరిన పేపరు ముంగిట తేమలో పడింది.

అందుకున్నాను...

"మీ కాలేజీలు ఎప్పుడు తెరుస్తారుట?"

"స్ట్రయికు పూర్తి కావాలిగా"

"అదెప్పుడు పూర్తవుతుంది"

"ఏమో !"

"అసలీ వల్లకాటి స్ట్రయిక్ ఎందుకుచేస్తున్నారు"

"చాలా డిమాండ్స్ ఉన్నాయి నాన్నా".

"అసలు మీరు చదువుకోడానికి వెళ్తున్నారా లేక ..'' "నేను ఇప్పుడు కూడా శ్రద్ధగానే చదువుకుంటున్నాను నాన్నా."

అకస్మాత్తుగా నాకు సుకన్య అమాయకంగా అబద్ధాలాడుతున్న పాపాయిలా కనిపించింది. నా కోపం మంచులా కరిగిపోయి,

"రాత్రి ఎందాకా చదివావమ్మా'? అబద్ధం నా కూతురు ఎలా, ఎంత అందంగా చెప్పగలదో చూద్దామని, సుకన్య ముఖంలోకి పరిశీలనగా చూస్తూ అడిగాను.

"ఒంటిగంట దాకా చదివాను నాన్నా, మీరేమో పది గంటలకే పడుకొన్నారు. చదువుతున్న పుస్తకం పూర్తయేదాకా.."

సుకన్య మాటలు నాకు వినిపించడం లేదు. దాని ముఖంలోకి పరిశీలనగా చూస్తే నా మనస్సు హిరోషిమా అయిపోయింది.

".. పడుకోగూడదనుకొన్నాను. పూర్తయేసరికి ఒంటి గంట దాటిపోయింది."

సుకన్య ముఖం సుకన్య ముఖంలా లేదు. ఆ కళ్ళల్లో ఇద్దరు ముగ్గురు పిల్లల్ని తొలగించుకున్న తల్లి గాని తల్లి కళ్ళలోని ప్రౌఢత్వం - శాంతిలేని, తృప్తి లేని ప్రౌఢత్వం..

"..... ఈ సారి నాకు తప్పకుండా క్లాసు వస్తుంది నాన్నా..."

"నోర్ముయ్. వెళ్ళు!"

సుకన్యఆశ్చర్యపోయి వెళ్ళిపోయిందను కుంటాను.

నా మనస్సు నా స్వాధీనంలోకి వచ్చేసరికి, సీత వంటించి గుమ్మం ముందు నిలబడి ఉంది.

" మరికాస్త కాఫీ తాగుతారా?" చిరునవ్వుతో ప్రశ్నించింది.

సీత చిరునవ్వును తప్పించుకోవటానికి, పత్రిక చదవటం నటించసాగాను.

అద్భుత శృంగార వీరదృశ్య కావ్యం - వయసు - మనస్సు

అర్ధనగ్నంగా ఉన్న ఒక అమ్మాయి అసహ్యాకరమైన భంగిమలో ఆంధ్ర ప్రేక్షక మహాశయుల కోసం నిలబడి ఉంది. (బ్రహ్మాండం, వారేవా!) వయస్సు... సుమారు పాతిక....వంకీల జుట్టు, కోల ముఖం..సుకన్యలాగే మొనకాస్త పైకి లేచిన ముక్కు! చూచేకొద్దీ అన్నీ ...అన్నీ సుకన్య పోలికలే అర్ధ నగ్నంగా సుకన్య ! ఈ అసహ్యాకరమైన భంగిమలో సుకన్య ప్రతిరోడ్డు మలుపులో సుకన్య ఛీ ఛీ!

భగవాన్ ఈ దేశాన్ని రక్షించు - ముఖ్యంగా స్త్రీల నుండి, రాజకీయ నాయకుల నుండి, వ్యవస్థలు నిలిచినా, కూలినా వారిద్దరి పనే !

పత్రిక విసిరి పారేసి వీధిలోకొచ్చాను.

మేడలు, చెట్లు కూలిపోయున్నాయి. నా మీద కూలిపోతున్నాయి... మేడలు, చెట్లు వ్యవస్థలు...మళ్ళీ ఇంట్లోకెళ్ళాను.....

సుకన్య పెరట్లోకి పోతూ నా వైపు ఆదో రకంగా చూచింది.

ఏకాంతంలో రేగిన ఆలోచనల్లాంటి జుట్టు!

చెదిరిన ఆత్మవిశ్వాసంలాంటి బొట్టు !

ఎంత వింతగా ఉంది సుకన్య ?

"ఏమండి స్నానం చేస్తారా?"

"ఆ..."

"నీళ్లుతోడాను త్వరగా లేవండి"

.... స్నానం పూర్తి చేశాను...పెరట్లో తాను నాటిన బాదం చెట్టు మొదట కూర్చుని సుకన్య పళ్ళు తోముకుంటూంది. దాని ముఖం చూడాలంటే నాకు భయమేసింది.

బట్టలు వేసుకొని బయలుదేరాను.

"మరికాస్త కాఫీ తాగుతారా?" సీత చిరునవ్వుతో ప్రశ్నించింది.

"అఖ్ఖర్లేదు"

నా కాఠిన్యానికి నాకే ఆశ్చర్యమేసి, "తాగాలని లేదు" అని సర్దుకుని బయలుదేరాను.

'వీధులు దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి. కొంత మంది కాలేజీ విద్యార్థులు కాబోలు ఎన్.సి.సి.యూనిఫారాల్లో సిగరెట్లు తాగుతూ (యూనిఫారంలో ఉన్నప్పుడు సిగరెట్లు తాగవచ్చా?) ముందు నడుస్తున్న అమ్మాయిని గురించి వాగుతూ నడుస్తున్నారు.

"నిలువవే వాలుకనులదానా, వయ్యారీ హంసనడక దానా...'' ముందు నడుస్తున్న వాలుకనుల వయ్యారి తిరిగి చూచి. పెదవులు బిగబట్టి నవ్వబోయి, మానేసింది.

యూనిఫారాలన్నీ ఒక్క సారిగా పులకించి పోయాయి

వీరగంధము తెచ్చి నారము

వీరులెవరో తెల్పుడీ..

ముందు నడుస్తున్న ఖద్దరు వస్త్రధారిణులైన యువతులు పాడుతుంటే, దేశభక్తితో, త్యాగంతో మా హృదయాలెలా చెమర్చాయి!

నిలువవే వాలు కనులదానా ?

"నమస్కారం సార్!"

"నమస్కారం"

"ఊరికా?"

"ఆ.. అలా ఊరికే"

ఇంద ఇంద తీసుకో... నన్నే సొంతం చేసుకో.....

ఎవరా పాడుతోంది ? సుకన్యేనా?.... అలాంటి పాటలు పాడద్దు నడివీధిలో అంత పెద్ద గొంతుకతో సుకన్యా సుకన్యా. నువ్వు నా బిడ్డని నువ్వలాంటి పాటలు నడివీధిలో ఇంత పెద్ద గొంతుకతో పాడకూడదు. మీ అమ్మ విన్నదంటే గుండె పగిలి చచ్చిపోతుంది.... వద్దు ...

ఇంద ఇంద తీసుకో ...

'అబ్బబ్బబ్బ! ఈ మైకులతో నరకంగా ఉంది '

నరకం - ఎలా ఉంటుంది నరకం ? నా బ్రతుకులా ఉంటుందా ?

కొన్నాళ్ళ ముందు ఎవరో కవి (పిచ్చాడు) ప్రేయసిని నరకానికి ఆహ్వానిస్తూ

'నరకం ఇక ఎంతో కాలం ఉండదుట, రా, పోదాం', అన్నాడు. ఈ సరికి నరకం ఉండదు కాబోలు.

ఎందుకుండదూ, ఉంటుంది. జగమే నరకం - బ్రతుకే నరకం

ఎర్ర చందనంతో చేసిన తొండం లేని వినాయకుడిలా ఉన్న ఒకశెట్టి గారు అరుగు మీద కూచొని బ్రెడ్డు ముక్కల్ని వీధిలోకి విసిరేస్తున్నారు. వాటికోసం కాకులు గోలగోలగా పోట్లాడు కుంటున్నాయి. కొన్ని తెలివైన కాకులు ముక్క నేలపడక ముందే రాజకీయ నాయకుడు పదవిని తన్నుకు పోయినట్టు ఎగరేసుకుపోతున్నాయి.

హరేరామ హరేరామ....

రామరామ హరేహరే

హరేకృష్ణ హరేకృష్ణ

కృష్ణ కృష్ణ హరేహరే

శెట్టి గారు 'రామా కృష్ణా, అనుకొంటూ దానం చేస్తున్నారు.

రామా - కృష్ణా! రామకృష్ణ ! ఆ వెధవ జ్ఞాపకం వస్తున్నాడు.

రామకృష్ణ నా బిడ్డ. నా రక్తాన్ని పంచుకొని పుట్టిన వాడు. తన స్వార్థం కోసం తల్లిని తండ్రిని పుట్టిన దేశాన్ని వదిలేశాడు.

రామకృష్ణను నమ్ముకొన్నాను. ఈ బ్రతుకు చాలించే టప్పుడు వాడి చేతి తులసినీళ్ళు తాగుతూ వాడిపేరు తలుచుకుంటూ చాలించాలనుకొన్నాను. కానీ, వాడు నన్ను వదిలి వెళ్ళిపోయాడు....

శంఖుమార్కు బనీనులనే వాడుదు సుఖం, సంతోషంకోసం శంఖుమార్కు బనీనులు.

సుఖం, సంతోషం !

ఎవరికున్నాయి? ఎవరికైనా ఉన్నాయా ? కొందరి కుండవచ్చు

చెరసాలలు, ఊరికొయ్యలు ఎవరిని రక్షిస్తున్నాయో వారికి. నాకు లేవు !

సుకన్య కున్నాయా? ఏమో?

రామకృష్ణకున్నాయా ?! నా కెందుకు?

ప్రేక్షక మహాశయులకొక శుభవార్త జూలీ - అపూర్వ హిందీ చిత్రం

జూలీ !!!

రాక్షసి ! పిశాచి!!

నా రామకృష్ణను గద్దలా తన్నుకుపోయింది.

బాగుంది ఉపమానం చాలా బాగుంది.

గద్దలా తన్నుకుపోయి ఏం చేస్తోందో ? పొడిచి పొడిచి తింటోందా? అయినా నాకెందుకూ? నన్ను మరిచి పోయినవాణ్ణి నేనూ మరిచిపోవాలి. కానీ వీలుకావటం లేదే !

పుచ్చి పోయిన పంటి మీదికి నాలుక పోయినట్టు నా మనస్సు వాడి మీదకే మళ్ళీ మళ్ళీ పోతోందే.

మనస్సు గుర్రం రోరి మనిసీ

మనసు కళ్ళెము లాగు మనిసీ!

పొగరుబోతు అధికారి కోపంలా వచ్చిన కారు పక్కనే ఆగింది.

"నమస్కారం ..గారూ" అన్నాడు విశ్వనాథరెడ్డి

"నమస్కారం", అన్నారు.

ఒకనాడు నన్ను ఖద్దరు బిచ్చగాడన్న విశ్వనాథరెడ్డికి ఆనాడు ఒక ఇల్లు, ఒకే ఇల్లాలు ఉండేవారు. తర్వాత అతనికి అన్నిటి సంఖ్య పెరిగింది.

రాజులెందరు మారినా రాణిని మాత్రం నేననే అన్నదట ఒకానొక రాణి. అలాంటివాడు విశ్వనాథరెడ్డి.

"పోలీస్ గ్రౌండ్స్‌లో మీటింగు ఉంది", అన్నాడు విశ్వనాథరెడ్డి స్టీరింగ్ నుద్దేశించి. ఎదురుగా వస్తున్న సినిమా బండి అరుపులో విశ్వనాథరెడ్డి స్వగతం కలిసి పోయింది

జూలీ నేడే చూడండి

"ఎందాకా వెళ్తున్నారు?"

"ఊరికే అలా .."

"మీటింగ్‌కి రాకూడదూ?"

రెండేళ్ళ క్రితం కూడా ఇలాగే తాను మాట్లాడబోతున్న స్వాతంత్ర్యదినోత్సవ సభకు తన కారులో తీసుకెళ్ళాడు విశ్వనాథరెడ్డి. ఈ ఏడు మళ్ళీ ... లేదంటే అతని పార్టీ మాత్రం మారింది.

"రావచ్చు క్రిందటేడు కూడా రాలేదు".

"ఎందుకూ?"

"స్వాతంత్ర్యమే లేకుండా దానికంత ఉత్సాహమెందుకనీ."

విశ్వనాథరెడ్డి గట్టిగా నవ్వి , "కరెక్ట్" అన్నాడు.

"ఎక్కండి ...డ్రాప్ చేస్తాను".

నవ్వొచ్చింది. నువ్వు కూడా డ్రాప్ చేస్తావా ? స్వాతంత్ర్యం రాగానే నా తోటివారు నన్ను డ్రాప్ చేసి పదవు లెక్కారు. నేను ఎన్నో ఆశలు పెట్టుకొన్న కొడుకు ఒక్క ఆడదాని కోసం నన్ను డ్రాప్ చేసి పారేశాడు.

కారు కదిలింది.

జూలీ..జూలీ.జూలీ..

ఎటువంటి త్యాగాలకైనా స్వాతంత్ర్యదిన కానుక చీరలు దోమతెరలు రాస్కెల్ చస్తావురా. ధూ ఆఫ్టికల్స్! అనాబ్‌షాహీ (మనం కొనలేం) భోజనం తయారు (ఇంత ఉదయాన్నే) గోల్కొండ బ్రాందీనే ....బాబోయ్ కారు పడిపోతుందేమో ..అబ్బ

"దిగండి"

"......"

'నమస్కారం"

"నమస్కారం"

స్వాతంత్రదినోత్సవం, ఇష్టంలేని కొడుకు తండ్రికి పెడుతున్న శ్రాద్ధంలా, నమ్మకం లేని అధికారి చేతిలో ప్రణాళికలా ఉంది...

....పురంబునందలి అనధికారులు శ్వేతమకుట ధారులయ్యును , అధికారులు పాలియెస్టర్ కవచ దారులయ్యును ఆసీసులై యుండిరి. మండల భూరాజ స్వగ్రాహక దొరవారు ఈ 'నౌకరు శాహీ' రాజ్యమును మధ్యనున్న యున్నతాసనము పై కూర్చుని వీక్షించు చుండిరి. ఇరువంకల కరండవాహికల వలె నిరువురు రక్షకభటులు....

రాజు వెడలే రవితేజములలరగ రాజసభకు నేడు, కుడి ఎడమల డాల్ కత్తులు మెరయగ... డాల్ కత్తులు....

"ఏం మామయ్యా ఇక్కడ నిలబడ్డావు"?

డాల్ కత్తులు పారేసి చూద్దునుకదా పలకరించింది కోడలు కాలేక పోయిన మేనకోడలు శాంత !

"ఏమిటమ్మా ఇలా వచ్చావు"?

"అమ్మకు మందు తేవటానికి వెళ్తుంటే మీరు కనిపించారు"...

పాపం నా చెల్లెలు ! నన్ను నా కొడుకును నమ్మి మోసపోయి మంచాన పడింది.

" అమ్మకెలా ఉందమ్మా".

"ఫరవాలేదు మామయ్యా, బావ ఉత్తరాలు రాస్తున్నాడా ?"

"అంత అదృష్టం లేదమ్మా. ఏ జన్మలో ఏ తండ్రీ బిడ్డల్ని విడదీశానో ...." శాంత కళ్ళల్లో కన్నీటిపొర !

"మనసు గట్టి చేసుకోవాలి మామయ్యా", శాంత మనసులోని అశాంతంతా ఒక్కమాటలో ధ్వనించింది.

"......

"ఏమిటి మామయ్యా ఆలోచిస్తున్నావు"

"నిన్ను గురించేనమ్మా".

శాంతకు అర్థమైంది. జవాబు చెప్పకుండా తన మనసులా రెపరెపలాడుతున్న తోరణాల్ని చూస్తోంది.

"వాడు నీకెన్నో ఆశలు చూపించి, చివరకు నిన్ను నట్టేట్లో ముంచి నీ బ్రతుకు చిదిమేశాడు కదా?"

"కొందరికి అభిమానం కంటే డబ్బు విలువైంది మామయ్యా"

ఆ వాలిన కనురెప్పల్లోని జాలి, వంగిన పెదవుల్లోని ఓర్పు, కంఠస్వరంలోని దైన్యం ఆ వేదవకు, ఆ రామకృష్ణకు - ఛీ వాణ్ణి నేను

మరిచిపోవాలి.

శాంత నిట్టూర్చింది.

చిన్నారి శాంత బ్రతుకే ఒక నిట్టూర్పయిపోయింది.

"వెళ్ళొస్తాను మామయ్యా".

'స్వాధీనంలో ఉన్న ఆలోచనల్లాంటి జుట్టు, ఆత్మవిశ్వాసంలాంటి చెదరని బొట్టు! సుకన్య... శాంత..

పోలీసుబాండు బయలుదేరింది.

మంత్రదండాన్ని ధరించిన మాంత్రికునిలా బాండుమాస్టరు కొయ్యబొమ్మలా నడుస్తున్నాడు. వెనుక బాండు దళం, ఆ వెనుక రిజర్వు పోలీసులు మామూలు పోలీసులు (పాపం ఇరవై నెలలు వీళ్ళకు మంచినీళ్ళకు రక్తానికి భేదం తెలియనే లేదు) ఆ తర్వాత ఎన్.సి.సి. దళం (విలువవే వాలుకనుల దానా) వారి వెనుక శిఖండులు ఎవరబ్బా వీళ్ళు? అమ్మాయిల దుస్తుల్లో అబ్బాయిలా, అబ్బాయిల దుస్తుల్లో అమ్మాయిలా? అరె ఆడపిల్లలే! నవ్వొస్తోంది. ముప్పైకోట్ల మంది పురుషులున్న ఈ దేశంలో ఆడది తుపాకి పట్టి దేశరక్షణ చేస్తానంటే నవ్వొచ్చేస్తోంది.

ఇది పురుషులు లేని దేశం కాదుగా?

జౌనూ? ఘనదేశంలో పురుషులున్నారు?

కట్టుబట్టయు, తిండి గతిలేని దేశన

పుట్టగొడుగులు గాక పురుషులెవరున్నారు?

ఎవడో మహాకవి అన్నాడు

ఇంత గొప్ప మాట అన్నవాడు మహాకవి గాక మరెవరు?

సాదా కవైతే బ్రేయసిని గూర్చియు మెల్లగన్నును గూర్చియు బద్యములు వ్రాసి యుండెడివాడు. తననననననతననానసన తననే.

ఆలోచన ఆపి అటెన్షన్‌లో నిలబడ్డాను....

జయహే జయహే జయహే

జయ జయ జయహే

అయిపోయింది స్వాతంత్ర్యం దినం.

స్వాతంత్ర్య దినోత్సవం రానురానూ జీవితమంత నిస్సారంగా మారిపోతోంది.

దీనికి కారణం ఎవరు?

అందరి జావాబూ ఒకటే నువ్వు - నువ్వు నువ్వే?

"వెళ్ళొస్తాను మామయ్యా" శాంతి తిరిగొచ్చింది.

"వెళ్ళి రామ్మా" అమ్మతో సాయంకాలం వస్తానని చెప్పు".

శాంత వెళ్ళిపోయింది. శాంతి వెళ్ళిపోయింది.

నేనూ వెళ్ళిపోతాను.

ఎక్కడికి? అగమ్య గమ్యస్థానానికి

ఆగమ్యంగా గమ్యం చేరేసరికి సీత వాకిట్లో నిలబడి ఉంది.

సీతా...సీతా.. ఆ సుకన్య నీ కడుపున ఎలా పుట్టింది 'సాలగ్రామ ఖనిన్ జనించునే కదా జాత్యుల్ప పాషాణముల్', సుకన్య పాషాణం తిని చచ్చిపోగూడదూ? ఛీ! ఛీ! సుకన్య నాబిడ్డ. అది చచ్చిపోతే నేను చూడగలనా?

ఎందుకు చూళ్ళేనూ?

గాంధీ గారు చచ్చిపోతే నేను బ్రతగ్గలనను కున్నానా?

గాంధీగారు పోయారు. కాదు చంపేశారు చంపేశారు

కానీ నేను బ్రతికానే?

నాకిట చిరునవ్వుతో నిలబడి ఉంది సీత.

సీత చచ్చిపోతే నేను బ్రతగ్గలనా?

ఛీ! ఎంత భయం కఠమైన ఆలోచన?

రారా కృష్ణా .....ఛీ మళ్ళీ వాడు మనసులో కొస్తున్నాడు.

"టిఫిన్ తింటారా?" సీత అడిగింది

"ఆకలిగా లేదు".

అయ్యో నోరు జారిపోయింది ఆకలిగా లేకేం?...

"తినండి" అన్నది సీత ప్లేటు చేతికందిస్తూ

ఉప్మా చాలా బాగుంది. తినేస్తున్నాను.

సీత వంటింట్లో నవ్వుకుంటోంది కాబోలు.. కానీ ప్లేటు ఖాళీ అయిపోయింది.

సుకన్య మేడ దిగుతోంది కాళ్లు చేతులు అదురు తున్నాయి. ఎందుకూ? భయమా? నాకెందుకు భయం? ప్లేటు దిగుతోంది ...మేడ మెట్లు చేతిలో ....బలహీనమైన మనస్సులా ఆదురుతోంది...ఎర్రచీర... రక్తం ....బంగారం చెప్పులు దిగుతోంది. ....బాబోయ్ ప్లేటు జారిపోతోంది...

"మార్నింగ్ షోకి వెళ్ళొస్తాను నాన్నా"

"అలాగేనమ్మా వెళ్ళిరా?"

ఇంత బలహీనంగా మాట్లాడుతున్నానేమిటి నేను!

"ఏ సినిమాకమ్మా?"

'ఏదో నాన్నా తెలీదు. న్యూరిలీజ్. స్నేహితులంతా కలిసి వెళుతున్నాము."

స్వాతంత్ర్య దినం కానుక, అద్భుత శృంగార వీర దృశ్య కావ్యం. వయస్సు మనసు

సన్నని నడుమున్న అమ్మాయి, ఆస్తి నాస్తి విచికిత్సా హేతుశాతోదరి, సుకన్యలాంటి - నొక్కులజట్టులాంటి అమ్మాయిలాంటి - సుకన్యలాంటి సుకన్య వీధి గడప దాటిపోయింది....

"అమ్మాయిని సినిమాకు పంపారా?" సీత అడిగింది - చిరునవ్వుతో.

మళ్ళీ చిరునవ్వు!

నా అంతరాంతరాలలోని బలహీనతల్ని గుర్తు చేసే చిరునవ్వు!

ఆ చిరునవ్వును తప్పించుకోవాలి.

అబ్బ! మనస్సు చికాకుగా ఉంది చీకి పాదలా ఉంది.

ఏదైన కాసేపు చదువుకుంటే బావుణ్ణు. ఏం చదివేది? నా దగ్గర ఏం పుస్తకాలున్నాయి.

వాల్మీకి రామాయణం - సుందరకాండ- "తతో రావణనీతాయా స్సీతా యాశ్శత్రు దర్శనం" ఎన్నోసార్లు చదివాను. మరి ఓపిక లేదు. భగవద్గీత. గీతా ప్రెస్ - గోరక్‌పూర్- కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు", ఈ విషయాన్ని భగవద్గీతకన్నా నా బ్రతుకే బాగా నచ్చజెప్పింది. "మై ఎక్స్ పెరిమెంట్స్ విత్ ట్రూత్" మహాత్మా నీకు నూరేళ్ళు నిండిపోయాయి రాం రాం..

సుకన్య ఎప్పుడూ ఏదో చదువుతూ ఉంటుంది. దాని గదిలో ఏదయినా ఒక పుస్తకం దొరకవచ్చు. ఇంగ్లీషు వాడన్నట్టు కాలాన్ని చంపటానికి..

.. పిచ్చివాడి మనస్సులా ఉంది సుకన్య గది. మూలబడిన కోరికల్లాంటి పాతబట్టలు. దుమ్మును పొడరుగా అద్దు కున్న పున్తకాల వన్నెల వినసకర్రలు..అబ్బ ఉక్కపోస్తోంది. ఆగష్టు నెలలో కూడా - రేపు రెండు వినసకర్రలు కొనాలి.

అయాన్ ఫ్లెమింగ్, హెరాల్డ్ రాబిన్స్, హడ్లీ, చేస్, నిక్ కార్టర్, అమ్మో అన్నీ ఇంగ్లీషు పుస్తకాలు."

"టెడ్‌మార్క్ - ఏజంట్ ఇన్ ది బెడ్‌రూమ్"

ఎవడో అన్నట్టు హత్య చెయ్యదలచుకుంటే ఏ చోటైతేనేమని - పరిశోధనకు కూడా చోటు లేదు కాబోలు.

అబ్బ! ఎంత అసహ్యంగా ఉంది అట్ట మీది బొమ్మ!

దాచుకోవాల్సిన అవయవాలు ఇక్కడే ఉన్నాయని సూచించడానికి ధరించిన బ్రాలతో, నలుగురు చాకుల్లాంటి అమ్మాయిలు ఒక చేతిలో సిగరెట్టు, మరొకచేతిలో రివాల్వరు ఉన్న ఒక పురుషుణ్ణి - ఏం చేస్తున్నారు? ఊ..... ఏదో చేస్తున్నారు.

బికినీలు ధరించిన అమ్మాయిలు ఎంత బాగున్నారు! ముఖ్యంగా నొక్కులు జట్టు అమ్మాయి! వయస్సు సుమారు పాతిక, అదే వంకీలు జట్టు. ఆ అమ్మాయి బికినీ లాగి పారేస్తోంది..వద్దు సుకన్య వద్దు! అలాంటి బట్టలు వేసుకోవటమే తప్పు. వాటిని లాగిపారేయటం అందులోనూ కన్నతండ్రి ఎదుట...అబ్బబ్బ! తల పగిలిపోతోంది.

"సీతా!"

"ఏమండీ"

"ఇలారా"

"ఇదిగో వస్తున్నానండీ"

సీత ఎంత బుద్ధిలేనిది. సుకన్య ఇలా ...ఇలా..... ఇదైపోతుంటే హద్దుల్లో పెట్టలేకపోయింది.

అన్నట్టు రామకృష్ణ పాడైపోయాడు - ఆ తప్పు నాదేనా?

"సీతా"

"ఇదిగో వస్తున్నానండీ"

"నువ్వే రానవసరం లేదు".

"అలాగేనండీ," బిగ్గరగా అంది సీత.

సీత కంఠం ఎంత హాయిగా ఉంది. సీత గొంతులో తంబూర శృతి ఉంది సీత పాడుతూంటే ఎదకు మంచి గంధం పూసుకున్నట్టుగా ఉంటుంది.

నగుమోము...కనలేని...నా జాలి...... తెలిసీ.....ఈ ...ఈ......

సీత నవ్వంటే ఈ రోజు భయం ఉంది.

సీతా నీ నగుమోము కనలేని నా జాలి తెలిసి....
"సార్! పోస్ట్"
"సీతా పోస్ట్ వచ్చింది చూడు"
"అలాగేనండి"
సీతకు, "అలాగేనండి", అనటం తప్ప మరో మాటరాదేమో
"సీతా డబ్బుతో చాలా ఇబ్బందిగా ఉంది....మీ నాన్నగారిచ్చిన గొలుసు...."
"అలాగేనండీ"
ఇలా ఎప్పుడూ సీత నా అభిప్రాయాలకు ప్రతిధ్వని!
"ఇదిగోనండీ ఉత్తరం".
చూచావా సీతా సుకన్య ఎలా అయిపోయిందో....
"ఏమిటండీ అలా చూస్తున్నారు. ఇదిగోనండీ ఉత్తరం"
'ఎలా' ?
చిరునవ్వు నవ్వింది సీత.
నగుమోము కనలేని నాజాలి తెలిసి తెలిసీ నవ్వింది.
వెళ్ళిపోయింది సీత, నేనూ వెళ్ళిపోతాను.
ఎక్కడికి ?
ఎక్కడికో - ఆగమ్య గమ్యస్థానానికి,
వెళ్ళిపోతాను ఈ నరకం నుండి వెళ్ళిపోతాను.
వెళ్ళిపోతే ఎలా? ఉత్తరం చదవద్దూ?
రాకరాక ఒక ఉత్తరం వచ్చింది. దాన్ని చదివేసి వెళ్ళిపోతాను.
కవరు చించాను.
"డియర్ సుకన్యా!"
అయ్యో ఇది నా ఉత్తరం కాదే!
కానీ చించేశానే. ఎలా ఇతరుల ఉత్తరాలు చదవటం ఎంత నీచం !
చివరికి అవి బిడ్డలవైనా ?
నాకు బిడ్డలెక్కడున్నారు? చచ్చిపోయారు.
ఛీఛీ! ఎంత మాట వాళ్ళు చచ్చిపోలేదు. నన్ను చంపేశారు.
నేను చచ్చిపోయాను. అయ్యో పాపం నేను చచ్చిపోయాను. "పరచికొందు నా మరణశయ్య నిప్పుడె..."
"డియర్ సుకన్యా! నీ ఉత్తరం అందింది. నీవు చెప్పినట్టు తేది..నీవ్వు చెప్పిన... హోటల్ వద్దనే ఎదురు చూస్తుంటాను. ఏదో ఒక కారణం చెప్పి వచ్చేయ్....ఎ థౌజెండ్ (ఛీఛీ) శ్రీహరి."
హరి హరీ! నా బిడ్డలు ఎందుకిలాగైపోయారు.
అసలు ఎందుకు చదివానీ ఉత్తరాన్ని...
చదవకుండా ఎలా ఉండగలను?
అదే నా బలహీనత!
బలహీనతను సమర్ధించుకోవడం మరొక బలహీనత!
"బెడ్‌మార్క్ - ఏజెంట్ ఇన్ ది ఒడ్ రూమ్".
నొక్కులు జట్టు సుకన్య అలా బట్టలు లాగి పారెయ్యకు...
"అదేమిటండీ. అలా కళ్ళు మూసుకు నిలబడ్డారు. ఏం చేస్తున్నారిక్కడ?"
మేడ మీదికొచ్చిన సీత ప్రశ్నించింది.
ఏం చేస్తున్నానా ? చచ్చిపోతున్నాను. నీ బిడ్డలిద్దరూ గొంతు కోసేస్తుంటే క్రమంగా చచ్చిపోతున్నాను.
"అరె ! ఎవరి వద్దనుంచండీ ఉత్తరం" !
"నా స్నేహితుడి వద్ద నుండి"
"ఎవరండీ ఆయన"?
"నాకు ప్రాణస్నేహితుడు. జైల్లో ఒకే గదిలో ఉండే వాళ్ళం .....పాపం!"
"ఏమింటండీ ఏం జరిగింది?"
"అతని కూతురు చచ్చిపోయిందట".
"పాపం".
"అతనికిద్దరే పిల్లలు. ఒక కొడుకు, ఒక కూతురు - కొడుకు ఇంతకుముందే చనిపోయాడు. ఇప్పుడు కూతురు పోయింది"
"అయ్యోపాపం ఎంత అన్యాయమండి!
ఔను. ఎంత అన్యాయం. బిడ్డలు తండ్రిని చంపేయ్యటం ఎంత అన్యాయం. చూశావా సీతా నేను చచ్చిపోయాను.
"పాపం అంత బాధని ఎలా భరిస్తారో ఆయన", అన్నది సీత.
"ఎవరు"?
"వారేనండీ మీ స్నేహితుడు"
సుకన్య బికినీ లాగి పారేస్తోంది ...దాన్ని చూడు సీతా ! మన లోకం వేరు. ఈనాటి లోకం వేరు. వీటి మధ్య పెద్ద అగాధం
అగాధమైన అగాధం
ఈనాడు "పాపం పుణ్యం ప్రపంచమార్గం..అన్నీ శ్లేషార్థాలు"
అన్నీ శ్లేషలే! ఈనాటి జీవితమే ఒక పెద్ద శ్లేష...
"సుకన్య వచ్చే వేళయింది ! వడ్డిస్తాను. కలిసి భోంచెద్దురుగాని లేవండి."
"అలాగే" అన్నాను అసమర్థుణ్ణి.
దాంతో కలిసి నేనెందుకు భోంచేయాలి? దానికీ నాకూ ఏమిటీ సంబంధం.
రక్త సంబంధం.
అదేనాడో తెగిపోయింది.
అది తెగిపోదూ.
రామకృష్ణ తెంచితే తెగలేదూ?
తెగలేదు.
"అమ్మా", సుకన్య కింద నుంచి పిలిచింది.
"వస్తున్నా" వెళ్ళిపోయింది సీత...
"ఎలా ఉందే సినిమా?"
"చాలా బాగుంది డాన్సులు , యుద్ధాలు ఫైన్".
నొక్కుల జట్టు అమ్మాయి... సుకన్య లాంటి నొక్కుల జట్టు డాన్సు -
ఇంద ఇంద తీసుకో
ఏముందీ తీసుకోవటానికి.
సుఖం లేదు, శాంతి లేదు, శంఖుమార్కు బనీనులు లేవు.
"వడ్డించాను త్వరగా భోజనానికి రండి".
"ఇదిగో వస్తున్నా" ఉత్తరాన్ని టేబిలు మీద పడేసి క్రింది కెళ్ళాను.
అద్దం ముందు నిలబడి ముఖం తుడుచుకుంటోంది.
మెదడులోంచి వేలాడుతున్న పాముల్లా ఉన్న రెండు జడలు.
అలికినా ముగ్గు పెట్టని ముంగిలా ఉన్న బొట్టులేని నుదురు!
ఛీ ఛీ. దీని ముఖం చూడకూడదు
'దీని' ముఖం చూడకూడదనుకొంటే ఎదురుగా,
'వాడి', ఫోటో, వాడి ఫోటో నా ఇంట్లో ఎందుకుండాలి.
వాడు నా కొడుకు.
బరువుల్ని చూచి పారిపోయి బంధాలు తెంచుకున్నవాడు నాకింకా కొడుకెలా అవుతాడు?
అబ్బ తల పగిలిపోతుంది. నా బతుక్కి సుఖం సంతోషం లేవు.
రేపు రెండు శంఖుమార్కు బనీన్లు కొనాలి - సుఖం కోసం, సంతోషం కోసం. కాని బనీన్లు కూడా కొనలేనివారి సంగతో?
విదేశీవాళి కార్లలో తిరుగుతున్న నాయకులు... దేశం ఇంత బాగుపడిపోయిందేం - అని ఆశ్చర్యపడి పోతున్నారు.
దేశవాళి కార్లలో విదేశీవాళి వాననల్తో తిరుగుతున్న ప్రేమమార్కు కవులు విప్లవాలను గురించి అరుస్తున్నారు.
అమ్మాయిలు జట్టు కత్తిరించుకొంటూ, అబ్బాయిలు జట్టు పెంచుకొంటూ అందరూ సుఖంగానే ఉన్నారనుకొంటున్నాను.
నాకు మాత్రం సుఖం, సంతోషం లేవు
"వడ్డించాను కూర్చోండి", నవ్వుతూ అన్నది సీత
నీ నగుమోము కనలేని - నా జాలి తెలిసి తెలిసి అలా నవ్వకు.
"ఎందుకూ"?
అప్పుడే భోజనానికి సిద్ధంగా కూర్చొని ఉన్న రాక్షసి నవ్వింది.
"ఎందుకు నాన్నా- తినటానికి" అన్నది సుకన్య
కాని సుకన్య
అయినా దాని ప్రక్కన కూర్చొని నేనెందుకు భోంచేయాలి.
"ఆకలిగా ఉంది రా నాన్నా" అన్నది రాక్షసి.
"కూర్చోండి," అన్నది సీత పాయసం కప్పు పక్కన పెడుతూ.
"ఇదేమిటీ"?
"పాయసం".
"ఎందుకూ"?
"ఇవాళ రెండు పండగలు కదండీ - స్వాతంత్ర్య దినం, సుకన్య పుట్టినరోజు..."

"ఎవరికీ"?

"మనందరికీ".

"మనమంటే"?

"ఏమిటండీ ఆ మాటలు". సీత కంఠంలో భయం!

సుకన్య ఆశ్చర్యపోయి చూస్తోంది.

"నేను తినను. నాకక్కర్లేదు"

సీత జవాబు చెప్పలేదు.

సుకన్య అన్నం తినలేదు.

"ఏమిటలా చూస్తావు? నేను తిననంటే తినను".

"నువ్వు తినకపోతే నేనూ తినను" అన్నది సుకన్య తన నొక్కుల జట్టు పైకి తీసుకుంటూ.

సుకన్యలాంటి అమ్మాయి - సుకన్యలాంటి నొక్కుల జట్టు అమ్మాయి ప్రతి వీధిమలుపులో - ఇంద ఇంద తీసుకో... అని బికినీలు లాగిపారేస్తోంది.

"వద్దు సుకన్య వద్దు అలాంటి పని చెయ్యద్దు" మనసులో అనుకోబోయి బిగ్గరగా అనేశాడు.

"ఎందుకు చెయ్యనూ, చేస్తాను" అన్నది సుకన్య.

"ఏమిటే ఎన్ని గుండెలు నీకు ! చేస్తావా? చెయ్ నీ ఇష్టం వచ్చినట్టు తిరుగు, మానం మర్యాద లేకుండా తిరుగు...... తిరుగు....."

అబ్బ తల తిరిగిపోతుంది.

"చాలా ఆకలిగా ఉన్నట్టున్నారు కూర్చోండి", అన్నది సీత భయాన్ని చిరునవ్వుగా మార్పు చేయాలని ప్రయత్నిస్తూ.

సీతా! నేను తినగలనంటావా? పిచ్చిదానా! నీ అజ్ఞానం నీకు దేవుడిచ్చిన వరం. నేను ఈ రోజు తింటున్నది అన్నం కాదు విషం! విషం!

ఎంత హాయి! హాయిగా ఈ విషం తిని హాయిగా చచ్చిపోతారు. ఎంత సులభంగా దొరికింది ! విషం తినటానికి కూర్చున్నాను....

"పచ్చడి బాగుందా?" సీత ప్రశ్న

"నా బ్రతుకులా ఉంది"

"అంటే" సీత గొంతులో భయం

"చప్పగా"

రాక్షసి గలగలమని నవ్వింది.

....

"పాయసం ఎలా ఉందండి?"

"లేదు"

"బాగా లేదాండీ? సీత ఆశ్చర్యపోయింది

"ఏమిటీ?"

"పాయసం"

"బాగలేదని ఎవరన్నారు?"

"మీరేగా అన్నారు".

"పాయసం ఎలాగుందని అడిగావా నువ్వు?"

"అడిగాను కదండీ. మీరు బాగాలేదన్నారు", సీత కళ్ళల్లో నవ్వుల తళతళ.

"అలాగా! నా మనసు ఎలా ఉందని అడిగావనుకున్నాను".

సీత కళ్ళలోని తళతళమాయమైపోయింది. క్రమంగా భయాల నీడలు , తెగిపోయిన ఆశలు, రామకృష్ణులు, గద్దలు ఆ కళ్ళల్లో తెరలు తెరలుగా కదిలారు.

సీత కళ్ళనిండుకూ కన్నీళ్ళు ఉబికి వచ్చాయి అందుల్లో అన్ని దృశ్యాలు కరిగి పోయాయి.

అయ్యో అయ్యో ! నా సీత ఏడుస్తోంది సీతని ఏడిపించాక నేనందుకు బ్రతకాలి

ఏమనుకోకు సీతా ఈ రోజు మనసేం బాగాలేదు.

ఈ రోజు మనస్సులో చాలా ముళ్ళు గుచ్చుకొన్నాయి. వాటిని పీకేసుకోలేక ఛస్తున్నాను. తీరా ఒక్కటంటే ఒక్కటి పీకానో లేదో, అది నీకు గుచ్చుకొంది ఏమనుకోకు సీతా !

సీత ముఖం చాటు చేసుకొని పెరట్లోకెళ్ళిపోయింది.

నా మనస్సు రెపరెపలాడి పోయింది..నేనూ వెళ్ళాను

బాదం చెట్టు నీడలో నిలబడి సీత కళ్ళు తుడుచుకుంటూంది. సీత కళ్ళు లోతులేని నీటిలో నిశ్చలంగా ఉన్న ఎర్రని చేపల్లా ఉన్నాయి.

"రామకృష్ణ జ్ఞాపకం వచ్చాడా !" వెలగని చిరునవ్వుతో ప్రశ్నించింది సీత.

అవును సీతా రామకృష్ణ మాత్రమే కాదు. నా జీవితం మొత్తం జ్ఞాపకం వస్తోంది. కొందరి జీవితాల్లో పరాజయాలు అప్పుడప్పుడూ మాత్రమే వస్తాయి కానీ, నా జీవితం మొదటినుంచి చివరివరకూ ఒకే పరాజయం.

నా బ్రతకు అందరి బ్రతుకుతో పెవేసుకుపోయిందనుకొన్నాను. కానీ అందరి బ్రతుకులాగే నా బ్రతుకూ తెల్లవారింది.

ఈ రోజు నేను పాయసం తాగలేను ....ఏమి అనుకోవద్దు.

"ఏమండీ రామకృష్ణ జ్ఞాపకం వచ్చాడా ?" మళ్ళీ అన్నది సీత

అవును సీతా ! బాధ్యత సృష్టించే సమస్యల్ని చూచి భయపడిపోయి, దూరంగా పారిపోయిన రామకృష్ణ జ్ఞాపకం వచ్చాడు. వాడి జ్ఞాపకంగా మనకు మిగిలింది వాడి చదువుకోసం మనం చేసిన తీర్చలేని అప్పులు మాత్రమే !

"అవును సీతా!" అన్నాను.

"నిన్నటి నుంచీ నా మనసులోనూ వాడే మెదలు తున్నాడు".

అలాగా?

"రాత్రి నిద్ర కూడా పట్టలేదు"

నిద్రకు వెలియై నీ వొంటరివై ఎంత బాధపడ్డావో!

"నిన్న రామకృష్ణ ఉత్తరం రాశాడు." అన్నది సీత

నాగుండె క్షణం ఆగినట్టనిపించింది. కళ్ళు చెవులు వెచ్చగా నిట్టూర్చాయి.

"ఎవరికి...నా...నాకా ?"

"...... కాదు సుకన్యకు. మనకు రాసే ధైర్యం వాడికి లేదు".

"జీవితంలో ఎన్ని దెబ్బలు తిన్నా నీలో అమాయకత్వం పోలేదు".

"అదో మీరలా బాధపడతారనే మీతో చెప్పలేదు".

ఇప్పుడు కూడా చెప్పకుండా ఉంటే బాగుండేది. పోనీ ఏం రాశాడు"?

"మామూలే..."

"చూడు సీతా అదంతా ఆత్మ వంచన - పరవంచన, విశాలదృష్టి ఉన్న వాడెవడూ వాడు చేసిన పని చెయ్యడు, ఆ మాటకొస్తే నా వరకూ నాకు కులం మీద, మతం మీద నమ్మకం లేదు. కానీ అంత మాత్రాన నేను నాస్తికుణ్ణి కాను..."

"అవును"

"ఛీఛీ! వాడికంత విశాల దృష్టే ఉంటే వాడి పేరెందుకు మారేది"

"ఇదిగో నాన్నా అన్నయ్య ఉత్తరం"

ఒక జడ ముందుకు, మరొక జడ వెనక్కు వేసుకొన్న సుకన్య - నా రక్తాన్ని పంచుకొన్న సుకన్య - ఇంద ఇంద తీసుకో సుకన్య - టెడ్ మార్కుల సుకన్య - శ్రీహరి సుకన్య వచ్చింది.

"ఇదిగో నాన్నా అన్నయ్య ఉత్తరం" కవరులోంచి ఉత్తరాన్ని తీసిచ్చింది.

"చదవండి", అన్నది సీత.

..... ప్రయత్నించాను

కళ్ళు చెదిరిపోతున్నాయి. అక్షరాలు కదిలి పోతున్నాయి మనసులో అక్షరాలు ఉత్తరాలు కలిసి పోతున్నాయి.

"డియర్ సుకన్యా! నీ ఉత్తరం అందింది. నీవు చెప్పినట్టు 25వ తేదీ నువ్వు చెప్పిన హోటలు వద్దనే ఎదురుచూస్తుంటాను ఏదో ఒక కారణం చెప్పి వచ్చేయ్..."

"ఛీ ! నా ఉత్తరం చింపింది నువ్వేనా ?"

సుకన్య చెంప ఛెళ్ళుమంది.

"ఏమండి ఏమండీ..." సీత నిలబడలేక బాదం చెట్టు మొదట కూలిపోయింది.

మునిసిపల్ ఆఫీసుకు షిఫ్టరమెంట్ల కోసం వెళ్ళిన పిల్లలు తిరిగొస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు సంప్రదాయంగా జరిగే అన్నదానానికి బీదా బిక్కీ పరుగులు తీస్తున్నారు.

.....సుకన్య నాటిన బాదం చెట్టు ఆకులు రాలుస్తోంది...

"అప్పుడే శిశిరం వచ్చిందా."?

"లేదే"

"మరి ఆకులు రాలిపోతున్నాయే"?

"ఈ చెట్టు కేదో చీడ పట్టింది".

అయ్యో! నా ఆకులు రాలిపోతున్నాయి. నా గుండెలు జారిపోతున్నాయి కూలబడ్డాను.

నా మీద నా ఆకులు రాలుతూనే ఉన్నాయి.

జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, 1977
తెలుగునాడి, 2006లో పునర్ముద్రణ

*

బంధాలు

నమస్కారం సార్!

నా పేరు శివరామయ్య. మా పొలాలు సాగుచేసే రైతులు నన్ను శివప్ప అంటారు. చదువుకున్నవాళ్ళూ, చదువుకున్నామనుకున్న వాళ్ళూ, వాళ్ళు చదువుకున్నారని మనం అనుకోవాలనుకున్న వాళ్ళూ నన్ను మిస్టర్ శివయ్య అంటారు. నా ప్రాణస్నేహితుడు డాక్టరు వెంకటేష్ నన్ను "శివా". అని పిలుస్తాడు. ఇతరుల్తో నన్ను గురించి మాట్లాడేటప్పుడు శివుడు అంటాడు.

ఇంతకూ మీకు వెంకటేష్‌ని గురించి చెప్పానా? లేదనుకుంటాను.

సమయం వచ్చినపుడు చెబుతాలెండి.

నేను నన్ను గురించి ఏం చెప్పాలన్నా వాణ్ణి గురించి చెప్పక తప్పదు.

ఎందుకందటారా? అదో పెద్ద కథ.

ఇంతకూ అసలు విషయమేమిటంటే ఈ ప్రపంచం - అంటే ఈ మనుషులు- పెదవుల్తో పలకరిస్తూ, నొసటితో వెక్కిరిస్తూ ఉంటారేందుకని. వీళ్ళు మనమీద ఎందుకు పడతారో ఎప్పుడు కౌగిలించుకుంటారో ఎందుచేత అర్థం కాదని, ఎందుకని ఓ నేస్తగాణ్ణడిగాను.

"నీతోనేకాదురా నా తండ్రి, అందరితోనూ అలాగే ప్రవర్తిస్తారు" అన్నాడు.

"ఎందుకూ?" అన్నాను.

"ఎందుకంటే - అది వాళ్ళ స్వభావం" అన్నాడు.

"అది సరేలేవోయ్, ఆ స్వభావం వాళ్ళకెందుకొచ్చింది?" అన్నాను మళ్ళీ.

"ఎందుకంటే ....ఎందుకంటే...." అని ప్రారంభించి మిగిలిన భావాన్ని వాడు నవ్వుతో పూర్తిచేశాడు.

అలా వాడు నా అజ్ఞానాన్ని నాజూగ్గా వెక్కిరించి, తన అజ్ఞానాన్ని నవ్వుకింద దాచేశాడు.

అలా నా ప్రశ్నమాత్రం ప్రశ్నగానే మిగిలిపోయింది.

నేను మంచివాణ్ణి కాదంటారు మా బంధువులు. మంచి సంగతి అంతగా నాకు తెలీదుకానీ. నేను చెడ్డవాణ్ణి మాత్రం కాను,

నాకు తెలిసి నేను ఎవరికీ చెడ్డ చేయలేదు. చెడ్డ చేయని వాడు చెడ్డవాడెలా ఔతాడో మీరే చెప్పండి.

నేను అబద్ధం చెప్పటం లేదు సార్!

ఇప్పుడు నేనున్న స్థితిలో నాలాంటివాడు అబద్ధం చెప్పడంటే చెప్పడు.

నేను తాగుబోతుననేవారు కూడా లేకపోలేదు.

నేను తాగేమాట నిజమే - అప్పుడప్పుడూ నాకు తాగుడు అలవాటు కాదు.

నా మిత్రుడు వెంకటేష్ "డ్రింక్ ఈజ్ ఎ గ్రేట్ లిబరలైజర్" అంటాడు.

వాడికొచ్చినంత చదువు నాకు రాదు, నాకు తెలిసిందొకటే-

"నేను తాగుబోతునుమాత్రం కాను"

ఈ సంగతి ఈ గ్లాసు సాక్షిగా చెప్పగలను,

మరో విషయం సార్, నా గుణం మంచిదికాదనే వాళ్ళు కూడా మా బంధువుల్లో చాలా మందున్నారు.

"గుణం అంటే ఏమిటి?" అన్నాను - ఆ మాటన్న ఒక బంధువుతో. అతడు నాకు మామయ్యవుతాడు.

చెప్పవయ్యా గుణం అంటే ఏమిటో?" అన్నాను మళ్ళీ

అతడు ఇరుకు మాన్లో ఇరుక్కున్న దొంగగొడ్డులా గిలగిలలాడిపోయాడు.

అతడు కాస్సేపు ఆలోచించి "గుణం అంటే నీతి" అన్నాడు.

"నాకు నీతి లేదంటావా"

"నువ్వ ఆమెతో సంసారం చేయటం నీతెలా ఔతుంది?" అని ఎదురుప్రశ్న వేశాడు. పైకప్పును చూస్తూ.

"ఎవరితో?"

"ఆదిలక్ష్మితో"

"ఎందుకో?"

"అమెది మన కులం కాదుగా"

"నాకు కులం మీద నమ్మకం లేదుగా" అన్నాను.

"మీరిద్దరూ పెళ్ళికూడ చేసుకోలేదు" అని గట్టిగా అరిచాడు.

'మా ఇద్దరికీ పెళ్ళిమీద కూడా నమ్మకం లేదుగా. ఒక వేళ చేసుకుందామన్నా నీలాంటి వాళ్ళు ఒప్పుకోరుగా" ?అన్నాను.

ఆ మామయ్య అనే వాడికి ఒళ్ళు తెలియని కోపం వచ్చింది.

"ఛీ! నీ ముఖం చూడకూడదు"అని నిష్క్రమించాడు.

అంతేనండీ! ఆనాటితో నాకు బంధాలు తగ్గిపోయాయి. నా వద్దకు రావటం కలిసికట్టుగా అందరూ మానేశారు.

అంతకుముందు పెళ్ళిళ్ళకో, చావుకో మొక్కుబడిగా నైనా పిలిచేవారు.

ఆ తరువాత అందరూ కలిసికట్టుగా నా ముఖం చూట్టం మానేశారు.

నిజం చెప్పాలంటే నా బతుకులో ఆనందం ఆనాడే ప్రారంభమైంది. అది నా ఆస్తిపాస్తుల్తోపాటు చకచకా జొన్నకర్రగా పెరిగింది. ఇప్పుడు నాకు నేను శ్రద్ధ చూపకపోయినా చక్కగా సాగిపోయే వ్యాపారం ఉంది. నమ్మకంగా కొలిచ్చే రైతులున్నారు.

ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఈ ఇల్లుంది. అందులో ఆదిలక్ష్మి ఉంది. చూడండి సార్!

ఆదిలక్ష్మిని "ఇల్లాలు" అని మీరు అంటారో అనరో అది పూర్తిగా మీ ఇష్టం. కానీ, నా ఇష్టం వచ్చినట్టుగా ఉండటం నాకిష్టం.

ఈ విషయం తెలిసిన ఒకే ఒక నేస్తగాడు డాక్టర్ వెంకటేష్

ఆ.. వెంకటేష్ ను గురించి ఇంతకుముందే చెప్పానుగా.

మనిషంటే వాడేసార్. కత్తి లాంటి మనిషి

వాడు నాకు రెండో నేస్తం

మొదటి నేస్తం ఆదిలక్ష్మి. వాడికీ నాకూ నేస్తం కాలేజీలో పోట్లాటతో ప్రారంభమైంది.

వాడు నన్ను అనవసరంగా అవమానించాడు

వాడు నాకన్నా తెలివైనవాడూ, బలమైన వాడూ కావటం చేత నేను వాణ్ణేమీ చేయలేక పోయాను.

రెండో రోజు ఏం జరిగిందో తెలుసా సార్!

వాడు సరాసరి నా గదికొచ్చేసి నా చేతులు పట్టుకొని, క్షమించమని కోరుతూ కౌగిలించుకున్నాడు.

అంతే!

ఆ కౌగిలింత ఇంకా విడిపోలేదు.

వాడు మంచి మూడ్‌లో ఉన్నప్పుడు అంతటి జ్ఞానీ, తత్వవేత్తా మరొకడు ఉండడు. వాడొకసారి -

"ఒరే శివా! మీ వాళ్ళు నీకు దూరంగా ఎంత కాలం ఉండగలర్లేరా" అన్నాడు. అప్పుడు మేము వెన్నెల్లో కూచొని కబుర్లు చెప్పుకుంటున్నాం.

వెన్నెల నులివెచ్చగా కురుస్తోంది. పెరట్లో ఉన్న కొబ్బరి చెట్లు వెన్నెల్లో స్నానం చేస్తూ మత్తుగా ఉన్నాయి. మాలాగే - కొబ్బరాకుల మీదనుంచీ వెన్నెల తెల్లతెల్లగా పచ్చపచ్చగా జారుతోంది.

అవి కత్తుల్లా తళతళమంటున్నాయి. పాముల్లా సరసరమంటున్నాయి.

"ఎప్పటికీ రారేమో" అన్నాను.

"ఎందుకు రారూ ?" అన్నాడు వాడు.

"వాళ్ళకి నేనంటే ఇష్టం లేదుగా".

"ఒరేయ్, ఈ లోకంలో బంధుత్వాలు ఇష్టాయిష్టాల మీద మాత్రమే ఆధారపడవురా" అన్నాడు వాడు.

"నాకు దగ్గర బంధువులు మాత్రం ఎందరున్నారూ? మా అక్కయ్య మామయ్య మా అన్నయ్య అంతేగా?"

"బంధువులు నల్లుల్లాంటివాళ్ళు. ముగ్గురున్నా చాలు" అన్నాడు వాడు నవ్వుతూ.

మామూలుగా నవ్వితేనే వాడు బావుంటాడు. వాడు గొంతుతోకాదు, కళ్ళతో నవ్వుతాడు. ఇక వాడు వెన్నెల్లో నవ్వితే వాడి నవ్వుకు పోలికల్లేవు సార్. ఇంతలో ఆదిలక్ష్మి గమగమలాడే పళ్ళేలతో రావటంతో మా మాటలు మారిపోయాయి.

అలా నవ్వుల్ని గురించి ఆలోచిస్తూ, నల్లుల్ని

గురించి మరిచిపోయాను.

కొంతకాలాం తరువాత ఒక విచిత్రం జరిగింది.

ఒక రోజు తల తిరిగి బాత్‌రూంలో పడిపోయాను.

ఉన్నట్టుండి తల తిరిగినట్టనిపించింది....

అదిగో అలా నవ్వకండి సార్.

మీ నవ్వుకు కారణం నాకు తెలుసు. అలాంటిదేం లేదు. నేను మామూలుగానే ఉన్నాను.. ఇంతకూ చెప్పొచ్చిందేమిటంటే, తల తిరిగింది.... పడిపోతున్నానని పించింది.. పడిపోయే ఉంటాను.

తెలివొచ్చేసరికి ఆస్పత్రిలో ఉన్నాను.

ఒక వైపు వెంకటేష్, మరోవైపు ఆదిలక్ష్మి చెరోచెయ్యి పట్టుకొని కూచొనున్నారు.

నిజం చెప్పొద్దూ నాకు బలే నవ్వొచ్చింది కానీ, నవ్వలేక పోయాను.

నేనలా ఆస్పత్రిలో పడుకోనుండటం ఎందుకో అసహజమనిపించిది.

నేను ఆస్పత్రిలోపు పట్టనూలేదు... పుట్టాక వెళ్ళనూ లేదు.

వెంకటేష్ ఏవేవో పరీక్షలు చేశాడు. మందులిచ్చాడు.

ఉప్పు కారం తగ్గించమన్నాడు. తెల్లవారు జామున షికారు వెళ్ళాలన్నాడు.

"తీర్థ" యాత్రలు మానేయాలన్నాడు.

కనీసం కొంత కాలం గౌతమబుద్దునిలా ఉండాలన్నాడు.

అలాగేనన్నాను. వాడు చెప్పటం, నేను వినకపోడటం ఉండదుకదండీ? అప్పుడండీ వాడి కళ్ళు నవ్వాయండీ

"ఏమిట్రా నీకింత జబ్బు చేసినా మీ వాళ్ళు రాలేదు?" అన్నాడండీ వాడు.

"ఒరే వెంకటేష్, మావాళ్ళ సంగతి నీకు పూర్తిగా తెలీదురా. వాళ్ళకు నేనన్నా నా బతుకన్నా పరమ అసహ్యం. నేను చచ్చినా వాళ్ళు రారురా" అన్నాను.

అప్పుడు వాడు అదోరకంగా "అలాగా?" అన్నాడండీ

వాడు "అలాగా"..... అన్నాడంటే కొంప మునిగిందన్నమాటే.

వాడితో చదరంగం ఆడుతూ మనం 'చెక్' అన్నప్పుడో టైంబాంబులాంటి ఆలోచన వాడి బుర్రలో వెలిగినప్పుడో తప్ప వాడు "అలాగా?" అనడండీ. మరో పదిరోజులు ఆస్పత్రిలోనే విశ్రాంతి తీసుకొని ఇంటికి తిరిగొచ్చాను.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు సోఫాలో అటూ ఇటూ దొర్లుతున్నాను. ఆస్పత్రి నుంచి ఆ రోజే వచ్చాం కదండీ. నా ఇల్లే నాకు కొత్తగా ఉంది - నిద్ర రావటం లేదు కానీ, మగత మగతగా ఉంది.

"ఒకవేళ నేను చచ్చిపోయి ఉంటే ఆదిలక్ష్మి ఎంత బాధపడేది?"

ఈ ఆలోచనకు భయపడి మగత పారిపోయింది.

ఆందోళనపడటం మంచిదికాదు కాబట్టి అలాంటి పిచ్చి ఆలోచనల్ని రానివ్వకూడదను కున్నాను. రానివ్వకుండా ఏం చేయాలి?

ఆదిలక్ష్మి ఎదురుగ్గా ఉంటే అలాంటి పిచ్చి ఆలోచనలురావు కాబట్టి ఆవిణ్ణి పిలుద్దాం - అనుకుంటున్నాను.

అప్పుడు మామయ్య మహాశయుడు తక్కుతూ తారుతూ లోపలికొచ్చాడు

"ఇదేమిటి మామయ్యా దారితప్పి చెడిపోయిన వాడి ఇంటికి వచ్చేశావ్?" అన్నాను ఆదిలక్ష్మిని పిలవడం మానుకొని.

"అదేమిట్రా అలా అంటావ్? మనమేమన్నా శత్రువులమా? నువ్వు ఎంతకాదన్నా నా అల్లుడు కాకుండా పోతావా? అన్నాడు నిజం చెబుతున్న వాడిలా ముఖం పెట్టి.

"నువ్వు నిజంగా నా కోసమే వచ్చావా మామయ్యా?" అన్నాను చిలిపిగా

"మరెందుకనుకున్నావ్‌రా. ఆఁ... అన్నట్టు మరో శుభవార్త.ఇందిర పెళ్ళి నిశ్చయమైపోయింది. నా పరిస్థితి నీకు తెలుసుగా. ఈ పెళ్ళి జరిపించే భారం నీదే" అన్నాడు. ఉచ్చువేశాను. ఎలా తప్పించుకుంటావో చూద్దాం అన్నట్టుగా.

"ఇందిరెవరు మామయ్యా?" అన్నాను.

మా మామయ్య నోరు తెరిచాడు. దొంగ ఆశ్చర్యంతో.

"నా పెద్ద అమ్మాయిరా" అన్నాడు ఆశ్చర్యం నుంచి తేరుకున్నట్టు నటిస్తూ.

అప్పుడు కొంగుతో చేతులు తుడుచుకుంటూ హాల్లోకొచ్చింది ఆదిలక్ష్మి.

'డైనింగ్ హాల్లోకొస్తారా, ఇక్కడే వడ్డించమంటారా?' అంది మామయ్య నుద్దేశించి.

"భోజనానికి లెయ్ మామయ్యా" అన్నాను ఆదిలక్ష్మి చిలిపితనాన్ని కొనసాగిస్తూ.

చివ్వున లేచాడు మామయ్య. ఆదిలక్ష్మిని, నన్నూ కత్తులు విసిరినట్టుగా చూసి, ఏదో అనబోయి మానుకుని, మరిచిపోయిన నటుడిలా నిష్క్రమించాడు.

"లోపలికి రండి భోంచేద్దురు కానీ" అంది ఆదిలక్ష్మి - మామయ్య రావటం, వెళ్లటం కూడా మరిచిపోయినదానిలా.

ఆందోళన తగ్గటానికి దోహదం చేసిన మామయ్యకు ధన్యవాదాలు తెలుపుకుంటూ భోజనానికి లేచాను.

మరుసటి రోజే రెండో ఆశ్చర్యం ఎదురైంది.

ఇంకా గూట్లో పొద్దు గూట్లో ఉండగానే ఎవరో తలుపు తడుతున్న శబ్దం వినిపించింది. విసుక్కుంటూ వెళ్ళి నేనే తలుపు తీశాను.

అక్కయ్య తలవంచుకొని నిలబడి వుంది.

"నువ్వా!" అన్నాను ఆశ్చర్యపోతూ.

అక్కయ్య పూనకం వచ్చిన దాన్లా తలుపు తోసుకొని లోపలికి వచ్చేసింది.

"ఎలా వున్నావురా తమ్ముడూ" అంటూ నా ఒళ్లంతా తడుముతూ కన్నీళ్ళు కార్చేయసాగింది".

"నాకేం ... హాయిగా ఉన్నాను" అన్నాను.

"నువ్విలా అంటున్నా వంతే ... మాకు దూరమైపోయినందుకు లోపల్లోపల నువ్వెంత కుమిలి పోతున్నావో నాకు తెలీదనుకున్నావా? నువ్వు .. నువ్వు నా అల్లుడు కావాల్సిన తమ్ముడివి. అది ... అది ...".

"ఏవరక్కయ్యా - ఆదిలక్ష్మా? లోపల నిద్ర పోతోంది" అన్నాను.

మా అక్కయ్య ముఖం దు:ఖంతో నిండిపోయింది.

"అవున్రా నిద్రపోతుంది ... ఎందుకు నిద్రపోదూ? అదే ఇల్లాలైతే ఇలా నిద్రపోతుందా? ఇప్పుడే ఇలా ఉంది. నీ పెళ్ళామైతే మరికొంత కాలానికి నిన్ను చూసేవాళ్ళెవరూ నీ గతేం కావాలి? నిన్ను ... చూస్తే మనసు తరుక్కుపోతోందిరా శివన్నా".

మా అక్కయ్య ధారాపాతంగా ఏడవటం ప్రారంభించింది.

అక్కయ్య కన్నీళ్లు పిలువగానే ఎంత సులభంగా పలుకుతాయో ఆలోచిస్తూ కూర్చున్నాను.

మా అక్కయ్య అంత కష్టపడి ఏడుస్తున్నప్పుడు నేను మధ్యలో మాట్లాడ్డం మర్యాద కాదు కదా సార్!

మా అక్కయ్య అలా ఏడ్చీ ఏడ్చీ అలిసిపోయింది.

ఉన్నట్టుండి ఏడుపు ఆపి రహస్యం చెబుతున్నట్లుగా అంది -

"చూడ్రా శివన్నా ఇప్పుడైనా మించిపోయింది లేదు. నువ్వు హాయిగా శశిని పెళ్ళి చేసుకో".

నిజం చెబుతున్నా సార్, కోపంతో నా గుండె ఆగినంత పని జరిగింది.

"ఛీ! నీకు బుద్ధిలేదూ? నా వయసెంతనుకున్నావ్?" అన్నాను కాస్త తమాయించుకొని.

"ఎంతైతేనేం?" అంది అక్కయ్య.

"ఎంతైనా ఫరవాలేదా. నీ కూతురు గొంతు కోస్తావా?"

మా అక్కయ్య చిరునవ్వులోకి మారిపోయింది.

"అదేమిట్రా శివన్నా ముసలితనం వచ్చినట్టు మాట్లాడుతున్నావ్! నీకు ముప్పై ఏడేళ్ళేగా? శశికి మాత్రం వయస్సు మించిపోలేదా? తెచ్చిన సంబంధాన్నంతా కాదని అదిమాత్రం ముప్పై ఏళ్ళు నెత్తిమీదికి తెచ్చుకోలేదా?"

ఇలా సాగింది సార్ సంభాషణ.

నాకు ముప్పై ఏడేళ్ళు కాదు, నలభై రెండన్నాను.

మా అక్కయ్య మించిపోయిందేం లేదన్నది.

శశికి పాతికేళ్లు దాటలేదన్నాను.

ఎలాంటి సంకోచమూ లేకుండా ముప్పైయో యేడు జరుగుతోందని దబాయించింది మా అక్కయ్య.

ఆవిడను భరించలేకుండా మర్యాదగా వెళ్ళిపొమ్మన్నాను.
వెళ్ళకుండా అరుపులూ అఘాయిత్యాలూ ప్రారంభించింది.
చిట్టచివరికి మా అక్కయ్యను దాదాపు బలవంతంగా బయటకు తోసి తలుపు వేయాల్సి వచ్చింది.
అందుకు నాకు బాధగానే ఉంది సార్! ఎంత కాదన్నా మేమిద్దరం ఒకే రక్తం పంచుకొని పుట్టిన వాళ్ళం కదా. కానీ ఏం చెస్తాం చెప్పండి?
నేనేమో ఉద్రేకాల మనిషిని.
ఆలోచించటం, జుట్టు పీక్కోవటం నా తత్వానికి పడదు.
కానీ సార్, ఆ రోజు ఆలోచించక తప్పలేదు. ఏమిటీ ప్రపంచం? ఏమిటీ మనుషులు? ఏమిటీ బంధాలు? అలా ఆలోచిస్తూ ఉండిపోయాను.
ఆదిలక్ష్మి నా మానాన నన్ను వదిలేసి తన పని పాటా చూసుకుంటోంది. రెండు మూడు సార్లు ఆవిణ్ణి గమనించాను.
ఆవిడేం చెప్పలేదు కానీ, ఆవిడ చిరునవ్వు మాత్రం చాలా విషయాలు చెప్పింది. వ్యంగ్యంగా మూడుచుకున్న పెదవుల వెనక ఆవిడేదో జీవిత రహస్యాన్ని దాచుతున్నట్టనిపించింది.
అలాగే పొద్దు మధ్యాహ్నమైంది.
భోజనానికి లేద్దాం అనుకుంటూ ఉండగా వచ్చాడండీ మా అన్నయ్య - నేలకు తగులుతున్న కారియర్‌తో, సిగ్గుతో ముడుచుకుపోయిన ముఖంతో.
మళ్ళీ మామూలు గొడవే. అనుబంధాల విలువ తెంచుకున్నా తెగని బంధాల గట్టితనం. రక్తం పంచుకోవటం, ఒకే తల్లి కడుపులో పుట్టటం ... ఇలా ఎన్నో.
నా పిచ్చి కానీ ఇవన్నీ మీకు తెలీవా సార్ ?
ఓ అరగంట తరువాత చిరునవ్వుతో వచ్చిన అన్నయ్య వెర్రికోపంతో కేకలు పెడుతూ వెళ్ళిపోయాడు - టిఫిన్ కారియర్‌తో పాటు.
గుండెల మీద బరువు దిగినట్టనిపించి భోజనానికి లేచాను.
భోజనం వద్ద భోజనం గురించి తప్ప మరో విషయం గురించి ఆదిలక్ష్మి మాట్లాడలేదు.
ఆ రోజు రాత్రి ...
"ఉదయం శశి వచ్చింది" అంది ఆదిలక్ష్మి నెమ్మదిగా.
"ఉదయం ఎప్పుడొచ్చిందీ?" అన్నాను.
"మీరు అక్కయ్యతో మాట్లాడుతుండగా వచ్చింది, పెరటి వైపు నుంచి."
"ఎందుకూ?"
"మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదట" అంది ఆదిలక్ష్మి నాజూగ్గా నవ్వుతూ.
"ఎంత అవమానం! ఎందుకట?"
"మరో అబ్బాయిని పెళ్ళి చేసుకోవాలట".
"ఎవరో ఆ అబ్బాయి? నాకు పోటీదారు".
"ఎవరో డాక్టరు గారి అబ్బాయట".
"పేరు?"
"చెప్పింది. మర్చిపోయాను" మళ్ళీ చిలిపి చిరునవ్వే.
ఆలోచనలోపడ్డాను.
"మీతో మాట్లాడాలట. శశిని రమ్మంటారా?" మళ్ళీ అంది ఆదిలక్ష్మి.
"రమ్మంటే బావుంటుందంటావా?"
"అదేమిటి? కొత్త సంగతులు ఆలోచిస్తున్నారు?".
నిజమే నాకే నవ్వొచ్చింది.
"రమ్మనండి ... బావుంటుందో లేదో తరువాత ఆలోచిద్దాం".
"సరే ... రమ్మను". అన్నాను.
మరో నెల తిరిగింది.
జారిపోతుందేమో అనుకున్న ఆరోగ్యం గట్టిగానే చేతికి చిక్కింది.
ఈలోగా రెండుసార్లు ఆస్పత్రికి వెళ్ళాను. వెంకటేశ్‌తో పాటు మరిద్దరు డాక్టర్లు మరిన్ని పరీక్షలు చేసి 'నువ్వు రాక్షసి ముండాకొడుకువి' అన్నారు ప్రియంగా.
మందులు మానేయమన్నారు.
ఈలోగా ఉదయం షికారు ఒక హుషారుగా అలవాటైంది.
బాగా బరువు తగ్గింది. ఆరోగ్యం పెరిగింది.
"మెడికల్‌గా నువ్వు ముందటికంటే ఎంతో ఆరోగ్యంగా ఉన్నావురా" అని యోగ్యతాపత్రం ఇచ్చాడు డాక్టర్ వెంకటేశ్.
"అదేమో నాకు తెలీదు కానీ, వయసు తగ్గినట్టు మాత్రం కనిపిస్తున్నారు" అంది ఆదిలక్ష్మి.
ఆ రోజు నేనూ, వెంకటేశ్ డాబా మీద కూచొని కబుర్లు చెప్పుకొంటున్నాం.
ఇంకా కొంతకాలం పోతే అమెరికా వాళ్ళు మనం ఏ రోజు ఏ కూర చేసుకోవాలో, ఎన్ని గంటలకి అన్నం తినాలో, ఎన్ని గంటలకు పడుకోవాలో కూడా చెబుతారని జోకులేస్తూ, నవ్వుతూ, నవ్విస్తూ ఉన్నాడు వెంకటేశ్.
ఇంతకుముందే చెప్పాను గదా సార్ వెన్నెట్లో వాడు నవ్వితే నా కిష్టమని. వాడు మామూలుగానే నవ్విస్తూ తన కళ్ళతో నవ్వుతున్నాడు.
శివపూజలోకి ఎలుగొడ్లలా అప్పుడొచ్చారండీ మా అక్కయ్యా, అన్నయ్యానూ.
"ఒరే శివన్నా, ఉదయం నుంచి శశి కనిపించటం లేదురా?" అంది అక్కయ్య ఏడుస్తూ.
"నిజంగానా?" అన్నాను ఆశ్చర్యం నటిస్తూ.
వెంకటేశ్ నాకు మాత్రం అర్థమయ్యేలా నవ్వాడు.
"నిజంగానేరా" అంది అక్కయ్య.
"ఎక్కడికెళ్ళిందీ?"
"ఏ బావిలో దూకి చచ్చిందో ఎవరికి తెలుసూ?"
అయ్యో ఎంత ఘోరం! ఇంట్లో ఉత్తరమైనా పెట్టి వెళ్లిందేమో చూశారా? బావులూ, చెరువులూ వెదికించారా! నా పిచ్చికానీ, బావుల్లో, చెరువుల్లో నీళ్ళెక్కడున్నాయ్" అన్నాను.
అప్పుడు చూశాడు సార్ మా అన్నయ్య టీపాయ్ మీదున్న వస్తువుల్ని.
"మళ్ళీ ప్రారంభించావురా తాగుబోతు వెధవా. ఇలాగైతే ఆరునెలల్లో కాదు. నెల్లోనే పోతావ్" అన్నాడు. ఎంతో ఉదారంగా.
అంతవరకూ నిశ్శబ్దంగా కూచొని వినోదం చూస్తున్న డాక్టర్ వెంకటేశ్ చేతిలో ఉన్న గ్లాసుతో పాటు లేచి, నెమ్మదిగా అన్నయ్య ముందుకెళ్ళాడు.
కంబళి పురుగు మీదికొస్తున్నట్టుగా అసహ్యించుకున్నాడు అన్నయ్య. వెంకటేశ్ వాడి వెన్నెల నవ్వు నవ్వి అన్నాడు.
"వాడికి మరోపాతిక సంవత్సరాలు గ్యారంటీ రాసిస్తాను. ఈ మాట నేను డాక్టరుగా చెబుతున్నాను"
అక్కయ్య వెంకటేశ్ మీదికో విషపు చూపు విసిరింది.
"అది కాదయ్యా - వీడికి క్యాన్సరొచ్చింది. ఆరు నెలలు బతకటం కూడా కష్టం అని చెప్పావు కదయ్యా" అంది అక్కయ్య ఆశ్చర్యంలో మునిగిపోయి తానేం మాట్లాడుతుందో తనకే తెలియని స్థితిలో.
"సరదాకి చెప్పాను" అన్నాడు వెంకటేశ్.
అప్పుడు వాడి కళ్ళేకాదు - వాడి ముఖమంతా నవ్వుతో వెలిగిపోయింది.
"ఛీ, నీతిలేని వెధవల్లారా!" అంటూ నిష్క్రమించాడు అన్నయ్య.
కూతురి సంగతి మరిచిపోయి దిగ్భ్రమ నుంచి తేరుకోకుండానే అక్కయ్య అన్నయ్య వెంట కదిలింది.
"అక్కయ్యా, శశి సంగతేమిటి" అన్నాను.
"చచ్చింది".
"అదికాదే. వెంకటేశ్ కొడుకు కూడా ఉదయం నుంచీ కనిపించటం లేదట"
"వాణ్ణీ చావమను".
నా మాట అర్థం చేసుకోవాలన్న ప్రయత్నం కూడా చేయకుండా అక్కయ్య వెళ్ళిపోయింది.
"ఆవిడ భాషలో చావంటే పెళ్ళి" అన్నాడు వెంకటేశ్, నింపాదిగా కూర్చుంటూ.
అదండీ కథ.
"ఒరేయ్ వెంకటేశ్, ఇకమీదట వీళ్ళు రార్రా" అన్నాను, వెళ్ళిపోతున్న రక్తం పంచుకొని పుట్టినవాళ్ళను బాధగా చూస్తూ.
వాడు మళ్ళీ వాడి నవ్వు నవ్వి "అలాగా" అన్నాడు సార్.
నేను అదిరిపడ్డాను.
నేను ఆస్పత్రిలో ఉండగా వాడు "అలాగా? అన్నందుకు అర్థం ఇప్పుడు తెలిసింది సార్. *

ఇండియా టుడే డిసెంబర్, 6-20, 1992

వల్లంపాటి వ్యాసాలు రెండు :

అనువాద కళ - నా అనుభవాలు

రచన కత్తిమీద సామైతే అనువాదం రెండు కత్తుల మీద సాము. ఒక భాష వచ్చిన ప్రతివాడూ రచయిత కాలేడు. అలాగే రెండు భాషలు వచ్చిన ప్రతివాడు అనువాదకుడు కాలేడు. కానీ అనువాదకునికి రెండు భాషలు "బాగా" వచ్చి ఉండక తప్పదు. అందులో ఒకటి మాతృభాష, రెండవది దాదాపు కృత్రిమంగా నేర్చుకున్న "పరాయి" భాష. ఎవరైనా మాతృభాషలోకి మాత్రమే అనువాదం చేయగలరని చాలా మంది నమ్ముతారు. ఇందులో సత్యం లేక పోలేదు కానీ ఈ సిద్ధంతానికి కొన్ని మినహాయింపులు లేక పోలేదు. అలాంటి మినహాయింపులుగా పి.వి. నరసింహారావు హిందీలోకి అనువాదం చేసిన "వేయిపడగలు" నూ, పుట్టపర్తి మలయాళంలోకి అనువదించిన "ఏకవీర" నూ, పి.ఎల్. రెడ్డి హిందీ లోకి అనువదించిన తెలుగు కథలనూ, ఎస్.ఎస్.ప్రభాకర్ ఇంగ్లీషులోకి అనువదించిన "అమృతం కురిసిన రాత్రి" నీ, రంగారావు ఇంగ్లీషులోకి అనువదించిన తెలుగు కథలనూ చెప్పుకోవచ్చునుకుంటాను. వీరి అనువాదాలు అంతబాగా ఉండటానికి కారణం బహుశా మనం పరాయి భాషలనుకుంటున్నవి వీరికి మరీ అంత "పరాయి"వి కాక పోవటమేనేమో.

ఇప్పుడు భాషలు తెలియటం అంటే ఏమిటో ఆలోచిద్దాం. భాష ఆ భాషను మాట్లాడే ప్రజల సంస్కృతిలో ఒక ప్రధానమైన అంశం. అంతేకాదు ఆ సంస్కృతికి మాధ్యమం కూడా. కాబట్టి రెండు భాషలు తెలిసి ఉండటం అంటే రెండు సంస్కృతులు తెలిసి ఉండటం, రెండు జీవిత విధానాలు తెలిసి ఉండటం. భాషకు జీవం నుడికారం. ఏ భాష నుడికారం ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతిలో నుంచి, భౌగోళిక పరిస్థితులలో నుంచీ, ఆ ప్రాంత ప్రజల ఆచార వ్యవహారాలలో నుంచీ, ఆటపాటల్లో నుంచీ ఉద్భవిస్తుంది. ఉదాహరణకు ఎస్కిమో భాషలో రకరకాలైన మంచును సూచించటానికి దాదాపు ఇరవై పదాలున్నాయట. మరాఠీ భాషలో యుద్ధరంగం ఆధారంగా పుట్టిన నుడికారం ఎంతో ఉందట. ఇంగ్లీషుభాష నుడికారం వారికి ఆటలన్నా, నౌకాయానమన్నా ఉన్న ఇష్టంలో నుంచీ ఎంతో పుట్టింది. మన భాషలో చాలా నుడికారం మన వ్యావసాయిక జీవితంలో నుంచీ పుట్టింది. భాషను తెలుసుకోవటమంటే దాని నుడికారం యొక్క మూలాలను తెలుసుకోవటం. వీటిని తెలిసి ఉండటం లేదా తెలుసుకోవాలని ఉండటం అనవవాదకుని మొదటి అర్హత.

అనువాదకుని రెండవ అర్హత మూల గ్రంథంలోని విషయాన్ని గురించి నిజమైన ఆసక్తి ఉండటం. అందరూ అన్ని విషయాలనూ అనువదించలేరు. ఆసక్తి లేని విషయాన్ని అనువదిస్తే అది యాంత్రికంగా, నిర్జీవంగా ఉండక తప్పదు. వస్తువుకు సంబంధించిన మరొక ప్రధానమైన అంశం కూడా ఉంది. ఒకే వస్తువును అనేక దృక్పథాల నుంచీ చర్చించవచ్చు. ఉదాహరణకు భారతీయ తత్వశాస్త్రాన్ని గురించి గోళ్వాళ్కర్ లాగా రాయవచ్చు. రాధాకృష్ణన్ లాగా రాయవచ్చు. దేవీ ప్రసాద్ చటోపాధ్యాయలాగా రాయవచ్చు మూల గ్రంథ రచయిత అందులోని విషయాన్ని తనకునచ్చిన, తాను నమ్మిన భావజాల దృక్పథం నుంచీ చర్చించి ఉంటాడు. మూల రచయిత భావజాల దృక్పథం మీద కనీసం సానుభూతి లేకుండా ఆ గ్రంథాన్ని అనువాదం చేయటానికి అంగీకరించకూడదు.

అనువాదం ప్రారంభించటానికి ముందుగానే భాషకు సంబంధించిన కొన్ని క్లిష్టమైన నిర్ణయాలను అనువాదకుడు తీసుకోక తప్పదు.

అనువాదకుడు తాను చేయబోతున్న అనువాదంలో వాడదలుచుకున్న భాషా స్థాయిని గురించి ఒక ఖచ్చితమైన నిర్ణయానికి రావాలి. ఒకే భాషను అనేక స్థాయిలలో రాయవచ్చు. "భాషాస్థాయి" పదజాలానికి మాత్రమేకాకుండా వాక్యనిర్మాణానికి కూడా సంబంధించిన విషయం. భాషా స్థాయిని గురించి నిర్ణయం తీసుకోవటానికి పూర్వం మూలగ్రంథంలోని విషయాన్ని గురించి, మూల గ్రంథం ఎవరికోసం ఉద్దేశించబడిందో ఆ పాఠకుల్ని గురించీ, అనువాదం ఎలాంటి పాఠకుల కోసం చేయబడుతోందో వారిని గురించీ అనువాదకునికి స్పష్టమైన అవగాహన ఉండాలి. ఇది ఇంగ్లీషు నుంచీ శాస్త్ర గ్రంథాలను అనువదించేటప్పుడు మరీ చిక్కు సమస్యగా మారుతుంది. దాదాపు ఆరులక్షల పద సంపద ఉన్న ఇంగ్లీషు నుంచీ పాతిక వేలు వ్యావహారిక పదజాలం కూడా లేని తెలుగులోకి శాస్త్రగ్రంథాలను అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు అనేక పదాలనూ, పద బంధాలను సృష్టించుకోవలసి ఉంటుంది. అవి తాను ఎన్నుకున్న భాషాస్థాయిలో ఉండేలా జాగ్రత్త పడటం కత్తిమీద సాము వంటి క్లిష్టమైన పని.

భాషకు సంబంధించిన మరొక ఇబ్బంది కంఠస్వరం. సమర్థుడైన రచయిత శైలికి "కంఠస్వరం" ఉంటుంది. అది రచయితకూ, విషయానికీ మాత్రమే కాకుండా, రచయిచతకూ, పాఠకునికీ మధ్య ఉన్న సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది. గొప్పగాయకుని కంఠంలో ఎన్ని భావాలు పలుకుతాయో సమర్థుడైన రచయిత శైలిలో అన్ని భావాలు పలుకుతాయి. అందులో కోపం ఉండవచ్చు, కసి ఉండవచ్చు, హాస్యం ఉండవచ్చు, వ్యంగ్యం ఉండవచ్చు. ఇంకా ఎన్నో భావాలూ భావమిశ్రమాలూ ఉండవచ్చు. మూల రచయిత కంఠస్వరాన్ని పొరపాటు పడకుండా గుర్తించి దాన్ని లక్ష్య భాషలో వ్యక్తం చేయగలిగిన రంగు, రుచి, వాసన ఉన్న పదాలనూ, వాక్య విన్యాసాలనూ జాగ్రత్తగా ఎన్నుకోవాలి.

వీటికి తోడు మూల గ్రంథాన్ని అనేక సార్లు చదివి జీర్ణంచేసుకోవటం, గ్లాసరీని అనువాదం ప్రారంభించటానికి పూర్వమే తయారు చేసుకోవటం, పదప్రయోగస్థాయిని తరచుగా వెనుదిరిగి చూసుకుంటూ ఉండటం, అన్నింటికంటే ముఖ్యంగా సాపు రాసే పనిని తానే స్వయంగా చేయటం అనువాదకుడు తీసుకోవలసిన మరికొన్ని ఇతర జాగ్రత్తలు. అనువాదకుని చివరి అర్హతను గురించి ఒక మాట చెప్పాలను కుంటున్నాను. సృజనకు భావోద్రేకం Inspiration అవసరమేమో కానీ అనువాదానికి పరిశ్రమే ప్రాణం. పరిశ్రమ చేసే ఓపిక లేని వాడు మంచి అనువాదకుడు కావటం అసాధ్యం.

అనువాద కళను గురించి ఇంగ్లీషులో కొన్ని మంచి పుస్తకాలొచ్చాయి. 1979లోనే అలెగ్జాండర్ ఫ్రేజర్ టైట్లర్ అన్న వ్యక్తి "An Essay on the principle of Translation" అన్న గ్రంథాన్ని ప్రచురించాడు. ఆ తరువాత థియొడర్ సేవరీ, రెనెటో పొగియోలీ వంటి విద్వాంసులు కొన్ని గ్రంథాలు రాశారు. ఈ శతాబ్దంలో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పాశ్చాత్య దేశాల్లో భాషాశాస్త్రం ప్రతిష్ట బాగా పెరిగింది. దీని ప్రభావం అనేక పరిసర రంగామీద ప్రసరించటం ప్రారంభించింది. జె.సి. కాట్ ఫోర్డ్ లాంటి భాషాశాస్త్రవేత్తలు ఈ రంగంలో చాలా కృషి చేసారు. అంత వరకూ "కళ" అని అందరూ భావిస్తున్న అనువాదం "శాస్త్రం" గా పరిణామం చెందటం ప్రారంభించింది. కంప్యూటర్లను అనువాదాలకు కూడా ఉపయోగించుకోవచ్చన్న అభిప్రాయం కూడా బలంపుంజుకుంటోంది. కానీ తెలుగులో అనువాదం మీద మంచి గ్రంథాలు ఇంతవరకూ రాలేదు. రారా రాసిన "అనువాద సమస్యలు" పత్రికల వారూ, పత్రికా రచయితలూ తయారుచేసిన కరదీపికలూ తప్ప తెలుగులో అనువాదాన్ని గురించి సమగ్రమైన, సాధికారమైన గ్రంథం రాలేదు.

***

వాదించుకోవటంలోనూ, అనువదించుకోవటంలోనూ తెలుగువారు నిష్ణాతులని ఎవరో అన్నారు. వాదించుకోవటం మన రాజకీయ వ్యవసమైతే అనువదించుకోవటం మన సాహిత్య వ్యాసంగం కావచ్చు. వాస్తవానికి తెలుగుసాహిత్యం అనువాదాలతోనే ప్రారంభమైంది. శతాబ్దాలపాటు అనువాదాలతోనే సంతృప్తి పడుతూ వచ్చింది. మన మహాకవుల్లో చాలా మంది కథనూ, కథానిర్మాణాన్నీ, పాత్రలనూ, వారి మనస్తత్వాలనూ, ప్రాపంచిక దృక్పథాన్నీ, భావాలనూ, ఆలంకారికతనూ, కొంతవరకూ శైలినీ మూల గ్రంథకర్తల నుంచీ గ్రహించిన గొప్ప అనువాదకులే. అందుకు మనం సిగ్గు పడాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు. అత్యంతప్రాచీనమైన సంస్కృత, గ్రీక్, లాటిన్ సాహిత్యాల వంటివి తప్ప ఇతర సాహిత్యాలలో చాలా భాగం అనువాదాలతోనే ప్రారంభమయ్యాయి.

20వ శతాబ్దంలో తెలుగువారు అనువాదం పట్ల గొప్ప శ్రద్ధను చూపించారు. ప్రేంచంద్, టాగోర్, శరత్, గోర్కీ, రాహుల్ మొదలైన ఎందరో మహారచయితలు

తెలుగువారైపోయారు. 1930 లలో అభ్యుదయ సాహిత్యోద్యమంతో ప్రారంభమైన శాస్త్రగ్రంథాల అనువాదం ఇంకాకొనసాగుతూనే ఉంది. ఇంగ్లీషులో తగినంత ప్రావీణ్యం లేని తెలుగు రచయితలు అనువాదాల ద్వారానే ప్రపంచ సాహిత్య ధోరణులనూ, ఆలోచనా ధోరణులనూ ఎంతో కొంతగా అందుకోగలుగుతున్నారు. "విపుల" వంటి అనువాద కథాసాహిత్య పత్రిక తెలుగులో మాత్రమే ఉందేమోనని నా అనుమానం.

***

అనువాదకుడుగా నా అనుభవాలను గురించి చెప్పేటప్పుడు నన్ను గురించి రెండు మాటలు చెప్పుకోవాలి.

నేను పద్యాలతో రచన ప్రారంభించాను. పద్యాలూ, గేయాలు మాని కథలు రాయటం ప్రారంభించాను. కథలు రాస్తూనే మూడు నవలలు రాశాను. ఆ తరువాత రచన మీద అనాసక్తి కలిగి చదువుకుంటూ ఉండిపోయిన కాలంలో నాకు తెలియకుండానే అనువాదకుణ్ణయ్యాను. 1981 లోననుకుంటాను హెచ్.బి.టి. ప్రారంభమైంది. దాని ట్రస్టీలలో ఒకరైన సి.కె. గారు అనువాదం చేయించటానికేనైనా మంచి పుస్తకాలను సూచించమన్నారు. నేను సూచించిన రెండు పుస్తకాల్లో ఇ.హెచ్. కార్ రాసిన "వాట్ ఈజ్ హిస్టరీ ?" ఒకటి. హెచ్.బి.టి వాళ్ళు ఆ పుస్తకాన్ని అనువదింప చేయటానికి తీర్మానం చేసి అనువాదకుడికోసం వెదకటం ప్రారంభించారు. కొందరు ఆ పుస్తకాన్ని అనువాదం చేయటం అసాధ్యమన్నారు. మరికొందరు వృథా అన్నారు. చారిత్రక శాస్త్రం (హిస్టారియోగ్రఫీ) మీద ఆసక్తి ఉండి ఇంగ్లీషు రాని వళ్ళు ఎవరూ ఉండరన్నారు. చారిత్రక శాస్త్రం మీద ఆసక్తి ఉండి, ఇంగీషు వచ్చిన వాళ్ళు మూలగ్రంథాన్ని చదువుకుంటారుకానీ అనువాద గ్రంథాన్ని చదవరని వాదించారు. మొత్తం మీద "వాట్ ఈజ్ హిస్టరి"కి అనువాదకులు దొరకలేదు. "నువ్వు సూచించావుకదా, నువ్వే చేస్తావా?" అన్నారు సి.కె.గారు, అంగీకరించాను. సంవత్సరం కాలం నా విశ్రాంతి సమయాన్ని ఆ అనువాద కార్యానికే వినియోగించాను. అర్థం కాని విషయాలను తెలిసిన స్నేహితుల వద్ద తెలుసుకున్నాను. సంవత్సరం తరువాత అనువాదం పూర్తయింది.

అనువాదం జరుగుతుండగా నా దృష్టికి రాని, స్పష్టంగా రాని రెండు లోపాలు నా అనువాదంలో కనిపించాయి. మొదటి మూలగ్రంథ పాఠకులూ, తెలుగు అనువాద గ్రంథం పాఠకులూ ఒకే స్థాయికి చెందిన వారు కాక పోవటం. కార్ గ్రంథం కేంబ్రిడ్జి హిస్టరీ సొసైటీలో ఇచ్చిన ఉపన్యాసాల సంపుటం. శ్రోతలందరూ చరిత్ర విద్యార్థులూ, చరిత్ర ఉపాధ్యాయులూ కావటం చేత కార్ చారిత్రక సంఘటనలనూ, తాత్విక సిద్ధాంతాలనూ ఎలాంటి వివరణా లేకుండా ఉటంకిస్తాడు. తెలుగు పాఠకుల్లో తొంభైశాతం మంది కేంబ్రిడ్జ్ హిస్టారికల్ సొసైటీ స్థాయి వారు కారు. అందుచేత ఫుట్‌నోట్స్ ఇవ్వాలనుకున్నాను. కానీ ప్రచురణ కర్తలు ససేమిరా వద్దన్నారు. ఫుట్‌నోట్స్ ఉన్న పుస్తకాలను సాధారణ పాఠకులు చదవరన్నారు. అందుచేత అనువాదాన్ని ఒక అతిసాధారణ పాఠకుడికీ, ఒక చరిత్ర విద్యార్థికీ ఇచ్చి తాము నోట్సు అవసరమని భావించే పదాల కింద గీతలు గీచి పంపమన్నాము. వాటిని సేకరించి రెండు భాగాలుగా విభజించాను. మొదటి వర్గం టెక్స్ట్‌లోకే వెళ్ళాల్సిన నోట్స్, రెండవ వర్గం గ్రంథం చివర ఇవ్వాల్సిన నోట్స్ ఈ విధంగా కేంబ్రిడ్జి హిస్టరీ సొసైటీ స్థాయి గ్రంథాన్ని సాధారణ తెలుగు పాఠకుల స్థాయికి తీసుకువచ్చే ప్రయత్నం చేశాను.

రెండవ లోపం మరింత ప్రమాదకరమైంది. అనువాదం పూర్తయిన తరువాత మూలాన్నీ, అనువాదాన్నీ మరొకసారి చదివి చూసి దిమ్మెరపోయాను. మూల గ్రంథంలోని టోన్ ను పట్టుకోవటంలో నేను పూర్తిగా విఫలమయ్యాను. మూలంలో హాస్య - వ్యంగ్య కంఠస్వరం అనువాదంలోకి రాలేదు. తెలుగు అనువాదంలోని కంఠస్వరం మ్యాటర్ ఆఫ్ ఫాక్ట్‌గా న్యూట్రల్‌గా ఉంది. అందుచేత మళ్ళీ సాపురాశాను. మూలంలోని కంఠస్వరాన్ని తెలుగు అనువాదంలోకి తీసుకరావటానికి ప్రయత్నించాను. ఇంత శ్రమపడ్డా "చరిత్ర అంటే ఏమిటి?" ని వ్యాపార నవలను చదువుకున్నంత అశ్రమంగా చదువుకోవటానికి వీలుకావటం లేదని కొందరంటుంటారు.వారికి నా సలహా ఒకటే- మూల గ్రంథాన్ని చదువుకోమని.

"చరిత్ర అంటే ఏమిటి?" ఇప్పటికి మూడు ముద్రణలు పొందింది. దాదాపు పదివేల కాపీలు అమ్ముడైంది. చరిత్ర విద్యార్థులు మాత్రమే కాకుండా రచయితలు ఆ పుస్తకాన్ని చాలా శ్రద్ధగా చదివారు.

"చరిత్ర అంటే ఏమిటి" మొదటి ముద్రణ ప్రతులు ఆరు నెలల్లో చెల్లిపోయాక గార్డన్ చైల్డ్ రాసిన "వాట్ హ్యాపెన్డ్ ఇన్ హిస్టరీ?"ని తెలుగులోకి తేవాలని నిశ్చయించాం. ఈ రెండు పుస్తకాలూ ఒక సెట్ లాగా 'పరస్పర పూరకాలు' గా ఉంటాయని హెచ్.బి.టి. వారు భావించారు. ఈ పుస్తకాన్ని అనువదించటానికి నేను చాలా శ్రమ చేయవలసి వచ్చింది. ఈ పుస్తకంలో గార్డన్ చైల్డ్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణిత శాస్త్రం మొదలైన అనేక శాస్త్రాలు చారిత్రక పరిణామ క్రమంలో ఎలా అభివృద్ధి చెందిందీ వివరంగా చెప్పాడు. ఆ శాస్త్రాలను గురించి నాకు సరైన జ్ఞానం లేకపోవటం చేత తెలిసిన మిత్రుల వద్ద నుండీ ఆ సిద్ధాంతాలను గురించి తెలుసుకున్నాను. అలాగే పురాతత్వ శాస్త్రంలో ఉపయోగించే విధానాలను గురించీ, ముఖ్యంగా కార్బన్ టెస్టుల్ని గురించీ తెలిసిన వారి నుంచీ తెలుసుకున్నాను.

ఆ తరువాత నేను అనువదించిన సోయింకా నోబెల్ బహుమతి అంగీకరణోపన్యాసం నాకు అసంతృప్తినే మిగిల్చింది. "నల్లవాడు ఈ వేదిక నెక్కకుండా తెల్లవాళ్ళైన మీరు ఎన్ని కుట్రలు పన్నారు. కానీ మీరు ఆపగలిగారా? చూడండి మిమ్మల్ని చీల్చి చెండాడి నోబెల్ బహుమతిని అందుకుంటున్నాను" అన్న సోయింకా కసి బాగా నా అనువాదంలోకి రాలేదనుకుంటాను. సోయింకా ప్రస్తావించిన కొన్ని రిఫరెన్సులు కూడా నాకు అందలేదు. స్త్రీవాద దృక్పథం నుంచీ క్రిస్ బ్రేజియర్ రాసిన "ప్రపంచ చరిత్ర" ను అనువదించినప్పుడు కూడా అందులో వచ్చే కొన్ని పేరడీలు అనువాదం చేయటానికి చాలా ఇబ్బంది పడ్డాను. ఉదాహరణకు ఈ గ్రంథం "ఇన్ ది బిగినింగ్ దేర్ వాస్ స్లైయిమ్" అన్న వాక్యంతో ప్రారంభమౌతుంది. అది "ఇన్ ది బిగినింగ్ దేర్ వాజ్ ది వర్డ్" అన్న బైబిల్‌లోని సెయింట్ జాన్ వాక్యానికి పేరడీ. ఇలాంటి సూక్ష్మాతి సూక్ష్మమైన కొన్ని అందాలు అనువాదానికి అందకుండానే పోతాయి.

అనువాదకుడుగా నాకు సంతృప్తినిచ్చిన గ్రంథం యస్.జి. సర్‌దేశాయ్ గారి "ప్రోగ్రెస్ అండ్ కన్సర్వేటిజం ఇన్ ఏన్షియంట్ ఇండియా". ఆ పుస్తకాన్ని ఒంటబట్టించుకోవటానికి దాన్ని అనేకసార్లు చదివాను. ఆ పుస్తకంలో మొదటి నుంచీ చివరి దాకా భగభగలాడే సర్దేశాయి గారి కోపాన్నీ, అసహనాన్నీ అనువాదంలోకి తీసుకురాగలనన్న నమ్మకం కలిగిన తరువాత రచన ప్రారంభించాను. వైదిక సాహిత్యాన్ని, సమాజాన్నీ అభివర్ణించటానికి సర్దేశాయ్‌గారు ఉపయోగించిన ఇంగ్లీషు మాటలకు అసలు రూపాలైన సంస్కృత పదాలను గాలించి పట్టుకొని ఉపయోగించాను. "ప్రాచీన భారతదేశంలో ప్రగతి, సంప్రదాయ వాదం" అనువాదం లాగా కాకుండా మూల గ్రంథం లాగా చదివించిందని పెద్దలు అన్నప్పుడు చాలా సంతృప్తి కలిగింది.

ఈ గ్రంథాలు కాకుండా రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'ది నావెల్ అండ్ ది పీపుల్', ఆర్.ఎస్. శర్మ రాసిన "ఏన్షియంట్ ఇండియన్ హిస్టరీ", తస్లీమా నస్రీన్ రాసిన 'లజ్జ' అన్న పుస్తకాలను అనువదించాను. వీటిలో మొదటిది నవలా సిద్ధాంతం గురించిన పుస్తకం, మూడవది నవల. వీటిలో 'లజ్జ' అనువాదానికి అనువాదం. అనువాదం ద్వారా మూల గ్రంథంలోని శైలిని ఎంత కష్టపడి ఊహించుకున్నా, అనువాదానికి చేసిన అనువాదం అంత సంతృప్తిగా రాకపోవచ్చు. ఇవన్నీ నేను ఇంగ్లీషు నుంచీ అనువదించిన గ్రంథాలు. వీటికి తోడు కన్నడం నుంచీ "ఒడలాళ" అన్న నవలికను కూడా అనువదించాను. అది కన్నడంలో చాలా ప్రసిద్ధ నవలిక. దాన్ని రాసిన దేవనూరు మహదేవను "ఒడలాళ మహదేవ" అని కూడా పిలుస్తారు. ఈ నవలిక అనువాదాన్ని హెచ్.బి.టి. వారు 'బతుకంతా' అన్న పేరుతో ప్రచురించారు. అది ఎవరి దృష్టినీ ఆకర్షించినట్టులేదు. అందుకు కారణం కర్నాటక, ఆంధ్ర సామాజిక జీవన చైతన్యంలో ఉన్న తేడాలని అనిపిస్తుంది. వారికి బాగా అభ్యుదయకరంగా కనిపించిన పుస్తకం మనకు మరీ అంత అభ్యుదయకరంగా కనిపించకపోవటమే అందుకు కారణం. ఇది కూడా అనువాదకుడికి ఒక పాఠమే. ఒక భాష వారిని ఆకర్షించిన పుస్తకం మరొక భాష వారిని ఆకర్షించకపోవచ్చు. అందుకు ఒకే విషయానికి సంబంధించిందే

‘భయం’ - ఒక విశ్లేషణ

కాళీపట్నం రామారావుగారి “భయం” తెలుగులో వున్న గొప్ప కథల్లో ఒకటి. తెలుగు కథకు ప్రతినిధిగా సగర్వంగా ప్రపంచ కథాసంకలనంలోకి వెళ్ళగల అర్హత వున్న అతి కొద్ది తెలుగు కథల్లో ఒకటి.

భయం విశ్వజనీనమైన సహజాతం. మానవునికి అనేక రకాలైన భయాలుంటాయి. మన సౌకర్యం కోసం వాటికి వ్యక్తిగత భయాలనీ, సమాజిక భయాలనీ రెండు రకాలుగా విభజించుకోవచ్చు. మృత్యుభయం వ్యక్తిగతమైతే, బలవంతుడైన దుర్మార్గుణ్ణి చూస్తే కలిగే భయం సామాజికం.

“భయం” కథలో సామాజిక భయానికి ప్రతీక పాము. ఆ భయాన్ని జయించిన వీరుడు సత్తెయ్య. సామాన్య జనం భద్రతకు, ఉనికికి ప్రమాదకరంగా పరిణమించిన విషకీటకాలను మట్టుపెట్టడం మినహా మరో మార్గం లేదని గుర్తించిన వాడు సత్తెయ్య. అతడు యాదృచ్ఛికంగా, అకస్మాత్తుగా ఆ నిర్ణయానికి రాలేదు. అతనికి తొమ్మిదేళ్ళ వయస్సున్నప్పుడు పాము భయం అతని తల్లిని పొట్టన పెట్టుకుంది. మరికొంత కాలానికి అతని తండ్రిని పాము కాటేసింది. అతడు బ్రతికాడు కానీ జీవితాంతం రోగిష్టయిపోయాడు.

తాను పాముల్ని చంపటానికి వ్యక్తిగత కక్ష కారణం కాదని సత్తెయ్యే చెబుతాడు. అతనిలో వ్యక్తిగత కక్ష ఏనాడో సామాజిక బాధ్యతగా మారిపోయింది. పాము భయం మనిషిని తినేస్తుందనీ, ఆ భయాన్ని జయించటం కోసం తాను పాముల్ని చంపుతాననీ, చావుకు భయపడనివాడు మాత్రమే పాముల్ని చంపగలడనీ కూడా అతడు చెబుతాడు.

పామును చంపటానికి సిద్ధపడటంలో ఆపద (రిస్క్) ఉందనటానికి సందేహం లేదు. ఈ కథలో భయం సామాజికం కావటంతో ఆపద కూడా సామాజికమే. అలాంటి ఆపదల జోలికి వెళ్ళకుండా “భద్రంగా” జీవితం గడపాలనుకునేవారు సమాజంలో చాలామంది వున్నారు. అలాంటి వారికి ప్రతీక సుబ్బాయమ్మ. తమ ఇంట్లోకి పామొచ్చినప్పుడు కూడా చెట్టంత కొడుకు ఇంట్లో వున్నా సరే, ఇతరులే వచ్చి కొట్టాలి. సత్తెయ్య తనకు సాయం చేసేవాడు కావాలంటే ఆ పని చేయటానికి తన కొడుక్కు అనుమతి ఇవ్వదు సుబ్బాయమ్మ. ఆ పని చేయటానికి చిన్న పిల్ల వాడైన గురవణ్ణి పిలుచుకొని వస్తుంది. ఆ తరువాత పామును బయటికి లాగి విసిరేస్తే మూడోవైపు కాపు కాయటానికి క్కూడా కొడుకును వెళ్ళ వద్దంటుంది. పాము సత్తెయ్యను కాటేస్తే దెబ్బతిన్న పాము పూర్తిగా చచ్చిపోయిందో లేదో అని ఆందోళన పడుతుందే కానీ సత్తెయ్య ప్రాణాన్ని గురించి ఆలోచించదు. ఆపదల్ని ఇతరులు మాత్రమే ఎదుర్కోవాలి. ఫలితాలను తాము మాత్రమే అనుభవించాలి అన్న సామాజిక వర్గ స్వార్థానికి సాకారమైన ప్రతీక సుబ్బాయమ్మ.

మానవేతరమైన విషయాల పట్ల మానవుని కున్న భయాన్ని డబ్బుగా మార్చుకునే పురోహిత వర్గానికి ప్రతీక మంత్రగాడు రాములయ్య. ఒకవేళ అలాంటి భయం లేకపోతే అతడు దాన్ని సృష్టించగలడు. సత్యయ్య లాగా అతడు ప్రతిఫలాపేక్ష లేకుండా పాముల్ని చంపడు. చేటడు బియ్యమూ, బట్టలూ, దక్షిణా ఇమ్మంటాడు. ఇంకా పాములున్నాయని భయపెట్టి ఇంటికి దిగ్బంధన చేయాలని డబ్బు గుంజుతాడు. అసలు అతనికి తన మంత్రం మీదనే నమ్మకం లేదు. మంత్రానికి ‘టైం’ వుంటుందట. అది దాటిపోయాక మంత్రం పని చేయదట. మంత్రానికి బలమే వుంటే అది ఎల్లప్పుడూ పని చేయాలి కదా అని అతణ్ణి ఎవరూ అడగరు. సత్తెయ్యంటే రాములయ్యకు ద్వేషం వుండటానికి ఆర్థిక కారణం కూడా వుంది. సత్తెయ్య పాముల్ని చంపటం ప్రారంభించాక రాములయ్య ఆదాయం పడిపోయింది. ఈ రెండు కారణాల వల్లనే సొమ్ముల గురవడు పిలిచినప్పుడు పాము కరిచిన సత్తెయ్యకు మంత్రం చేయటానికి అతడు రాడు. సత్తెయ్య స్వయంగా తనని పిలవనంపలేదన్న సాకుతో తప్పించుకుంటాడు.

కథాంశానికి సంబంధించినంతవరకూ రచనయితకు ప్రతినిధి - ఆల్టర్ ఇగో. అయిన పాత్ర సొమ్ముల గురవడు. అతడు తెలివైన పాఠకునికి ప్రతినిధి కూడా. తెలివైన పాఠకునికి రావల్సిన సందేహాలు వాడికొస్తుంటాయి. అతడు అడగాల్సిన ప్రశ్నల్ని కూడా గురవడు అడుగుతూ వుంటాడు. “భయం” కథలో మొట్టమొదటి సారిగా సుబ్బాయమ్మ స్వార్థాన్ని ప్రశ్నించినవాడు గురవడే.

“పాము దూరింది ఆళ్ళ ఇరకలోనా?... సాయానికి నువ్వా నేనా?... చెయ్యి సాయం, తోడుండమంటే - ఎలాగా సత్తారో మీరిద్దరూ సావండి కానీ, నా కొడుక్కి దాని గాలి కూడా తగల్డానికి ఒల్లకాదంటాది ఆయమ్మ. ఈయిడేకన్నాదేమిటి కొడుకుని? నిన్నూ నన్నూ అమ్మకన్లేదేటి?”

అన్నవాడు గురవడే.

సత్తెయ్యకు పాము కరిచిన తరువాత మంత్రం వేయటానికి రాములయ్యను వెళ్ళి బతిమాలతాడు సొమ్ముల గురవడు. ఎంత బతిమాలుకున్నా అతడు రాడు. తిరిగి సత్తెయ్య వద్దకు వెళ్ళటానికి మనస్కరించని గురవడు సరాసరి ఊరవతల వున్న పశువుల మంద వద్దకు వెళ్తాడు. ఆ వెనక రోజు వరకూ కనిపించిన విధంగా ఆ మంద కనిపించదు. మంద ఒక వర్గ సమాజంలాగా కనిపిస్తుంది. మందలోని జీవాలు వర్గ సమాజంలోని మనుషుల్లా కనిపిస్తాయి. తాను ఆలోచిస్తున్న విధానాన్ని చూసి గురవడే ఆశ్చర్యపోతాడు. అలా తాను కొత్తగా ఆలోచించటం తప్పు కాదని తెలుసుకుంటాడు. తన జీవితానుభవం తన జీవిత దృక్పథాన్ని మార్చి వేసిందని అర్థం చేసుకుంటాడు. గురవడికి కలిగింది సమాజం యొక్క నగ్న సాక్షాత్కారం గొప్ప ఎపిఫనీ. ఒకే ఒక జీవితానుభవంతో గురవడు జీవితాన్ని నడిపే మూల సూత్రమేమిటో అర్థం చేసుకొని ఎదిగిపోతాడు.

ఈ విధంగా “భయం” కథాంశం, కథనం, పాత్రలూ పత్రీకలుగా కుదిరిన అరుదైన గొప్ప కథ. ***11.11.94 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక*** *

అయినా వారి చైతన్యస్థాయిలోని తేడాలు కారణం కావచ్చు. అందుచేత అనువాదకుడు లక్ష్య భాషను మాట్లాడే ప్రజల నాడిని పట్టుకోవటం చాలా అవసరం.

ఈలోగా అనువాదకుడిగా నేను మరో పాఠాన్ని కూడా నేర్చుకున్నాను. “సోషియల్ అండ్ సివిలైజేషన్” అన్న పుస్తకాన్ని పంపుతూ హెచ్.బి.టి. వాళ్ల దాన్ని అనువదించమని కోరారు. ఆ పుస్తకాన్ని చదివి ఆశ్చర్యపోయాను. జీవావరణానికీ, సంస్కృతికీ ఉన్న సంబంధాన్ని - మొత్తం ప్రపంచ చరిత్రను ఆధారంగా వేసుకొని - చర్చించిన పుస్తకం అది. ఆ పుస్తకంలోని వస్తువు అర్థమయింది కానీ ఆ పుస్తకం మొత్తంగా నా నరాలలోకి ఎక్కలేదు. అందుచేత ఆ పుస్తకాన్ని నేను అనువదిస్తే బాగా రాకపోవచ్చు ననిపించింది. సరైన అనువాదకుడు ఎవరా అని ఆలోచిస్తే తల్లావజ్ఝల పతంజలి శాస్త్రిగారు జ్ఞాపకం వచ్చారు. వారు చరిత్ర చదువుకున్నవారు. సాంస్కృతిక అధ్యయనాలలో నుంచీ పర్యావరణంలోకి వచ్చినవారు. పర్యావరణ కార్యకర్త. కథా రచయిత. “మీరు ఆ పుస్తకాన్ని అనువాదం చేస్తారా?” అని అడిగితే వారు సంతోషంగా అంగీకరించారు, ఇప్పుడు అనువాదం సాగుతోంది. రచయితకు కథా వస్తువుతో హృదయసంవాదం కుదిరినట్టుగా అనువాదకుడికి గూడా మూల గ్రంథంలోని విషయంతో హృదయ సంవాదం కుదరాలి. అందరు అనువాదకులూ అన్ని విషయాలనూ బాగా అనువదించలేరు. కొందరు కొన్ని విషయాలను ఇతరుల కంటే మెరుగ్గా అనువదించగలరు. ఈ సత్యాన్ని గుర్తిస్తే అనువాదం కొందరు భావిస్తున్నట్టుగా వృత్తి రచనకాదని అర్థమవుతుంది.

ఇవి నేను ఇతర భాషల్లో నుంచి తెలుగులోకి చేసిన అనువాదాలకు సంబంధించిన అనుభవాలు. నేను తెలుగు నుంచి ఇంగ్లీషులోకి కూడా కొన్ని అనువాదాలు చేశాను. కొంత కవిత్వాన్నీ, తిలక్, పెద్దిభొట్ల, సింగమనేని, వివినమూర్తి, వల్లంపాటి గార్ల కథల్ని ఇంగ్లీషులోకి అనువదించి వివిధ పత్రికల్లో ప్రచురించాను. ఆ అనువాద కార్యంలోని అనుభవాలూ, సమస్యలూ వేరు. వాటిని గురించి మరొకసారి మాట్లాడుకుందాం.

మొత్తం మీద అనువాదం రెండు భాషలకూ, రెండు సంస్కృతులకూ మధ్య అక్షరాల వంతెన. ప్రపంచంలోని అన్ని భాషల్నీ, సంస్కృతుల్నీ, సర్వమానవ జీవతానుభవాలనూ, విజ్ఞానాన్నీ ఏకం చేసే విశ్వ కుటుంబి అనువాదకుడు.

*

వ్యాసం

☆ కొడవటిగంటి కుటుంబ రావు

సినిమాలూ - ప్రబంధయుగం

(ఇటీవల జరిగిన తెలుగు సినిమా వజ్రోత్సవాల మీద చాలా మందే రాశారు. - తెలుగు సినిమా గురించి 1969లోనే కొ.కు. ఇచ్చిన ఈ సునిశిత విశ్లేషణ చూడండి - సం.)

పరిణామం చెందే అన్నికళలకూ నాలుగుదశలుంటాయి. ఈ దశలనే మానవుడు తన జీవితంలోనూ పొందుతాడు.

మొదటిది బాల్యదశ. పవిత్రతా, విశ్వాసమూ, పెరుగుదలా ఈ దశయొక్క లక్షణాలు. తప్పటడుగులూ, అల్ప సంతోషమూ, చిన్న పెద్ద బాలారిష్టాలూ ఈ దశయొక్క అవలక్షణాలు.

కళలు ఈ దశలో ఎంతో పవిత్ర భావాలను ప్రదర్శిస్తాయి. పురాణాలూ, ధర్మగ్రంథాలూ, నీతి శతకాలూ ఈ యుగంలోనే పుడతాయి. కళాసరస్వతి ఆరాధ్యదేవతగా పూజించబడుతుంది.

మన సినిమాలకు ఈ దశ గడిచిపోయింది. నిజానికి ఈ దశలో అచ్చగా పౌరాణిక చిత్రాలే రాలేదు. సాంఘిక చిత్రాలు కూడా వచ్చాయి. కాని వాటికి కూడా పవిత్రత ఆపాదించుకున్నది. అస్పృశ్యతనైతేనేం, రైతు సమస్యనైతేనేం, తాగుడు సమస్యనైతేనేం స్త్రీ పునర్వివాహ సమస్యనైతేనేం అప్పటి నిర్మాతలు ఎంతో పవిత్ర భావంతో చిత్రించి, సంఘానికి మహోపకారం చేస్తున్నామనుకున్నారు. లేదా అన్నారు; సంఘం విశ్వసించింది.

పురాణయుగం వెళ్ళిపోయి, సినిమాలకు ఇప్పుడు ప్రబంధయుగం నడుస్తున్నది. మనిషివరంగా చూసినట్టయితే ఇది యౌవనదశ. ఈ దశలో అహంకారమూ, ఉద్రేకమూ, సుఖవాంఛా, సాహసమూ జాస్తి. పవిత్రభావాలు వెనుకబడిపోతాయి. శృంగారం మీద మోజు పెరుగుతుంది. అందమూ, ఆనందమూ అగ్రస్థానం వహిస్తాయి.

సాంస్కృతిక రంగంలో ఇది ప్రబంధయుగం. శృంగారం ప్రధానరసం. వీరం దానికి తోడవుతుంది. ఈ యుగపు సంక్రాంతి పురుషుడు శత్రువులకు యముడు, ప్రియురాలికి నవ మన్మథుడు. గాంధర్వం జీవితం మీద తాండవం చేస్తుంది. "వాణి నారాణి" అవుతుంది. కళాదేవత మోహినీ రూపంలో తప్ప ప్రత్యక్షం కాదు.

ఈ లక్షణాలన్నీ మనకు ఈనాడు సినిమాలలో కనబడుతూనే ఉన్నవి. బూతుపాటలూ, సంభాషణలూ, శృంగార సన్నివేశాలూ, హత్యాచిత్రాలూ, స్టంటులూ మొదలైనవి ఈ దశకు సంబంధించినవే.

సినిమాల జాతకం గుణించలేనివాళ్ళు మన చిత్రాలలో వాస్తవికత లోపించిందనీ, ప్రయోజనం మృగ్యంగా ఉందనీ ఆక్షేపించవచ్చు. కాని సినిమాల జాతకం మార్చటం అంత తేలికకాదు. వాస్తవిక దృష్టీ, విమర్శనా శక్తీ, కళా ప్రయోజనాలపట్ల లక్ష్యమూ ఉండే దశ ఇంకా రాలేదు. ఆఖరుదైన విప్లవ దశ ఎక్కడా కనుచూపుమేరలో లేనేలేదు.

సినిమాలు పదహారో శతాబ్దంలో ఉండి మనం ఇరవయ్యో శతాబ్దంలో ఉండటం మూలాన సహజంగా కొన్ని చిక్కులు ఏర్పడతాయి. మన జీవితానికీ, సినిమాలకూ లంగరందదు. రెండు తిత్తులూ వేరే వేరేగా ఉండటమే చాలా గొప్ప విషయం అని కొందరంటున్నారు. కాని కొంచెం ఆలోచిస్తే ఇందువల్ల చాలా నష్టాలున్నాయి.

ఒక నష్టం కళాస్వాదనకు సంబంధించినది. కళలు ఇచ్చే అనుభూతికీ, జీవితానుభవానికీ ఏమీ సంబంధం లేకపోతే కళలు జీర్ణం కావు, వంటబట్టవు. మొట్టమొదటిసారి మనం ఏ పాశ్చాత్య సంగీతమో, మోడర్న్ ఆర్టో అనుభవించినప్పుడిలాగే జరుగుతుంది. అది మనకు సంగీతమేననీ, ఆర్టేననీ కూడా అనిపించదు. పరిచితమైనా కూడా సర్కసులూ, ఇంద్రజాలాలూ రసానుభూతి నివ్వకపోవటానికి ఇదే కారణం. రసానుభూతి లోపించిన కళానుభూతి నల్లమందులాగా ఇన్హిబిషన్ కలిగిస్తుంది. కోడలుతో జగడమాడి పురాణం వినటానికి వెళ్ళిన ముసలిది కునికిపాట్లు పడుతుంది. ఇన్హిబిషన్ లక్షణం.

(నేనీ మాట అంటే ఒక సైకాలజిస్టు ఒప్పుకున్నాడు. "మన సినిమాలలో పిల్లలు ఉలిక్కిపడే బాక్ గ్రౌండ్ మ్యూజిక్కూ, పాత్రలు అరవటమూ, ఏడవటమూ, పెద్ద పెట్టున పాటలూ, కోలాహలంగా డాన్సులూ లేని పక్షంలో ఇంటర్వల్ లోపల ప్రేక్షకులలో చాలామంది నిశ్చయంగా నిద్రపోతారు" అంటాడతను. అందుచేత మన సినిమాలలో "ధ్వని" జాస్తిగా ఉన్నందుకు విమర్శకులు తప్పుపట్టటం సబబుకాదు. షేక్స్పియరంతటివాడే తన యుగానికి సంబంధించని ఇతివృత్తాలతో నాటకాలు రాసి, ప్రేక్షకులు నిద్రపోకుండా ఉండటానికి రెండో అంకంలో పెద్ద చప్పుళ్ళు ఏర్పాటు చేశాడని విమర్శకులన్నారు. మన ప్రొడ్యూసర్లనగా ఎంత?)

ఈనాటి చిత్రాలతో వచ్చిన రెండో ఇబ్బంది సాధారణ మనస్తత్వానికి సంబంధించినది. 'తినగ తినగ వేము తియ్యనుండు' నన్నాడు వేమనయోగి. ఈ కాలపు సినిమాలలో చూడగా చూడగా, జీవితం అట్లాగే ఉంటుందన్న భ్రమ ఒకటి కలుగుతుంది నిత్య ప్రేక్షకుడికి. దీన్నే పవర్ ఆఫ్ సజెశ్చన్ అంటారు.

సినిమాలలో మనం చూసే పాత్రలు, అందులోనూ ప్రత్యేకించి ప్రధానపాత్రలు, కేవలమూ మృణ్మయ పాత్రలు.... అవి, నిత్యజీవితంలో మనం చేసే పనులు ఏవీ చెయ్యవు. కార్లలో తిరగటమూ, సైకిళ్ళమీద అమ్మాయిలను వెంబడించటమూ, డ్యూయెట్లు రావటమూ, డాన్సులు చెయ్యటమూ, పరిస్థితి విషమిస్తే గంభీరంగా ఉపన్యాసాలు దంచటమూ సినిమా హీరోల సమగ్ర జీవితం. హత్యా చిత్రాలయితే హీరో గుర్రపు సవారీ చెయ్యాలి. గంతలు కట్టుకోవాలి. పిస్తోళ్ళు పేల్చాలి, పరిగెత్తాలి, దూకాలి, ఒక్కపోటుతో డజనుమందిని పడగొట్టాలి, హీరోయిన్ను వాటేసుకోవాలి.

హీరోయిన్ మామూలు పరిస్థితుల్లో సెక్సు ఒడ్డాలి, అమామూలు స్థితుల్లో కన్నీరు ఒడ్డాలి, బస్.

కుర్రకారువాళ్ళు, యువతీ యువకులు, ఇదే నిజమైన జీవితం అనుకున్న స్థితికి వచ్చాక వాళ్ళు ఈ ఇరవయ్యో శతాబ్దపు జీవితానికి తట్టుకోలేరు. ఆ స్థితి రాకుండా ఉండాలంటే మన ప్రేక్షకులు ఈనాటి సినిమాలను సర్కసులను చూసినట్టు చూడటమూ, "ధ్వని" అంతగా లేనప్పుడు ఒక కునుకు తియ్యటమూ క్షేమం.

"మిగిలినవన్నీ అబద్ధమైనా సెక్సు సార్వకాలికం గదా. అది పుష్కలంగా సినిమాలలో ఉంటూనే ఉన్నదాయె" అని ఎవరన్నా అనవచ్చు.

ప్రబంధాలలో సెక్సును నమ్మటం ఎంత ప్రమాదమో, ఈ సినిమా సెక్సును నమ్మటం కూడా అంత ప్రమాదమే. ప్రబంధాలలో దంత క్షతాలూ, నఖక్షతాలూ పెట్టి సెక్సును రాక్షసంగా చిత్రించారు. డ్యూయెట్లూ, మైథున నృత్యాలూ పెట్టి ఈనాటి చిత్రాలలో సెక్సును హాస్యాస్పదం చేస్తున్నారు. (స్త్రీలను అర్ధనగ్నంగా చూపటం సెక్సు కిందికి వస్తుందనుకోను. మన స్త్రీలు పదేసి మూళ్ళ చీరెల చాటున తమ అందాన్నీ, అనాకారితనాన్నీ కూడా దాచేస్తున్నారు. మగవాళ్ళూ, ఆడవాళ్ళూ కూడా తమ శరీరాలను అందంగా ఉంచుకోవలసిందే. సినిమాల ప్రభావం వల్ల మన స్త్రీలు తమ దేహాలను అందంగా ఉంచుకోవటం జరిగితే అంతవరకైనా మనం వాటికి కృతజ్ఞత చూపవచ్చు.)

ఇప్పుడు సమస్య ఏమిటంటే, ప్రబంధయుగంలో ఉన్న ఈ సినిమా చిత్రాలను ఆధునిక యుగంలోకి చేరవేయటం సాధ్యం కాదా? అది అసాధ్యం కాదు. అందుకు "మినిమమ్ కండిషన్" ఏమంటే, సినిమా చిత్రాలు తీసేవాళ్ళు పూర్తిగా ఆధునిక సంస్కృతి కలవాళ్ళయి ఉండాలి. వాళ్ళకు సినిమాలు తీయాలనిపించాలి; అన్ని హంగులూ వాళ్ళకు అమరాలి.

ఇదంతా సాధ్యమయినా ప్రేక్షకులకు తమ వాస్తవ జీవితంపైన శ్రద్ధా ఆసక్తి లేకపోతే వాటిని వాళ్ళు చూడరు. వ్యాపార దృష్ట్యా అటువంటి చిత్రాలు తీయటం ఆత్మహత్య అవుతుంది.

నిజానికి సినిమాలకు ప్రత్యేక సమస్య లేదు. ఈ దేశంలో కళల కన్నిటికీ ఉన్న సమస్యే సినిమాలలోనూ కొంతవరకు ద్యోతకమవుతున్నది. మనది వాస్తవిక దృష్టిగల జాతి కాదు.

మనం కార్యవాదులం కాము. ఎవరిమటుకు వారు గత కాలంలో ఏదో ఒక ప్రాంతాన జీవిస్తున్నాం. అందరూ ఎవరో తోలే వాహనాలలో ప్రయాణం చేస్తున్నారు. అనేకమంది తమ రథాల పగ్గాలను తిరుపతి వెంకటేశ్వరుడి చేతిలో ఉంచారు. కొందరు బాబాలపైన తమ జీవితభారం వేశారు. ఈ జనాభాలో చాలా ఆధునికులమనుకునేవాళ్ళు సైతం వివిధ రాజకీయ పార్టీలపైనే తమ ఆశలన్నీ పెట్టుకున్నారు. తమ జీవితాలను తామే నడుపుకుంటున్న అత్యల్ప సంఖ్యాకులు అక్రమ మార్గాలు తొక్కి బాగుపడుతున్నారు. (క్రమ మార్గాల బాగుపడే పథకాలు ఈనాటి జీవితంలో సాధ్యంకావు గనక) జీవితమే పంచకూళ్ళ కషాయం లాగా, కుక్కల దొడ్డిలాగా, రొచ్చుగుంటలాగా ఉన్నది.

దీని ఫలితంగా మన సంస్కృతి ఆధునిక కళారూపాల కేసిపోక, భరతనాట్యం కేసీ, కూచిపూడి భాగోతాల కేసీ, జానపద పాటలకేసీ పోతున్నది. మన జాతి ఎంత వెనక్కు పోవటం సాధ్యమో చూడటానికి యత్నిస్తున్నది. ఈ ప్రయత్నంలో మన సినిమాలు కూడా ఒక భాగమైతే మనం వాటిని తప్పుపట్టాలా?

- విజయచిత్ర మాసపత్రిక ప్రత్యేక సంచిక 1969 ✻

లేఖ ☆ సయ్యద్ సాబిర్ హుసేన్

ఇస్లాం వాదం పై గోబెల్స్ ప్రచారం ఆపండి

అరుణతార డిసెంబరు సంచికలో 'అలావా' పై షఫి పేరుతో వచ్చిన సమీక్ష గందరగోళంగా వుంది. సమీక్షను అడ్డుపెట్టుకొని ఇస్లాంవాదం పై బురద జల్లడానికి ముస్లింవాదులు చేసే కుటిల ప్రయత్నాలతో భాగంగానే ఈ రివ్యూ కనిపించింది.

షఫి అలావా గురించి, ముస్లిం వాదం గురించి ఏమి చెప్పుకున్నా మాకేం అభ్యంతరం లేదు. కాని ఇస్లాం వాదంలోకి దూరి రంధ్రాన్వేషణ చేసినట్టుగా అనేక విషయాలు చెప్పుకొచ్చాడు. ఇస్లాం వాదుల వైపు నుండి భావ వ్యక్తీకరణ ఆరంభంలోనే వుంది. ఇది గమనించకుండా అప్పుడే తొందరపాటుతో ఇస్లాం వాదుల్ని మత ఛాందసులుగా ముద్రవేయడం ఏ విధంగా సబబు అనిపించుకుంటుందో షఫి లాంటి వాళ్ళకే తెలియాలి. షేక్ కరీముల్లా ముస్లిం రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా చెప్పుకుంటున్నాడని రాసాడు. జూన్ 5 న హైదరాబాదులో జరిగిన ఇస్లాం వాద సాహిత్య సభానంతరం ముస్లిం రచయితల సమావేశం జరగడం, అందులో రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు కావడం అందరికీ తెల్సిన విషయమే. ముస్లింలతో కలవని షఫి లాంటి వాళ్ళకి ఇలాంటి విషయాలు తెలియవు. ఇక 'ఇస్లాం వాదులు', "ముల్లాల సంస్కృతిని ప్రవేశపెట్టడానికి అలిఫ్ బేలు వల్లిస్తున్నారు" అని అన్నాడు. ఇస్లాం వాదం వైపు నుండి ఇప్పటివరకు వచ్చిన 'సాయిబు' దీర్ఘ కవిత, 'ఖిబ్లా' కవితా సంకలనాలలో ఎక్కడైనా ముల్లాల సంస్కృతిని ప్రవేశపెట్టిన ఆనవాళ్ళను నిరూపిస్తూ మాట్లాడి వుంటే బాగుండేది. అలాకాక ఏకపక్షంగా ముల్లాల సంస్కృతిని పెంచి పోషిస్తుందని మాట్లాడ్డం గోబెల్స్ ప్రచారం చేయడం అవుతుంది. నిజానికి ముస్లింల సామాజిక వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్న ముల్లాల వ్యవస్థను విచ్చిన్నం చేయడానికే ఇస్లాం వాదం వచ్చింది. ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా, అసలు ముస్లిం సంస్కృతి పై ఏమాత్రం అవగాహన లేకుండా షఫి లాంటి వాళ్ళు రాసే రాతలు అందరిలో అయోమయం సృష్టించే అవకాశం వుంది.

ఇదే సమీక్షలో మరోచోట "ఇస్లాం వాదం పేరుతో ముస్లిం వాదం గొంతు నొక్కాలని చూస్తున్నారు" అని రాశారు. ఏ వాదమూ విమర్శలకు అతీతం కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరి భావనలు వారివి. ముస్లిం వాదం లోపాల్ని విమర్శించినంత మాత్రానా దాని గొంతు నొక్కేయాలని చూస్తున్నారని రాయడం అవివేకమే అవుతుంది. కేవలం కరీముల్లా రాసిన వ్యాసాలకే ఆ వాదం కుప్పకూలిపోయినట్లయితే అదొక వాదమే కాదు. ఇస్లాం వాదులుగా మేము మొదటి నుండీ చెప్పేది సైద్ధాంతిక తాత్విక భూమిక ఆధారంగానే ఏ వాదమైనా శాశ్వతంగా మనగలుగుతుంది. అలాకాక కేవలం ఒకరిద్దరి మీద ఆధారపడిన వాదం కనుకే ముస్లిం వాదానికి ఈ పరిస్థితి దాపురించింది. దానికో తలా లేదు, తోకా లేదు. కొన్నాళ్ళు అంబేద్కరిస్టుల వెనుకా, కొన్నాళ్ళు మరొకరి వెనుకా, ఇంకొన్నాళ్ళు పోతే ఎవరి వెనుక ప్రయాణిస్తుందో తెలియదు. ముస్లిం వాదానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఆ ఒకరిద్దరు వ్యక్తులు గంగలో దూకితే గంగలోకి, కృష్ణలో దూకితే కృష్ణలోకి దూకడం మినహా మిగిలిన ముస్లిం వాదులకు గత్యంతరం లేదు. ఎందుకంటే దానికో సిద్ధాంతమూ లేదు, తాత్విక పునాది అంతకన్నా లేదు. తెలుగు సాహిత్యంలో విప్లవ వాదం, అభ్యుదయవాదం, దళిత వాదం ఇన్నాళ్ళు బతికుండటానికి ప్రధాన కారణం వాటికున్న సైద్ధాంతిక తాత్విక భావజాలమే. వ్యక్తులపై ఆధారపడ్డ దిగంబర వాదం, పోస్టు మోడర్నిస్టు దృక్పథాలకు ఏ గతి పట్టిందో అందరికీ తెల్సిన విషయమే. కనుకే ఏ వాదానికైనా సిద్ధాంతం అవసరం. ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ, నాయకత్వ స్థాయిలో వున్న ప్రముఖ కవులు విప్లవ వాదాన్ని వీడి వెళ్ళినప్పటికీ అది ఇప్పటికీ సజీవంగా ఉండటానికి ప్రధాన కారణం దాని తాత్విక భావజాలమే. ముస్లిం వాదానికి తాత్విక భావజాలమేదో ముస్లిం వాదులు చెప్పగలరా? ఏ సాహిత్య వాదానికైనా ప్రజల సమస్యలే వస్తువు అవుతాయి. కానీ అంతర్లీనంగా దానికో ఫిలాసఫి ఉండాలి. ఇవేవీ లేకుండా కొనసాగే ముస్లిం వాదం ఎంతకాలం ఉండగలుగుతుంది?

మరోచోట ఇస్లాం వాదాన్ని సంఘ్ పరివార్ సాహిత్య రూపంతో షఫి పోల్చాడు. ఇంతకన్నా దుర్మార్గమైన దాడి మరొకటి లేదు. ఫాసిజాన్ని నమ్మి జాతి నిర్మూలనకు పాల్పడుతున్న కాషాయ సాహిత్యానికి, ప్రపంచంలోని మానవులంతా పరస్పరం సహోదరులేనన్న పవిత్ర ఖురాన్ బోధను నమ్మిన ఇస్లాం వాదానికి పోలిక పెట్టడం గర్హనీయం. ఇస్లాం వాద సాహిత్యంలో మత సామరస్యానికి విఘాతం కలిగించే రాతలను షఫి ఒక్కటైనా చూపగలడా? "సబ్ ఊపర్‌వాలేకే హాతోమే హై" అనేది ఛాందసవాదులు మాత్రమే. ఇటువంటి ఛాందసాన్ని ఇస్లాం వాదం వ్యతిరేకిస్తుంది. పవిత్ర ఖురానే స్వయంగా ఒక సమాజం తనని తాను మార్చుకోవడానికి సిద్ధపడనంత వరకూ అల్లా కూడా దాని స్థితిని మార్చడని బోధించింది. ఇస్లాం దువా ఔర్ దవా అని చెప్పింది. అంతేకాని కేవలం ప్రార్థనలు చేసుకుంటూ తజ్బీని తిప్పుకుంటూ కూర్చోమని చెప్పలేదు. ఇస్లాం కర్మ సిద్ధాంతాన్ని బోధించదు. ఇస్లాంను సరిగ్గా అధ్యయనం చేయకుండా యూరప్ సామ్రాజ్యవాదులు సృష్టించిన "ఇస్లామీఫోబియా" లో పడి కొట్టుకుపోయే షఫి లాంటి వాళ్ళకు ఇస్లాంవాదం అర్థం కాకపోవడం విచిత్రమేమీ కాదు. సంఘ్ పరివార్ ఇస్లాంపై ఏ విధంగా దాడి చేస్తుందో ముస్లిం వాదులూ అదే చేస్తున్నారు.

ఈ దేశ మూలవాసులైన ముస్లింలు తమ సంస్కృతిని కాపాడుకుంటూ మిగిలిన అన్ని సమాజాలతో కలిసి నడవవలసిన అవసరం వుంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఎవరి సంస్కృతీ నిలబడని పరిస్థితి వుంది. ఈ స్థితిలో సాంస్కృతిక దాడుల్ని అడ్డుకోవాలని భావించడం మతవాదం ఔతుందా? మేము ఏ వాదానికీ వ్యతిరేకం కాదు. ముస్లింలను గొర్రెలుగా, బర్రెలుగా కాక మనుషుల్లా చూస్తూ వారి ప్రాణాలకూ విలువిచ్చే అన్నీ వాదాలు మాకు మిత్రవాదాలే. మొత్తం తెలుగు సాహిత్యంలో ఒక్క సంఘ్ పరివార్ వాదం తప్ప ఇంక ఏ వాదంపై వ్యతిరేకత ఉండవలసిన అవసరం ఇస్లాం వాదులకు లేదు. ఈ విషయాన్ని భవిష్యత్తులోనైనా షఫి లాంటి వాళ్ళు గుర్తించక మానరు.

*

కామ్రేడ్ మల్లెల నారాయణకు జోహార్లు

బయటి ప్రాంతాల్లోని ఈతరం విరసం సభ్యులకు కూడా తెలియని మల్లెల నారాయణ విరసంలో చాలా సీనియర్. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. రాష్ట్రస్థాయి విరసం కార్యకలాపాల్లో ఎన్నడు కనిపించకపోయినా కడప జిల్లాలో ప్రజా పోరాటాలకు తోడ్పాటునందిస్తూ విరసం, విప్లవ సాంస్కృతిక కార్యక్రమాల్లో క్రియాశీలంగా ఉండేవారు. 2006 సెప్టెంబర్ 21న ప్రొద్దుటూరులో అనారోగ్య కారణం వల్ల చనిపోయేవరకు ఆయన విరసం ఆశయాలతో, విలువలతో కొనసాగారు. సహజంగా కడపజిల్లాలో సాహిత్యాసక్తిగలవారిపై పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రభావం ఉన్నట్టే మల్లెల నారాయణకు కూడా ఆయన గురుతుల్యుడు. కానీ, నారాయణ స్పష్టమైన సామాజిక అవగాహన ఏర్పరచుకొనే క్రమంలో మార్క్సిజం వైపు, విప్లవరాజకీయాలవైపు ప్రయాణించి జీవిత పర్యంతం దృఢంగా నిలబడ్డారు. 22వ తేది విరసం కడప యూనిట్ ఆధ్వర్యంలో కామ్రేడ్ మల్లెల నారాయణ అంత్యక్రియలకు ఆయన విద్యార్థులు, మిత్రులు, సహచరులు చాలా మంది హాజరయ్యారు. విరసం రాష్ట్ర కార్యదర్శి వి.చెంచయ్య ఆయన భౌతిక కాయంపై ఎర్రజెండా కప్పి జోహార్లు అర్పించారు. ఆ సాయంకాలం ప్రొద్దుటూరులో జరిగిన సంతాప సభలో మల్లెల నారాయణ సాహిత్య, రాజకీయ సహచరులు ప్రసంగించారు. చెంచయ్య ఆయన సాహిత్య కృషి గురించి విశ్లేషించారు. నారాయణ వైవిధ్యమైన ఆసక్తులు కలవారు కావడం వల్ల జీవితా పర్యంతం ఆయన చేసిన రచనలను, పరిశోధనలను, సేకరణలను ఒక చోటికి చేర్చితే ప్రజాదృక్పథంతో ఆయన సాహిత్య కృషి అర్థమవుతుంది.

చర్చ

'మూలుగు' నవలలోని మూలుగ

☆ వెన్నెలకంటి రామారావు

'రామకవచం సాగర్ మానసిక పతనానికి ఆయన రాసిన "మూలుగు" నవల ఒక నిదర్శనంగా నిలిచింది. అది తన వ్యక్తిగత మానసిక సంక్షోభానికి ఒక ప్రతిబింబం. సామాజిక కట్టుబాట్లన్నీ విద్రోహపూరితమైనవిగా తలుస్తూ, కోరుకున్న స్త్రీతో కామవాంఛ తీర్చుకోలేని పరిస్థితిలో కామదాహంతో మూలుగేవాడి మూలుగు లాంటిదే 'మూలుగు', నైజాం రజాకార్ల క్రూరత్వానికి, యూనియన్ సైన్యాలకి వ్యతిరేకంగా తెగించి పోరాడిన కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులపై రచయిత తప్పుడు వ్యాఖ్యానాలు చేసి చరిత్రను వక్రీకరించారు' - అని డా.జి.వి.కృష్ణారావుగారు, 'ప్రజాసాహితి" ఆగష్టు 2006 సంచికలో "మూలుగు" నవలపై రాసిన సమీక్షా వ్యాసంలో వ్యాఖానించారు.

తెలంగాణా సాయుధ పోరాటం ముమ్మరంగా జరుగుతున్న కాలం అది. ఒక ప్రాంత క్రూర భూస్వామి ఉంపుడుగత్తె, అనేక మంది ప్రజల మాన, ప్రాణ హరణాలకు కారకురాలు, పోలీసు ఇన్‌ఫార్మర్ ఆ ప్రాంత కమ్యూనిస్టు సాయుధ దళానికి బందీగా చిక్కింది. ఆమెకు ఎలాంటి శిక్షవెయ్యాలో దళం తీవ్రంగా చర్చించి, ఆమెపై దళంలోని వారందరూ లైంగిక అత్యాచారం జరిపి, మరణశిక్ష విధించాలని తీర్మానించింది. దళ కమాండరుకు ఆ నిర్ణయం పట్ల అభ్యంతరం వుండడం, పై నాయకుని జోక్యంతో ఆ తీర్మానం అమలు జరుగలేదనుకోండి. అయితే సమాజంకోసం ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడిన కమ్యూనిస్టు కార్యకర్తలు స్త్రీ పురుష సంబంధాల విషయంలో తీవ్రమైన అవగాహనా లోపంతో వున్నారు. భూస్వామ్య భావజాలమా? ఫ్రాయిడ్ సూచించిన "లిబిడో" సిద్ధాంతమా? ఏది వారిని నడిపించిందనేది అవతల విషయం. ఒక నీచమైన ఆలోచన ఈ సంఘటనలో వున్నవారిలో అంతర్గతంగా వుంది. ఆ చారిత్రక సందర్భంలో ఇలాంటి ఘటనలు యాదృచ్ఛికమైనవిగాను, అనాయాచిత మైనవిగాను కన్పడుతాయి.

ఆదర్శాలు, త్యాగాలూ, వీరత్వాలు వగైరా సవ్య లక్షణాలు (Positive aspects) ఉద్యమం యొక్క పోటుదశలో (Hightide pahse) ఆ ఉద్యమకారులలో ప్రధాన దృగంశంగా వుంటాయి. ఉద్యమం యొక్క ఆటుదశలో (Lowtide phase)ను, తాత్కాలిక వోటమి దశలోను గతం తాలుకు అపసవ్యలక్షణాలు (Negative aspects) అరకొర సైద్ధాంతిక జ్ఞానంతో ఉద్యమంలో పని చేసిన అనేక మందిని పెద్ద ఎత్తున ఆవహిస్తాయి. హేతుబద్ధ అంశాలతో (Rational factors) కూడుకున్న వారికంటే ఉద్వేగ భరిత అంశాలతో (Emotinal factors) కూడుకున్నవారు ఉద్యమం యొక్క పోటుదశలో పెద్దఎత్తున ఉద్యమ నిర్మాణాలలోకి వస్తారు, ఎగబ్రాకుతారు. అలాంటి వారే ఉద్యమం యొక్క ఆటు దశలో సైద్ధాంతిక, భావజాల సంక్షోభానికి గురై, ఆదర్శాలలో, ఆశయాలలో దివాళాతీసి, పాత భావాల్ని, మనోవికారాల్ని తీవ్రస్థాయిలో ఆత్రంగా పుణికి పుచ్చుకుంటారు.

నవలలోని దావూదు పాత్ర, ఆయన చుట్టు వున్న కొందరు కమ్యూనిస్టు నాయకుల పాత్రలు దృక్పథపు సంక్షోభపు ఆ చారిత్రక సందర్భాలలో వారి వారి గత సామాజిక అస్థిత్వాల (Social identities) (కుల, లింగ, మత, భాష, ప్రాంత వగైరాల) పునాదిగా ప్రతివర్తించారు. తెలంగాణా పోరాటంలో వీరోచితంగా పోరాడిన కొంతమంది విప్లవకారులు ఉదాహరణకు రావినారాయణ రెడ్డి లాంటివారు చివరకు ఎలా మిగిలారో చలసాని ప్రసాదరావుగారు తన పుస్తకంలో వ్రాశారు. వెనుకతట్టు పట్టిన (Setback) ప్రతి ఉద్యమం తనదైన రీతిలో సామాజిక విధ్వంసాన్ని సృష్టిస్తుంది. అలాంటి విధ్వంసకర వాతావరణంలో "మూలుగు"లోని దావూద్‌లాంటి మనోభావాలుగల విభిన్న పాత్రలు సమాజంలో ఉనికిలోకి వస్తాయి. రివిజినిస్టు రాజ్యాలుగా మారిన సోవియట్ రష్యా, చైనా, తూర్పు యూరప్ దేశాలలోని సోషలిస్టు సామాజిక ప్రయోగ వైఫల్యాలు ఆయాదేశాల సమాజాల్ని మాఫియా ముఠాల విశృంఖలతలోకి, తీవ్రదారిద్ర్యంలోకి, లైంగిక అరాచకంలోకి నెట్టివేశాయి. తెలంగాణా సాయుధ పోరాట విరమణ కాలంలో అనేక మంది కమ్యూనిస్టు కార్యకర్తలలోను, నాయకులలోను కుడిఎడమగా అలాంటి వైమనస్యతే నెలకొనిందనేది నిర్వివాద అంశం.

ఉద్యమం యొక్క పోటుదశలోని ఉత్సాహపూరిత వాతావరణాన్ని, ఆదర్శమైన, త్యాగపూరితమైన కార్యకర్తల, నాయకుల జీవితాలను ప్రతిఫలిస్తూ అనేక సాహిత్యరూపాలు వెలువడ్డాయి. ఈ రచనలన్నీ ఉద్యమంలో భాగస్వాములైన వారి సవ్య లక్షణాల్ని (Positive aspects) చిత్రీకరించాయి. అయితే ఉద్యమం యొక్క ఆటుదశలో అనేకమంది ఉద్యమకారులు దిగజారిపోయి, సంఘవ్యతిరేక శక్తులుగా తయారైనారు. చాలామంది చారిత్రక అర్థరాహిత్యానికి గురైనారు. అయితే విప్లవోద్యమ ఆటుదశకు చెందిన ఈ కోణాన్ని ప్రతిఫలిస్తూ ఎలాంటి రచనలు రాలేదు. ఈ చారిత్రక అపసవ్యలక్షణాల్ని, ఆత్మవైకల్యాన్ని ప్రతిఫలిస్తూ సాహితీ సృజన జరగలేదు. ఉద్యమాన్ని ప్రతిఫలించడమంటే ఆటు,పోట్ల చారిత్రక దశలలోని సవ్య, అపసవ్య పాత్రల స్వరూప, స్వభావాల్ని సజావుగా చిత్రించడమే. ఉద్యమంలో త్యాగాలు చేస్తున్న వారి జీవితాల్ని ఎలా సజావుగా ప్రతిబింబిస్తామో, దిగజారిపోయిన వారి, మరియు సందిగ్ధ చేతనలో వుండే వారి జీవితాల్ని, అపసవ్యలక్షణాల్ని కూడా సజావుగా ప్రతిబింబిస్తేనే చారిత్రక ప్రయోజనం వొనకూడుతుంది. త్యాగాల్ని మాత్రమే వ్రాస్తూ, అవలక్షణాల్ని స్పృశించకుండా వుంటే అది విప్లవ సాహిత్యంగాను, అవలక్షణాలను కూడా చిత్రీకరించి రాస్తే అది విప్లవ ప్రతిఘాతుక సాహిత్యం గాను చూసే దురలవాటు కొంతమంది వామపక్ష మేధావుల్లో వుంది. ఆ మేధోమంద "మూలుగు" నవలను తృణీకరించి చారిత్రక ద్రోహానికి పాల్పడుతుంది. పోటుదశలోని సవ్యలక్షణాలు, ఆటుదశలోని అపసవ్య లక్షణాలు వెరసి ఉద్యమం యొక్క సహేతుక స్వభావాన్ని నిర్ణయిస్తాయి. ఆటు, పోటు దశలు రెండూ పరస్పర పూరకాలుగా వుంటాయి. రెండు దశలలోని ప్రజల, కార్యకర్తల, నాయకుల స్వభావాల్ని సజీవంగా ప్రతిఫలించగల్గే సాహిత్యమే ఆ యుగ సాహిత్యంగా నిలుస్తుంది. అపసవ్య పార్శ్వాన్ని సజావుగా, సవ్యంగా ప్రతిఫలించగల్గితే అలాంటి రచన ప్రజలకు అపసవ్య బోధకునిగా (Negative teacher) చరిత్రలో నిలుస్తుంది.

ఏదేని మతాన్ని స్వీకరించినవాడు చనిపోయేంతవరకు (వేరే, ఇతర మతాన్ని స్వీకరించనప్పుడు) అదే మతస్తుడిగా వుండినట్లు, కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు కాగానే చనిపోయేంతవరకు కమ్యూనిస్టుగానే వుంటాడని, వుండాలని అనుకోవడం, అలాంటివారి తప్పిదాలను ఎత్తి చూపితే, కమ్యూనిజానికి, ప్రజలకు ద్రోహం చేసినట్లుగా భావించడం దుర్మార్గపూరితమైన అమాయకత్వం అవుతుంది. మూలుగు నవలలోని కమ్యూనిస్టు నాయకుల పాత్రలలోని మానసిక పతనం ఆ నవల చిత్రీకరించిన చారిత్రక సందర్భంనాటి విభిన్న వ్యక్తుల మానసిక పతనానికి ప్రతిబింబమేగాని, రచయిత మానసిక పతనానికి నిదర్శనమని డా.కృష్ణారావు విచక్షణారహితంగా వ్యాఖానించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం రూపొందించిన విధానం స్విచ్ వేస్తే లైట్ వెలిగినంత వేగంగా క్రింది క్యాడర్‌కు అర్థం కావడంగాని, మొత్తం పార్టీ కార్యాచరణలోకి ఆ అవగాహన ఇంకడంగాని, ఎక్కడా జరగదు. ఇది అన్నిదేశాలలోని అనుభవమే.

1987లో రిజర్వేషన్ అనుకూల, ప్రతికూల ఉద్యమాలలో వామపక్ష, రాజకీయ పార్టీల క్యాడర్ (ఒక్క రాడికల్స్ మినహా) అంతా కేంద్ర పార్టీ పాలసీతో సంబంధం లేకుండా వారి వారి కుల అస్థిత్వాల కనుగుణ్యంగా, రెండు భిన్న ఉద్యమాలలో చేరి, నిలువునా కులరీత్యా భిన్నవైఖరులను చేపట్టారు. కృష్ణారావుగారు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటే మంచిది. ఇకపోతే, ఇలాంటి వైవిధ్యభరిత, వివాదాస్పద అంశాలను "మూలుగు" నవలలో మొరటు రూపంలోనైనా తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన సాగర్‌గారి ధైర్యాన్ని, మానసిక ఔన్నత్యాన్ని గుర్తించాలి. ఉద్యమాలలోకి భిన్న అస్థిత్వాల పునాదిగా వచ్చి చేరే వ్యక్తులలోని ఉద్వేగాలన్ని భావజాల పునాదిగా హేతుబద్ధమైనవిగా (Rational) సంఘటిత పరచకపోతే (పడకపోతే) ఉద్యమం యొక్క ఆటుదశలో

అప్పటివరకు అణగివున్న అసంఘటిత ఉద్వేగాలు పెద్దయెత్తున విజృంభించి ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాల్ని డొల్ల చేస్తాయి. "మూలుగు" నవలలోని దావూదు పాత్ర అలాంటి చారిత్రక స్వభావానికి ఒక నిదర్శనంగా నిలుస్తుంది. అతనిలోని మత అస్థిత్వం, లైంగిక ఉద్వేగాలు (అసంఘటితంగా ఉన్న) రెండూ పార్టీలోని దృక్పధ సంక్షోభంతో కల్సి ఒక పార లౌకిక భావనకు గుర్తై, ఆనాటి కఠోర వాస్తవ ఘటనల్ని స్వప్నసాకార దృశ్యాలుగా పలవరించడం, గోడల మీద కదలాడే నీడల్లాంటి భవిష్యత్‌ను కలవరించడం జరిగింది. అంతేగాని తీరని కామమదంతో రచయిత సాగర్ మూలుగుగా కృష్ణారావుగారికి అర్థం కావడంలోని అంతరార్థాన్ని పాఠకులే అర్థం చేసుకోవాలి.

నవలా రచయిత సాగర్‌గారు చరిత్రను వక్రీకరించినట్లుగా డా.కృష్ణారావుగారు విమర్శించారు. అసలు చరిత్ర ఎప్పుడూ సరళరేఖగా నడవదు. రామాయణంలోని భిన్నపాత్రలు గ్రంథం మొదటి నుండి చివరి వరకూ ఒకే లక్షణాల్ని కల్గి వున్నట్లు, చరిత్రలోని వ్యక్తులు అరుదుగాగాని వుండరు. అనేక ఎత్తుపల్లాల గుండా, మలుపుల గుండా, చుట్టు తిరిగే బాటల గుండా సాగే చరిత్రను సరళరేఖలో అర్థం చేసుకుని, కమ్యూనిస్టులను శిలాసదృశ్యులుగా చిత్రించడం పొరపాటు. చరిత్ర వంకరటింకరగా, వక్రీభవనంగానే సాగుతుంది. ఈ నవలలో సాగర్‌గారు చరిత్రను వక్రీకరించలేదు సరిగదా, సరళరేఖవాదం నుండి తప్పించి చరిత్ర వక్రీభవనాల్ని సజీవంగా చిత్రించేందుకు ప్రయత్నించారు. దాన్ని సరళరేఖవాదైన కృష్ణారావుగారు ఇదో కుట్రగా అపార్థం చేసుకున్నారు.

"నిర్మొహమాటంగా ఇదో మంచి ప్రయోగాత్మక నవల. అద్భుతమైన ఓ అరాచక వాస్తవం. దిగ్భ్రాంతికి గురిచేసే ఒక జీవితస్వప్నం".... అయితే ఎంచుకున్న శిల్పం వల్ల ఇది ఆశించిన లక్ష్యాన్ని స్పష్టంగా చెప్పలేదనే చెప్పాలి. ఎందుకంటే ఇది కేవలం రచయితల కోసమే రాసిన నవల - జె.వి.యస్. మూర్తిగారి ఈ అంచనాలో చివరి వాక్యం మినహా మిగిలిన దానితో ఏకీభవించాల్సివస్తుంది. ఎందుకంటే, ప్రజల కోసం రాసే నవలలు, రచయితల కోసం రాసిన నవలలు అని వర్గీకరించడం తప్పు. నవలకు అనుబంధంగా రాసిన మూర్తిగారి "వుక్కబోస్తుంది" వ్యాసం అనుచిత కూర్పు ఫలితంగా పాఠకులకు వుక్కబోయించింది. దాంతో విమర్శకులెవరూ ఈ వ్యాసాన్ని జీర్ణించుకోలేకపోయారు. బురాక్రటిక్ తాత్విక దృక్పథమనే నూతన తాత్విక ప్రతిపాదన మేధావివర్గానికి ఇంతవరకు పరిచయంకాని నేపథ్యంలో, ఆ తాత్విక దృక్పథం పునాదిగా వుండే సాహితీ ధోరణని వారు అర్థం చేసుకోలేకపోవడమనేది సహజం.

"మూలుగు" నవల వాస్తవ పరిస్థితిని నాటకీయంగా మలచడంలో ఒక గురితప్పిన బాణం. బాణము, దాని లక్ష్యము, విలుకాని సంకల్పములలో తీవ్రమైన దోషాలేమీలేవు. కేవలం బాణాన్ని ప్రయోగించడంలోని నైపుణ్యారాహిత్యం మాత్రమే. పాక్షికంగా విజయవంతమైన ఒక భగీరథ ప్రయత్నం. ఏ సాహిత్యమైనా తానున్న మట్టి నుండి సారాన్ని (విషయాన్ని) గ్రహించి, అందుకు అనువైన రూపంతో తొలుచుకు వస్తేనే జనరంజకంగా వుంటుంది. అంటే వస్తు, శిల్పాల పొందిక (Alignment) వుంటేనే ఆ సాహిత్యం పచ్చపచ్చగా వుంటుంది. వర్గ సమాజంలో సాహిత్యం యొక్క వస్తు, శిల్పాల మధ్య వైరుధ్యం వైషమ్యరూపం (Antagonistic form) తీసుకుంటుంది. శిల్పం ఆధిపత్య స్థానంలో వుంటూ వస్తువు యొక్క ప్రామాణికతను, ప్రాముఖ్యతను అణచివేస్తూ వుంటుంది. శిల్పం యొక్క తళుకు బెళుకులు వస్తువును తృణీకరించేటట్లు చేస్తుంటాయి. విమర్శకులు సాహిత్యాన్ని అంచనా వేసే ప్రయత్నాలు కూడా శిల్పవాదం దృష్ట్యా సాగుతుండడంతో (వామపక్ష విమర్శకులకు మినహాయింపు వుంది) సర్వత్రా శిల్ప ప్రామాణికత అధినాయకత్వం (Hegemony) వహిస్తోంది.

స్థూలంగా - మహాకావ్యాలు (రామాయణ, భారతం వగైరా) బానిసయాజమాన్య వ్యవస్థ యొక్క ప్రధాన సాహిత్య ధోరణిగా; ప్రబంధకావ్యాలు భూస్వామ్య వ్యవస్థ యొక్క ప్రధాన సాహిత్య ధోరణిగా; 'నవల' పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ప్రధాన సాహిత్య ధోరణిగా తదనుగుణ్యమైన వస్తు, శిల్పాలతో చరిత్రలో ఉనికిలోకి వచ్చాయి. పెట్టుబడిదారీ విధాన పూర్వ సమాజాలలోని పితృస్వామిక సంబంధాలు, నిష్కపట జానపద సంబంధాలు, మత భావజాల సంబంధాలు, మమకారాల మేలిముసుగు కప్పుకున్న కుటుంబ సంబంధాలు వగైరాల మార్మికత పునాదిగా మహాకావ్యాలు, ప్రబంధాలులాంటి సాహిత్యం వెలువడింది. పెట్టుబడిదారీ సమాజం మనిషికీ మనిషికీ మధ్య నగ్నమైన లాభం తప్ప, కిరాతకమైన 'డబ్బు' లావాదేవీ తప్ప, ఇక ఏ సంబంధాన్ని మిగులనివ్వలేదు. మతావేశంవల్ల, రణోత్సాహంవల్లా, మూర్ఖపు మమకారంవల్ల కలిగే అలౌకిక ఆనందాలన్నిటినీ అది స్వలాభమనే కత్తితో ఖండించి వేసింది. మనషుల మధ్య సరకులమాయ అలుముకుంది. పెట్టుబడిదారీ విధానం సమాజంలోని వ్యక్తుల మధ్య గత కాలపు రక్తసంబంధీకుల లేదా మత భావజాల మార్మికతను ధ్వంసం చేసి కేవలం ఆర్థిక సంబంధాల్ని తీసుకురావడం జరిగింది. దాంతో సమాజంలోని వ్యక్తులందరు స్వకీయ స్వార్థపూరిత అణువులుగా (Self - Seeking), ఎడారిలోని ఇసుక రేణువులుగా మారిపోవడం జరిగింది. ప్రతివాడు తనకుతానే స్వయం పూర్ణ విషయమనే మానసిక స్థితిలోకి పెట్టుబడిదారీ సమాజం జారిపోయింది. 'చిన్ డబ్బు లేనిదే శెట్టి వరద బోడు' అన్నట్టుగా ఫలిత ప్రాధాన్యవాదం (Pragmatism) ఆ సమాజం యొక్క ప్రబల తాత్విక ధోరణిగా ఉనికిలోకి వచ్చింది. ఇలాంటి సమాజం యొక్క ప్రతిఫలనంగా వచ్చిన 'నవల' అనే సాహితీ ప్రక్రియ పెట్టుబడిదారీ సమాజ తొలినాళ్ళలో మహాకావ్యాల, ప్రబంధాలలోని పాత్రల స్వభావాన్ని, స్వరూపాన్ని పోలినప్పటికీ, సామ్రాజ్యవాద దశ నాటికి ఆనాటి వ్యక్తుల మధ్యగల శేష భావజాల మార్మికత కరిగిపోయి, విడివిడి పరిపూర్ణ వ్యక్తుల సమూహంగా మారిన వాతావరణంలో మనోవైజ్ఞానిక నవలలు ఉనికిలోకి వచ్చి, జనరంజకంగా మారాయి.

1990ల తర్వాత వేగవంతమైన ప్రపంచ పెట్టుబడిదారీ విధానం యొక్క ఆధిపత్యం, భారతదేశంలాంటి దేశాలలో పెట్టుబడిదారీ పూర్వ సమాజాల అస్థిత్వాన్ని విధ్వంసం చేస్తూ, కేంద్ర పెట్టుబడిదారీ సమాజాల 'అంగిక కొనసాగింపు సమాజాలుగా' మార్చివేశాయి. అంటే, బురాక్రటిక్ బూర్జువా సామాజిక సంబంధాలు ఉనికిలోకి రావడంతో, ఇలాంటి సమాజాలలోని వ్యక్తుల మధ్య సంబంధాలు కూడ పెట్టుబడిదారీ సమాజాలలోని సంబంధాలకు అనుమేయంగా, ఛద్మ సంబంధాలుగా, వాటి అనుసృజన సంబంధాలుగా అంటే విడివిడి పరిపూర్ణ వ్యక్తుల సమూహాలుగా క్రమంగా మార్పు చెందుతోంది. అందుచేత మన సమాజంలోని నవలా ప్రక్రియ కూడా ఇక్కడి ప్రజల మనోభావాల ననుసరించి మనోవైజ్ఞానిక రూపాన్ని సంతరించుకోగల్గితేనే జనరంజకమైనదిగా తయారవుతోంది. మహాకథనాలలోని కథనాన్ని ఈ విడివిడి వ్యక్తుల మానసిక స్థితి అంతగా ఆమోదించదు. మనోవైజ్ఞానిక ర పంలోని నవలలోని ప్రతిపాత్ర అంతర్మథనం కొనసాగుతుంటుంది. కాబట్టి .టి వ్యక్తులు ఆ పాత్రలలో తమనుతాను విడివిడిగా దర్శించుకొంటూ, సమీక్షించుకుంటూ, అనుభూతి చెందే పరిస్థితి ఉంటుంది. అందువలన అలాంటి శైలిలోని రచనలు జనరంజకంగా మారే అవకాశం ఎక్కువగా వుంటుంది. ఈ కారణంగా "మూలుగు" నవలలో ప్రయత్నించిన శిల్పంతో సాగే రచనలు నేడు ప్రజామోదం పొందగల్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పాత్రల అంతర్మథనంతో సాగే నవలలు రావాల్సిన ఆవశ్యక తరుణంలో సాగర్‌గారు చేసినది ప్రయోగం కాదు, ఒక ఆవశ్యక ప్రయత్నం. మారిన, మారుతున్న నేటి సామాజిక పరిస్థితులలో సాగర్‌గారు కాకపోతే, ఇంకొక రచయిత ఇలాంటి శిల్పంతో కూడిన నవలల రచనకు పూనుకుంటారు. ప్రపంచ సాహిత్య ప్రధాన ధోరణి కూడా ఇదే. "మూలుగు" నవలా శిల్పం ఎంత మొరటుగా, ఆదిమరూపంలో మలచబడినప్పటికి, నేటి యుగ శిల్పంగా చూడని ప్రతి విమర్శకుని విమర్శ సమకాలీన దృక్కోణాన్ని కోల్పోయినట్లే.

గతిశీలమైన సామాజిక సంబంధాల పలువన్నెల్ని (Different shades), అనుసంధానాల్ని (Mediations) ప్రతిబింబించేది సాహిత్యంలోని 'వస్తువు'.

(మిగతా 61వ పేజీలో...)

చర్చ

☆ యస్. హజరత్ అలి

"ఆమె తలాక్ అన్నది" పై అభ్యంతరం ఎందుకు?

"అరుణతార' ఏప్రిల్ సంచికలో ఈ కథ చదివి రచయిత వడ్డేబోయిన శ్రీనివాస్ గారిని అభినందించాలనుకున్నాను. అంతలో ఆ కథమీద ఆగస్టు సంచికలో 'ఆమె తలఖ్ అనే వీలు లేదు' అంటూ అలీ ఒక ముల్లాలాగా ఫత్వా జారీ చేసే సరికి ఇక మిన్నకుండటం భావ్యంకాదని నా భావాల్ని మీ ముందుంచుతున్నాను.

ఈ మధ్య ముస్లిం రచయితలే గాకుండా యితరులూ ఇస్లాం సాంప్రదాయాల మీద, ముస్లిం ప్రజల కడగండ్లనీ, కన్నీటి గాథల్నీ సాహిత్య రూపకాలుగా రాస్తున్నారు. గీతాంజలి "బచ్చేదాని" ఇందుకు బాగా సరిపోతుంది. ఇక వడ్డేబోయిన శ్రీనివాస్ తనకథలో ముస్లిం వివాహ వ్యవస్థలో స్త్రీల పాట్లూ, వారు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఎంతగా మతానికి కుదవబెట్టి జీవచ్ఛవాలుగా బ్రతుకుతున్నారో కళ్ళకు కట్టినట్లు తేల్చారు! హృదయం ద్రవించి పోయింది. ఇది చాలు ఆ రచయిత కృషి ఫలించిన దనడానికి! అదే సంచికలో "సంకెళ్ళూ నీకు బైబై" - కథలోనూ అన్వర్ అనే ఒక ముస్లిం యువకుడు, ప్రతిభను ప్రేమించి వివాహం మాత్రం తమ మత పద్ధతులలో 'నిఖా' చేసుకుని బురఖా ధరించాలని కోరగానే ఆ యువతి బహుచక్కగా స్పందించి ఎవరికోసమో సంకెళ్ళు వేసుకొని బ్రతకలేననీ ఆ ప్రేమకు గుడ్‌బై చెప్పినట్లు రచయిత్రి డా.కె.సుభాషిణి రాశారు. ఇక ఈ కథలోని రజియా పాత్ర 'తలాఖ్' అనడం ముస్లిం సంప్రదాయమే కాదంటూ విరుచక పడ్డారు గానీ, స్నేహాన్నీ, ప్రేమనీ, బంధుత్వాన్ని త్రెంచుకోవడం జరిగినప్పుడు దానికి 'తలాఖ్' (కట్టీఫ్) అని వాడతానే ఉన్నారు కొందరు - నా కొడుకుతో 'తలాఖ్' ఇచ్చానని నా మిత్రుడొకరు 'కోవెన' గారు అన్నారు. ఈ విధంగా వాడితో నాకు సంబంధం లేదు అని బంధనాన్ని తెంచుకోవడంగా చెప్పారు. అట్లాగే ముస్లిం పురుషుడు స్త్రీకిచ్చే 'తలాఖ్'నే, స్త్రీ ఇవ్వడానికి వేరే 'కండీషన్స్' పెట్టి దానికి మత పెద్దల, ఇద్దరు సాక్షుల తతంగాలెన్నో గడిస్తే గాని ముస్లిం స్త్రీ తన భర్తకు "ఖులా" ఇవ్వలేదు. అదీ భర్త దానిని అంగీకరిస్తేనే అది చెల్లుబాటయ్యేది! 'తలాఖ్' - అలాగాదే? ఫోన్‌లో చెప్పినా చెల్లుబాటయ్యే అవకాశం పురుషులకే ఉంది. అంత దూరం రచయిత పోలేదు గాని, అందరికీ అర్థం అయ్యే విధంగా 'తలాఖ్' ఇస్తాను అని ముస్లిం స్త్రీ చేత చెప్పించడం 'రచయిత చాతుర్యమే' గాని అది ఇస్లామీయుల్ని అవమాన పరచినట్లు తలంచకూడదు. సాహిత్యంలో స్వేచ్ఛ ఉంటుంది. తూ.చా తప్పక మత విధానాల్ని రచయిత పాటించనవసరం లేదు. భూత, భవిష్యత్తుల్ని సమన్వయం చేయడంలో తన ప్రతిభను ఊహాత్మకంగా తన రచనలలో చెప్పుకోవడం సహజమే! ఇందులో కుట్రలూ, కుతంత్రాలూ లేనే లేవు. 'చలం' తన మైదానం కథలో, ముస్లిం యువకుణ్ణి హిందూ సనాతన బ్రాహ్మణ స్త్రీ ప్రేమించి లేచిపోయి స్వేచ్ఛగా ఆకాశహర్మ్యాలలో విహరించి తన జీవితాన్ని త్యాగం చేయలేదా? హిందువులు ముస్లిం స్త్రీలను ప్రేమించే కథలు రాసి, తమ మత ప్రభావాల్ని రుద్దుతున్నారని ముస్లింలు భావించి భుజాలు తడుముకోవాల్సిన పనిలేదు. ముస్లింలు సంస్కరణ వాదులున్నూ! ఇంకా 7వ శతాబ్దపు జీవితాల్నే ప్రేమిస్తూ కూర్చోవడం లేదు. ఆలోచనలు మారాలి. మారాయి కూడా. ఈ కథలో కూడా రచయిత ముస్లింల ఆచారాల్ని వారి మౌఢ్యాల్నీ ఎత్తి చూపకుండానే, వారి అమాయకత్వాల్నీ, నిష్కల్మషాల్ని, ప్రేమనీ, ఔదార్యాన్నీ, ఔన్నత్యాన్నీ ఎంతో చక్కగా తెలియజెప్పారు. రజియా పాత్ర ద్వారా ప్రేమనురాగాల్నీ, త్యాగాల్నీ, జీవితానుభవాల్నీ తెలియజేస్తూనే, సున్నితంగా ముస్లిం స్త్రీల కట్టు బానిసత్వాన్నీ, వివాహ వ్యవస్థలోని పురుషాధికత్వాన్నీ, షరియత్ న్యాయసూత్రాల్నీ మౌనంగా నిరసించారు. తనకు పట్టిన దుర్గతే తన బిడ్డకు రాకూడదని, ఆమె గొంతుకోసి, ఆయన బావకొడుకు బాషాను పెండ్లి (నిఖా) చేసుకోమని ఒత్తిడి తెస్తే, తన కూతురు తాను రహస్యంగా పెండ్లాడి కట్టించుకున్న 'తాళి'ని చూపినప్పుడే, తననూ, తన బిడ్డ సుల్తానాను కొట్టి, తిట్టి అసహ్యించుకొని, ఇంట్లోనించి వెళ్లగొట్టారు. ఆ బిడ్డే తనకు చివరకు దిక్కైంది! తనను అక్కున చేర్చుకొని అష్టకష్టాలపాలైంది. అల్లుడు రామశాస్త్రి తనకోసం పడిన పాట్లు, లొల్లి, ఘర్షణలు, కుటుంబం నుండి వేరు పడటం, తనకోసం తన బాధా విముక్తి కోసం, చివరకు అతని మతాన్నీ, భగవద్గీత సాక్షిగా వదలుకొని, సుంతీ చేసుకొని, మత మార్పిడి చేసుకుంటానని ముస్లిం, హిందూ ఉభయ మత పెద్దల పంచాయితీలో ప్రకటించడం తాను సహించలేకపోయింది! ఎంతో మానసిక సంఘర్షణ, వత్తిడికి లోనై కూడా ఓ గొప్ప ఉదాత్తనిర్ణయం తీసికొని తనకు అలాంటి భర్త అక్కర లేదని, తన సంసారం, తన మతం, తన జీవితం నాశనమైనా సరే, తన బిడ్డ సుల్తానా, తన అల్లుడు రామ శాస్త్రిల కోసం అంతటి కఠోర నిర్ణయం తీసుకొని భర్తకు 'తలాఖ్' యిచ్చేసింది! ఇరు మతాల పెద్దల తీర్పును ఎదిరించింది! ఇమాం సాహెబుతోనే కాదు. మనుష్యుల్ని అర్థం చేసుకొనే గుణం లేని ఏ మతాన్నీ తాను అనుసరించననీ, అల్లుడు రామశాస్త్రి బాటనే తన బాటగా ప్రకటించిన ఆ తీర్పు ఉభయ మతపెద్దలకు పెద్ద చెంపపెట్టు! మతాలు మానవత్వంలేని కఠిన కసాయి కష్టాల కడగండ్లనేగాని మానవుడికి శాంతిని సౌభ్రాతృత్వాల్ని ఏ మాత్రమూ కలిగించవని లోకానికే సవాలును విసిరింది! కథానాయికా నాయకులు సుల్తానా రామశాస్త్రుల కంటే, ఈ రజియా పాత్రను ఎంతో ఔన్నత్యంగా తీర్చిదిద్దారు రచయిత. ఇక, అలీ గారెత్తిన విమర్శ స్వార్థంతో, తన మతాభిమానాన్ని చూపించిందేగాని, రచయిత నిజాయితీని గమనించలేకపోవడం కడు శోచనీయం. రామశాస్త్రి అత్తగారు నవాజు చేయడానికి ఓ గదిని సహితం ఏర్పాటు చేశారంటే .ఆయనకెంత మత సహనమో? తన యిష్ట గ్రంథం భగవద్గీత మీద ప్రమాణం చేసి, నేనీ రోజు నుంచి ముస్లింగా మార్తాను, సుంతీ చేయించుకుంటాను, అని ప్రకటించడం కుట్ర, కుతంతం ఎలా అవుతుందీ?

ముస్లింల 'నిఖా' గురించి, 'తలాఖ్' గురించి, రచయితకేగాదు లోకానికంతా తెలుసు! స్త్రీలను వదలించుకోవడంలో తలాఖ్ ఇవ్వడం, ఏదో కోపంతో భార్యకు 'తలాఖ్' అని అన్నందుకుగాను, తిరిగి ఆ భార్యను ఏలుకోరాదనడం! ఆ భార్యనే మరొకరికి యిచ్చి వివాహమాడి బిడ్డల్ని కన్న తర్వాత, తిరిగి తాను తన భార్యగా 'నిఖా' చేసుకోవచ్చుననడం - విజ్ఞులకు తెలియంది కాదు. ఇంత లోతుల్లోకి వెళ్ళలేదు రచయిత. ఇందులో ముస్లిం స్త్రీలను లోబరచుకొని 'నిఖా' పేరుతో మోసం చేయడమనేది లేనే లేదు. ముస్లిం సంస్కృతిని కలుషితం చేయడం కానేకాదు. ఇంకా బ్రాహ్మణత్వాన్ని మంట గలిపి, మానవులుగా ఆదర్శంగా నిలబడాలనే మానవతా వాదం ఈ కథలో. యిమిడి వుంది! 'ఖురాన్' పేరే కథలో ఎత్తకూడదంటే ఎలా? వారి మూతి మీద తన్నే జవాబునివ్వాల్సిందే అని ఆగ్రహిస్తే ఎలా? ఆ తీర్పుని రజియా తిరస్కరించి, మానవత్వాన్ని ప్రేమించి, అల్లుని వెంట దారి తీసిందన్న ముగింపును గమనించక పోతే ఎలా? 30 సం.ల బానిస జీవితం బాగోలేదని రజియానే చెప్పుకుంటుంటే, ఆ కథ ప్రారంభం మాత్రం ఈ మహానుభావుడికి నచ్చిందంట! ఇదంతా స్వార్థపూరిత విమర్శ! అందుకే ఎంతటి విప్లవకారులలో కూడా మత ఛాయలు వదలకున్నాయి అని చెప్పేటట్లుగానే, ఎంత ముస్లిం అభ్యుదయవాదులంటూ చెప్పే ముస్లిం కవులకూ వారి మత వాసనలు పోకున్నాయి!

*

అభివృద్ధి - విధ్వంసాలను సిద్ధాంత, సృజనాత్మక స్థాయిల్లో విశ్లేషించిన విరసం సాహిత్య పాఠశాల

జనవరి 13, 14 తేదీల్లో కర్నూలు లక్ష్మీనరసింహ కళ్యాణ మంటపంలో విరసం రాష్ట్ర సాహిత్య పాఠశాల జరిగింది. విప్లవ కవి, కథకుడు, విరసం సభ్యుడు, విప్లవోద్యమ నాయకుడు అయిన కామ్రేడ్ మంజీర హాలులో, విరసం సభ్యురాలు, రచయిత్రి, విప్లవ మహిళా ఉద్యమ నాయకురాలు కామ్రేడ్ పద్మ హాలులో, విరసంలో సీనియర్ సభ్యుడు, కవి, పరిశోధకుడు కామ్రేడ్ మల్లెల నారాయణ ద్వారం, విరసం సభ్యుడు, కవి, కథా రచయిత కామ్రేడ్ రాప్తాడు గోపాలకృష్ణ వేదిక మీద రెండు రోజుల సాహిత్య పాఠశాల జరిగింది.

13 వ తేదీ ఉదయం 10-30 గంటలకు అంతర్జాతీయ కమ్యూనిస్టు పతాకాన్ని అమరుడు కామ్రేడ్ సుంకన్న తల్లి ఉసేనమ్మ ఆవిష్కరించారు. కామ్రేడ్ సుంకు విరసం సభ్యుడు, కథలు, కవితలు రాస్తూ సాహిత్యోద్యమం నుండి విప్లవోద్యమం లోకి వెళ్ళి, విరసం నిషేధంలో ఉన్న కాలంలో గుంటూరు దగ్గర ఒక బూటకపు ఎన్‌కౌంటర్లో అమరుడయ్యాడు. తర్వాత విరసం పతాకాన్ని కార్యదర్శి వి. చెంచయ్య ఆవిష్కరించారు. ఎఐఎల్ఆర్‌సి పతాకాన్ని మహిళా ఉద్యమ నాయకురాలు లక్ష్మి తండ్రి సోలన్న ఆవిష్కరించారు. లక్ష్మి కర్నూలు మహిళా ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళా సమాఖ్య నాయకురాలిగా పలు మహిళ, శ్రామిక ప్రజల ఆందోళనల్లో చురుగ్గా పాలుపంచుకుంటూ వుండేది. రాష్ట్ర ప్రభుత్వానికి విప్లవ పార్టీలకు మధ్య చర్చలకు ప్రభుత్వం విఘాతం కలిగించాక 2005 జనవరి 8న లక్ష్మిని ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలో బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చేశారు.

తర్వాత అమరవీరుల స్మారక స్థూపాన్ని కా॥ వి.వి. ఆవిష్కరించారు. ఇటీవలి కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా విప్లవోద్యమంలో, ప్రజా పోరాటాల్లో అమరులైన వారందరికీ పేరుపేరునా జోహార్లు చెప్తూ, వారి ఆశయాలను సాహిత్య సాంస్కృతిక రంగాల్లో కొనసాగిస్తామని ప్రతిన బూనుతూ సాహిత్య పాఠశాల ప్రారంభమైంది.

కవి, కథా రచయిత జి. వెంకట కృష్ణ ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ- ఒక సాహిత్య సంస్థగా విరసం అనేక ఆటుపాట్లు, నిర్బంధాలు, నిషేధాలు అధిగమిస్తూ పురోగమించడం ఉద్వేగపూరితమైన విషయం. సాహిత్య ప్రక్రియలన్నిటిలో ప్రామాణిక కృషి చేస్తూ, తెలుగు సాహిత్యంలో అలాంటి కృషికి ఉత్తేజాన్నిస్తున్న విరసం సభ్యులకూ, ప్రతినిధులకూ, కళాకారులకు ఆహ్వానం. రాయలసీమ ద్వారం అనదగిన కర్నూల్లో ఆధునిక విలువలకు, చైతన్యానికి స్ఫూర్తినిచ్చేలా ఈ సాహిత్య పాఠశాల జరగడం సంతోషం. నిజానికి, ఈ ప్రయత్నం కర్నూలు జిల్లాలో విరసం సభ్యులతోనే ప్రారంభమైంది. 'కథాసమయం' వేదికకు తెలుగు సాహిత్యంలో గుర్తింపు రావడానికి కూడ విరసమే ప్రేరణ.

ఈ పాఠశాలలో చర్చించబోయే 'అభివృద్ధి- విధ్వంసం- సాహిత్య ప్రతిఫలనం' అనే అంశానికీ కర్నూలుకు, రాయలసీమకు చాలా ప్రాసంగికత ఉంది. కరువు, వెనుకబాటుతనం, ఫ్యాక్షనిజం అనే ప్రత్యేకతల వల్ల ఇక్కడి సామాజిక వ్యవస్థ బహుముఖాల్లో విధ్వంసం జరుగుతోంది. వ్యవసాయం విధ్వంసమై, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమై, రైతు భూమితో పరాయీకరింపబడి వలసపోతున్నాడు. ఈ 'చిత్రాన్ని' రాయలసీమ కథ గొప్పగా చిత్రించింది. కరువుతో పాటు ఆధిపత్య శక్తులకు నూతన ఆదాయమార్గాలు పెరగడం వల్ల పాత ఫ్యాక్షనిజంలో మార్పు మొదలైంది. ఒక రకంగా చూస్తే దీన్ని అభివృద్ధి అనేవాళ్ళున్నారు. కాని వాస్తవానికి ఇది అసమ అభివృద్ధి. ఒకే ప్రాంతలో కష్టం చేసేవాళ్ళకూ, ఇతరుల శ్రమపై ఆధారపడే వాళ్ళకూ మధ్య అసమ అభివృద్ధి వ్యాపించి విపరీతమైన విధ్వంసానికి కారణం అవుతోంది. దీనివల్ల మానవ నిలువలు, చైతన్యం అడుగంటిపోతున్నాయి. కరువులో పేదరైతుల జీవితాన్ని చిత్రించినంతగా, ఇతర జీవితాలను, ఇటీవలి అసమ అభివృద్ధిలోని విధ్వంసాన్ని సీమ రచయితలు ఎంతవరకు చిత్రించారని ప్రశ్నించుకోవాలి. ఉదాహరణకు ప్రభుత్వ విధానాల్లోని నిధులు, సంపద దళారీ చేతుల్లోకి ఎలా వెళ్ళిపోతున్నాయి? ఇంత వరకు రచయితలు నోస్టాల్జియాకే పరిమితం అయ్యారా? మన రచయితలంతా అభివృద్ధిలో భాగంగా పల్లెలనుండి చదువుకొని, ఉద్యోగరీత్యా పట్టణాలలో స్థిరపడి పల్లె జీవిత విధ్వంసం గురించి నోస్టాల్జియా రాస్తున్నవాళ్ళేమోనని నా అనుమానం. మనం ఈ అసమ అభివృద్ధిని కింది నుండి లోతుగా పట్టుకోకపోతే మన సాహిత్యక్రమం కూడా అసమ అభివృద్ధిలో భాగం అయిపోయే ప్రమాదం ఉన్నదని నా అనుమానం.

హైటెక్ అభివృద్ధి కలలుగంటున్న యువత అన్ని ప్రాంతాల్లో ఉన్నారు. వీళ్ళు అభివృద్ధిని ఒకవైపు మాత్రమే చూస్తున్నారు. ఇంకోవైపు ధ్వంసమైపోతున్న అసంఖ్యాక ప్రజల గురించి పట్టించుకోవడం లేదు. ఇన్ని వేల మంది రైతులు ఈ అభివృద్ధి చక్రాల కిందపడి ఆత్మహత్యల పాలయితే ఎందుకు గత పదిహేనేళ్ళలో ఒక బలమైన రైతాంగ ఉద్యమం కూడా రాలేదు. ఈ ప్రశ్న రచయితలు, కార్యకర్తలు అందరూ వేసుకోవాల్సి ఉంది. అయితే ఇంత నిరాశాజనకంగా ఉన్న వ్యవస్థ కూడా ముందుకే పోతుంది. ఇందులోని మాయాజాలాన్ని ఉద్యమాలు, సాహిత్యం పట్టుకోవాలి. దీన్ని ఛేదించడంలో సృజనాత్మక రచయితలు.ఎక్కడ ఉన్నారు? ఆలోచించాల్సి ఉందన్నారు.

ప్రారంభ సమావేశంలో "తెలుగు సాహిత్యం పై విరసం ప్రభావం" అంశంపై కా॥ చెంచయ్య మాట్లాడారు. కా॥ చలసాని ప్రసాద్ అధ్యక్షత వహించారు. అధ్యక్షోపన్యాసంలో చలసాని ప్రసాద్ కళింగాంధ్ర వెనుకబాటుతనం గురించి ప్రస్తావిస్తూ తెలంగాణ, రాయలసీమ మీద వచ్చిన విశ్లేషణ కళింగాంధ్ర వెనుకబాటు మీద రాలేదని, కళింగాంధ్ర గురించి అధ్యయనం చేయవలసిన అవసరం ఉందని చెప్పారు. విరసం పుట్టుకను గురించి మాట్లాడుతూ "ద్రౌపది అగ్నిలో పుట్టిందో లేదో తెలీదు గానీ, విరసం శ్రీకాకుళ విప్లవాగ్నుల నుండి పుట్టడం నేను కళ్ళారా చూశాను" అన్న శ్రీశ్రీ మాటల్ని గుర్తు చేశారు.

తర్వాత విరసం రాష్ట్ర కార్యదర్శి చెంచయ్య ప్రసంగించారు. "సోషలిజం స్వప్నసీమ కానే కాదు నిజం సుమా, ఆకలంత సహజమది, అన్నమంత అవసరమది" అన్నాడు చెరబండ రాజు. ఇక్కడ సమస్య ఆకలి. పరిష్కారం అన్నం. ఇది చెప్పినంత తేలిక కాదు. సమస్యలు తీరే వరకు ఉద్యమాలు ఆగవు. విప్లవోద్యమం వున్నంత వరకు విప్లవ సాహిత్యోద్యమం ఉంటుంది. విప్లవం విజయవంతమైన తర్వాత కూడా విరసం బాధ్యత వుంటుంది. 1970 లను విరసం దశాబ్దం అని అందరూ అంగీకరిస్తారు. అంత ప్రేరణ కలిగించే శక్తి విరసానికి ఎలా వచ్చింది. విప్లవాలు తాత్కాలికంగా అణిగిపోయే దశలో ఆ ఉద్యమమే అప్పుడు ప్రేరణ. తెలంగణ ఉద్యమం 1951 లో ఆపేశారు. అది ఆగకూడదు అని చాలా మంది అనుకున్నారు. ఆ ప్రేరణ లేక చాలామంది రచయితలు సినిమాల్లోకి పోయారు. నక్సలైట్లంటే బందిపోట్లు కాదని, విప్లవకారుని ప్రజల్లోకి తీసుకుపోయింది విరసం. తొలిదశలో ఝుంఝు, లే, మార్చ్ కవితా సంకలనాలు ప్రచురించింది. ఏ ఉద్యమమైనా మొదట కవిత్వం రూపంలో బైటపడుతుంది. ఎందుకంటే వెంటనే స్పందింపజేసేది కవిత్వం.

మాండలిక భాషలో కథ, నవల రావటానికి విప్లవ సాహిత్యోద్యమమే కృషి చేసిందని చేకూరి రామారావు వంటి వారే అన్నారు. నిజమైన తెలుగు

మాండలికాల్లోనే వుంది. సామాజిక నేపథ్యం సాహిత్యాన్ని బలంగా నిర్దేశిస్తుంది అని నిరూపించింది విరసం అని అన్నారు చేరా. నేపథ్యం ఒక్కటే విమర్శ కాదు అని కూడా ఆయన అన్నారు. కాని నేపథ్యం లేకుండా సాహిత్యం లేదు. ప్రబంధ కాలాల నేపథ్యం మీద త్రిపురనేని మధుసూదనరావు గొప్ప వ్యాసం రాశారు. ఊహల్లో తిరిగే కవికి కూడా నేపథ్యం వుంది. కృష్ణశాస్త్రి కూడా కమ్యూనిస్టు పార్టీకి ఓటు వేయొద్దు అన్నాడు. విశ్వనాథ గురించి మధుసూదనరావు పుస్తకమే రాశారు. మార్క్సిస్టు దృక్పథంలో ఏ కాలపు సాహిత్యాన్నైనా విమర్శించే సంవిధానం ఉంటుంది. టి.టి.డి. వారు మహాభారతం గురించి సభ పెడితే రెండు మూడు వేలమందితో హాలు నిండిపోయింది. ఆ ఆకర్షణ ఎందుకుందో మనం చెప్పాలి. 'విరసం ప్రభావం ఎంతగా ఉందంటే ఒక సామాజిక సమస్య వచ్చినప్పుడు విరసం దాని గురించి ఏం మాట్లాడుతుంది? అని ఎదురుచూసేవారు ఉన్నారు. సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం విరసానికి ముందు అంతగా లేవు. స్పృహ అనే మాట రెండు చోట్లనే వినిపిస్తుంది., ఒకటి హాస్పిటల్, రెండు విరసం అని వెటకారంగా అనేవారు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. ఆ తర్వాత నండూరి రామ్మోహనరావు సామాజిక స్పృహ విరసం సొత్తు కాదు, మాక్కూడా ఉంది అని '80 ల్లో అన్నారు. సామాజిక స్పృహ లేని కవి లేడు. అది విశ్వనాథకు కూడా వుంది. కావలసింది సామాజిక చైతన్యం అని తెలుగు సాహిత్య పరిణామాలన్నిటి మీద విరసం ప్రభావాన్ని వివరించారు.

ఆ తర్వాత సెషన్‌లో ... "అభివృద్ధి మాయాజాలం - రాజకీయార్థిక పరిచయం" అంశానికి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు.

రాష్ట్ర ప్రభుత్వం జలయజ్ఞం పేరుతో చేసే అభివృద్ధిలో 20 లక్షల మంది నిర్వాసితులవుతున్నారు. గిరిజనులే కాదు రైతులు కూడా అధిక సంఖ్యలో నిర్వాసితులవుతున్నారు. మరో పక్క ప్రత్యేక ఆర్థిక మండళ్ళు నెలకొల్పి పారిశ్రామికవేత్తలకు ఏది కావాలంటే అది ఇస్తామంటున్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం టాటా కంపెనీ పరిశ్రమ కోసం ఏం చేయడానికైనా సిద్ధమే అంటోంది. 1997 నుండి 2005 వరకు 10 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విదేశీ మారకద్రవ్యం పెరుగుతోందంటున్నారు. విదేశీ మారక ద్రవ్యం 150 మిలియన్ డాలర్లు వుంటే, 100 మిలియన్ డాలర్లు అప్పు వుంది. ద్రవ్యోల్బణం తగ్గిందంటున్నారు. కానీ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎగుమతులు పెరిగిపోతున్నాయి అంటున్నారు. 100 కోట్ల ప్రజలు వున్న దేశంలో ఎగుమతుల కోసమే ఉత్పత్తి చేస్తున్నారు. గ్రామీణ సంక్షోభం గురించి ఎవరూ మాట్లాడరు. బిలీనీర్లు ఎక్కువ కావడమే అభివృద్ధా? చైనా అభివృద్ధి నమూనా ఏమిటి? అందరికీ సంక్షేమం లభిస్తేనే అభివృద్ధి అన్నాడు మావో. కాని ఇప్పుడు చైనాలో అసమానతలు పెరిగిపోతున్నాయి. విద్య, వైద్యం చాలా ఖరీదైపోయింది. కాబట్టి ఆర్థిక వృద్ధి మాత్రమే అభివృద్ధి కాదు అన్నారు.

ఆ తర్వాత ప్రొ॥ ఆర్.యస్. రావు అభివృద్ధి మాయాజాల గురించి ప్రసంగించారు

అభివృద్ధి మాయాజాలం అంటున్నాం. ప్రశ్నలు - లేని సమాధానాలు, సమాధానాలు లేని ప్రశ్నలు ఉంటే మాయాజాలం అంటాం. యజ్ఞం కథలో అప్పల్నాముడు ఈ అప్పు న్యాయమా అన్యాయమా అని అడుగుతాడు. శ్రీరాములు నాయుడు చెప్పలేడు. సత్యసాయిని ఎలా ఇస్తారండీ లింగం అంటే చెప్పడు, అలా ఇస్తాడు అంతే ! ఎందుకు పెడుతున్నారు సెజ్‌లు అంటే చైనాలో ఇవి పెట్టారు, అభివృద్ధి చెందవచ్చు అంటారు. కాని ఎందుకో చెప్పరు. అభివృద్ధి అంటే ఏమిటి? ఏమి బాగుపడుతుంది? పొలం కావాలి, భూమి ఇవ్వండి, మేము బాగుపడతామంటే- భూమి లేదంటాడు. అభివృద్ధి అనేది ఏ కాలంలో వచ్చింది? వలస పాలన నుండి బైటికి వచ్చిన దేశాలు, తమకు రాజ్యాలు కూడా వలస రాజ్యాలు ఉండాలి అనుకోవడం నుండి వచ్చింది. చైనా సెజ్ అంటే, వాళ్ళు చేస్తే అది మేం చేస్తామంటారు. దీన్ని క్యాచింగ్ అప్ అంటారు. ఇది నెహ్రూ హయాంలోనే మొదలైంది. అంతకుముందే బాంబే ప్లాన్ ఒకటి తయారుచేశారు. ఫ్యాక్టరీలు, రైల్వేలు వంటివి వాళ్ళకున్నాయి కాబట్టి మనకూ కావాలి. '50ల్లో అది బలంగా ఉండింది. కమ్యూనిస్టులు కూడా దీనికి లొంగిపోయారు.

అభివృద్ధికి కావలసిన ప్రణాళికలు తయారు చేయమంటే - ఆ అభివృద్ధిలో డ్యాములు, ఫ్యాక్టరీలు వంటివి వుంటాయి. అది అభివృద్ధి పథకం కానీ అభివృద్ధి కాదు. కొంతవరకు స్టాలిన్ హయాంలో కూడా ఇది ఉంది. ఎంత ఇనుము, ఎంత వ్యవసాయ ఉత్పత్తి? అని. ఇది ఒక భావజాలం. పెద్ద ప్రాజెక్టు ఉంటే, పెద్ద స్టీలు ప్లాంట్ ఉంటే అది గొప్ప రాష్ట్రం అని. ఒరిస్సాలో మహానది పెద్ద వరదలు వచ్చే ప్రాంతం. కటక్ ఎప్పుడూ మునిగిపోతూ వుండేది. ఆ వరదల్ని నివారించడానికి హిరాకుడ్ డ్యామ్ కట్టారు. అప్పుడు ఆ ముంపు ప్రాంతాల వాళ్ళు మీకు రెండు మూడేళ్ళకు వరదలు వస్తాయని 120 గ్రామాలు ముంచేస్తారా అని అడిగారు. వ్యతిరేకించిన వాళ్ళలో భూస్వాములు ఉన్నారు. అభివృద్ధి వ్యతిరేకంగా ఇది ఒక ఎక్స్‌ట్రీమ్. ఇంకొక ఎక్స్‌ట్రీమ్‌లో ప్రసన్న పండా వంటి కమ్యూనిస్టు నాయకులు నిర్వాసితుల గురించి మాట్లాడారు. ప్రత్యామ్నాయాలు చూడండి, చిన్న డ్యాములు కట్టండి, విధ్వంసం తక్కువ చేసే టెక్నాలజీ పెట్టుకోండి అని.

అభివృద్ధి అంటే మనకు తెలిసిన దాన్నుండి మొదలవ్వాలి. అందులో నుండి జ్ఞానం పొందాలి. ఇండియా పాలసీ ఏమంటే- జ్ఞానం అక్కడ కాబట్టి అక్కడి నుండి తెచ్చుకోవాలి అని. చైనా అభివృద్ధికి, ఇండియా అభివృద్ధికి ఇదే తేడా. చైనాలో అభివృద్ధిని అభివృద్ధిగా చూశారు. ఇండియాలో అభివృద్ధిని అభివృద్ధి పథకంగా చూశారు. అభివృద్ధి అంటే సామాజిక పరివర్తనం (సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్). వ్యక్తి ఆలోచనా సరళి, ఆచరణా సరళి మారాలి. ఆలోచన, ఆచరణకు ఒక సమన్వయం ఉంటుంది. ఆ విధంగా అభివృద్ధిని చూడాలి. అభివృద్ధి ప్రణాళికలో ఏ వర్గం నష్టపోతుంది. ఆ వర్గ దృక్పథంతో మనం చూడటం లేదేమో! మన సాహిత్యంలో వర్గ విశ్లేషణ లోపిస్తున్నట్టు ఉంది. రచయితలు దాన్ని పట్టించుకోవాలి.

ఆ తర్వాత 'రాయలసీమ రాజకీయార్థిక విశ్లేషణ' అంశం పై మూడవ సెషన్‌కు జి.యస్. రామ్మోహన్ అధ్యక్షత వహించారు.

పుట్టపర్తి నారాయణాచార్యుల 'కపటపు నాయకుల గుంపు, సత్కవీంద్రుల కన్నీటి ముంపు చూడమ్మా' అంటారు మేఘదూతంలో. రాయలసీమకు ఇది సరిగ్గా వర్తిస్తుంది. 1907 లో రాయలసీమ యువక సాంఘిక సభ జరిగింది. 1937 లో శ్రీబాగ్ ఒడంబడిక చేసుకున్నారు. అప్పటి నుండి రాయలసీమ వెనుకబాటుతనం గురించి మాట్లాడుతున్నారు. రచయితలు, కళాకారులు మాత్రమే ఆ చైతన్యం నిలబెడుతున్నారు, రాజకీయ నాయకులు కాదు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటును గురించి రాయలసీమ వారు ఆంధ్ర మహాసభలో పాల్గొనకుండా 18 ఏళ్ళు దూరంగా ఉన్నారు. ఇప్పుడైతే విశ్వవిద్యాలయం ఎక్కడ ఉండాలో, ఐ.ఐ.టి. ఎక్కడ ఉండాలో రియలెస్టేటు వాళ్ళు చెప్పాలి. 1947 లో సంజీవరెడ్డి రాష్ట్రం విడిపోయే అవకాశం వుంది అని చెప్పినప్పుడు ఇక్కడ మూడు రకాల అభిప్రాయాలు వచ్చాయి. ఉత్తరాదితో వేగలేం కనక సమైక్యంగా ఉండాలి అని ఒకటి, రాయలసీమ విడిపోవాలి అని ఒకటి, రాయలసీమకు అభివృద్ధి ప్యాకేజి ఇవ్వాలి అనే ఇంకోటి. అన్ని రకాలుగా రాయలసీమకు అన్యాయం జరిగింది. కృష్ణదేవరాయల పాలనలో ఎంత అణచివేత ఉన్నా ఇక్కడి వారు ఆయన పాలనను పొగడుతారు. కొన్ని చెరువులు తవ్వించారని, నీటి సౌకర్యం కలిగించారని. ఇప్పుడైతే ఆ కనీస సదుపాయాలు కూడా అందివ్వడం లేదు. కనుకనే రాయల నాటి పాలనే మంచిదని చెప్పుకునే దుర్భరమైన స్థితి ఇది. పోతిరెడ్డిపాడు గురించి ఎంతో వివాదం ఉంది. న్యాయంగానైతే కృష్ణా జలాల్లో రాయలసీమ వాటా ఉంది అన్నారు..

ఈ అంశంపై వక్త బాలగోపాల్ రాయలసీమ సామాజిక ఆర్థిక సమస్యలను నీటిపారుదల వివాదాల్ని వివరించారు.

రాయలసీమలో నీటి లేమి ప్రధానమైన సమస్య. నీరు ఇంకిపోయే నేలలు ఇక్కడ తక్కువ. పెన్నా బేసిన్‌లో మాత్రమే నల్లరేగడి నేల కనిపిస్తుంది. మిగిలినవన్నీ ఎర్ర నేలలు. ఇక్కడ 700 మి.మీ. కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. నిజాం నవాబు రాయలసీమను తనే పాలించి ఉంటే ఈ సమస్య ఉండేది కాదేమో! ఇక్కడి నేల విస్తీర్ణత, జనాభా నిష్పత్తి చూస్తే అది మూడో వంతు తక్కువగా ఉంది. ఎందుకంటే ఈ నేల చాలామందిని పోషించలేదు కాబట్టి. సాగుయోగ్యమైన భూమి 20 శాతానికంటే తక్కువ. అతి తక్కువ సాగుయోగ్యమైన భూమి కడప జిల్లాలో ఉంది. కానీ రాయలసీమలో దానికే ఎక్కువ నీళ్ళు ఇవ్వగలిగారు. అనంతపురంలో సగటు వర్షపాతం 500 మి.మీ. కంటే తక్కువ. రాయలసీమలో భూగర్భ జలం వెయ్యి అడుగులకు పోయింది. దీనికి తోడు వ్యవసాయం చాలా అస్థిరంగా ఉంది. క్షామం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఎందుకంటే ఇక్కడ 70% తిండి గింజలు పండించరు. తెలంగాణాలో పండిస్తారు. మొత్తం రాష్ట్రంలో రాయలసీమ జనాభా 19 శాతం ఉన్నది. ఫ్యాక్టరీలు 11 శాతం, కార్మికులు 5 శాతం ఉన్నారు. ఇక్కడ ఒక మిత్ ఉంది. రాయలసీమలో అపారమైన ఖనిజ సంపద ఉందని, దాన్ని అభివృద్ధి చేయాలని. నిజానికి ఇక్కడ చాలా తక్కువ ఖనిజాలు ఉన్నాయి. వనరులు బైట నుండి వస్తే గాని రాయలసీమ బాగుపడదు. రాయలసీమలో కెసి కాలువ ఆయకట్టుకు చాలా నీరు తీసుకుంటున్నారు. ఇంకా కావాలని అడుగుతున్నారు. అనంతపురంకు ప్రాధాన్యత ఇవ్వరు. జిల్లాల మధ్య సమదృష్టి లేదు. అనంతపురానికి నీళ్ళిచ్చే తుంగభద్ర కాలువలు పాడైపోయి వున్నాయి. కర్నాటక వాళ్ళు సమాంతరమైన కాలువ తీద్దామంటున్నారు. ఇది చాలా చిన్న విషయం. కానీ మన పాలుకులు చేయరు. జల రాజకీయాల్లో భారీ కాంట్రాక్టులు ఉంటే కాని పనిచేయరు. ఆదిలాబాద్‌కు నీరిచ్చే పెన్‌గంగ కూడా ఇలాగే పక్కనపెట్టారు.

రాయలసీమ సామాజిక జీవితం గురించి మాట్లాడుకుంటే, ఇక్కడ పెత్తందారీ వర్గంవల్ల, దాని స్వభావం వల్ల మెరుగైన జీవితం రావడం లేదు. వర్షపాతం మహబూబ్‌నగర్‌కు కడపకు ఒక్కటే. కె.సి. కెనాల్ ఆధునీకరణ పూర్తయింది. జూరాల కాలేదు. నాయకులు తమకు కావలసివస్తే ఎక్కడికైనా తీసుకురాగలరు. ఇక్కడ ప్రజాతంత్ర వాతావరణం చాలా తక్కువ. ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీ బాగా ఉండేది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు కూడా ఫ్యాక్షనిస్టుల్లాగా వ్యవహరిస్తారు. ఫ్యాక్షన్ సంస్కృతి '60 ల నుండి రాజకీయాల్లోకి, సివిల్ కాంట్రాక్టుల్లోకి వచ్చింది. దీంట్లో రాజశేఖరరెడ్డి, యం.వి.రమణారెడ్డి పోటీపడ్డారు. ఇక్కడ నాయకుల్లోనే కాదు ప్రజల్లో కూడా ఫ్యాక్షన్ సంస్కృతి వుంది. ప్రజల్లో ప్రజాస్వామిక సంస్కృతి పెంపొందించకపోతే అదే వర్ధిల్లుతుంది. జల రాజకీయాలు తెలంగాణ, రాయలసీమ మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నాయి. విద్యాసాగర్‌రావు కృష్ణా మిగులు జలాల్లో రాయలసీమకు హక్కు లేదు అంటాడు. రాయలసీమ నాయకులేమో మొత్తం రాయలసీమకే అంటారు. ఒక ప్రజాస్వామిక చర్చ అవసరం. వెనుకబడిన ప్రాంతాల మధ్య విద్వేషం చాలా నష్టం కలుగజేస్తుంది. జలయజ్ఞంలో రాజశేఖర రెడ్డి మాత్రమే లాభపడుతున్నాడు. కాంట్రాక్టులు ఇచ్చేసి మిగులు జలాల మీద కాలువలు కట్టేస్తున్నాడు. నీళ్ళు మాత్రం రావు. కడప జిల్లా వాళ్ళు వచ్చినప్పుడే వస్తాయిలే అనుకుంటారు. ప్రజలు ఎంత కొట్లాడుకుంటే అంత మంచిది ఫ్యాక్షన్ రాజకీయాలకు. పులివెందుల రాజకీయాలను రాజశేఖర రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లోకి తీసుకొస్తున్నాడు. గోదావరి జలాలు 200 టియంసి లను కృష్ణా బేసిన్‌కు ఇస్తానంటాడు. మహబూబ్‌నగర్, మార్కాపురంలకు కూడా ఇస్తాడా? బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 90 టియంసిలు కర్నాటకకు వస్తాయి. గోదావరి నీరు పుష్కలంగా ఏమీ లేవు. 680 టియంసి మాత్రమే ఉన్నాయి. పోలవరం ద్వారా 245 టియంసి కృష్ణా డెల్టాకు ఇస్తానంటాడు. తెలంగాణకు రావు. దక్షిణ తెలంగాణ, రాయలసీమ రెండూ క్రిష్ణా బేసిన్ ప్రాంతాలే. మరి దక్షిణ తెలంగాణకు కూడా నీరివ్వాలి కదా!

జరగవలసింది నికర జలాల్ని పున:పంపిణీ చేయడం. మూడో వంతు నీళ్ళు గ్యారెంటీగా ఉంటే దాన్ని నికర జలాలు అంటారు. వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎక్కువగా ఇవ్వాలి. కృష్ణా డెల్టాకు ఇచ్చే నీరు తగ్గించాలి. సుందరయ్య గారు అనేవారు ... "కృష్ణా డెల్టా వాళ్ళు పంట మార్పిడికి సిద్ధపడాలి" అని. స్నేహపూర్వక వాతావరణం వెనుకబడిన ప్రాంతాల వారిలో పెంపొందించాలి. అని ముగించారు.

అనంతరం కాశీం, నాగరాజుల నిర్వహణలో కవి సభ జరిగింది.

ఇరవై మందికి పైగా కవులు కవిత్వం చదివారు. సద్దాం ఉరిని నిరసిస్తూ ఎక్కువ మంది కవిత్వం చదివారు. బూటకపు ఎన్‌కౌంటర్లు రాజ్యహింస తదితర అంశాలున్నప్పటికి కవి సభ ప్రధానంగా సామ్రాజ్యవాద దుర్మార్గాన్ని గురి చూసింది.

మరుసటి రోజు ఉదయం పదిగంటలకు అసమ అభివృద్ధి - రాయలసీమ సాహిత్యం అంశంపై మొదటి సెషన్ ప్రారంభమైంది

ఈ సెషన్‌కు రవికుమార్ అధ్యక్షత వహించారు. అధ్యక్షోపన్యాసంలో రవికుమార్ మాట్లాడుతూ అసమ అభివృద్ధి పై రాయలసీమలో ఉద్యమం రగులుకునే పరిస్థితులొచ్చినాయని, గతంలో మాదిరి ఫ్యాక్షనిస్టుల ప్రయోజనాల కోసం కాకుండా, అన్ని వర్గాల్లో అసంతృప్తి మొదలై రాయలసీమ రగిలే పరిస్థితులొచ్చాయన్నారు. రాయలసీమ జీవితాన్ని ఎంతమంది రచయితలు తమ రచనల్లో ప్రతిఫలింపజేసినా కరువుకు, ఫ్యాక్షనిజానికి, నేపథ్యంగా ఉన్న భూస్వామ్య ఆధిపత్య భావజాలం గురించి లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ అంశం పై ప్రధాన వక్తగా ప్రజాభ్యుదయ సంస్థ కార్యదర్శి జి. భార్గవ ఉపన్యసించారు.

అసమ అభివృద్ధి అనేది ఈ రోజుది కాకపోయినా సాహిత్యంలో ఇప్పుడు ఎక్కువగా ప్రతిఫలిస్తోంది. మట్టిమనుషుల్ని సాహిత్యంలోకి తేవడానికి పరిస్థితి అనుకూలంగా ఇప్పుడుంది. వాళ్ళ గురించి రాయనిది సాహిత్యం కాని పరిస్థితి. పాప్‌కార్న్ సాహిత్యం కూడా ఉండినా అది రాసి బతకడం కష్టం, కాబట్టి ఇప్పుడా రచయితలు వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు రాసుకోవాల్సిందే. అభివృద్ధికి చాలా నిర్వచనాలున్నాయి. పది మంది మాట్లాడితే అభివృద్ధి గురించి 12 నిర్వచనాలు వస్తున్నాయి. అభివృద్ధిని సందర్భాలకు అతీతంగా నిర్వచించడం కష్టమవుతోంది. ఈ నిర్వచనాల మీద ఏకాభిప్రాయం కుదరకపోయినా ఏదో ఒక రకమైన అభివృద్ధి కావాలని జనం మస్తిష్కంలో వుంది. తెలంగాణ కావాలన్న వాదం వెనుక అభివృద్ధి కోణం ఉంది. ఇదే రాయలసీమ విషయంలో కూడా. ఒక భావజాలంగా అభివృద్ధి 'హెజిమొనీ' ని స్థాపించుకుంది. హెజిమొనీ అంటే పాలకవర్గాల భావాలకు ఒక సమ్మతి. నెహ్రూ చెప్పిన మాట 'ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు' కూడా అటువంటిది. పాలకులు నిర్వచించే అభివృద్ధికి ప్రజల నుండి సమ్మతి ఉంది. దానిని ఎలా ఛేదించగలుగుతాం అన్నది చాలా ముఖ్యమైన ప్రశ్న.

గతంలో మాదిరి కాకుండా ఈనాటి పాలకులకు ప్రజా సంక్షేమం కోసమే చేస్తున్నాము అని నమ్మించుకోవాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి పథకంతో పాటే సమ్మతిని సృష్టించుకునే పథకం కూడా ఉంది. దానిని తిప్పికొట్టే బాధ్యత సాహిత్యకారుల మీద ఉంది. విచిత్రమైన ఐరనీ ఏమంటే పాఠకులు తగ్గిపోతున్నారు. సాహిత్యకారుల బాధ్యతలు పెరిగిపోతున్నాయి. ఈ సవాల్‌ను సాహిత్యకారులు ఎట్లా ఎదుర్కొంటారో అనిపిస్తుంది. అందులో ఒక స్తబ్దతలో ఇరుక్కున్న రాయలసీమలో, పారే నీళ్ళలో కంటే నిలువ నీరులో ఈత కష్టం.

ఈ స్టాగ్నేషన్ లోపల ఎలా చలనాలు సృష్టించుకోవాలి. గత 15 సంవత్సరాలలో కథా సాహిత్యంలో 60 శాతం కథలు రాయలసీమ నుండి వచ్చాయి. ఒకనాటి సాహిత్యపు ఎడారి కర్నూలులో కూడా కథా సాహిత్యం వస్తోంది. ఇంత సాహిత్యాన్ని తడమడం చాలా కష్టం. అయితే అంశాల వారీగా ఏ విధమైన వ్యక్తీకరణ చేసింది అనేది మీతో పంచుకుంటాను. దీనిని మూడు కోణాల్లో చూస్తే ఒకటి ప్రాంతీయ అసమానత. ఏ స్థాయిలో చూసినా అసమానతలు పెరుగుతున్న పరిస్థితి. రెండో కోణం వివిధ రంగాల మధ్య వ్యవసాయక రంగానికీ, పారిశ్రామిక రంగానికీ మధ్య అసమానత, చేతి వృత్తులు చితికిపోతూ వున్న పరిస్థితి. ఇక మూడో కోణం సామాజిక అసమానత. ఒక వెనుకబడిన ప్రాంతంలో దీనిని ఎలా చూడాలి? కరువు ప్రాంతంలోనే కరువులో లబ్ది పొందేవారు ఉన్నారు. బైటెక్కడో లబ్దిదారులున్నారు అన్నటువంటి భ్రమ. ప్రతిధ్వని దాన్ని సాధారణీకరణ చేయకూడదు. కరువు పేరుతో అభివృద్ధి పనుల కాంట్రాక్టు సొమ్ము తినే అవకాశం ఉన్నవాళ్ళు అక్కడే ఉంటారు. కొత్త వాహనం ఒకటి ఇండియా మార్కెట్‌లోకి వస్తే అది అనంతపురంలో కనిపిస్తుంది. కాబట్టి వైరుధ్యం స్థానికమైనదే. అసమ అభివృద్ధి, సాహిత్యంలో ప్రతిఫలనం అన్నప్పుడు అంత వైవిధ్యభరితంగా చూడబడుతుందా ?. ఒక ధనిక రైతు, వ్యవసాయ కూలీ అనుభవాలు ఎలా ఉంటాయి. అట్లానే స్త్రీ పురుష వివక్ష అన్నది ప్రపంచ వ్యాప్తంగా ఉన్నది. రాయలసీమలో అనేక ప్రక్రియల్లో గొప్ప శిల్పంలో రాసిన వాళ్ళు ఉన్నారు. ఎంతమంది స్త్రీల నుండి, దళితుల నుండి రాశారు అన్న ప్రశ్న వస్తుంది. ఈ దృష్టితో చూస్తే రాయలసీమలో అంతో ఇంతో పేరున్న దళిత సాహిత్యకారులు ముగ్గురు కంటే ఎక్కువ మంది లేరు. మహిళలు కూడా అంతే.

రాయలసీమ గురించి ఇంకొక ఇబ్బంది ఏమిటంటే స్టీరియో టైప్స్. ఇవి మొదట మనం తెలుసుకున్న నిజాలు. కొండ గుర్తులు. మొదట్లో ఇవి ముఖ్యమైన పాత్ర నిర్వర్తిస్తాయి. కాని అవి కొత్త భావాలు రానీయవు. ఆ లక్షణం వుంది. నేర్చుకోవడం అనేది అంతకుముందు నేర్చుకున్న దానిని వదిలించుకోవడంతోనే మొదలవుతుంది. ఇవి రాయలసీమ సాహిత్యకారులకు కూడా కొన్ని ఉండి ఉంటాయి. కరువు ప్రకృతి ఇచ్చిన శాపం. ఫ్యాక్షనిస్టులు ఆధునిక పాలెగాళ్ళు, రాయలసీమ ప్రజల సంస్కృతి గురించినవి లాంటివి. ఉదాహరణకు తెలుగు సినిమాకు రాయలసీమ గురించి బండ స్టీరియో టైప్ ఉంది. దీనిని సులభంగానే వ్యతిరేకించగలుగుతాం. కానీ మనకు నచ్చిన దానిని ఎంచుకునే ప్రవృత్తి మూలంగా కొన్ని సున్నితమైన స్టీరియో టైప్స్ ఉన్నాయి. రాయలసీమ కరువులో ప్రకృతి పాత్ర ఎంత? రాయలసీమలో ముందు నుండి కరువులు ఉన్నాయి అన్నదాంట్లో కొంత వాస్తవం ఉంది. ఇక్కడ వనరులు లేవు, వనరులను బైటి నుండి తరలించడంతో మాత్రమే అన్ని ఆటోమేటిక్‌గా పరిష్కారమవుతాయి అన్నది మళ్ళీ స్టీరియో టైప్. రాయలసీమలో కరువును ప్రాకృతిక కోణం నుండి రాసే రచయితలు ఎక్కువగా కనిపిస్తారు. ఈ కథల్లో కార్యకారణ సంబంధం అర్థం కాదు. ఎక్కువ కథలు ఎలా ఉంటాయంటే, ఈ జీవితం మారే అవకాశం లేదు అనే దు:ఖం ఉంటుంది.

గుండె నిబ్బరంతో జీవించే వాళ్ళ గురించి కూడా కథలున్నాయి. వెంకటకృష్ణ "సొంటేర్లు" కథలో రైతులు వాగు గర్భంలో ఉండే సొంటేర్లను ఏరుకొచ్చి పశువులను మేపు కొస్తారు. ముసలి ఎద్దును బతికించుకోవాలని, ఎర్రటి ఎండలో సొంటేర్ల కోసం తవ్వుతూ ఒక వృద్ధుడు సొమ్మసిల్లి పడిపోతాడు. కార్యకారణ సబంధం కనిపించదు. ఎద్దును బతికించుకోవడం అనేది ఒక విలువ. రాయలసీమ పల్లెల్లో మార్పొచ్చింది అని చెప్పే ఇంకో రకం కథలున్నాయి. స్వామి 'నడక' కథలో ఊరికి బస్సొస్తే దాన్ని ఎవరెవరు ఎట్లా చూస్తారు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. బస్సు ఆ ఊరిలో కొత్త అలవాట్లను, కొత్త మానసిక ధోరణులను ఎట్లా ప్రవేశపెడుతుందో చూపిస్తుంది. స్వామి 'నాగరికతా వ్యామోహం' అని ఒక మాటంటాడు. రైతులు వ్యాపార పంటల వైపు పోవడం ఒక ఉచ్చులో ఇరుక్కున్నట్లు చూడాలా, లేక వాళ్ళంతట వాళ్ళు ఏర్పరచుకున్న మార్గమో చర్చించాలి. డబ్బు చలామణి విస్తృతమౌతున్నపుడు, ఆర్థిక అవసరాలు పెరుగుతున్నపుడు, ఆహార భద్రత ఉన్నపుడు రైతు వ్యాపారి పంటల వైపు పోవడంలో లాజిక్ ఉంది. దీసవైపు కూడా ఆలోచించాలి. సాంప్రదాయానికి, ఆధునికతకు మధ్య ఘర్షణ కూడా రాయలసీమ కథల్లో కనబడుతుంది. సాధారణంగా ఎంచుకునే ఎత్తుగడ ముసలివాళ్ళ కోణం నుంచి చూడటం. వాళ్ళు గతం తప్ప భవిష్యత్తు ఎక్కువ లేనోళ్ళు. ఇది గతం నుండి వర్తమానాన్ని కామెంట్ చేసినట్లుగా ఉంటుంది. ఇంకొకటి సామాజిక అసమానతల కోణం. చేతి వృత్తులు ధ్వంసం అయిపోయే దశలో చదువుకొని బాగుపడదామని వచ్చే కొత్త తరం, వాళ్ళకు రిజర్వేషన్ ఒక అవకాశం. రాయలసీమలో కరువు, వలసలు, ఆత్మహత్యలు ప్రతిఫలించే మంచి కథలు వచ్చాయి. కాని దాన్నుండి బైట పడేందుకు ఎలా సంఘటిత పరచాలి అని రచయితలు ఆలోచించాల్సిన బాధ్యత ఉంది అని భార్గవ వివరించారు.

'అసమ అభివృద్ధి - తెలంగాణ సాహిత్యం' అంశంపై రెండో సెషన్‌కు కాశీం అధ్యక్షత వహించారు. అధ్యక్షోపన్యాసంలో కాశీం మాట్లాడుతూ తెలంగాణ ప్రపంచ చరిత్రలో ఒక స్థానమున్న ప్రాంతమని, పోరాటంలో, సాహిత్యంలో ఎంత పేరుందో కరువుల్లో, ఆత్మహత్యల్లో కూడా అంత పేరుందని, పాలకుల విధానం వల్ల వచ్చిన అసమ అభివృద్ధి దీనికి కారణమని అన్నారు. సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచంలో అసమానతలు పెంచుతాయని అన్నారు. అనేక జాతులున్న భారతదేశంలో ఒక జాతిని మరొక జాతి పీడించే సాంఘిక ధర్మం ఉందని అన్నారు. రాయలసీమ ప్రాంతం ఎన్నో రకాలుగా వేదనలు అనుభవిస్తోందని, అయితే ఇక్కడ వనరులు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఉందని, కానీ తెలంగాణలో వనరులుండి దోపిడికి గురవుతున్న ప్రాంతమని చెప్పారు. తెలంగాణలో రెండు జీవనదులు. కృష్ణానది తలమీద, గోదావరి కడుపు మీద పారుతోంది కాని ఇక్కడ పథకం ప్రకారం నీళ్ళను కొల్లగొట్టారని అన్నారు. తెలంగాణ సాహిత్య కథ, కవిత, పాటగా విస్తరించి ఈ వివక్షను ప్రతిబింబిస్తూ వచ్చిందని చెప్పారు.

నందినీ సిద్దారెడ్డి ఈ అంశం పై ప్రసంగించారు.

తెలంగాణ ఉద్యమం ముందుకొచ్చినప్పుడే ఉత్తరాంధ్ర, రాయలసీమ, గ్రేటర్ రాయలసీమ ముందుకొస్తాయి. తెలంగాణ వ్యవసాయానికి అనుకూలమైన ప్రాంతం. సారవంతమైన, సంపద్వంతమైన భూమి. పాలడుగు వెంకట్రావు వంటి వారేకాదు, బాలగోపాల్ కూడా నిజాం పాలనలో ఉండి ఉంటే అభివృద్ధిని పంచుకునేవాళ్ళం అని అంటున్నారు. తెలసి అంటున్నారో తెలియక అంటున్నారో మరి. 'రేగడి విత్తులు' నవల్లో నాలుగు సార్లు ప్రస్తావన ఉంది: నైజాం నడిగడ్డ అడవులో ఎట్లా బతుకుతావు అని అడుగుతారు. నిజాం హయాం నుండి ప్రధానంగా భూమి సమస్యతో ఇబ్బందులు పడ్డారు. భూమి పోరాటం నిజాం వ్యతిరేక ఉద్యమంగా వ్యక్తీకరింపబడింది. అధిక పన్నులే కాక దుర్మార్గమైన వెట్టి ఉండేవి. 'బందగీ లాంటి వాళ్ళు చట్టప్రకారం పోరాటం చేసి భూమి సంపాదించినా, గుండాలు చంపేస్తారు. సురవరం ప్రతాపరెడ్డి 'సంఘాల పంతులు' కథలో రాత్రిపూట ఒక పంతులు గ్రామానికి వెళ్ళినప్పుడు హరిజనవాడ దగ్గర ఆగి ఒక హరిజనున్ని సమయం అడుగుతాడు. కుక్కలు మొరుగుతున్నాయ్ కాబట్టి నాలుగు కావచ్చు అంటాడు. కుయ్యటానికి కోళ్ళు లేవు, రజాకార్లు పోలీసులు తినేసినారు అంటాడు. వర్తక సంఘం, ఆంధ్ర జన సంఘం వంటి అనేక సంఘాల ఉద్యమాలు ఆంధ్ర మహాసభతో రాజకీయ పోరాట రూపం తీసుకున్నాయి. మూడు వేల గ్రామాల్ని విముక్తం చేస్తే, ఆ భూమి మీద హక్కు వచ్చిందనుకున్న దశలో మొదటిసారి సైనికపాలనతో నిరాశే మిగిలింది. సెప్టెంబరు 17, 1948 న నిజాం లొంగిపోయాడు. ఆ స్వాతంత్ర్య దినం గుర్తించకుండా అయిపోయింది. "దేశమంతా పండుగ చేసుకున్న రోజున నేను తలకిందులుగా వేలాడబడి ..." అని అఫ్సర్ కవిత రాశాడు. 1952 లో

ఎన్నికలతో మొదటిసారిగా ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడినప్పుడు స్థానికులకు ఉద్యోగాల కోసం ఉద్యమం మొదలైంది. ఉద్యమాన్ని తగలేసి స్థానికేతరులకు ఉద్యోగాలిచ్చారు. తెలంగాణను ఆంధ్ర ప్రాంతంలో కలపాలని ఉద్యమం చేశారు. కలిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించారు. అసలు సమస్య అక్కడ మొదలైంది. అంతకుముందే మీ తెలుగేం తెలుగని నైజాం వాళ్ళు ఎగతాళి చేశారు, ఇప్పుడు మీదేం తెలుగని ఆంధ్ర వాళ్ళు అంటున్నారు. 1980 ల్లో మొదలైన భూమి పోరాటం సుదీర్ఘ కాలంగా కొనసాగుతూనే ఉంది. భూమికి సంబంధించిన ఎన్నో కథలు వచ్చాయి. అల్లం రాజయ్య కథలో "నన్ను అరెస్టు చేస్తే నా తమ్ముడు భూమి దున్నుతాడు, నా తమ్ముణ్ని అరెస్టు చేస్తే నా కొడుకులు దున్నుతారు, వాళ్ళనూ అరెస్టు చేస్తే నాగలి తనంతట తానే దున్నుకుంటది, నాగలిని కూడా అరెస్టు చేస్తే, భూమి పట్టున పగులుతుంది" అంటాడు. భూమి కోసం ఎంతో పోరాటం చేసిన చోటే ఇప్పుడు లక్ష నుండి 70 లక్షల రూపాయల వరకు మేం భూమి అమ్ముతాం అని రైతులే చెప్పే స్థితి వచ్చింది. పెద్ద మనుషుల ఒప్పందంతో మొదటి క్లాజ్ ఇక్కడ భూమిలో ఎకరం భూమి కూడా అమ్మడానికి వీల్లేదు, అమ్మడానికి రీజినల్ కమిటీ అనుమతి తీసుకోవాలి అని ఉంది. హైదరాబాద్ చుట్టుపక్కల మనుషులకు తుపాకులిచ్చి నిలబెడుతున్నారు. ఎవరు బలం ఎక్కువైతే వాళ్ళు స్వాధీనం చేసుకునే స్థితి.

సాగునీటి వ్యవస్థ అన్ని ప్రాంతాల్లో ఒకలా లేదు. తెలంగాణకు ప్రత్యేకమైన కష్టాలు ఉన్నాయి. నీరొస్తే భూమేది అని దళితుల చేత అనిపించారు. ఇప్పుడు నీరు తప్పనిసరి అని ఎజెండా మీదికి వచ్చింది. రెండు రకాల సాగు వ్యవస్థలున్నాయి - బోర్ల ద్వారా, చెరువుల ద్వారా. కాకతీయుల కాలంలో గొలుసు కట్టు చెరువుల వ్యవస్థ ఉండేది. 1984 లో ఎన్.టి.ఆర్. చెరువుల వ్యవస్థను ధ్వంసం చేసి తెలంగాణలో పడ్డ ప్రతి నీటి చినుకును నదుల్లో కలిపి కోస్తా ప్రాంతంలో పరవళ్ళు తొక్కించారు. శ్రీనివాస్ "పెరటి గుమ్మం దగ్గిర మొహం చూపించి ... చాటేసింది కృష్ణ" అని రాశాడు. నారాయణ రెడ్డి - నాగార్జున సాగరం అనే కావ్యంలో "ఆడవే జలకమ్ములాడవే" అని రాశాడు. శ్రీనివాస్ "జలకాలాడటానికి నీళ్ళేవి?" అని రాశాడు. రాయలసీమ వాళ్ళను కూడా పెద్ద మనుషుల ఒప్పందంతో మభ్యపెట్టారు. అభ్యుదయ కవులందర్నీ తెలంగాణ వాళ్ళు ఊరేగించారు. 'జగన్నాథ రథ చక్రాలు వస్తున్నాయ్' అంటే తెలంగాణ కవులంతా ఈ పాటలు పాడుకొని ప్రజలను మేల్కొలిపారు. ఇవాళ కవి "మీ జగన్నాథ రథ చక్రాలు మా నేల మీద దిగనే లేదు. మీ భగీరథుడు మా నదుల్ని దారి మళ్ళించుకెళ్ళాడు, తెలుగుతల్లి తన కలశాన్ని మా నేల మీద ఒంపనే లేదు. ఓ నీటి పారుదలా నీ రస్తా కోస్తాకే, నిజం దేవుడెరుగు నీరు కోస్తానెరుగు, పల్లం ఒక నెపం మాత్రమే" అని రాస్తున్నాడు. సాగునీటి సమస్యంతా కవిత్వంలోకొచ్చింది. కాలువ ద్వారా 43% పెట్టుబడి ఖర్చు ఉంటే బోర్ల ద్వారా 36.3% అవుతోంది. బోధనం నరసింహారెడ్డి కథలో బోరు కొరుకున్న రైతు ఆత్మహత్య చేసుకుంటాడు. "బొంబాయి సంపాదనంతా బోరు బొక్కల్నే బోస్తి" అని కవిత్వంలోకి కూడా వచ్చింది. తెలంగాణ కరెంటు ఉత్పత్తికి, అవసరమైన బొగ్గు సరఫరా చేస్తుంది. ఎంకన్న పాట రాశాడు 'సింగరేణి దీపం చుట్టూతా చీకట' ని. అర్ధరాత్రి కరెంటుకు రైతుల ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. ఇక్కడ కొక్కాలు ధరించి కరెంటు తీసుకుంటారు. దానికి కేసులు లేవు. అయితే తెలంగాణలో కేసులు పెడతారు. ఇటీవల విడుదల చేసిన ఖైదీల్లో 5000 మంది రైతులే.

ఆధునిక అభివృద్ధి వ్యక్తిగత స్వార్థానికి దోహదం చేస్తుందని, పెద్దింటి అశోక్ కుమార్ 'పేగు ముడి' కథ రాశాడు. వనరులను కొల్లగొట్టడానికి పై నుండి పథకాలు వచ్చాయి. గోరటి వెంకన్న నుంచి 'పల్లె కన్నీరు పెడుతోంది' వంటి పాటలొచ్చాయి. తెలంగాణకున్న పెద్ద వరం పాట. ప్రతి సన్నివేశాన్ని పాటలోకి తెచ్చారు. ఐ.ఐ.టి. విషయంలో బాసరకు, హైదరాబాద్ దగ్గర మెదక్ జిల్లాల మధ్యన కొట్లాట పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఐ.ఐ.టి. హైదరాబాద్‌కు మార్చడం వెనుక హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలన్న కుట్ర ఉంది. అందుకే తెలంగాణ వాళ్ళంతా బాసరకే ఐ.ఐ.టి.ని అడుగుతున్నారు. ఇప్పుడు తెలంగాణ ఉద్యమాన్ని 1969 లో లాగా అణచడం సాధ్యం కాదు. విడిపోయినంత మాత్రాన ఏం జరగదు. "రావొచ్చు, పోవొచ్చు, రొయ్యలమ్ముకోవచ్చు", సెక్రటేరియట్ మీద తెలంగాణ జెండా ఎగిరేస్తే తెలంగాణ ప్రాంత ప్రజల కష్టాలు కొన్నైనా తీర్తాయని ఆశిస్తున్నాము.

'అభివృద్ధి - విద్య - సాహిత్య ప్రతిఫలనం' అంశం పై మూడో సెషన్ నడిచింది. దీనిలో రత్నమాల అధ్యక్షోపన్యాసం - చదువులో పిల్లలు ఆత్మ హత్యలు చేసుకునేటంత విధ్వంసం ఉంది. ఒకప్పుడు పాఠశాల వరకైనా ఆడుతూ పాడుతూ చదువుకునే వారు. ఇప్పుడు పిల్లలు ఆడుతూ పాడుతూ కాదు, ఆపసోపాలు పడుతూ చదువుకోవాల్సి వస్తోంది. సామాజిక జీవితాన్ని సాహిత్యం ప్రతిఫలించాలి. అట్లనే రచయితలనే వాళ్ళు ఒక డైరెక్షన్ ఇవ్వగలగాలి. ఒక ముందుచూపుతో చెప్పగలగాలి. విద్యా విధానాల మీద, చదువుల మీద ఈ మధ్య ఎంతో కొంత సాహిత్యం వస్తోంది. నామిని సుబ్రహ్మణ్యం నాయుడు పాఠశాల విద్యకు సంబంధించి నిరంతర శ్రద్ధతో రాస్తున్నాడు. గతంలో విద్యారంగం గురించి కుటుంబరావు, చలం రాశారు. ఇప్పుడు నామిని ఒక కథ రాశాడు. "తల్లి, తండ్రి, గురువు. ఈ మూడు ఒక దయ్యాల భాష" అని. పిల్లలకు వీరు దయ్యాల్లా కనబడుతున్నారు. ఎందుకు? విద్యా విధానం ఒక విషచక్రంగా తయారైంది. ఒకవైపు కార్పోరేట్ విద్యా సంస్థలకు, వ్యతిరేకంగా ప్రైవేట్ విద్యా సంస్థలు కోర్టుకెళుతున్నాయి. చిన్న చేపను పెద్ద చేపలు మింగినట్లు, చిన్న దుకాణాలను, సూపర్ మార్కెట్లు, సూపర్ మార్కెట్లను ఇప్పుడు రిలయన్స్ లాంటివి మింగుతున్నట్లు, ప్రభుత్వ స్కూళ్ళను ప్రైవేటు స్కూళ్ళు, ప్రైవేటు స్కూళ్ళను ఇప్పుడు కార్పోరేట్ సంస్థలు మింగుతున్నాయి. ప్రభుత్వం కావాలనే మింగించిందనుకోండి. చాలా పాఠశాలలు పోటీలో భాగంగా మేం ఎల్.కే.జి. నుండి ఐ.ఐ.టి. నేర్పిస్తాము అంటున్నాయి. ఇది ఎక్కడిదాకా పోయిందంటే నామిని కథలో ఒక పాప అన్నట్లు "నేం చచ్చిందాకా మా అమ్మా, నాన్న సణుగుడు ఆపరు". చిన్న పాప అంత పెద్ద మాట ఎలా అనగలిగింది. విద్యకు అర్థం మారిపోయింది. సామ్రాజ్యవాద దేశాలకు ఏ అవసరాలున్నాయి అనేదాన్ని బట్టి మన విద్యారంగం ఉంది. స్వాతంత్ర్యానికి ముందు వలస దేశాలు ఇక్కడికొచ్చి కావలసినవి తయారు చేసుకున్నారు. ఇప్పుడు ఔట్ సోర్సింగ్ పేరుతో ఇక్కడి నుండే జరుగుతోంది. ఎంతో కొంత చైతన్యం ఉన్న వాళ్ళ కుటుంబాల్లో కూడా పరిస్థితి భిన్నంగా లేదు.

కాసుల ప్రతాపరెడ్డి యూనివర్సిటీ విద్య మీద కథ రాశారు. విశ్వవిద్యాలయాల నుండి పారిపోండి అని రాశాడు. ఎక్కడికి పారిపోవాలి, ఏం చెయ్యాలి అని చెప్పలేకపోవడంలో ఆయన లోపం మాత్రమే కాదు. ఒక సామాజిక వాతావరణం అక్కడ లేదు. '80 ల్లో గద్దర్ పాట రాశాడు 'చదువంటే ఉద్యమమని'. అప్పుడు విశ్వవిద్యాలయాల్లో ఆ పరిస్థితి ఉంది. జార్జిరెడ్డి, జంపాల వంటి ఉద్యమకారులు వచ్చారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఉండి కూడా చెప్పని వాడు దుర్మార్గుడు, యండమూరి వీరేంద్రనాథ్ లాగా. మన దౌర్భాగ్యం ఏమంటే మనం చెప్పడం పోవడం, ఈ వ్యవస్థను మన మీద పిల్లలు విసిరిగొడుతున్నారు. ఐ.ఐ.టి. లు చదువుకుంటే డబ్బులు సంపాదించరా? అంతకంటే వ్యాపారాలు చేసుకునే వాళ్ళు డబ్బులు సంపాదిస్తున్నారు. డబ్బులు సంపాదించుకోవడం కోసమే అయితే ఇంత పీడించనక్కర లేదు కదా ! చదువంటే ఉద్యమమని మనకు ఎందుకు నేర్పట్లేదు. ఒక కథలో ఒక ఇంటర్ చదివే అమ్మాయి నన్ను ఎవరూ అర్థం చేసుకోవడం లేదు అని చచ్చిపోతుంది. నామిని ఏమంటాడంటే మన మీద పడి పిల్లలు ఏడ్వాలి కాని, పిల్లల మీద పడి మనం ఏడ్చేలా వాళ్ళని పెంచకూడదు అని. శశికళ ప్రాథమిక విద్య గురించి కథలు రాసింది. నవీన్ ఉస్మానియా విశ్వవిద్యాలయం మీద 'అంపశయ్య' నవల రాశాడు. సురేష్ '90 ల్లో ఉస్మానియా యూనివర్సిటీ గురించి రాశాడు.

చంద్రశేఖర్ విద్యాలయాల్లో యూనియన్లు వెనకపట్టు పట్టాక వాతావరణం ఎట్లా మారింది, ఐడెంటిటీ ఉద్యమాల సంక్షోభం గురించి రాశాడు. అధ్యాపక వర్గం నుండి ఎక్కువ మంది రచయితలు వస్తే ఇంకా బాగా పరిస్థితుల్ని ప్రతిబింబించే అవకాశం ఉంది. ఉద్యమాల్లో సంఘాల్లో ఉన్న మనం చేయలేని పని నామిని చేశాడు.

తర్వాత ప్రొ॥ హరగోపాల్ మాట్లాడుతూ...

ఒక కాలేజి 'సావనీర్' లోని బయో టెక్నాలజి వ్యాసం నన్ను ఆశ్చర్యపరిచింది. అది రవి కిశోర్ అనే ప్రొఫెసర్ ఉపన్యాసాన్ని జూనియర్ కాలేజి అమ్మాయి సంగ్రహంగా రాసినది. జన్యుశాస్త్రంలో పరిశోధన - మనిషి ఆరోగ్యంగా జీవించడానికి, ఆరోగ్యంగా పుట్టడానికి దోహదం చేసేలా జరగాలి. ఆ వ్యాసంలో ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్లు పెద్ద ప్రమాదమని, వాళ్ళ మందుపాతరలు కనుగొనే జన్యువును పొగాకు మొక్కలో ప్రవేశపెడితే ఆ మొక్కలు జిలెటిన్‌ని కనుగొంటాయని, అలా 2020 సవత్సరానికి నక్సలైట్లు నిర్మూలించబడతారని రాశారు. ఇది ఒక విచిత్రమైన విషయం. మనిషి తన సర్వస్వాన్ని వదులుకొని, ఈ సమాజం మారాలి అని చేసే అత్యున్నతమైన త్యాగానికి స్పందించకపోగా (సైద్ధాంతిక విభేదం ఉన్నా), ఒక సైంటిస్టుకు ఒక ఉద్యమం అంతరించిపోవాలనే వైఖరి ఏదైతే ఉందో అది సైన్స్ అండ్ టెక్నాలజిలో అంతర్లీనంగా వ్యాపించి ఉంది. మొత్తం విద్యా విధానంలో సైన్స్‌కు, టెక్నాలజికి అత్యంత ప్రాధాన్యత వుంది. సైన్స్‌లో మౌళిక అంశాల మీద పరిశోధన కాక, ప్రత్యక్షంగా పరిశ్రమకు ఉపయోగపడేదిగా ఉండే దానికే ప్రాధాన్యత ఉంది. ఇప్పుడు ఐన్‌స్టీన్ పుడితే ఆయనకు ఎక్కడా ఉద్యోగం దొరకదు. ఈ విజ్ఞానం యొక్క ప్రయోజనం ఏమిటి, వీటి పరిణామాల గురించి సాహిత్యంలో ఏమైనా ఉందా? ఉత్పత్తి శక్తులకు, లాభాలను పెంచడానికి మొత్తం శాస్త్ర పరిశోధనలు జరగడం ఆ ప్రాపంచిక దృక్పథం, ఆ విలువల చట్రం మీద ఏదైనా సాహిత్యం రావాలి. సైంటిస్ట్ అయినా రచయిత కావాలి లేదా రచయితైనా సైంటిస్టు జీవితాన్ని పట్టగలగాలి. ఎందుకంటే సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రధానంగా జరిగింది వాళ్ళను సమాజం నుండి విడగొట్టడం. హైస్కూల్ దాకా సామాజిక శాస్త్రాలు నామమాత్రంగా చెబుతున్నారు. పదో తరగతి వరకు విద్యార్థి పునాది చాలా విస్తృతంగా వుండాలి. అక్కడి నుండి ప్రావీణ్యత సాధించడం ఈ విస్తృతమైన పునాదికి సంబంధంగా ఉండాలి. అంతిమంగా విజ్ఞానం అంటే మనిషికి, ప్రకృతికి (శాస్త్రీయ విజ్ఞానం), మనిషికి మనిషికి ఉండే సంబంధం (సామాజిక శాస్త్రం). నేను ఏ స్కూలుకు వెళ్ళినా విద్యార్థులు సోషల్ స్టడీస్ అంటే ఇష్టం అని చెప్పడం లేదు. ఉత్పత్తి శక్తులలో పాల్గొనే శాస్త్రజ్ఞుడికి సామాజిక జీవితం, మనిషి సమాజంలో వస్తున్న అంతర్గత సంఘర్షణ వీటి మీద అవగాహన లేకపోతే ఆ సైంటిస్టు కేవలం స్వప్రయోజనాలకు, మార్కెట్‌కే ఉపయోగపడతాడు. విద్యా వ్యవస్థలో ఈ అసమగ్రత అనేది చాలా లోతుగా వెళ్ళిపోయింది. ఈ విషయాన్ని గురించి సాహిత్యంలో చెప్పాలి.

సైన్సు అభివృద్ధి క్రమంలో సమాజాన్ని చాలా ముందుకు నెట్టింది. మనిషి ప్రకృతి సూత్రాలను, కార్యకారణాలను అర్థం చేసుకున్నాడు. ప్రకృతిలో ఉండే చలన సూత్రాల్ని అర్థం చేసుకుని మానవ జీవితాన్ని మలచుకోవడంగా మనిషి జీవించే విధానం ఉండాలి. ప్రకృతితో ఐక్యత, ఘర్షణలో ఘర్షణ ముందుకుపోయింది. ఐక్యత ఎక్కడో పోగొట్టుకోబడింది. అదే కాపిటలిజమ్. సమస్యలన్నీ దాంట్లో నుంచే వచ్చాయి. మనిషి శాస్త్రీయంగా ఆలోచిస్తాడు. శాస్త్రం అనేది మనిషి ఉపయోగించుకొని సమాజాన్ని మార్చడానికి దోహదం చేసేది. హేతువుతో ఉంది గనుకనే సైన్స్ అంటే ఒక ఆరాధన. అది మనిషిని ఆత్మవిశ్వాసంతో జీవించేలా చేసింది. ప్రకృతికి భయపడకుండా, భయం నుండి బైటికి వచ్చేలా చేసింది. కానీ మనిషి జీవితాన్ని, సమాజాన్ని సంపూర్ణంగా నిర్దేశించే శక్తి హేతువుకు వుందా? హేతువు ఒక సాధనమా లేక హేతువనేదే అంతిమమా? శాస్త్రీయంగా ఆలోచించే మనిషికి ఒక అంతిమ ప్రయోజనంగా ఎలాంటి సమాజం కావాలి? హేతువును దాని ఖచ్చితమైన అర్థంలో ఉపయోగిస్తే, జీవితంలో ఉండే సహజమైన ఉద్వేగాలకు, మానవ సంబంధాలకు రెండింటికీ సంబంధం ఎక్కడ లోతుగా ఆలోచించాలి. మానవీకరించే క్రమంలో మనుషులు కొన్ని ప్రమాణాలు నిర్ణయించుకుంటారు. ఆ ప్రమాణాలు పెట్టుకునేవాళ్ళు ఉన్నతంగా జీవిస్తారు. ఆ ప్రమాణాలు పెట్టుకోని వాళ్ళు ప్రతీదానికి ఒక కారణాన్ని తీసుకొస్తారు. ఇప్పుడు శాస్త్రవేత్తలు చాలా ప్రమాదంగా మారారు. ఐన్‌స్టీన్ తరం దాకా మనకు పెద్ద సమస్య లేదు. ఐన్‌స్టీన్ శాస్త్రానికీ, సమాజానికి ఒక వారధిగా ఉన్నాడు. 1948 లో 'సోషలిజం రిలవెంట్' అని ఆయన వ్యాసం రాశారు. అమెరికా తయారు చేసిన అణుబాంబుకు ఐన్‌స్టీన్ సాపేక్షిక సిద్ధాంతం ఉపయోగపడింది. అప్పుడు ఐన్‌స్టీన్‌కు ఒక ప్రశ్న వేధించింది. 'నేను ప్రపంచానికి మంచి చేశానా? చెడు చేశానా?' అని. ఐన్‌స్టీన్ మిత్రుడన్నాడట 'నువ్వెందుకు బాధపడతావు, పోతేపోయారు. మనుషులందరూ పోతే ఏంటి' అని. ఒక మనిషి ఇలా ఎందుకు ఆలోచిస్తాడు అన్న ప్రశ్న అప్పుడాయనకు కలిగింది. మనిషి సమిష్టి నుండి చాలా దూరమై పోయిన తర్వాత, మొత్తం సమాజమే పోటీ అయితే, ఒక శత్రు సంబంధం ఉంటే, మనుషులంతా శత్రువులే అనుకునే దాకా పోతేనే అలా అనగలడు. కనుకనే ఐన్‌స్టీన్ 'సోషలిజం రిలవెంట్' అని రాశాడు. ఒక సైంటిస్టుగా ఐన్‌స్టీన్ స్పందించిన పద్ధతి ఇది. ఇప్పుడెవరైనా సైంటిస్టును అడిగితే ఇదంతా మాకేం సంబంధం అంటారు. అబ్దుల్ కలాం సైన్స్, టెక్నాలజి మీద మాట్లాడినట్లు సమాజం గురించి మాట్లాడలేదు. 'విశ్వవిద్యాలయం' పేరులోనే విశ్వాన్ని అధ్యయనం చేయడం వుంది. అయితే ఎక్కడికక్కడ విడగొట్టి, చిన్న జ్ఞానం ఇచ్చి అదే గొప్పనుకునేలా చేస్తున్నారు. సోషియల్ చదువుకునే వాళ్ళంటే చులకన కూడా ఉంది. మానవ జీవితానికి సమాజిక విజ్ఞానం అవసరం. ఇవి సైన్స్ కంటే తక్కువ కాదని ఎలా చెప్పాలి. యూనివర్శిటీ ప్రొఫెసర్లలో సంకుచితత్వం, ఈర్ష్య, ద్వేషం, ఇంత ఉంటే వాళ్ళు విద్యార్థులకు ఏం చెప్పగలరు. ఈ 'ఎరోగెన్స్' నుండే అధికారాన్ని ఆరాధించడం, నియంతృత్వం వచ్చేస్తాయి. విద్య అనేది ఒక ప్రజాస్వామిక ప్రక్రియ అనే అవగాహన లేనప్పుడు ఇదంతా వస్తుంది. ఈ ప్రశ్నలు ఈనాడు ఉన్న ఛాలెంజ్. సాహిత్యం ఎలా స్పందిస్తోంది? సాహిత్యకారుడికి ఒక వెసులుబాటు ఉంటుంది. వాళ్ళకు మెథడాలజీ శృంఖలాలు ఉండవు. విశ్వవిద్యాలయాల్లో ఉన్నవాళ్ళు బైట సంఘర్షణలకు స్పందించక పోవడానికి ఈ విజ్ఞానంలోనే లోపాలున్నాయి. వంద కోట్ల జనాభా ఉన్న దేశంలో ఈ సమాజం నాకు అవసరం లేదు, అనుకునే విద్యార్థులున్నా, మార్కెట్‌కు వీళ్ళు అవసరం లేదని అనుకున్నా ఎక్కడో లోపం ఉన్నట్లే. సాహిత్యం దీన్ని వెతకాలి. అల్లం రాజయ్య 'ప్రత్యర్థులు' కథలో పి.వి. నరసింహారావు వ్యక్తిత్వాన్ని ఎంతో గొప్పగా మనిషి లోపలికి వెళ్ళిపోయి చెప్పాడు. సాహిత్యం మాత్రమే అది చేయగలడు. రాజకీయ, ఆర్థిక విధానాల్లో వచ్చిన మార్పుల వల్ల విద్యలో సామాజిక అంశాలు లేకుండా పోయాయి. 1990 ల్లో బిర్లా, అంబానీలను ఉన్నత విద్య మీద రిపోర్టు తయారు చేయమని ప్రభుత్వం అడిగిందంటే అర్థం ఏమిటి? అంబానీ జీవితంలో లక్ష కోట్లు సంపాదించాడు. కానీ అతని పిల్లలు కొట్లాడుకుంటున్నారు. తల్లిని కోర్టుకు లాగారు. సంపదలో ఎంత డిస్టార్షన్ ఉంది! సంపదలోంచి మనుషులు రారు. ఇది సాహిత్యం గొప్పగా చెప్తుంది. కానీ సంపద సృష్టిలో విద్యావిధానం పాత్ర - ఈ అనుసంధానం సాహిత్యంలో చేయాల్సి వుంది. విద్యావిధానం గురించి 1966-67 లో జరిగిన చర్చ, అప్పుడొచ్చి స్పందనే మొదటిది, ఆఖరుది. సమాజానికి, విద్యకు ఉన్న సంబంధాన్ని చెప్పడానికి ప్రయత్నం చేసింది కొఠారి కమీషన్ రిపోర్టు. '66-67 లో వచ్చిన ఉద్యమాలు, నక్సల్బరీ, తెలంగాణ, ఫ్రాన్స్‌లో, యూరప్‌లో, అమెరికాలో వచ్చిన ఉద్యమాలు దీనికి ప్రేరణగా నిలిచి ఉండవచ్చు. ఇప్పుడు చిదంబరం చెబుతున్నారు. జ్ఞానం యొక్క ఆవశ్యకత సంపదను సృష్టించడం అని. ఉత్పత్తి

చేయి, సంపాదించు, వినియోగించు, ఎంజాయ్ చెయ్యి ఇవే లక్ష్యాలుగా ఉన్నాయి. విద్యావిధానం దీనికి తగినట్లుగానే వచ్చింది. చాలా సంక్షోభం ఉంది. అయితే సంక్షోభ సమయంతో సాహిత్యంలో స్పందన గొప్పగా ఉంటుంది. సోవియట్ యూనియన్‌లో విప్లవానికి ముందు వచ్చిన రచనలు తర్వాత రాలేదు. అది కూడా ఎందుకో ఆలోచించాలి. టెక్నాలజీలో వచ్చిన మార్పులు - అభివృద్ధి, విధ్వంసం - విద్యా విధానం మీద సాహిత్యం రాయాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను చరిత్ర మరోసారి విరసం మీద పెట్టింది.

'అభివృద్ధి - విధ్వంసం - సంస్కృతీ రూపాలు' అంశం పై చివరి సెషన్ జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన రాఘవాచారి గారు మాట్లాడుతూ మనది అసమ సమాజం కాబట్టి, అభివృద్ధి అంటేనే అది పాలకుల అభివృద్ధి అని, పాలితుల్ని అది విధ్వంసం చేస్తోందని అర్థం చేసుకోవాలని అన్నారు. పాలకులు ఆస్తులు పెంచుకుంటున్నారు, ప్రజలకు దారుణమైన విధ్వంసం జరిగిందని, ఆ విధ్వంసం కూడా కనిపించకుండా సాంస్కృతిక దాడి జరుగుతోందని, ఆ విధ్వంసాన్ని ప్రశ్నించే నిర్మాణాల్ని దుర్మార్గంగా కూలగొడుతున్నారని దీనిని మనం ఎదుర్కోవాలని అన్నారు.

వేణుగోపాల్ తన ప్రసంగంలో... 'అభివృద్ధి' నిర్వచనం చాలా సంక్లిష్టంగా ఉంటుంది. దీనిని అర్థం చేసుకోవడానికి కైట్ ఫ్లయింగ్ చేయాలి. గాలిపటం ఎగరటంలో నియంత్రణ ఉంటుంది, స్వేచ్ఛ ఉంటుంది. జాగ్రత్తగా లేకపోతే గాలిపటం ప్రాంతీయవాదంలో కొట్టుకుపోతుంది. అభివృద్ధిని కొన్ని ఉదాహరణలు తీసుకుని నిర్వచించడానికి ప్రయత్నిస్తే ... 1956 లో వ్యవసాయ రంగంలో 1600 ట్రాక్టర్లు ఉండేవి. 2000 సంవత్సరం నాటికి రాష్ట్రంలో వినియోగించే ట్రాక్టర్ల సంఖ్య 90,000. సాగు యోగ్యమైన భూమి 1956 నుండి 2000 వరకు ఏమీ పెరగలేదు. మరి ఎంతమంది కూలీలను ఈ ట్రాక్టర్లు రీప్లేస్ చేశాయి 1985 లో కారంచేడు సంఘటన జరిగింది. 1920 ల్లోనే ఆ ఊళ్లో వ్యాపార పంటలు పండించేవారు. ఎంతో అభివృద్ధి, మిగులు కనపడుతుంది. కానీ 1985 నాటికి కూడా దళితులు గేదెల్ని కడిగే నీటినే తాగే పరిస్థితి. కోస్తాలో నిర్మించబోయే పారిశ్రామిక కారిడార్ కోసం పోలవరం ప్రాజెక్టు 276 గ్రామాలను ముంచేయబోతోంది. లక్షల మంది ఆదివాసీల సంస్కృతి ధ్వంసం కాబోతోంది. సామ్రాజ్యవాదం ఆటోమొబైల్, చమురు పరిశ్రమ కొరకు ముస్లింల మీద భయంకరమైన దాడి చేస్తోంది.

ఆర్థికంగా స్థితిమంతులైతే అభివృద్ధి చెందారు అంటారు. కొత్తవి వస్తే అభివృద్ధి అంటారు. భోగలాలసతే అభివృద్ధికి చిహ్నం అవుతోంది. ఈ క్రమంలో మనిషితనం అదృశ్యమవుతోంది. విద్యావకాశాలు, ఆర్థిక పెరుగుదలే అభివృద్ధి అని కూడా అంటారు. తలసరి ఆదాయం, తలసరి వినియోగంలో అభివృద్ధిని నిర్వచించాలని చూస్తే ఆ లెక్క సక్రమంగా ఉండదు. 1990ల్లో 'యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' అభివృద్ధికి మూడింటిని ప్రమాణంగా చెప్పింది. ఒకటి ఆయు:ప్రమాణం ఎంత ఉంది, రెండు విద్యావకాశాలు, మూడు కొనుగోలు శక్తి. చివరికి లెక్కించే క్రమంలో కొనుగోలు శక్తి ఎక్కువగా వచ్చింది. అంతిమంగా సరుకుల కొనుగోలు దగ్గరికి వచ్చింది. మరొక నిర్వచనంలో పల్లెలు వెనుకబాటుతనానికి, పట్నం అభివృద్ధికి చిహ్నం అయిపోయింది. ప్రాచీన కాలంలో కూడా గుప్తుల స్వర్ణయుగం, రాయల స్వర్ణయుగం అని చెప్తారు గానీ ప్రజా జీవనం గురించి ఏమీ ఉండదు. రాయల కాలంలో రత్నాలు రాసులుగా పోశారన్నారు. అవి ఎవరు కొనుగోలు చేశారు? పార్శీలు కొన్నారు. అభివృద్ధి పథకం, అభివృద్ధి రెండింటికీ చాలా తేడా ఉంది. కాస్ట్ ఆఫ్ డెవలప్‌మెంట్ కంటే కాస్ట్ ఆఫ్ అండర్ డెవలప్‌మెంట్ ఎక్కువ కనుక అభివృద్ధికి మూల్యం చెల్లించాలి అని చెబుతారు. మరో మాటలో ముంపు బాధితులు, నిర్వాసితులు త్యాగాలు చెయ్యాలి అని చెబుతారు.

మానవ ముఖంతో అభివృద్ధి అని కూడా అంటారు. అభివృద్ధి మానవుల కోసమే అయితే దానికి ముఖం తొడగడం ఎందుకు? 1983-84 లో అనంతపురం ఎడారిగా మారబోతున్నదని రిపోర్టు వచ్చింది. అభివృద్ధి నిధులన్నీ అనంతపురంలోకి ప్రవేశించాయి. అభివృద్ధి అనేది ఇంటలెక్చువల్ మాఫియా, ఎన్జీవో మాఫియా అవుతోంది. అభివృద్ధిని సంస్కృతి నుండి ఎలా అర్థం చేసుకోవాలి? అభివృద్ధి భావజాలంగా ఉంది. దీనిని ఎలా ఖండించాలి. అభివృద్ధి అంటే ఒక స్థితిలా, కోస్తా, పంజాబ్, హైదరాబాద్ సాధించిన స్థితిలా చూసే భావజాలం. దీనిని ఒక జడత్వ రూపంగా చర్చిస్తున్నాము. పాలక వర్గాలు అభివృద్ధిని ఒక కలగా చూపిస్తున్నాయి. స్వర్ణాంధ్రప్రదేశ్, హరితాంధ్రప్రదేశ్ ఇలా ... అభివృద్ధి అనే కలను కొనుక్కోవడానికి మధ్యతరగతి సిద్ధంగా ఉంది.

అభివృద్ధిని ఉత్పత్తి సంబంధాల, ఉత్పత్తి శక్తుల అభివృద్ధిగా మనం అర్థం చేసుకోవాలి. నానోటెక్నాలజీ, నరబలి పక్కపక్కనే జరిగాయి. ఎందుకంటే ఉత్పత్తి శక్తులలో, ప్రజల్లో అభివృద్ధి జరగలేదు. బాంబేలో అణువిద్యుత్ కేంద్రం, పక్కనే పశుపోషణ దశలో ఆదివాసీ తెగ ఉన్నాయి. ఇక్కడే మావో చెప్పిన అభివృద్ధిని అర్థం చేసుకోవాలి. ఎంగిల్స్ మనిషి శక్తి ఒక పనిముట్టులోకి ట్రాన్స్‌ఫర్ అయింది అని చెబుతాడు. పెట్టుబడి మనిషి చేతికి, పనిముట్టుకు అడ్డుగోడ. మన అభివృద్ధి అవసరాలు మనమే నిర్ణయించుకోవడమే స్వావలంబన. రాయలసీమలో సజ్జలు, జొన్నలు వంటి తిండి గింజలు పండగలవు. వ్యాపార పంటలు మాత్రమే ఎందుకు పండించాలి? అభివృద్ధిని మనిషి వైపు నుండి నిర్వచించాలి. బస్తర్‌లో ఇవాళ ఆదివాసులు అలా నిర్వచిస్తున్నారు అని వివరించారు.

తర్వాత సాయంకాలం 6.30 గంటలకు కా. సి.యస్.ఆర్. ప్రసాద్ అధ్యక్షతన 'నల్లమల అమరుల వేదిక' మీద బహిరంగ సభ జరిగింది. కా.ప్రసాద్ ప్రస్తుత రాజకీయ సాహిత్య వాతావరణాన్ని విశ్లేషిస్తూ ఇవాల్టి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు స్ఫూర్తి నివ్వడంలో భగత్ సింగ్ అవగాహన, స్ఫూర్తి చాలా అవసరం, ఇది ఆయన శతజయంతి సంవత్సరం అన్నారు. అట్లాగే ప్రపంచ విప్లవ సాహిత్య చరిత్రలో సుస్థిరమైన 'అమ్మ' నవలను మ్యాక్సిమ్ గోర్కి రాసి వందేళ్ళవుతోంది. ఇవ్వాల్టి తెలుగు సాహిత్యం సమాజ జీవితపు లోతునూ, ప్రజా పోరాటాల చిత్రణను అందిపుచ్చుకోవడానికి 'అమ్మ' ప్రాధాన్యత ఉంది అని గుర్తు చేశారు.

తర్వాత విరసం కార్యదర్శి వి. చెంచయ్య తీర్మానాలు చదివి వినిపించారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రొ॥ శేషయ్య మాట్లాడుతూ విరసం నిర్బంధాల నుండి, నిషేధాల నుండి తిరిగి ప్రజాపరం అ ు ప్రజల తరుపున మాట్లాడుతున్నందుకు సంతోషంగా ఉంది. నిషేధ కాలంలో విరసం యువ కవులు అరెస్టులను, చిత్రహింసలను అనుభవించి కూడా అద్భుతమైన కవిత్వం రాశారు అని ప్రారంభించి ఇవాళ నిర్బంధాన్ని కేవలం భౌతికంగా ఎన్‌కౌంటర్ హత్యలు, అణచివేత గానే గాక భావజాల సమస్యగా కూడా చూడాలి అన్నారు. నిర్బంధానికి భావజాల కోణం లేకపోతే యింత ప్రభావం చూపలేదని, రాజ్యం చేసే ప్రాథమిక హక్కుల విధ్వంసం పట్ల న్యాయ వ్యవస్థకు కూడా ఏ ప్రతిస్పందన ఉండదనీ వివరించారు. రాజ్యాంగంలోని హక్కులు ఉద్యమాల ద్వారా వచ్చినవే గాని, ఎవరో దయతలచి యిస్తే వచ్చినవి కావు. మనకు ఈ స్పృహ లేకుండా చేయడంలో రాజ్యం తన అన్ని అంగాల ద్వారా నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటుంది. అందువలన హక్కులు సంక్షోభంలో పడ్డప్పుడు మన ప్రతిస్పందన ఉండవలసిన విధంగా ఉండటం లేదు అన్నారు.

చివర్లో విరసం కార్యవర్గ సభ్యుడు కా॥ వి.వి. మాట్లాడారు. నల్లమల విప్లవోద్యమం గాయపడి ఉన్న తరుణంలో, మనం యిక్కడ ఈ నల్లమల అమరుల వేదిక నుండి మాట్లాడుకుంటున్నాం. అభివృద్ధి విధ్వంసాలకు లోతైన సామాజిక, రాజకీయ సాహిత్య విశ్లేషణ యిచ్చుకుంటే - పాలకుల రాజకీయాలు

సాహిత్య పాఠశాల సందర్భంగా విరసం సర్వసభ్య సమావేశం ఆమోదించిన తీర్మానాలు

నిర్బంధం - ఎన్‌కౌంటర్లు

వై.యస్.రాజశేఖర్ రెడ్డి పాలనలో విప్లవకారుల నెత్తురు ఏరులైపారుతుంది. తన పరిపాలనలో బూటకపు ఎదురుకాల్పులు వుండవు అని ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ గత ప్రభుత్వాల మాదిరిగానే తన హాయంలో కూడా యధావిధిగా హత్యలు చేస్తున్నాడు.

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాధవ్ బూటకపు ఎన్‌కౌంటర్, మహబూబ్‌నగర్‌లోని సంగడి గుండాల కడపజిల్లా శేషాచలం, ఎర్రశెల బూటకపు ఎదురుకాల్పుల్లో పెద్ద సంఖ్యలో విప్లవాకారుల్ని అతికిరాతకంగా కాల్చి చంపి మారణహోమాల్ని సృష్టించిందీ ప్రభుత్వం. ఈ కాల్పుల్లో ముందెన్నడు లేనంతా ఎక్కువ సంఖ్యలో మహిళా విప్లవకారులు అమరులయ్యారు. సుదర్శన్, గౌతమ్, వడ్కపూర్ చంద్రమౌళి, కరుణలను పట్టుకొచ్చి కాల్చి ఎదురు కాల్పుల కట్టుకథలు అల్లారు.

కోవర్టు, విష ప్రయోగాలే కాకుండా వరంగల్ జిల్లా ఆముదాల పల్లిలో పోలీసులు బాంబ్ బ్లాస్టింగ్ వంటి కిరాతకాలకు పాల్పడుతున్నారు. చనిపోయిన వారి వివరాలు సభ్యసమాజానికి తొందరగా తెలియకుండా ఉంచాలనే క్రూర స్వభావం కల్గిన రాజ్యాం విప్ల కారుల ఊరు, పేరు కావాలనే తప్పుడు సమాచారం ఇస్తూ, అటు చనిపోయిన విప్లవకారుల రక్త సంబంధీకుల్ని, ఇటు ప్రజల్ని గందరగోళానికి గురిచేస్తూ శవాలు కుళ్లిపోయేలా చేస్తూ అమానవీయంగా ప్రవర్తిస్తుంది. కుళ్లిన నరాలు, ఆకారాలు కూడా రూపుమాసిపోయి ఎవరు ఎవరో కన్నవారు కూడా పోల్చుకోలేని దుస్థితి నేటి విప్లవకారుల కుటుంబాలది.

ఇక అమరులైన వారి గుర్తింపు మొదులుకొని అంతిమయాత్రల వరకు తీవ్రనిర్బంధం మధ్య ప్రజా ప్రతిఘటన, నిరసనల మధ్య రాజ్యహింసను ఎదుర్కొంటూనే ప్రజలు సగౌరవంగా అమరుల అంతిమ సంస్కారాలు విప్లవ సాంప్రదాయం ప్రకారం జరుపుకుంటున్నారు.

ఒక వైపు రక్తపాతం, మరోవైపు ప్రజా ఉద్యమాలపై తీవ్ర నిర్బంధం అమలవుతుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా ఉద్యమాల్ని సమర్థించిన వైఎస్ఆర్ అధికారంలోకి రాగానే అణిచివేత చర్యలకు పూనుకున్నాడు. నల్గొండలో యూరేనియం ప్రాజెక్టుని వ్యతిరేకించిన రాజశేఖర్ రెడ్డి తన స్వంత జిల్లా కడపలో యూరేనియం ప్రాజెక్టు కట్టేందుకు అనుమతించాడు. ప్రజలపై తీవ్రనిర్బంధాన్ని ప్రయోగించి "పబ్లిక్ హియరింగ్"లో తన గుండాల చేత యురేనియం అనుకూలంగా గుండాయిజం చేయించాడు. అలాగే విశాఖ బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి గిరిజనుల్ని అనేక హింసలకు గురిచేసాడు. గంగవరంలో ప్రజా ఉద్యమకారులపై, ప్రజలపై లాఠీఛార్జ్, కాల్పులు జరిపి ప్రాణాల్ని బలితీసుకుంది వైఎస్ఆర్ పోలీసు యంత్రాంగం. గంగవరం ఆందోళనలో పాల్గొని నిర్బంధించబడిన 'స్త్రీ శక్తి' సంఘం కార్యకర్త జాన్సీని గొలుసులతో బంధించి అతిహేయంగా ప్రవర్తించారు పోలీసులు.

న్యాయవ్యవస్థకు తలవంచి విరసంపై నిషేధం ఎత్తివేసినప్పటికి, అనేక ప్రాంతాల్లో ఇప్పటికి విరసంపై అప్రకటిత నిషేధం అమలు అవుతూనే వుంది. యూనిట్లు బహిరంగంగా పనిచేయలేకపోతున్నాయి. విరసం సభ్యులపై పెట్టిన అక్రమకేసులు ఇప్పటికీ అలానే వున్నాయి. మరోవైపు అమరుల అంతిమ యాత్రలో పాల్గొంటున్నందుకు, రాజ్యహింసను ఖండిస్తున్నందుకు, అమరుల రక్తసంబంధీకులపై అక్రమ కేసులు పెట్టిందీ ప్రభుత్వం. రాష్ట్రంలో రాజకీయ విశ్వాసాలు ప్రకటించే స్వేచ్ఛ ఎంత మాత్రము లేదు. ప్రజాస్వామ్య బద్ధంగా పరిపాలన చేస్తానని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు, రాష్ట్రాన్ని నిర్బంధ శిబిరంగా మారుస్తుంది. ప్రశ్నించే గొంతుల్ని నొక్కివేయడానికి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తుంది. ప్రజలదృష్టిని మళ్లించేందుకు ఒకరి కబ్జా భూముల్ని మరొకరు ఏ కరువు పెడుతూ భూ భాగోతాల నాటకాలు ఆడుతున్నారు. నివాసస్థలాలకై పోరాడుతున్న పేదలపైన పోలీసుల్నీ పురిగొల్పి భీబత్సం సృష్టిస్తుంది.

ఉద్యమించే ప్రజలపై ప్రభుత్వ దమనకాండను విరసం తీవ్రంగా ఖండిస్తుంది. బూటకపు ఎన్‌కౌంటర్లపై ఉన్నత న్యాయమూర్తి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుంది. తమహక్కుల కోసం పోరాడుతున్న ప్రజలకు విప్లవ రచయితల సంఘం మద్దతు తెలుపుతుంది.

సద్దాం ఉరితీతను వ్యతిరేకిద్దాం

సామ్రాజ్యవాదులకు రెండు ప్రధాన అవసరాలున్నాయి. ఒకటి వారి ఉత్పత్తులను, సరుకులను అమ్ముకోవడం. సరుకుల అమ్మకానికి ఆటంకం ఏర్పడితే యుద్ధంతో పరిష్కరించడం.

సామ్రాజ్యవాదులు సరుకును ఉత్తపత్తిచేయడంలో, దాని వాడుకలో అవసరమయ్యే వనరులకోసం వివిధ దేశాలపై ఆధారపడతాయి. సరుకును అమ్ముకోవడానికి దేశాలు కావాలి. యుద్ధ టెక్నాలజీలు పరీక్షించుకోవడానికి యుద్ధాలు కావాలి.

ఇవ్వాల్టి సందర్భంలో సద్దాంహుస్సేన్ వారి పెట్రోలు అవసరాలు తీర్చడానికి సహకరించలేదు కాబట్టే, దేశ స్వాతంత్ర్యకాంక్షతో అమెరికన్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరగబడ్డాడు కనుకనే వారి ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది.

అంతర్జాతీయంగా సద్దాం ఉరితీత ఆత్మగౌరవంతో నిలబడే దేశాలకు, సార్వభౌమత్వం కోసం నిలిచే దేశాలకు సామ్రాజ్యవాదుల హెచ్చరిక మాత్రమే. ఒక అంతర్జాతీయ కుట్రలో భాగంగానే ఇస్లాం మతంపై వ్యతిరేకతను సామ్రాజ్యవాదులు పెంచిపోషిస్తున్నారు.

అంతర్జాతీయంగా సద్దాంపై ఉరిశిక్ష అమలు జరిగితే, మన దేశంలో

విధ్వంసపూరితమైనవి, విప్లవ రాజకీయాలు అభివృద్ధిని సాధించేవి, ప్రత్యామ్నాయమైనవి అని అర్థం అవుతుంది. ఈ ప్రత్యామ్నాయం శ్రీకాకుళ పోరాట కాలం కంటే ఇవాళ చాలా విశాలం అయింది. సామ్రాజ్యవాదాన్ని ఏ అర్థంలో, ఏ పోరాట రూపంలో వ్యతిరేకించే వారైనా సరే ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు నిలబడ్డట్లే. విప్లవోద్యమం అనేక దశలను దాటుకుంటూ అనేక నష్టాలను చవిచూసి ఉండవచ్చు గాని ప్రత్యామ్నాయ రాజకీయాల ప్రభావం దేశవ్యాప్తంగా ప్రజల శక్తిగా ఉన్నది. ముఖ్యంగా సద్దాం హుస్సేన్ ఉరిశిక్ష తర్వాత ప్రపంచ వ్యాప్తంగానే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిరసన పెల్లుబికుతున్నది. ఒకవైపు నుండి చూస్తే అననుకూల వాతావరణం ఉన్నట్టు కనిపించవచ్చునని, యింకోవైపు నుండి కనుక చూస్తే ఎన్నెన్ని అనుకూలాంశాలు ఉన్నదీ గమనించగలం. నల్లమల అమరుల వేదిక నుండి గాయపడిన నల్లమల విప్లవోద్యమంతో విప్లవ రచయితలు స్పష్టంగా ఒక విషయం చెప్పాల్సి వుంది. మీ పక్షాన రచయితలుగా మేం దృఢంగా నిలబడి ఉన్నాం. మీ త్యాగాల్ని, ఆశయాల్ని రాస్తాం, ప్రచారం చేస్తాం, సమాజంలో నిలబెట్టి ఉంచుతాం అని, ఉద్యమాలు దెబ్బతిన్నప్పుడు ప్రపంచవ్యాప్తంగా రచయితలు యిలాంటి పనే చేశారు. ఉద్యమాల్లో నేరుగా పాల్గొని విజయానికి దోహదపడ్డం ఒక అంశమైతే, దెబ్బతిన్న ఉద్యమాల్ని కళా సాహిత్యాల్లో బతికించి సమాజంలో నిలబెట్టడం యింకో అంశం. చరిత్రలో విరసం అదే పని చేసింది. యిప్పుడు కూడ నల్లమల విప్లవోద్యమం పక్షాన మన సాహిత్య సాంస్కృతిక కృషిని ముమ్మరం చేయవలసి ఉంది అన్నారు.

ప్రజా కళాకారుల పాటలతో, సాహిత్య పాఠశాల ఉత్తేజపూరితంగా ముగిసింది. నిర్బంధపు నిశ్శబ్దంలో కూడా సాహిత్య సాంస్కృతిక రంగాల కృషి పోరాటపటిమను తీర్చిదిద్దగలదని నిరూపిస్తూ విరసం సాహిత్య పాఠశాల విజయవంతమైంది. *

ముస్లింలు అత్యధికంగా జైళ్లలోనే మగ్గుతున్నారు. అఫ్జల్ గురుకు ఉరిశిక్ష విధించారు. ఒక పక్క అరుంధతీరాయ్‌లాంటివారు పార్లమెంట్‌పై దాడినే అనుమానిస్తున్నారు. ఇక మన రాష్ట్రంలో ముస్లింల స్థితిగతులు దేశ పరిస్థితికి భిన్నంగా ఏమీలేవు.

దేశాలు స్వాతంత్ర్యంకోసం, జాతులు విముక్తికోసం, ప్రజలు విప్లవ పరిష్కారాల కోసం పోరాడుతున్న కాలమిది. ఈ సందర్భంలో మనమంతా (పీడిత వర్గాలన్నీ) గొప్ప ఐక్యతతో పోరాడాల్సి ఉంది.

సద్దాంవల్ల చరిత్రలో జరిగిన పొరపాట్లకు ఆ దేశ ప్రజలు తీర్పునివ్వాలి. కచ్చితంగా నరహంతక అమెరికా మాత్రం కాదు. విప్లవ రచయితల సంఘం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే అన్ని ఉద్యమాలకు తన మద్దతునిస్తుంది. సాహిత్య, సాంస్కృతిక కళారంగాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తన కృషిని కొనసాగిస్తుంది. సద్దాం ఉరితీతను ఖండిస్తూ ఇరాకీ ప్రజలకు తన సంఘీభావాన్ని ప్రకటిస్తోంది.

ఖైర్లాంజి ఘటనను ఖండించండి

మహారాష్ట్రలోని నాగపూర్ సమీపంలోని భండార జిల్లాలో ఖైర్లాంజి గ్రామంలో 29 సెప్టెంబర్, 2006న హిందూ మతోన్మాదులు భయ్యాలాల్ బోత్మాంగే కుటుంబంపై చేసిన దుర్మార్గ, బీభత్స, వికృత దాడిని 'విరసం' తీవ్రంగా ఖండిస్తోంది. ఈ దాడి వెనక భూమి సమస్య ఉంది. దళితుల ఆత్మగౌరవ పోరాట చైతన్యం ఉంది. హిందూ మతాన్ని తిరస్కరించి బౌద్ధాన్ని స్వీకరించడంలో ఉంది. చదువుకుని తలెత్తుకు బతకడంలో ఉంది. ఈ దాడి చేసినవారు మరాఠ కుంబీలు. బహుజన కులాలకు చెందినవారు కావడం గమనించాల్సిన అంశం. అగ్రకుల హిందూ, బ్రాహ్మణీయ భావజాల ప్రభావం వివిధ సమూహాలపై ఎంతగా ఉందో ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది. హిందు మతోన్మాదులు, పాలక వర్గాలు ఒక పీడిత సమూహాన్నిపై, మరోసమూహాన్ని ప్రయోగించిన కుట్రలో భాగమే ఖైర్లాంజి ఘటన.

ఈ దేశంలో దేవుడు కూడా దళితుడైతే ఏమవుతుందో మన రాష్ట్రంలో ముక్కలయిన ప్యాపిలి (దళిత) వినాయకుడు చెబుతాడు.

అదే మహారాష్ట్రలో దళిత ఆత్మగౌరవ పోరాటాలెన్నో జరిగాయి. దళిత్ పాంథర్స్ ఉద్యమంతో మొదలై ఎన్నో అస్తిత్వ ఉద్యమాలు, మహారాష్ట్రలోను దేశవ్యాప్తంగా జరిగాయి. జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యాకాండ, అంటరానితనం, వివక్షలు 'అభివృద్ధి' చెందిన సమాజంలోనే జరుగుతున్నాయి. వీటన్నిటివెనక భూమి, భుక్తి, విముక్తికై ఆత్మగౌరవంకోసం పోరాడుతున్న చైతన్యం ఉంది. దళితులపై జరిగిన ఘటనలపై కేసుల్లేవు. కేసులున్నా శిక్షల్లేవు. దోషులకు శిక్షపడిన సందర్భాలు చాలా అరుదు. అందునా ఒకటీ, అర విప్లవోద్యమం ద్వారానే జరిగాయి.

ఖైర్లాంజీ ఘటనను తీవ్రంగా ఖండిస్తూనే, హిందు మతోన్మాదానికి, అగ్రకుల బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడదాం.

ప్రత్యేక ఆర్థిక మండళ్ళ (సెజ్‌ల) ఏర్పాటును వ్యతిరేకిద్దాం

దేశవ్యాప్తంగా 432 ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు (సెజ్) సుమారు ఎనిమిది లక్షల ఎకరాల భూమిని స్వదేశీ, బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేసే ప్రత్యేక ఆర్థిక మండళ్ళ ఏర్పాటు చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని 'విరసం' తీర్మానిస్తోంది. 2005 మేలో రూపొందించిన ఈ చట్టంలోని మార్గదర్శకాలు భారత రాజ్యాంగ సర్వసత్తాక అధికారానికే గాక భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలకు కూడా వ్యతిరేకమే. ఈ చట్టం అమల్లోకి వస్తే భూమిపై ఆధారపడ్డ సుమారు 20 లక్షల రైతు కుటుంబాల ప్రజలు, రైతు కూలీలు ఉపాధి కోల్పోవుటే గాక, వ్యవసాయ దిగుబడులు తగ్గిపోయి ఆహార భద్రతకు పెను ప్రమాదమేర్పడుతుంది.

భూ గరిష్ఠ పరిమితి చట్టం, కనీస వేతనాల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, వివిధ అటవీ, పర్యావరణ చట్టాలు, బాలకార్మిక విధాన నిషేధ చట్టం, ఆస్తి, ఆదాయ పన్నుల చట్టాలు - మున్నగు 21 చట్టాలు ఈ సెజ్‌లకు ఏమీ వర్తించకుండా పోతాయి. ఈ సెజ్‌లల్లో పనిచేసే కార్మికులకు కనీసం వేతనం పెంచమనే హక్కు, సమ్మెచేసే హక్కు కూడా ఉండదు. సెజ్‌లోపల సర్వాధికారులు సెజ్ డెవలప్‌మెంట్ అథారిటి (SEZDA)కి ప్రాతినిథ్యం వహించే ఆ సంస్థ అధిపతి, ప్రభుత్వం నియమించే డెవలప్‌మెంట్ కమీషనర్ కల్గియుంటారు. సెజ్ సామ్రాజ్యంలో జనన మరణ నమోదు, పారిశుధ్య, విద్య, వైద్యం మొదలుకొని సమస్త కార్యక్రమాలు వీరే నిర్వహిస్తారు. స్థానిక సంస్థల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సెజ్‌లలోని ఏ కార్యక్రమంలోనూ ప్రమేయం ఉండదు. అక్కడి ఉత్పత్తులను తనిఖీ చేయటానికి, పన్నులు విధించటానికి కూడా ప్రభుత్వాలకు అధికారం ఉండదు. అక్కడ శాంతి భద్రతల నిర్వహణకు సొంత సైన్యాన్ని కూడా సెజ్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు. న్యాయ వ్యవహారాల కొరకు అక్కడ 'ఫాస్ట్‌ట్రాక్' న్యాయస్థానము వారు ఏర్పాటు చేసుకోవచ్చు. పదేళ్ళపాటు సెజ్ అధిపతులు ఏరకమైన ఆదాయపు పన్ను, ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ రకంగా 1, 75,000 కోట్ల రూపాయల పన్ను రాయితీలను ఇవ్వడానికి భారత ప్రభుత్వం సిద్ధపడింది.

సెజ్‌లకు కేటాయించే భూమిలో 25% కోర్ ఏరియాలో పరిశ్రమ ఏర్పాటు, మిగతా 75% నివాస గృహాలు, ఇతర పరిపాలనా వ్యవహారాల కొరకు ఉపయోగించుకోవాలనే నిబంధన బుట్టదాఖలై మొత్తం భూమి రియల్ ఎస్టేట్ అధిపతుల చేతుల్లోకి వెళ్లే విధంగా, లక్షలాది ఎకరాల భూమిని స్వాధీన పర్చుకొనే ఒక 'నూతన భూస్వామ్యం' ఈ సెజ్‌ల రూపంలో మళ్ళీ వేళ్లూనుకుంటున్నది. ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక, చట్ట వ్యతిరేక, మొత్తంగా ప్రజావ్యతిరేక చట్టాన్ని ఉపసంహరించుకోవాలని విరసం డిమాండ్ చేస్తోంది. ఈ ప్రత్యేక ఆర్థిక (దోపిడి) మండళ్ళకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిస్తూ 'విరసం' తీర్మానిస్తోంది.

రెండో ఎస్సార్సీ కాంగ్రెస్ నాటకం

తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి రెండో ఎస్సార్సీ వేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. అంటే తెలంగాణకు మరోసారి మోసం చేయటానికి కాంగ్రెస్ నాయకత్వం కంకణం కట్టుకుంది. చెన్నారెడ్డిలాంటి మోసపూరిత చరిత్రను కాంగ్రెస్ రాయాలనుకుంటుంది. అంతిమంగా తెలంగాణకు మోసం చేసే నాటకానికి కాంగ్రెస్ తెరలేపింది.

1953లో ప్రకటించిన మొదటి ఎస్సార్సీ ఫజల్ అలీ నాయకత్వంలో హైద్రాబాద్ రాష్ట్రాన్ని పర్యటించింది. ఆ సందర్భంలో ఈ ప్రాంతంలోని ప్రజల అభిప్రాయాలను సేకరించి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని నివేదికను తయారు చేశాడు. కాని కోస్తాంధ్ర పెట్టుబడిదారుల డబ్బుకు ఆశపడి బలవంతంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ యాభై యేండ్లుగా తెలంగాణను అనేక రకాలుగా దోపిడి చేశారు. ఈ క్రమంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ముందుకు వచ్చింది. ఈ డిమాండ్‌ను ఓట్లుగా మార్చుకున్న కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండో ఎస్సార్సీ పల్లవిని ఎత్తుకుంది.

కాబట్టి మొదటి ఎస్సార్సీ చెప్పినట్లుగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని విరసం డిమాండ్ చేస్తుంది. రెండో ఎస్సార్సీ నాటకానికి కాంగ్రెస్ నాయకత్వం తెరదించాలని కోరుతుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయడమే దీర్ఘకాలికంగా ఉన్న తెలంగాణ ప్రజల సమస్యలకు పరిష్కారమార్గమని విరసం విశ్వసిస్తుంది. దీనికోసం జరిగే పోరాటాలలో విరసం తన పాత్రను నిర్వహిస్తుంది.

ఐదేళ్ళు శిక్షాకాలం పూర్తి చేసిన జీవిత ఖైదీలను విడుదల చేయాలి

రెండున్నర సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ యావజ్జీవ శిక్షను అనుభవిస్తున్న ఖైదీలను పదేళ్లు, అంతకన్నా తక్కువ శిక్షపడి జైల్లో 'సత్ప్రవర్తన'తో కొన్నేళ్ళుగా ఉన్న ఖైదీలను ఈ జనవరి 26 సందర్భంగా విడుదల చేయాలని ఆలోచిస్తున్నది.

అయితే ఈ విషయంలో అంతర్జాతీయంగా బలపడుతున్న ప్రజాస్వామిక దృక్పథం వెలుగులో కాకుండా తమ తమ రాజకీయ ప్రయోజనాలు, ముఖ్యంగా ఇక్కడి ఫ్యాక్షన్ రాజకీయాలదే నిర్ణయాత్మక ధోరణి అవుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో జైళ్లు తమను తాము సంస్కరణ నిలయాలుగా నిర్వచించుకున్నవి. డెబ్బై ఏళ్ల కమ్యూనిస్టు ఉద్యమం, అదే కాలం నుంచి కొనసాగుతున్న ప్రజాతంత్ర ఉద్యమం జైళ్ల విషయంలో కూడ కొన్ని ప్రజాస్వామిక సంస్కరణలను చేపట్టగలిగినవి. ఆ ఉద్యమాల ఫలితంగా, అంతర్జాతీయంగానూ, దేశంలోనూ మానవహక్కుల గురించి నేరము శిక్ష గురించి పరిణతమవుతున్న అవగాహన వలన నేరాన్ని శిక్షించే క్రమంలో మనిషిని ధ్వంసం చేయడం న్యాయం కాదన్న భావన బలపడింది. ఒక సంప్రదాయంగా ఐదేళ్లు శిక్ష పూర్తిచేసి 'సత్ప్రవర్తన' కలిగిన యావజ్జీవ ఖైదీలను, పరిమితకాలానికి శిక్షపడి 'సత్ప్రవర్తన' కలిగిన ఖైదీలను ఆగస్టు 15, జనవరి 26, నవంబర్ 1 వంటి సందర్భాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేస్తున్నది. ఈ సంప్రదాయానికి మొదటి అంతరాయం జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో వచ్చింది. జైళ్లలో, కోర్టులలో ఖైదీలు ఒక ఇరవయ్యేళ్లపాటు పోరాడి, 95 జైలు పోరాటం ద్వారా మళ్లీ ఆ సంప్రదాయాన్ని సాధించగలిగారు. చంద్రబాబు ప్రభుత్వకాలంలో కొంత, వైఎస్ఆర్ ప్రభుత్వకాలంలో మరింత ఈ సంప్రదాయానికి వాళ్ల వాళ్ల రాజకీయ ప్రయోజనాలు, సంకుచితత్వం కారణంగా నష్టం జరిగింది. జరుగుతున్నది. ఆ వివరాలకిది సందర్భం కాదుగానీ నేర ప్రవృత్తి తగ్గి మానుష ప్రవృత్తి వికసించే దిశగా, కుల, మత ఫ్యాక్షన్ రాజకీయాలకు అతీతంగా యావజ్జీవ ఖైదీలను, నిర్దిష్టకాలం శిక్షను అనుభవించిన ఖైదీలను విడుదల చేయాలని ఉద్యమించవలసిందిగా ప్రజాస్వామ్యవాదులకు విరసం విజ్ఞప్తి చేస్తున్నది.

కా॥ మల్లెల నారాయణకు నివాళి

విరసం సీనియర్ సభ్యుడు కా॥ మల్లెల నారాయణ 2006 సెప్టెంబర్ 21న అనారోగ్య కారణాలతో మరణించారు. కడపజిల్లాలో విప్లవ భావజాలాన్ని బలంగా వినిపించిన మల్లెల నారాయణ మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యుల శిష్యుడు. సాహిత్యంలో ఈయన ఎన్నుకున్న రంగం చాలా అరుదైనది. రాయలసీమ జానపద సాహిత్యం పైన, కడపజిల్లా శాసనాల పైన లోతుగా అధ్యయం చేశారు. కడప జిల్లాలోని జైన దేవాలయాలు, వీరశైవ మతస్తుల విగ్రహాల గురించి పురావస్తు పరిశోధనలో భాగంగా లోతైన అధ్యయనం చేశారు. రేనేటి పల్లెల జానపదాలు ఎన్నింటినో సేకరించారు. జానపదుల సంస్కృతిలో భాగమైన మౌఖిక సాహిత్యాన్ని రికార్డు చేశారు. 'తెలుగు సంక్రాంతి' అను పత్రికను నడిపారు. వేమన సాహిత్యం పైన ఎన్నో వ్యాసాలు రాశారు.

1972లో కడపజిల్లా రచయితల సంఘం ఏర్పాటులో, ప్రొద్దుటూరులో యుగసాహితి సంస్థలో ఈయన కృషి ఉంది. 1977 ఎమర్జెన్సీ ఆఖరి రోజుల్లో మల్లెల నారాయణగారు జమ్మలమడుగు తుపాకుల కేసులో అక్రమ నిర్బంధానికి గురై చిత్రహింసలు అనుభవించారు. 80ల్లో జరిగిన రాయలసీమ ఉద్యమంలో పాల్గొన్నారు. కడప జిల్లాలో ఆర్‌వైఎల్, ఎసిఆర్ఎస్‌వై సంస్థ స్థాపనలో ఆయన ప్రేరణ ఎంతగానో ఉండేది. ప్రొద్దుటూరులో యువ రచయితలను ప్రోత్సహించి విరసం కడప యూనిట్‌ను అభివృద్ధి చేశారు. ప్రొద్దుటూరులో మిత్రజ్యోతి సాహితీసాంస్కృతిక సంస్థను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర గణనీయం కా.మల్లెల నారాయణ తన తుదిశ్వాస వరకు విరసం ఆశయాల పట్ల గొప్ప నిబద్ధతను విశ్వాసాన్ని ప్రకటించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రకటిస్తూ, కా.మల్లెల నారాయణకు విరసం విప్లవ జోహార్లు అర్పిస్తున్నది.

అఫ్జల్ గురు మరణశిక్షను రద్దుచేయాలి

పార్లమెంటు భవనం మీద జరిగిన దాడితో సంబంధం ఉందనే ఆరోపణపై కాశ్మీరీ యువకుడు మహమ్మద్ అఫ్జల్ గురుకు కింది కోర్టు విధించిన మరణశిక్షను పైకోర్టులన్నీ, సుప్రీం కోర్టుతో సహా, నిర్ధారించాయి. అఫ్జల్ గురు పెట్టుకున్న క్షమాభిక్ష దరఖాస్తు రాష్ట్రపతి దగ్గర ఇంకా అపరిష్కృతంగా ఉంది. ఈ సమయంలో ఆయనను వెంటనే ఉరి తీయాలని సంఘ పరివార్ శక్తులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం, ఆందోళన సాగిస్తున్నాయి. నిజానికి అఫ్జల్ గురుకు ఆ నేరంతో సంబంధం ఉందని ఖచ్చితంగా నిరూపించే సాక్ష్యాధారాలు ఏవీలేవు. అన్ని న్యాయస్థానాలూ ఆయన ఏ టెర్రరిస్టు సంస్థతోనూ సంబంధం ఉన్నవాడు కాదని ప్రకటించాయి. కేవలం సందర్భ సాక్ష్యం మీద, అనుమాన ప్రమాణం మీద మాత్రమే ఆయనకు మరణశిక్ష విధించాయి. 'దేశప్రజల మనోభీష్టాన్ని' సంతృప్తి పరచడం కొరకే ఆ శిక్ష విధించాలని కూడ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు అన్నారంటే, ఈ కేసులో చట్టబద్ధత, సాక్ష్యాధారాలు న్యాయవిచారణ లాంటి విలువలన్నిటినీ పక్కన పెట్టి ముస్లిం వ్యతిరేకత, భావోద్వేగాలు మాత్రమే పరిగణించబడుతున్నాయన్న మాట. అంటే ఇది అఫ్జల్ గురు ప్రాణాల సమస్య మాత్రమే కాదు. ఈ దేశ ప్రజాస్వామ్యానికి, చట్టబద్ధ పాలనకు ఈ మరణశిక్ష ఒక సవాలు. అందువల్ల ఈ మరణశిక్షను వెంటనే రద్దుచేయాలని, అఫ్జల్ గురు పై విచారణను తిరిగి ప్రారంభించి, సరైన విచారణ జరిపించాలని, అసలు పార్లమెంటు మీద దాడికేసులో సరైన న్యాయవిచారణ జరిపించి నిజమైన దోషులెవరో తేల్చాలని విరసం డిమాండ్ చేస్తోంది.

సచార్ కమిటి సిఫార్సులకు అనుగుణంగా ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలి

దేశ జనాభాలో 13.8 శాతంగా ఉన్న ముస్లింలు (15 కోట్లు) స్వాతంత్ర్యం అందించిన ప్రగతి ఫలాలకు దూరంగా వివక్షకు, నిర్లక్ష్యానికి గురౌతున్నారు. వారి జీవన పరిస్థితుల మెరుగుదలకు ఏ ప్రభుత్వమూ కృషిచేయలేదు. ఓటుబ్యాంకు రాజకీయాల్లో భాగంగా ఏవో కంటితుడుపు హామీలు ప్రకటించడం మినహా, చిత్తశుద్ధితో ముస్లింల ఆర్థిక పురోగతికి సమగ్ర అధ్యయనం కానీ చర్యలు కానీ తీసుకొన్న దాఖలాలు లేవు. ఇందిరాగాంధి హయాంలో గోపాల్ సింగ్ కమిటి నియామకం జరిగినప్పటికీ, ఆ నివేదికను పట్టించుకోకపోవడంతో ఈ ప్రయత్నం అసంపూర్తిగా మిగిలిపోయింది. దేశ విభజనానంతరం 60 ఏళ్లకు ప్రస్తుత ప్రధాని మన్మోహన్ సింగ్ ఏర్పాటు చేసిన జస్టిస్ సచార్ కమిటి నివేదిక ముస్లింల దుర్భర స్థితికి అద్దంపడ్తూ ఎన్నో కఠిన వాస్తవాలను వెల్లడించింది.

సచార్ కమిటి నివేదిక ప్రకటించినట్లు ముస్లింల జీవన ప్రమాణాలు ఎస్సీ, ఎస్టీల కంటే కాస్త మెరుగ్గాను, బీ.సీల కంటే దుర్భరంగానూ ఉన్నాయి. ముస్లిం జనాభాకు తగ్గట్టు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం లేదు. విద్య విషయంలో ఎస్సీల కన్నా; ఉపాధి, దారిద్ర్యం, భూకమతాల విషయంలో బీ.సీల కన్నా వెనుకబడి ఉన్నారు.

ఈ కఠిన వాస్తవాలను పరిగణిస్తూ సచార్ కమిటి నివేదిక సిఫార్సులకు ప్రభుత్వం ఆచరణ రూపమిస్తూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందిగా విరసం డిమాండ్ చేస్తోంది. ఈ దిశగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకరావాల్సిందిగా ప్రజాస్వామికవాదులకు విరసం పిలుపునిస్తోంది. *

సాహిత్య పాఠశాలలో విడుదలైన కొత్త పుస్తకాలు

'చెలికాని కవిత్వం'



చెలికాడు
పిన్నిక శ్రీనివాస్ కవిత్వం
ఆవిష్కరణ : కాశీం
వెల : 20/-

తెలుగు కవిత్వ ప్రపంచానికి పిన్నిక శ్రీనివాస్ ఎవరో తెలియకపోవచ్చు. శ్రీనివాస్‌కు కూడా తెలుగు కవిత్వంలోని లోతుపాతులు, వాదోపవాదాలు, పరస్పర ప్రభావాల పరిణామాలు తెలియవనే చెప్పవచ్చు.

చీమకుర్తి ఎమ్మార్వో ఆఫీసు, ఒంగోల్లో కలెక్టరేట్, పోలీస్ స్టేషన్లు, అంబేద్కర్ భవన్, చర్చి సెంటర్‌ల ముందు దళిత బహుజనుల, పేద ప్రజల ఆందోళనల్లో, నినాదాల్లో, అరుపుల్లో, ఉపన్యాసాల్లో మాత్రమే కనిపించే శీనుకు అట్లాంటి ఉద్యమ సంరంభాలు, గొడవలు తప్ప యింకేమీ తెలియదు. అలాంటివాడు కవిత్వం రాస్తే ఎలా ఉంటుంది.

అతని కవిత్వం అత్యద్భుతం అని ఊదరగొట్టాల్సిన పనిలేదు.

అతని సమయ సందర్భాలు అతణ్ణి కవిత్వం కూడా రాయించాయి. అంతవరకే. అయితే శీను సమయసందర్భాలు చాలా ప్రత్యేకమైనవి, విచిత్రమైనవి, విషాదకరమైనవి. మొట్టమొదట చెప్పాల్సిన విషయం ఏమంటే ఈ చిన్న సంపుటిలోని పదహారు కవితల్లో సగందాకా ఆయా ప్రజా ఆందోళనల్లో విరసం తరపున శీను ప్రచురించిన కరపత్ర కవిత్వం. ఒంగోలులో శీను ఎదురయ్యాడంటే ఓ కవిత్వ కరపత్రం తీసిస్తాడని, యిద్దరో ముగ్గురో ఉండి ఉత్సాహపరిస్తే ఏకబిగిన ఎలుగెత్తె ఆ కవిత్వం చదివేస్తాడని మిత్రులు అనుకుంటారు.

ఉప్పు రైతుల, దళితుల ఆత్మగౌరవ ఆందోళనల్లో చీమకుర్తి ప్రాంత గ్రైనైట్ కార్మికుల, చేనేత కార్మికుల, యానాదుల, ముస్లిం మైనారిటీల హక్కుల పోరాటాల్లో, నల్లమల చెంచుల ఆందోళనల్లో శీను కవితలు కరపత్రాల రూపంలో సంఘీభావాన్ని ప్రకటించాయి. వారి సామాజిక రాజకీయ ఆందోళనల అంతస్సారమైన జీవన వ్యథలను కవిత్వీకరించాయి. యిదేగాక యింకా అనేక కరపత్రాలు శీను అచ్చేశాడు. కానీ పోలీసుల దాడుల్లో పోయిన కవిత్వం పోగా మిగిలినవి, అచ్చులో దొరికినవి మాత్రమే ఈ పదహారు.

ప్రకాశం జిల్లాలో అప్పటి ఎస్పీ మీద విప్లవకారుల దాడి తర్వాత నుండి శీను జెయిల్లోనో, ప్రవాసంలోనో జీవిస్తున్నాడు. విరసంలో కళ్యాణరావు, వరవరరావుల తర్వాత అన్నిరకాల తప్పుడు కేసులను ఎదుర్కొన్నదీ, వాళ్లిద్దరికన్నా ఇటీవలి చరిత్రలో ఎక్కువ జెయిలు జీవితం గడిపిందీ శ్రీనివాసే. ఆనాటి టాడా కేసు దగ్గరి నుండి అనేక కేసుల్లో ముద్దాయిగా రాటుదేలుతూ, అక్రమ నిర్బంధంలో చిత్రహింసలను అనుభవిస్తూ మళ్ళీ బైటికి రాగానే పోరాటాల్లో పాల్గొంటూ తన కవిత్వ సంఘీభావాన్ని పేదల పక్షాన నిలబెడుతున్న కవి. చాలా విచిత్రంగా ఆరునెల్లకు పైగా కోస్తాలోని నెల్లూరు జెయిల్లో బందీగా ఉంటూ తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను, పోరాట వారసత్వాన్ని దీర్ఘ కవితగా రాసి ప్రవాసంలో కరపత్రంగా అచ్చేశాడు.

యిదంతా కవి గురించి, కవిత్వ నేపథ్యం గురించే గదా అని పెదవి విరవాల్సినపని లేదు. కవిత్వం లోపలికే వెళ్ళితే శీను అట్టడుగు కులాల జీవితాలను వస్తువులుగా ఎంపిక చేసుకున్నాడు. ఎరుకలు, యానాదులు, చెంచులు, గ్రానైట్ కార్మికులు, చేనేత కార్మికులు, సమస్త వృత్తుల ముస్లిం మైనారిటీలు, ఉప్పు రైతులు మొదలైన సామాజిక జీవితాలు శీనులాంటి వారికే అనుభవంలోకి వస్తాయని చెప్పవచ్చు. విప్లవ కవి, కార్యకర్త కాబట్టి విప్లవోద్యమం, అమరత్వం, నిర్బంధం, గెలుపుమీది ఆశ తప్పక కవిత్వ వస్తువులు అయ్యేవే.

కేవలం కవిత్వ వ్యక్తీకరణకే పరిమితమైతే ఈ కింది ఉదాహరణలు చూడవచ్చు.

చినగంజాంలో యిద్దరు ఉప్పురైతులను కాల్చేసినప్పుడు రాసిన కవితో తీరంబతుకు / తూటలు తిన్న / ఇసుకతెన్నె; రెండు కెరటాలు / పోగొట్టుకున్న / కడుపుకోతల సముద్రం అంటాడు. అంటరానితనం గురించి చెప్తూ దళిత అనుభవాన్ని / సూరెక్కిన సత్తుగ్లాసు/తెల్లారేసరికి సద్ది టీతో/ఈ మాలోడి నోటికి తాకింది/దప్పికతో పిడచకట్టిన/ఈ మాదిగోనికి/యింటిబయటనే చెంబెత్తిపోసిన నీళ్ళు/దోసిళ్ళలోపడి / నోటిలోకి చిందిపడ్డాయి అన్నాడు.

యిందులో 'ఆగమాగం' అనే కవిత నల్లమల కవిత. గొప్ప నైసర్గిక శక్తి లేకపోతే నల్లమలను అంత అందంగా, అక్కడి చెంచుల గురించి అంత విషాదాత్మకంగా రాయడం సాధ్యంకాదు.

ఈ చిన్న సంపుటిని తను జెయిల్లోనో, ప్రవాసంలోనో నిస్సహాయంగా ఉండిపోయిన ఈ రెండేళ్ళ కాలంలో అమరులైన వాళ్లందరికీ అంకితమిచ్చి, మనుషులు ఎక్కడ ఎలా, ఏ స్థితిలో ఉన్నా, ఎందరు రాలిపోయినా పూసినవే కాదు/రాలిపోయినవీ అద్భుతమైనవనే విశ్వాసాన్ని ప్రకటించాడు. యింతకూ ఈ చెలికాడు ఎవరంటే - మా వాడు సూర్యుడు / నా ఎర్రని ప్రసాద్ / దిటవు గుండెల నుండి/ఏరుడై వస్తాడు. అతను పునర్జన్మించి తిరిగి రావడానికి శీనులాంటి కవికార్యకర్త కవిత్వం కూడా అవసరం. *

రాబందు నీడ



రాబందు నీడ
అమెరికా యుద్ధోన్మాదంపై వ్యాసాలు
ఎన్. వేణుగోపాల్
ఆవిష్కరణ : అరుణ్
వెల : 25/-

సద్దాం హుస్సేన్ ఉరి మీద ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన నిరసన వెల్లడైంది. సామ్రాజ్యవాదం ఎంత అమానుషమైందో, దురహంకార పూరితమైందో మరోసారి రుజువైంది. ఆంధ్రప్రదేశ్‌లో కవులు, రచయితలు, ఆలోచనాపరులంతా ముక్తకంఠంతో సద్దాం ఉరిని నిరసించారు. ఈ నేపథ్యంలో ఎన్. వేణుగోపాల్ సద్దాం ఉరి మీద ఆగ్రహంతో 'రాబందు నీడ' అమెరికా యుద్ధోన్మాద వ్యాసాల సంపుటి ప్రచురించారు.

1989 నుండి సద్దాం ఉరి తీయబడ్డ 2006 డిసెంబరు 30వ తేదీ దాక రాసిన ఎంపిక చేసిన 22 వ్యాసాలు ఉన్నాయి. మొట్టమొదటి వ్యాసం 1989లో లిబియా మీద అమెరికా సైనిక దాడిని ఖండిస్తూ 'అగ్రరాజ్యపు అహంకారమా?' అని రాసింది. లిబియా ప్రజల అద్భుత స్వేచ్ఛాకాంక్ష, అలుపెరగని పోరాటస్ఫూర్తి ఉమర్ ముక్తార్ పేరుతోపాటు ప్రతిధ్వనించేవే. అట్లాంటి లిబియాకు 'గుణపాఠం నేర్పే బాధ్యతను, టెర్రరిజానికి శిక్ష విధించే పవిత్ర కర్తవ్యాన్ని' అమెరికా తనంత తానుగా స్వీకరించి మారణహోమం సృష్టించింది. అమెరికా యుద్ధకాంక్షకు ప్రతీక అది.

మూడో వ్యాసం ' ఎవరి యుద్ధమిది? ఎవరికోసమిది?' 1991 ఆరంభంలో రాసింది. ఇరాక్ మీద జనవరి 16న అమెరికా యుద్ధానికి దిగిన నేపథ్యంలో ఈ వ్యాసం అచ్చయింది. సరిగ్గా 16 సంవత్సరాల తర్వాత అదే సద్దాం హుస్సేన్‌ను అన్యాయంగా అమెరికా ఉరితీసింది. ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం, ఇరాక్‌పై యుద్ధం జరిగిన కాలాల్లో రాసిన వ్యాసాలు, ఆనాటి అమెరికా అధ్యక్షుడు క్లింటన్, ప్రస్తుత అధ్యక్షుడు జార్జిబుష్ భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినపుడు రాసిన వ్యాసాలు చాలా విలువైనవి. నేరుగా యుద్ధంతో సంబంధం లేకపోయినా సామ్రాజ్యవాద భావజాల, సాంస్కృతిక విషయాలపై రాసినవ్యాసాలు అమెరికా యుద్ధోన్మాదాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. మొత్తంగా గత పదహారేళ్ళలో అమెరికా ప్రపంచవ్యాప్తంగా సాగించిన దురాక్రమణలు, అణచివేతలు అర్థం చేసుకోవడానికి ఈ వ్యాసాలు దోహదపడ్డాయి. సామ్రాజ్యవాదం గురించి విప్లవోద్యమ అవగాహనను చేరుకోవడానికి ఇందులోని రచనలన్నీ తప్పక చదవాల్సినవే. *

రివేరా 'ప్రవాసి'

'వెన్నెల' సగం కాలిదంటేనే / భరించలేని /నా కవి మిత్రులకి / ఇప్పుడసలు/ మనల్నిలా / అమవాస్యలకి, అర్థాయుస్సులకి వదిలేసి / 'వెన్నెల' మసకేసి పోయిందని / ఎలా చెప్పడం?

విషాద సంధిగ్ధతలా కనిపించే ఈ ప్రశ్నకు తనకెన్నటికైనా వెన్నెలే సమాధానం అవుతుందనే గొప్ప విశ్వాసం కూడా ఉన్నది. కవి రివేరా 'సగం కాలిన వెన్నెల' కోసం పరితపించీ, పరితపించీ - మనల్ని అమావాస్యలకీ, అర్థాయుష్షులకీ వదిలేసిన ప్రవాస కాలంలో ఈ కవితాగానాన్ని వినిపిస్తున్నాడు.

సుమారు నాలుగు దశాబ్దాల విప్లవ కవిత్వం అధిగమించి, అనుభవించిన అన్ని అణిచివేత దశల్లో వ్యక్తిగా, కార్యకర్తగా పోటాతో సహా పలు నిర్బంధాలను చవిచూచిన రివేరా రెండో కవితా సంపుటి యిది. 2000 సంవత్సరంలో 'సగం కాలిన వెన్నెల' అనే పదబంధ, ఎందరి బాధకు, దుఃఖానికో, వీటన్నిటినీ దాచుకున్న వాస్తవికస్థితికో పర్యాయపదంగా నిలబడింది. గడచిన ఆరేళ్ళకాలంలో అది కవి నిజజీవితంలోకి కూడా ప్రవేశించింది. వర్తమాన విప్లవకవికి నిర్బంధమో, ప్రాణభయమో, ఆచరణను కత్తిరించినా ఆలోచనా స్వేచ్ఛను 'నిర్బంధం'గా అందించే జెయిలు జీవితమో, ఇవేవీ కాపోతే ఉన్న ఊరును, తెలిసిన పనులను, పరిచిత ప్రజలను వదిలి ఎక్కడో ప్రవాసంలో తలదాచుకోవడమో కవి సమయాలు. యిదంతా విప్లవ కవుల సొంత జీవితాల్లోకి మోసుకొచ్చిన సన్నివేశమే కాదు, విప్లవ కవిత్వంలోకీ వచ్చిన ఒక కొత్త సన్నివేశం.

యిక్కడ విప్లవ కవిత్వం ఎలాంటి వస్తుశిల్పాల్లోకి ప్రయాణిస్తుంది? ఏ జీవన పోరాటాన్ని పలుకుతుంది? కాలంలోని సమస్త వత్తిళ్ళూ కాలంతోపాటు నడిచే విప్లవకవిలో ఎలా ప్రతిఫలిస్తాయి? అనే అన్వేషణకు రివేరా కవిత్వం ఒక సృజనాత్మకమైన వనరు. మానవ జీవితంలో వ్యవస్థ కల్పించిన గాయాలను మాన్పించి, ఖాళీలను మానవీయతతో భర్తీచేసి, నిజమైన మానవుణ్ణి చరిత్ర రంగం మీదికి తేవడానికి, చరిత్ర నిర్మాణానికి ఇరుసుగా పనిచేసే వర్గపోరాటమే ప్రజలకు కల్పించే చారిత్రక అవకాశాన్ని గుర్తించడంలోనే విప్లవ కవిత్వ దృక్పథ బలం ఉన్నది. తెలుగుగో విప్లవ కవిత్వానికి సంబంధించినంత వరకు యిదొక విభిన్నమైన సామాజిక సందర్భం. విప్లవ సాహిత్యోద్యమం ప్రారంభమయ్యాక వచ్చిన సాహిత్య ధోరణులన్నీ చిన్న చిన్న కుదుపులకూ, సంక్షోభాలకూ, పరీక్షలకూ తల్లకిందులైపోయినా వ్యవస్థలోని మహా విషాదాన్ని, పెను విధ్వంసాన్ని నిత్యం స్వీకరిస్తూ, స్వీయానుభవంలో గుర్తిస్తూ, వాటిని రద్దుచేసే మానవాచరణపై విశ్వాసాన్ని ఫోకస్ చేస్తూ విప్లవ సాహిత్యం దృఢంగా నిలబడి ఉన్నది. ఇటీవల కాలంలో విప్లవ కవిత్వానికి ఆ శక్తిని, దృష్టిని, విశాల ఆవరణనూ కల్పిస్తున్న యువకవుల్లో రివేరా పాత్రనూ, పరిణతినీ 'ప్రవాసి' తెలియజేస్తుంది. కవిగా రివేరా తొలి సంపుటి తర్వాత చాలా దూరం ప్రయాణించాడు. నేటి విప్లవ కవిత్వంలోని వైవిధ్యానికి, తాజాతనానికి, దృక్పథ స్పష్టతతో కూడిన ప్రయోగస్వభావానికి రివేరా కవిత్వం ఉదాహరణ. సద్దాం ఉరితీత మీద రాసిన 'ఉరిపడ్డ కంఠం', గుజరాత్ మీద రాసిన 'ఉయ్యాల బాల్యం' బందీగా జెయిల్లో రాసిన 'ఆర్.పి.నెం.4395', విప్లవోద్యమ సైనికచర్యలో పొరపాటున పేదప్రజలు చనిపోయిన ఘటనపై రాసిన 'మనమే క్షమించాలి', కాశ్మీరీ జాతి ఉద్యమకారుడి హత్య జరిగినప్పుడు రాసిన 'సోధీ'... యిలా అపారమైన వస్తు వైవిధ్యమేకాదు, కొత్త కవితాదృష్టి, తనదైన కవిత్వ నిర్మాణ పద్ధతీ కలగలసిన సంపుటి యిది.



ప్రవాసి
రివేరా కవిత్వం
ఆవిష్కరణ:నందినీసిధారెడ్డి
వెల : 30/-

కవి ఖైదీ కావచ్చు, ప్రవాసి కావచ్చు. కవి చూపు విప్లవం అయినప్పుడు జెయిళ్ళు, ప్రవాసాలు కవిత్వశక్తిని పెంచుకోమని పదేపదే గుర్తుచేస్తుంటాయి. కవిత్వం కోసం రాజ్యం చేతిలో హింసలపాలు అయిన కవికి నిరంతరం తన కవిత్వాన్ని విప్లవం పక్షాన నిలబెట్టడమే దినచర్య అవుతుంది. దీర్ఘకాలికమైన విప్లవ గమనంలోని ఎదురుదెబ్బల కాలంలో ఏర్పడ్డ ఖాళీని అచంచల విశ్వాసాన్నందించే కవిత్వంతో భర్తీ చేయడమే ఇవాళ విప్లవకవుల కర్తవ్యం. రివేరా ప్రవాసంలోనూ ఆ పని యింకా యింకా ముమ్మరం చేస్తాడనే నమ్మకాన్నిచ్చే సంపుటి యిది. *

సమాజ సాహిత్య సంబంధాల సృజనాత్మక విశ్లేషణ



తెలంగాణ విమోచనోద్యమం-తెలుగు నవల
సమాజ సాహిత్య సంబంధాలు - ఒక విశ్లేషణ
వరవరరావు
ఆవిష్కరణ : వగరి బాబయ్య
వెల : 75/-

'తెలంగాణ విమోచనోద్యమం - తెలుగు నవల' వరవరరావు రాసిన సమాజ సాహిత్యం సంబంధాల విశ్లేషణ గ్రంథం. తొలి ప్రచురణ మార్చి 1983. ఇప్పుడు 'స్వేచ్ఛాసాహితి' ప్రచురణగా రెండో కూర్పు వెలువడింది.

తెలంగాణ సాయుధ పోరాటంపై వెలువడిన ఆళ్వారుస్వామి 'ప్రజలమనిషి', 'గంగు';, మహీధర ఓనమాలు, 'మృత్యునీడల్లో', బొల్లిముంత 'మృత్యుంజయులు' అనే ఆరు నవల ఆధారంగా మార్క్సిస్టు సాహిత్యవిమర్శలో సమాజ సాహిత్య సంబంధాల సృజనాత్మక విశ్లేషణలో అందించిన గ్రంథం యిది.

ప్రజా పోరాటల స్ఫూర్తితో వెలువడిన కాల్పనిక రచనలో ఆ పోరాటం ఎన్నెన్ని కోణాల్లో చిత్రితమయ్యేదీ, ఆ పోరాటానికి భూమిక అయిన జీవితాన్ని, సమాజాన్ని నిర్ధారించే చారిత్రక సాంఘిక రాజకీయార్థిక అంశాలు రచన స్వభావాన్ని ఎట్లా నిర్ణయించేదీ అర్థం చేసుకోవడానికి ఈ విశ్లేషణ ప్రామాణిక స్థాయిలో ఉపయోగపడుతుంది. మార్క్సిస్టు విమర్శలో ముఖ్యమైన సమాజ సాహిత్య సంబంధాల దృక్పధాన్ని ఒక నిర్దిష్ట రచనకు అన్వయించే పద్ధతికి ఈ గ్రంధం ఒక గొప్ప ఉదాహరణ. ప్రజాకార్యాచరణ మానవ చైతన్యంలో, వ్యక్తిత్వంలో సామాజిక సంబంధాల్లో, స్త్రీ పురుష సంబంధాల్లో సాధించే అద్భుతమైన పరిణతిని వచన ప్రక్రియగా నవల ప్రతిబింబిస్తుంది. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం అట్లా కట్టగట్టు ప్రజల, మధ్యతరగతి ప్రజల చైతన్యాన్ని తీర్చిదిద్దిన క్రమాన్ని ఈ నవలలు చిత్రించడం ఒక ఎత్తయితే, దానికి సంబంధించిన సామాజిక ఉద్యమ నేపథ్యంలో నుండి దాన్ని వివరించడం విమర్శకుడిగా వరవరరావు ప్రతిభకు నిదర్శనం.

ముఖ్యంగా 'ప్రజల మనిషి' నవలను ఆధునిక చైతన్య ప్రాతిపదిక నవల అని 'గంగు' నవలను రాజకీయార్థిక ప్రాతిపదిక నవల అని వివి చేసిన సూత్రీకరణలు ఆ నవలల మౌలిక స్వభావాన్ని స్పష్టం చేస్తాయి. భూమి సమస్య కేంద్రంగా సాగిన తెలంగాణ రైతాంగ పోరాటం సామాజిక సంబంధాల్లోని అనేక ఆధిపత్యాలను గుర్తించి, వాటన్నింటినీ ప్రభావితం చేసింది. 'మృత్యుంజయులు' నవలలో ఎల్లారెడ్డిపాత్రను గోర్కి 'అమ్మ'లోని పావెల్‌లో, రాములమ్మ పాత్రను అమ్మపాత్రలో చూచుకోవచ్చని యిచ్చిన విశ్లేషణ అనేక పోలికలతో, తేడాలతో 'మృత్యుంజయులు'ను 'అమ్మ' స్థాయికి తీసికెళ్ళింది. ఏదేశకాలాల్లోని విప్లవంలోనైనా యిలాంటి పాత్రలు సార్వత్రికం అనిపించడం ప్రజాకార్యాచరణలోని గొప్పదనమే. అయితే 'అమ్మ'కు 'మృత్యుంజయులు'కు కల్పనా సామర్థ్యంలో, నవలా నిర్మాణంలో, సాహిత్య ప్రభావంలో చాలా తేడాలు ఉంటాయి. ఈ పుస్తకం చదివాక వచన ప్రక్రియల మీద, విమర్శ మీద ఆసక్తి, గౌరవం ఉన్నవాళ్ళకు గత నలభైఏళ్ళుగా ఆంధ్రప్రదేశ్‌లో నడుస్తున్న విప్లవోద్యమాల వెలుగులో వెలువడుతున్న సాహిత్యాన్ని కూడా ఈ పద్ధతిలో విశ్లేషించాల్సిన అవసరం ఉందిగదా అనిపిస్తుంది. అట్లా అనిపించే స్ఫూర్తినే గాక, ఎవరైనా అలాంటి కృషి చేయడానికి అవసరమైన పద్ధతిని కూడా వివి అందించారు. *

సైన్స్ వ్యాసం

కాలం - అవగాహన - 2

☆ డా.కొడవటిగంటి రోహిణి ప్రసాద్

ఈ రోజుల్లో దేనికీ టైము లేకపోవడం మామూలైపోయింది. యాంత్రిక జీవితాలూ, కన్స్యూమరిజం ధర్మమా అని మనుషులు మరబొమ్మలుగా తయారయారు. కూటికి లేనివారు పొట్టకోసమూ, కొంత ఉన్నవాళ్ళు మరింత సంపాదించటం కోసమూ పరుగులు తీస్తూ ఉంటారు. ఈ హడావిడి లేని యుగంలోనే ఆలస్యం అమృతం విషం అంటూ ఉండేవారు. మరీ దూకుడుగా ఉన్నవారిని ఉద్దేశించి నిదానమే ప్రధానం అని కూడా అన్నారు. త్వరగా, తాపీగా, వెంటనే, తక్షణమే, నెమ్మదిగా, నింపాదిగా మొదలైన మాటలన్నిటికీ సందర్భాన్ని బట్టి అర్థాలు ఏర్పడుతూ ఉంటాయి.

సామాన్యంగా మనుషులకు కాలాన్ని గురించిన అవగాహనకు వారి సగటు ఆయుర్దాయమే ఆధారం. ఆ నేపథ్యంలో సంవత్సరాల తరబడిగాని, నెలల, వారాల, గంటల తరబడిగాని ఏదైనా జరగడం మనకు స్వాభావికంగా అనిపించవచ్చు. వాటికి మనలాంటి అవగాహన ఉంటుందో లేదో తెలియదుగాని ఇది అన్ని ప్రాణులకూ వర్తించకపోవచ్చు. ఎంధుకంటే కొన్ని రకాల తాబేళ్ళవంటివి తప్ప తక్కిన జంతువులన్నీ మనుషులకన్నా తక్కువకాలం జీవిస్తాయి. తక్కిన విషయాలలాగే కాలాన్ని గురించి కూడా మన మెదడు అనుభవాన్ని బట్టి మనకు అవగాహన కలిగిస్తూ ఉంటుంది. ఉదాహరణకు ఒక సెకండు మనకు స్వల్పమైనదిగా అనిపిస్తుందిగాని ఆ వ్యవధిలో కొన్ని పురుగులు తమ రెక్కలను కొన్ని వందలసార్లు ఆడించగలవు. కొన్ని కీటకాలు ఒక్కరోజులోనే పుట్టి, పెరిగి, చచ్చిపోవడం కూడా జరుగుతుంది. మరొకవంక కొన్ని రకాల భౌగోళిక మార్పులు జరగడానికి లక్షల, కోట్ల సంవత్సరాలు పట్టవచ్చు. శారీరకంగా మనకు కొన్ని పరిమితులున్నాయి. మన కళ్ళు అతివేగంగా జరిగే మార్పులను గుర్తించలేకపోవడం వల్లనే సెకండుకు 24 ఫ్రేములు తిరిగే సినిమా బొమ్మలు సహజంగా కదులుతున్నట్టుగా అనిపిస్తాయి. కళ్ళతో చూసే దృశ్యాలకు మెదడు స్పందించడానికి కొంత వ్యవధి అవసరం కనకనే వేగంగా నడుపుతున్న కార్లనూ, రైళ్ళనూ అవసరమయినప్పుడు అకస్మాత్తుగా ఆపడానికి ఎంతో సమయస్ఫూర్తి కావాలి.

కాలాన్ని కొలవడానికి మనుషులు అనాదిగా రకరకాల సాధనాలనూ, పరికరాలనూ వాడుకుంటూ వస్తున్నారు. ఇవన్నీ అప్పటి జీవితావసరాలను బట్టి, సాంకేతిక సదుపాయాలను బట్టీ రూపొందినవి. క్రీస్తుకు మూడున్నరవేల ఏళ్ళ కిందటే ఈజిప్ట్‌లో ఒక గుంజను నిటారుగా పాతి దాని నీడ ఆధారంగా టైమెంతైందో తెలుసుకొనేవారు. ఎండ లేనప్పుడు రోమన్లలాగా గీతలు గీసిన కొవ్వొత్తినో, చైనావారిలాగా ముడులు వేసిన తాడునో కాల్చి, వాటి ద్వారా కాలగణనం చేసేవారు. ఆ తరువాత ఇసక గడియారాలూ, నీటి గడియారాలూ వచ్చాయి. యాంత్రికంగా నడిచే గడియారాల తయారీ మధ్యయుగాల్లో మొదలైంది. ఊగే పెండ్యులమ్ (లోలకం) సంగతి గెలీలియో కనిపెట్టాడు. చిన్నప్పుడు చర్చిలో జరిగే ప్రార్థనలను పట్టించుకోకుండా తన ఓరకంటితో చూరునుంచి వేలాడుతున్న దీపాలు గాలికి ఊగే పద్ధతిని గమనించసాగాడు. ఊపు చిన్నదైనా, పెద్దదైనా ఒకే సమయం పడుతుందని చేత్తో తన నాడి కొట్టుకోవడాన్ని బట్టి లెక్క కట్టాడు. ఆ తరవాత కొన్నేళ్ళకు లోలకాన్ని గడియారాల్లో వాడవచ్చని డచ్, ఇంగ్లీష్ పరిశోధకులు నిరూపించారు. ఈ లోపలే స్ప్రింగ్ సహాయంతో నడిచే జేబు గడియారాల తయారీ మొదలైంది. నిమిషాలనూ, సెకండ్లనూ సూచించే ముళ్ళు అమర్చడం పదిహేడో శతాబ్దంలో మొదటగా జరిగింది. అమెరికాలో ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో ఎలెక్ట్రిక్ గడియారాల తయారీ జరిగింది. 1960లలో వెలిగే ఎల్ఈడీ చేతి గడియారాలూ, మరో పదేళ్ళకు ఎల్‌సీడీ చేతిగడియారాలూ వచ్చాయి. సిసియం అణువుల కంపనాల ఆధారంగా నడిచే ప్రామాణికమైన అణుగడియారాలు మొదటగా 1955లో ఇంగ్లండ్‌లో తయారయాయి. ఇవి ఎంత నిర్దుష్టమైనవంటే వీటిలో 30 కోట్ల సంవత్సరాల్లో ఒక్క సెకండు తేడా రావచ్చు. అంతకంతకూ వేగం పెరుగుతున్న ఆధునిక జీవితాన్ని శాసిస్తున్నవి గడియారాలే. ఇవి లేని పరిస్థితిని ఊహించుకోవడం కూడా కష్టమే.

ప్రయాణాలు చేస్తున్నప్పుడు కాలవ్యవధిని దూరానికి కొలతగా వాడతాం. ఫలానా చోటి నుంచి ఫలానా చోటికి వెళ్ళడానికి ఎంత టైము పడుతుందనేది రవాణా సౌకర్యాన్ని బట్టి ఉంటుంది. కాలమనేదానికి నిజమైన సవాళ్ళన్నీ అంతరిక్షంలో తటస్థించే దూరాల ప్రస్తావనలో ఎదురవుతాయి. వాటికి సంబంధించినంతవరకూ దూరానికీ, కాలానికీ అర్థాన్నివ్వగలిగినవి కాంతి కిరణాలే. మనవాళ్ళు మనోవేగం వాయువేగం అంటూ ఉంటారు కాని సందేశాలు త్వరగా అందించడానికి కాంతి కిరణాలు బాగా పనికొస్తాయి. ఎందుకంటే విశ్వంలో మనకు తెలిసినంతవరకూ కాంతికన్నా వేగంగా పోగలిగినదేదీ లేదు. కాలవ్యవధిని సూచించేవి సంఘటనలే కనక అవి జరిగినట్టుగా మనకు వెంటనే తెలియాలంటే కాంతిని మించిన సాధనంలేదు. ఎటొచ్చీ కాంతి వేగానికి కూడా పరిమితులున్నాయి. అంతరిక్షంలో అది సెకండుకు 3 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. నక్షత్రాలూ మొదలైనవన్నీ ఎంతెంత దూరాల్లో ఉన్నాయంటే మనకు అన్నిటికన్నా దగ్గరున్న దాని కాంతి మనను చేరటానికి నాలుగు సంవత్సరాలకు పైగా పడుతుంది. సూర్యకిరణాలే ఎనిమిది నిమిషాల తరువాత భూమిని తాకుతాయి. ఈనాడు మనకు అంతరిక్షంలో ఒకేసారిగా రెండు నక్షత్రాలు పేలడం కనబడినంత మాత్రాన ఆ రెండు సంఘటనలూ ఒకేసారి జరిగాయనుకోవడానికి వీల్లేదు. భూమి నుంచి వాటికి గల దూరాన్ని బట్టి అవి వేరు వేరు సమయాల్లో జరిగి ఉండవచ్చు. పక్క ఊరి నుంచి నిన్న రాసిన ఉత్తరమూ, విదేశాల నుంచి పదిరోజుల కిందట బయలుదేరిన ఉత్తరమూ ఒకేసారి మన చేతికందినట్టుగా ఇలాంటి సంఘటనలు మనకు ఒకే క్షణంలో జరిగినట్టు అనిపిస్తాయి.

గంటకు యాభై కిలోమీటర్ల వేగంతో కదులుతున్న రైలు నుంచి చూస్తున్నపుడు స్టేషనే మనకేసి గంటకు యాభై కిలోమీటర్ల వేగంతో వస్తున్నట్టుగా అనిపిస్తుంది. రైలు వెళ్ళే దిశగా కదులుతున్న వాటి వేగాలను రైలులో ప్రయాణిస్తున్న వాడు కొలిచినప్పుడు అనుకోని ఫలితాలు లభిస్తాయి. రైలుతోబాటు అదే దిశలో పక్కనే ఎగురుతున్న పక్షుల వేగం రైలుకన్నా తక్కువ కనక అవన్నీ క్రమంగా వెనక్కుపోతున్నట్టు అనిపిస్తుంది. అలాగే రైలుకు ఎదురవుతున్నవన్నీ ఎంత నెమ్మదిగా కదులుతున్నప్పటికీ అతివేగంగా వెనక్కు వెళ్ళిపోయినట్టనిపిస్తుంది. ఇలా రైలు వేగాన్ని ఇతర వస్తువుల మీద ఆపాదించడం వల్ల వాటి వేగాల్లో హెచ్చుతగ్గులు ఉన్నట్టు అనిపిస్తుంది.

కదులుతున్న వాడు కాంతి వేగాన్ని కొలిచినప్పుడేమవుతుంది? కాంతితో పోలిస్తే రైలు వంటివి చాలా నెమ్మదిగా కదులుతాయి కనక రైలుబండికి బదులుగా కాంతిలో సగం వేగంతో కదిలే మరొక రాకెట్ వంటిది ఉందనుకుందాం. అప్పుడు కాంతివేగం ఒకటిన్నర రెట్లవుతుందా? అలా జరగదనీ, ఎట్టిపరిస్థితుల్లోనూ కాంతివేగం మారబోదనీ ఐన్‌స్టయిన్ అన్నాడు. ఇదెలా సాధ్యం? రాకెట్‌లో ఉన్నవాడికి కాంతివేగంలో మార్పేమీ కనబడదు. బైటినుంచి రాకెట్‌ను గమనిస్తున్న వారికి మాత్రం రాకెట్‌మీద ఉన్న గడియారాలు తమవాటికన్నా నింపాదిగా నడుస్తున్నట్టు అనిపిస్తుంది. రాకెట్ వేగం పెరిగినకొద్దీ బైటివారికి దాని కాలవ్యవధి పెరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. ఈ సూత్రం కదులుతున్న వాటన్నిటికీ వర్తిస్తుందిగాని నెమ్మదిగా కదులుతున్న వాటి విషయంలో ఈ తేడాలు కొలవలేనంత స్వల్పంగా ఉంటాయి కనుక ఎవరూ గమనించరు. తమాషా ఏమిటంటే రాకెట్ మీద ఉన్నవాడు బైటివాడి గడియారం గురించి సరిగ్గా ఇలాగే అనుకుంటాడు. ఎందుకంటే ఐన్‌స్టయిన్ ప్రతిపాదించిన స్పెషల్ థియరీ ఆఫ్ రిలెటివిటీ, లేక ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం లెక్కన సమానవేగంతో కదులుతున్న వ్యవస్థలన్నీ ఒకటే. రాకెట్ మీద ఉన్నవాడు తానే నిశ్చలంగా ఉన్నాననీ, బైట ఉన్నవాడే "వెనక్కు" కదులుతున్నాడనీ అనుకుంటే

అతన్ని తప్పుపట్టనవసరం లేదు. ఇక్కడ గమనించవలసిన దేమిటంటే కాలగమనం కూడా సాపేక్షమైనదే.

కాలం గురించి శాస్త్రీయ పద్ధతిలో గెలీలియో, న్యూటన్ తదితరులు మొదలుపెట్టిన పరిశోధనలను ఐన్‌స్టయిన్ ఆధునిక దిశగా మళ్ళించాడు. స్థలానికీ, కాలానికీ ఉన్న సంబంధాన్ని ఆయన కాంతితో ముడిపెట్టాడు. స్పెషల్ థియరీ ఆఫ్ రిలెటివిటీ, లేక ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ ఈ విశ్వంలో నిశ్చలమైనది ఏదీలేదనీ, అన్నీ కదులుతున్నవేననీ సూచించాడు. ఎదురెదురు దిశలలో వెళుతూ, పక్కపక్కనే ఆగిన రైలుబళ్ళలో ఏ ఒకటి ముందుకు కదిలినా పక్క రైల్లో ఉన్నవారికి కదులుతున్నది ఏ రైలో వెంటనే అర్థంకాదు. అంతరిక్షంలో తేలుతున్న రోదసీనౌకల విషయంలో ఇది మరింతగా అనుభవంలోకి వస్తుంది. ఎదురెదురుగా సెకండుకు 5 కిలోమీటర్ల వేగంతో ఒకదాన్కొటి సమీపిస్తున్న రాకెట్లలో ఉన్న ఇద్దరు వ్యోమగాముల్లో ప్రతివాడికి తాను కదలకుండా ఉన్నట్టూ, రెండోవాడు సెకండుకు 10 కిలోమీటర్ల వేగంతో తనకేసి వస్తున్నట్టూ అనిపిస్తుంది.

సమానవేగంతో కదులుతున్న వ్యవస్థలన్నీ ఒకటేననీ, వాటిలో ప్రత్యేకమైనదేదీ లేదనీ ఐన్‌స్టయిన్ అన్నాడు. అన్నిటికీ భౌతిక సూత్రాలు ఒకలాగే వర్తిస్తాయి. భూమిమీద సూర్యుడూ, చంద్రుడూ, నక్షత్రాలూ అన్నీ "ఉదయించి, అస్తమిస్తూ" ఉండడం భ్రమేనని మనకు తెలుసు. అలాగని సూర్యుడు నిశ్చలనంగా ఉన్నట్టు చెప్పలేం. సూర్యుడు తనచుట్టూ తాను తిరగడం, బ్రహ్మాండమయిన చక్రంలాగా తిరిగే పాలపుంత గేలక్సీలో ఇతర నక్షత్రాలతోబాటు సూర్యుడు కూడా తిరగడం, గేలక్సీల మధ్య మారుతూ ఉండే దూరాలూ అన్నీ మనకు తెలిసిన విషయాలే. ఈ పరిస్థితిలో ఒకటి నిశ్చలనంగా ఉన్నట్టూ, తక్కినవి మాత్రమే కదులుతున్నట్టూ అనుకోలేం. స్టేషన్ కదలకుండా ఉందని అనుకోనవసరం లేదు. స్టేషనూ, రైలూ అన్నీ భూమితోబాటు గుండ్రంగా తిరుగుతున్నవే. రైలు స్టేషన్‌లో ఉన్నవారికి రైలు కదులుతున్నట్టు అనిపించినా, రైల్లో ఉన్నవారికి స్టేషనే తమకేసి వస్తున్నట్టు అనిపించినా ఒకటే.

పై ఉదాహరణలో రాకెట్ వేగం కాంతివేగానికి సమానం అయినపుడు రాకెట్‌లోని గడియారం పూర్తిగా స్తంభించిపోయినట్టు కనిపిస్తుంది. దీన్ని మాములు భాషలో అర్థం చేసుకోవాలంటే బైట నిలబడ్డ పరిశీలకుడు ఏదో టెలిస్కోప్ సహాయంతో రాకెట్ మీదున్న గడియారాన్ని చూస్తున్నట్టుగా ఊహించుకోవచ్చు. గడియారపు దృశ్యాన్ని అందించే కాంతి కిరణాలన్నీ రాకెట్‌తోబాటుగా కాంతి వేగంతో కదిలిపోయాయి కనక చూసేవాడికి మొదటి దృశ్యమే కనిపిస్తూ కాలం ఆగిపోయినట్టుగా అనిపిస్తుంది. ఎవరైనా కాంతిలో పదోవంతు వేగంతో భూమి నుంచి 40 సంవత్సరాలపాటు ప్రయాణించి వెనక్కొస్తే వారికి 4 సంవత్సరాలు మాత్రమే గడిచినట్టుగా అనిపిస్తుంది. భూమిమీదే ఉంటున్న వారి వయసు మాత్రం 40 సంవత్సరాలు పెరుగుతుంది. ఇది నిజమే. ఇందులో అభూతకల్పన ఏమీలేదు. తూర్పు, పడమరలుగా ఎగురుతున్న విమానాల్లో ఉంచిన అణుగడియారాలను భూమి మీదున్న వాటితో పోల్చినప్పుడు ఇది నిజమేనని రుజువైంది. అయితే సమానవేగంతో కదులుతున్న వ్యవస్థలన్నీ ఒకటే అయినప్పుడు పై ఉదాహరణలో భూమి మీదే ఉండిపోయినవారికి రాకెట్‌లో వెళ్ళొచ్చిన వ్యక్తి వయసుకూడా 40 సంవత్సరాలు పెరిగినట్టు అనిపించాలి. కానీ అలా జరగదు. ఎందుకంటే వేగంలో హెచ్చు తగ్గులూ, మార్పులూ ఉన్నప్పుడు ఈ సూత్రాలు వర్తించవు. 40 సంవత్సరాలు ప్రయాణించిన రాకెతట్ వెనక్కొచ్చిందంటే దాని వేగంలోనూ, దిశలోనూ మార్పు కలిగినట్టే. అందుచేత సైన్స్ ఫిక్షన్ కథలోలాగా రోదసీ యాత్రికుడు వెనక్కొచ్చి తన వయస్సులోనే ఉన్న తన మనమలని కలుసుకుంటాడు.

నిత్యజీవితంలో మనం రాకెట్లెక్కి రోదసీయానాలు చెయ్యక పోవచ్చుగాని భౌతిక ప్రపంచంలో ఒక భాగమైన కాలాన్ని గురించి సమగ్రంగా అర్థం చేసుకోవటానికి ఈ విషయాలు పనికొస్తాయి. మన జీవితాలతోనూ, అవగాహనతోనూ ముడిపడిన కాలాన్ని గురించిన శాస్త్రీయ ప్రతిపాదనలను స్థూలంగానైనా అందరం తెలుసుకోవడం అవసరం. అయోమయం తగ్గడానికీ, హేతువాద ధోరణి పెరగడానికీ ఈ సమాచారం కొంతవరకు ఉపయోగపడే అవకాశం ఉంది. (ఇంకా ఉంది) *

(....46వ పేజి తరువాయి)

అయితే, ఆ సంబంధాల రీతుల్ని (Dimensions) ప్రతిబింబించేది సాహిత్యం యొక్క 'శిల్పం' (Form) అవుతుంది. వస్తువు, రూపంల పొందిక సాధించడమే ఒక సాహితీ ప్రక్రియ యొక్క ప్రధాన కర్తవ్యం. పొందిక సాధించడంలోని నైపుణ్యమే ఆ రచయిత యొక్క అల్లిక సామర్థ్యాన్ని (Crafting ability) తెల్పుతుంది. జనజీవన గమనాన్ని, గమ్యాన్ని సాక్షాత్కరింపజేసి, ప్రేరణ కల్గించడమే సాహిత్యం యొక్క లక్ష్యమవుతుంది. "మూలుగు" నవలా కృషిలో రచయితలో ఆ క్రాఫ్ట్‌లోపించింది. వంటకంలో వేయవల్సిన అన్ని వస్తువులు వేసినప్పటికీ, సరైన మోతాదులో, సకాలంలో (స్థల, కాలాలు) ఆ వస్తువుల్ని వాడకపోతే అనుకున్న వంటకం తయారుకానట్లుగా, ఈ నవలకూడ పాఠకులలో ఆశించిన ఫలితాన్ని తీసుకురాలేదు.

అదే సమయంలో, నవలలోని పాత్రల మనో విశ్లేషణ భావవాద మనస్తత్వ ధోరణి అయిన ఫ్రాయిడ్ సైకో అనాలిసిస్ పద్ధతిలో సాగింది. జీవితంలోని అణచివేత, అరాచకాల యొక్క పరిష్కారం స్వప్నలోకంలో కామాగ్ని ప్రకోపంగా (అంటే స్వేచ్ఛ పర్యాయంగా) సెక్స్‌ను చిత్రించడం సాగర్‌గారి భావవాద వైఖరిని తెలుపుతుంది. సమాజంలోని ఒకవ్యక్తి యొక్క వ్యక్తిత్వానికి చెందిన వివిధ అంశాలు ఏదేని ఒక జీవిత దృక్పథం లేక తాత్విక దృక్పథం పునాదిగా సంఘటితం చేయబడి వుంటాయి. ఇలా ఒక దృక్పథం పునాదిగా సంఘటితం చేయబడిన వ్యక్తిత్వం యొక్క ఆలంబనగా స్వప్నాల తీరుతెన్నులు ఉంటాయి. అంతేగాని సాగర్‌గారు చిత్రించినట్లుగా ఉద్వేగాలకు, ప్రవృత్తులకు శాశ్వతత్వం ఆపాదించి, వాటి నేపథ్యం నుండి స్వప్న ప్రపంచాన్ని ఆవిష్కరించడం తప్పు.

ఉద్యమం ఆటు దశలో కేవలం ఉద్వేగభరిత అంశాలలో, ఉద్యమంలో మిలిటెంట్‌గా ఎదిగిపోయే దావూద్‌లాంటి కార్యకర్తల, నాయకుల వ్యక్తిత్వ అంశాలన్నీ (Personality aspects), భౌతికవాద ప్రాతిపదికన సంఘటితం కాబడవు. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీలలో కార్యకర్తల, నాయకుల ఒకానొక వ్యక్తిత్వ అంశమైన సెక్స్ జీవిత దృక్పథం ఒక పథకం ప్రకారం సంఘటితం చేయబడదు. అది ప్రాప్తకాలజ్ఞతకు వదిలివేయబడుతుంది. పార్టీ క్రమశిక్షణకు లోబడి ఉంటారు కాబట్టి, వారి వారి వ్యక్తిగత కృషిపై ఆధారపడి, పై వ్యక్తిత్వ అంశం సవ్యంగా సంఘటిత పడిన రూపంలోగాని లేక అణచి పెట్టుకోబడిన రూపంలోగాని ఆయా ఉద్యమకారుల మనసుపొరలలో దాగి ఉంటుంది. ఉద్యమం యొక్క ఆటుదశలోని దృక్పథ సంక్షోభ కాలంలో దావూద్ లాంటి ఉద్వేగ ప్రధాన స్వభావంతో ఉన్న ఉద్యమకారులలో అంతవరకు అణచిపెట్టబడిన రూపంలో వున్న అసంఘటిత ఉద్వేగాలు, ప్రవృత్తులు ఒక్కసారిగా విశృంఖలంగా విజృంభించి, స్వప్నసాదృశ్యాలుగా నిలుస్తాయి. నీడల్లా వెన్నాడుతాయి. అంతేగాని, ఇలాంటి స్వప్నసాదృశ్యాలు స్వేచ్ఛ యొక్క పర్యాయాలుగాను, ఇలాంటి సాదృశ్యాలు వ్యక్తుల సంఘటిత అంతరాత్మలతో సంబంధంలేని మనిషికి చెందిన సాధారణ, శాశ్వత స్వప్న లక్షణాలుగా, సాహ్నిక పరిష్కారాలుగా చిత్రీకరించడం రచయిత యొక్క తాత్విక అజీర్తికి తార్కాణం.

సవ్యమైన సాహితీ పునరుత్పత్తి జరుగకుండా 'ఇనుప కచ్చడం'గా మారింది నేటి తెలుగు సాహితీ విమర్శ. తెలుగు సాహిత్యంలోని దృక్పథ సంక్షోభం ఒక విధంగా విమర్శకుల దృక్పథ సంక్షోభమే. సాహిత్యానికి కావలి కుక్కలా ఉండాల్సిన సాహితీ విమర్శ (KVR) కుక్కల కాట్లాటగా మారకూడదు. ఉద్వేగ పూరిత అంతరాత్మలతో కూడిన సాహిత్యకారుల్ని భామార్గం అంటే హేతుమార్గం పట్టించడంలో సాహితీ విమర్శకులే ప్రధానంగా చొరవచూపాలి. పుస్తకాల్లో, సాహితీ సభల్లో, సన్మానసభల్లో విహరించే సాహిత్యాన్ని, తిరిగి బళ్ళల్లో, మళ్ళలో, పొగగొట్టాల్లో, కొండకోనల్లో, రణరంగాల్లో విహరింప చేయగల్గితేనే జనరంజకమవుతుంది, జనవిమోచన సాధనమవుతుంది.

కవిత్వం

ప్రశాంత్ కవిత

నాగనూటి కాల్వకడిగిన పాటలల్లే పక్షుల పాదాలు

లోయలో ఒలికింది రక్తమే కావచ్చు
కారి కారి
పచ్చని చెట్టు కింద ఏరై పారదా....
చుక్కల పర్వతం దగ్గర ఒక్కటైన బంధం
సంగిడి గుండాల వద్ద తెగిపోవచ్చు
పంజుగుల దారి పెదజాలబండే ఎందుకయ్యిందో
సోమశిల మోదుగు
ఏములపాయ వాగు దాటి
కడ్డిబోడు మైదానాలు ఎందుకు తిరిగిందో

నెమళ్ళను పెంచిన ఒంటరి శివుడి సౌందర్యం
పార్వతి లేకుండానే ఊర్లపెంట దాటింది

దారపెంట లోయలోని
నాపరాళ్ళ మెరుపులు
పలవరించి
కలవరించి
కన్నీరు పెట్టవా....

పొప్పిడి వనాల్లో
కలిసిన తీపి చూపులు
ఏరు దాటి గజ్జెల కొండైనా చేరలేకపోయాయి కదా....

* * *

శతాబ్దాల నిశబ్దాల కొండల్ని
వెలిగించిన వాళ్ళెపుడూ మరణించరు
ముద్దునూటి పెంటలో ఉరుకులాడే జింకలు
పరుగునెపుడూ ఆపవు

* * *

అర్థరాత్రి లేచిన పాప
అవ్వతో ఏమన్నదో.....

గుండూరు చేరిన బిడ్డ
పంజుగులే దాటిందనుకున్నది
రెండూళ్ళ పొలిమేరలూ
దుందుభీ ప్రేమలూ
వదిలిపోయింది కదా

సహచరుడిపుడు
పెదవాగు తిన్నెల మీద పడుకుని
ఏమనుకుంటున్నాడో....
మైసిగండి కలయిక మధురమైందే
సంగిడి గుండాల్ల తెగిన బంధం బలమైందే

* * *

పాటలు పాడే రెండు మనసులూ
వెన్నెల రాత్రిన కలవలేదెందుకనో....
ఆమె రాకను
కంచంలో అన్నంతో ఎదురుచూసిన వాడేమనుకునెనో...
పట్నందారి
పాలుట్లలో ఆగిపోయిన ఊపిరయ్యింది

ఆడి ఆడి పాడి పాడి
తిరిగి తిరిగి
ఇపుడలిసిపోయింది
సంగిడి గుండాల వద్ద సేదతీరింది.
నల్లవాగున పెనవేసుకున్న చీకటి
మల్లం పెంట దగర వదిలిందనుకున్నాం
లింగాల బాట
రాంపురం పెంటకే ఎందుకయ్యిందో
అప్పాపూర్ అడుగులు
పెదజాల బండకే ఎందుకెళ్ళాయో
మాదవాని పల్లె జాలు
లింగసా పల్లెకే ఎందుకెళ్ళాయో
వటువర్లపల్లి దారి
కుర్వకిందికెందుకెళ్ళిందో...

* * *

బీరపూవుల జోరు
బీమ్ పతిమలబారు రాయవరం దాటింది
పెద కొత్తపల్లిన నక్షత్రమైరాలింది

* * *

ఏట్లో ఈదిన పక్షులు
ఏ కానుగు చెట్టుపై కునుకు తీస్తాయో
మాటలు లేక మోదుగు
ఎందుకలిగిపోయెనో
దేవుని కొండ వాగున దుంకులాడిన చేపపిల్లలు
వలల నోట్లో ఎందుకు పడెనో

* * *

నెమళ్ళాడిన నెక్కంటి గూడాన
నెత్తురొలికింది
మందారాల మాటకచేరి
మధ్యలోనే ఆగిపోయింది
గడ్డిపూల వీడ్కోళ్ళ మధ్య
వాళ్ళు వెళ్ళిపోయారు

*

జి. వెంకటకృష్ణ కవిత

ధిక్కార సద్దాం

నిప్పులు చిమ్ముతున్న అరబ్ క్షిపణి
అతని చూపు
తీక్షణంగా అగ్రరాజ్య అహంకారాన్ని దహించింది
ప్రతిధ్వనించే తీవ్ర ధిక్కారం
అతని స్వరం
సర్వమానవాళిలో కలకలం రేపింది
ప్రతిఘటించిన ఆత్మగౌరవం
అతని రూపు
ప్రపంచ నియంతనే ఎదురించి నిలిచింది
ఒక ఆక్రమణ తర్వాత
రెండు యుద్ధాలు ఓడిన నియంతనే అతడు
పూల మాలలా వురితాటిని ధరించిన యోధుడు
ఉరిబిగిస్తున్న కర్కశ తలారి
ఎవరి చేతి కీలుబొమ్మో యెరిగిన విరాగి అతడు
ఉరితాడు చెప్పే రహస్యం
వినేందుకు ముసుగును కాదన్న ధీరుడు
వర్తమాన ప్రపంచ నయనం ముందు
ఆవిష్కరింపబడ్డ ఆశాచిత్రం అతడు

* * *

అదే ధిక్కార స్వరమే
గోటూ హెల్ అని గర్జించిన గొంతుకే
ఘనీభవించిన కక్ష
తూతూ మంత్రంగా జరిపిన న్యాయాన్ని
నిరసించిన వైనమే
కలుగులో దొరికిన సింహాన్ని
అవును ఇరాకీ అధ్యక్షుణ్ణి -
బోనులో చిక్కిన సింహాన్ని
అవును ఇరాకీ అధ్యక్షుణ్ణి -
రాబందు చేతిలో చిక్కిన సైనికుణ్ణి
అవును ఇరాకీ అధ్యక్షుణ్ణి -
నేను అవు నేనేనని
నినదించిన సాహసినే - చూసింది లోకం
అతని లోపాలన్నింటినీ
అతని చివరి ధిక్కారం ప్రక్షాలన చేసింది

* * *

తప్పులెన్నో దొర్లే వుండవచ్చు
బాతిస్ట్ పాలనలో అభివృద్ధి మాత్రం వెల్లివిరిసింది
నియంతగానే రాజ్యమేలి వుండవచ్చు
భూమిని పంచిన వాడి చేతుల మీదుగా
భూస్వాములు హతం కావలసిందే
చొరబాటు ఒక నెపమే
ఆయుధాలూ ఒక నెపమే
చమురు రాజకీయమే అసలైన దుర్మార్గం
పొరపాటుకు లేదు ప్రాయశ్చిత్తం
అంకుల్ శ్యామ్ కుతంత్రానికి
రగులుతోంది దేశం
యుద్ధం కువైట్‌తోనే మొదలైందవచ్చు
అది ఇరాకీ ఆక్రమణతోనే ముగియకపోవచ్చు
యుద్ధం బుష్షాసురులతోనే మొదలైందవచ్చు
అది అంతర్యుద్ధంగానే ముగియవచ్చు
యుద్ధం ప్రారంభించినవాడు
మధ్యలో నిష్క్రమించినా
యుద్ధచ్ఛాయలో దేశం నిలబడిపోవచ్చు
సున్నీ షియాల మధ్య అగాధంలోకి
టైగ్రిస్ యూఫ్రటిస్ నదులు
కన్నీరై కారిపోవచ్చు

* * *

బోనులో గర్జించిన సింహం
ఊచల వురితాటికి వొరిగింది
ఆయిల్ రుచి మరిగిన రాక్షసి
ఏడేడు సముద్రాల ఆవలా
తన మంత్రదండాన్ని ఝుళిపిస్తోంది
పెట్టుబడికి పట్టుబడిన కాలాన
నిర్భయమే తీవ్రరాజ్యమేలుతోంది
యుద్ధంలో విజేతలే చరిత్రకారులు
యుద్ధంలో విజేతలే న్యాయనిర్ణేతలు
ప్రజల చరితలో పరాజితులే
న్యాయాన్ని బోనెక్కించేవాళ్ళు
మృత్యువు ముందు నిర్భీతులై
విక్టర్ జారా సంగీతంలా
వియత్నామ్ ప్రతిఘటనలా
చరిత్రకు కొత్త పాఠాలనందిసాయి
వేలాడే వురి కంఠాలు

* * *

ఇద్దరు మనుషుల మధ్య
మండుతున్న చితి
ఎవరు రగిల్చిన ద్వేషానిదో కదా!
రేపటి ఇరాక్ ఆ చితి నుండే
రూపు దిద్దుకొనాల్సి వుంది
ఆ యిద్దరు మనుషులు
షియా - సున్నీలో
అరబ్ - ఇరానియన్లో
అయినా సరే రేపటి ఇరాక్
ఆ అగాధాన్ని దాటాల్సిందే
ఇక ఇరాక్ -
రక్తం రచిస్తున్న వీరగాథ
ఇక ఇరాక్ -
బాంబులై పేలుతున్న మానవదేహాలు
రగిలించే ప్రతిఘటన
ప్రపంచ నియంత గుండెలు వొణికించే ధిక్కారం
వైట్ హౌస్‌ను మట్టుబెట్టే
అరేబియా ఇసుక తుఫాన్

ఇపుడు ఇరాక్ -
మరో ప్రజాసద్దాం కోసం
పురుటి నొప్పుల పుడమి తల్లి.

*

తాయమ్మ కరుణ కవిత

అతనొక 'Dare to be wise'

అతను
ఇతర్లను వేలెత్తి చూపలేదు
నాలుగు వేళ్లూ తన వేపే చూపుకున్నాడు

అతను
ఎన్నడూ ఇతర్లలో చెడును వెతకలేదు
చెడులో కూడా మంచినే చూసాడు

అతను
ఏనాడూ ఇతర్లను తూలనాడలేదు
తనను నిందించినా నిండుకుండలా వున్నాడు

అతను
తన స్వార్థం కోసం ఏమీ చేయలేదు
విప్లవం కోసం అన్నీ చేసాడు

అతను
ఉద్యమానికి అడ్డం అనుకున్న వాటిని కత్తిలా ఖండించాడు
అవసరమనుకున్న వాటిని దేనినీ వదలలేదు

అతను
ఎన్నడూ వున్నత పదవులు ఆశించలేదు
'తలవంచి ఎద్దు'లా పని చేసాడు

అతను
పెటీబూర్జువా లక్షణాలను దరిచేరనీయలేదు
ప్రతిక్షణం నిబద్ధత నిజాయితీతో బతికాడు

అతను
దేనినీ బహిరంగంగా ప్రదర్శించలేదు. కానీ,
అన్నీ తానై చేసాడు. అతనొక అనామకుడు

అతను
నిరంతర విద్యార్థి. అధ్యయనం అతని జీవితంలో భాగం
విప్లవ పురోగమున అతను ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపాడో

అతను
విప్లవ స్తబ్దతను తొలగించడానికి
రెండు పంథాల పోరాటంలో
డిమోషన్‌కైనా, ఖైదుకైనా
కరవాలానికి తలనైనా ఇస్తానని ప్రకటించినవాడు

అతను
కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి ప్రతిరూపం
మాటలు రాని చేతల మనిషి

అతను
మంచుకన్నా చల్లనివాడు
మల్లెల కన్నా స్వచ్ఛమైనవాడు
వెన్నెలకన్నా హాయి అయినవాడు

అతను
మృదు స్వభావి, మితభాషి, నిగర్వి
అతనొక 'Dare to be wise'
అతనొక అలుపెరుగని వీర యోధుడు

అతను
ఈనాడు లేడు
ఇక రాబోడు
ఇచ్చిన స్ఫూర్తి వుంది
చెప్పిన ధైర్యమూ వుంది
పంచిన జ్ఞాపకాలు వున్నాయి
పంచుకున్న కలలూ మిగిలే వున్నాయి
అతన్ని చేరే వరకూ నేను చేయాల్సినదెంతో వుంది

(మంజీర గురించి ఇలాంటి కవిత(లు) రాయాల్సి వస్తదని ఎందుకోగానీ ఎన్నడూ తట్టలేదు. విప్లవంలో మరణం అనేది ఎప్పుడైనా తలుపు తట్టవచ్చు. కానీ అది మంజీరను తట్టుతదని నేననుకోలేదు. భరించడం చాలా కష్టంగా ఉంది. తన గురించి ఏమి రాయాలన్నా కన్నీళ్ళడ్డొస్తున్నాయి. మనసునిండా తానే వున్నాడు. ఏవైతే మంచి లక్షణాలని జనులందరూ అనుకుంటారో అవన్నీ అతనిలో వున్నవి.
అతని గురించి ఎంత రాసినా తక్కువే
మూగవాని పిల్లన గ్రోవిని
అర్థం చేసుకుంటే పాటై చుట్టుకుపోతాను
లేదంటే పగిలిపోతానన్నాడు
కానీ, ఈనాడు
నేను అందుకోలేనంత ఎత్తులో
అమరత్వపు శిఖరాల మీదున్నాడు
పగిలిపోయి నేనున్నాను)

*

జూపాక సుభద్ర కవిత

సిమ్మ సీకట్ల సీక్రెట్ కొట్టం

సెక్రెటరీల నెలవు సెక్రటేరియట్
తెలుగులో సచివుల కొలువు సచివాలయం
అధికార భాష అనువాదం గడ్డమీన్నే గల్లంతయింది
అవ్వతోడు...
వుసేన్‌సాగర్ సాక్షిగ
యిది నక్లెసు రోడ్డంత పొడవుగ
బేగంపేటంత నున్నంగ
బంజారా హిల్సంత ఎత్తుగ
మాదాపురమంత మత్తుగ
జూబ్లిహిల్సంత విశాలంగ
బిర్లా మందిర్‌ను ముందటేసుకొని
మూసికి ధీటుగా ఆర్డర్లేసి
ఆంధ్ర నలుమూలలా వురికిస్తది
నా పక్క బొక్కల్ని
నా ముందే బొందవెట్టి
ఎవల గండాల్లో ఎక్కడి పిండాల్నో
టాంక్‌బండ్ మెడల గుండ్ల పేరోలె గుది గట్టింది
సుట్ట సుట్టుకొన్న పదివేల పడగనీడలు
కౌటిల్యుని కోరలు, మనువు గొల్లు
రాజ్యం పంజాల కలెగలుపు కాక్‌టెయిల్

పొదుల్ని పక్కనేసుకొని
డైనోసార్‌లా నిలుచున్న దండకారణ్యం
మేకల నోటి కాడి నూకల్ని గుంజే
కిటాకుల కాసారం
న్యాయ సముద్రాల్ని మింగే తిమింగలం
వూల్లకు వూల్లు నమిలే అనకొండ
కబలించే వలస సూత్రాలకు
మనీ ధర్మాలకు పీటల చెరువు
డబ్బున్నోడి డుబ్బే మోగుతదిక్కడ
యిక్కడి కంప్యూటర్ పక్షులు
స్మార్ట్ గవ్వలు కేర్ గువ్వలు
పేపర్ లెస్ ఫైలు గూళ్లకు చేరి
ఎంప్లాయీస్‌కి నెట్ ముద్దులిస్తాయి
డిపార్టుమెంటుకో కుంకుమ డబ్బ
సాయిశరణంగా విచ్చుకొని
భజనల కొబ్బరికాయ పులిహోర పాయసంగా పగిలి
ఫాస్టింగుకు బ్రేకిస్తూ
కరెంటు ఫైల్స్‌తో భక్తిగీతాలు ఆడిస్తది
కేసుల్ని కంప్యూటర్ కంచెకు తోలి
కాళ్లింటికి బోతయి
యిక్కడ పేషీలు ముళ్ల పొదల తోకల్తో
కుక్క మొకాలేసుకొని నక్కవిత్తులు నాటుతయి
నవరత్నాలు పొదువుకున్న సఫారీలు
కైకర మందర ఖద్దర్లు
తెలుగు గొలుసుల తోడేల్లు, పైరవీ పసరికలు
సెల్‌ఫోను వలలు వేసి ఎస్టీమ్ బెంజ్‌లతో
తొవ్వలు తవ్వుకునేటోల్లకు
సలాములు సెంగలించి మూడు పంగలై
అర్థంగాని భాషల ఆర్డర్లుగా అలుముకుంటయి
బికారీ బక్రాల ఎంట్రీలకు లారీలు
కంకర్రాళ్లై తరుముతయి
లొట్టసెంపలు, ఊడ్సుక పోయిన మొకాలు
గోసులు, గొంగల్లు, మట్టి కొంగుల
సెవుల సుట్టల వెలుగులు తాకనంతవరకు
గీ సెక్రెటేరియట్ సీక్రెట్ల
సిమ్మ సీకట్ల కొట్టమే

*

ఎం.వి. బాసిత్ కవిత

యా షహీద్! నీకు సరాముస్ - అలై...

(విరసం కవి సభలో చదివిన కవిత)

ఆఖరి శ్వాస దాక
స్వేచ్ఛను ఆఘ్రాణిస్తు
చిట్ట చివరి క్షణందాకా
ఖండాంతరాల్ని చూస్తు
నీలి నేత్రాల నిప్పుల్ని చిమ్ముతూ
ఇరాక్ జాతి విధ్వంసకర శక్తుల్ని
ఖండ ఖండాలుగా చీల్చేస్తూ
కోటి సూర్యప్రభల తేజో విరాజితమైన
గల్ఫ్ కల్లోల తీక్షణ వీక్షణమా!.
నీకు సలామున్ - అలై
మేఘ గంభీర
ధీర దిగ్గజమై
సామ్రాజ్యవాదం ఉచ్ఛ్వాసపోసుకునేల
దిక్కులు పిక్కటిల్లె ఘీంకార నాదమైన
భీకర ధిక్కార స్వరమా !
నీకు సలామున్ - అలై
నాకోసం ఏడవకండి
గల్ఫ్ క్షేత్రంలోని భూమి పుత్రులారా!
మీ హక్కు భుక్తం కావాల్సిన గాసాన్ని
దోచుకెళ్తున్న దొంగ తోడేలును తరమండి....
మీ ధన, మాన ప్రాణాల
రక్షణ కోసం పోరాడమన్న
జీసస్ ప్రభోదమా!
నీకు సలామున్ - అలై
దళారి తలారి
ఉరికొయ్యల కెదురేగిన కొదమసింహమా!
ఉరి ఉచ్చుల సర్పాన్ని
దర్పంగా కంఠహారం చేసుకున్న
గరళ కంఠుడి చిద్విలాసమా!!
నీకు సలామున్ - అలై
బుష్‌గాడి బుస బుసలపై
కాళీయ మర్దనోద్వేగమై
వధ్యశిలపై నృత్య భంగిమైన
పర్షియన్ పరాక్రమమా!
నీకు సలామున్ - అలై
వీరత్వం ఎగజిమ్మిన అమరత్వమా!
అమరత్వం విరజిమ్మిన వీరత్వమా!!
యా షహీద్!
నీకు సలామున్ అలై...
ప్రపంచ దాదాగిరిని
నీ పాద ధూళిగా ఎగదన్నిన
ఓ పోరాట ప్రవక్తా!
నీకు సలామున్ -అలై
ఓ ప్రపంచ ప్రజల
స్వేచ్ఛా ప్రజ్వలిత ప్రతీకాత్మ!
ఓ యుద్ధ సన్నద్ధ శంఖారావమా!!
యా సద్దాం!!!
నీకు సలామున్ - అలై

*

శికారి

నవలిక

☆ పాణి

సీరియల్

(గత సంచిక తరువాయి...)

డొక్కోనికి ఏకునే మెలకువొచ్చింది.

పక్కలో రానూ, చీర మోకాల్ల మీదికిపోయి నేలకు కర్చుకొని నిదరపోతా ఉంది. లోపలెక్కడ నుండో బరువుగా కట్... కట్‌మని గురకదీస్తా ఉంది.

డొక్కోడు లేచి ఉత్తాసైన బైటికొచ్చినాడు.

కొట్టం ముందుండే కానిగెచెట్టు కిందికొచ్చి నిలబన్నాడు.

చలికి కాల్లూ చేతుల మీదుండే ఎంటికలు నిక్కబొడుచుకుండాయి. సెల్లాడం పైకి ఎగదీసుకుంటా, నోట్లో ఊరిండే ఎమ్మిలి క్యాకరించి ఊంచినాడు. రెండు చేతులతో నడినెత్తి బరబర గీక్కుండాడు. నిదరమొబ్బు యింగా దిగలా, కండ్ల మూతలు బడుతున్నెట్లుంది.

మసక చీకట్లో చీకరించుకొని చూచినాడు. తియ్యక కానిగెచెట్టుకిందనే ముదరజుట్టుకొని పండుకొనే గుల్బారు అగపల్లా. 'ముసల్నాకొడుకు యాడికి పోయినాడబ్బా! నిన్న మొబ్బులో కూడ అగపన్నే' అనుకుండాడు.

గుల్బారుకు నిన్న పైటాలప్పుడు బువ్వకాడ రానూతో కొట్లాటయింది. డొక్కోన్ని జేసుకున్నాక, వానితో యికయికలకే పొద్దుసాలకొస్తా ఉంది అని వానికి మంట. దానికి తోడు డొక్కోడు ఆన్నే కాపరం పెట్టేతాలకు పైమీద కారం పూసినట్లయింది. యింతక ముందయితే యాడ తిరిగొచ్చినా బువ్వకు దిగుల్లాకుండె. గయ్యిన అరిచినా, పోతా పోతా అన్నం సెరవ ముందుకు దోసి పొయ్యేది. ఎప్పుడన్నా సారాయిగ్గాడ దుడ్లిచ్చేది. అట్లాంటిది, ఈ నడమ ఉరువు పట్టించుకోవడంలా అని గొంతుకాడికి ఉండది.

తన కత యిట్లయితదని గుల్బారికి ఎరికే.

అందుకే డొక్కోన్ని యింటి సగాల రానీకుండె. ఆ నాకొడుకు ఊకూకెనె ఎనికీడ్తి తిరుక్కుంట ఏం చెప్పెనోగాని, దీనికి యింగ వశంగాకపాయె... ఆనితో పెట్టుకోగాకే, అంకాచారికి ఏడ్చినా మొత్తుకున్న లాబంలే.... అని బంగపోతి. అయినా యినిపిచ్చుకోకపాయె... అని గుల్బారు ఒకటేమైన ఎదారు పన్నాడు.

రానూ బువ్వపెట్టని దానికంటే, డొక్కోని చూపులే గుల్బారును పూరా కుంగదీస్తుండాయి. కానిగె చెట్టుకింద కూచోని ఉంటే, బేకనె తలకాయ ఎగరేసుకుంట లోనికి బైటికి బిసబిస తరుగుతాడు! వాని కండ్లల్లో తూస్కారానికి గుల్బారుకు సానంబొయినట్టయితాంది.

అంతకముందు రానూ కాడికి రావల్లంటే - గుల్బారు ఎప్పుడు బైటికి పోతడా? అని కనిపెట్టుకొని దొంగ చూపులు చూసుకుంట తిరిగేటోడు, యిప్పుడు ఆన్నే కాపరం పెట్టె.

'ముసల్నాకొడుకు రొంచేపు బైటికి పోడుగదా? ఆ చెట్టుకిందనే గంటంత బూంచిపెట్టుకున్నెట్టు...' అనుకొనే డొక్కోడికిప్పుడు ఎదురు ల్యాకపాయె.

చూస్తుండగానే పూర్తి తెల్లగైంది.

గేర్లో నిద్రలేచినోల్లు బైటికొచ్చి కొందరు ఆడీడ ముడుక్కోని కూచోనుంటే, యింకొందరు చలికి యిగిలిచ్చుకుంట తిరుగుతా ఉండారు.

డొక్కోడు - గుల్బారు గురించి కంటి రెప్ప కొట్టుకున్నంత సేపు ఆలోచించినాడేమో. ఆ తర్వాత మనసు గుమ్లి మీదికి పోయింది.

పిల్లోలు మతికొచ్చినారు

రానూతో తిరుక్కుంటా, చెతుర్లాడుకుంట, సినిమాలకు పోతా ఆడ్నే ఉండాడు. గేర్లో ఈవల్ల మొగదాల గుల్బారు యిల్లుంటే, ఎడంగా ఎనకతట్టు డొక్కోని యిల్లుంటది. రానూతో పెండ్లయినాల్నుంచి తియ్యక రానూతోనే ఉంటాండు.

చలికి చేతులు బిగ్గట్టుకొని, కానిగెచెట్టు కింద ఆడాడ్నే తిరుగుతా ఉండు.

'గబ్బుది, అంచుకు రానీకుండె. ల్యాకపోతే, దీన్ని యింటికే తోలకపోదు. ఏమోలే అని చూచ్చున్నెట్లుంటె మీదికి మీదికి వస్తాది. యింగో రొండు దినాలుగిన తిరిగిచూడకపోతే అదే దావకొస్తాది' అనుకుండు గుమ్లి గురిచ్చి.

రానూ లేచిందేమో, లోపల చప్పిడైంది.

తలతిప్పి కొట్టంలోకి చూస్తా ఉంటే, నాలిగిండ్లవతల్నుంచి బజారి "న్నో... ఒగపారి యిట్రాన్నా...." అని రొండు చేతులు సాచి కేకేసినాడు

బజారికి పాతికేళ్ళుంటాయి. సోగ నలుపు మీద పల్చగ, కడ్డీలెక్క ఉంటాడు. కాళ్ళకుండే రబ్బరు చెప్పులు టకటకలాడించుకుంట, మొగంబిగపట్టి సూటిగ చూసుకుంట గేర్లో వస్తాపోతా ఉంటాడుగాని ఎవర్నేగాని పల్లెత్తి పలకరిచ్చడు. గేర్లోవాల్లు కూడ పగబట్టినట్లుంటారు. బజారోన్ని ఒక మనిసి అని గూడ పట్టించుకోరు.

బజారి యాపొద్దేగాని డొక్కోనితో 'ఏందినా....' అని మాట్లాడినోడుకాదు.

ఎవర్ని కేకేస్తున్నాడబ్బా! అని డొక్కోడు అటు ఇటు చూసినాడు. బజారి మళ్ళీ పిలిచినాడు.

డొక్కోనికి అర్తంగాలెగాని, నిదర మొబ్బు వదిలిపోయింది. కాని నిలబడుకొన్న సాట్నుంచి కదల్లా.

"బెరీతరాన్నా... దీనికేందో కడుపులో నొప్పంట, సుట్టచుట్టుకొని పోతాంది. ఈల్లదనకబానే ఉండె..." చెప్పుకుంటానే రెండగల్లో వచ్చిపడ్నాడు. ఆ యింత కే వాడి గొంతు ఆర్చకపోయింది.

కొట్టంలో పిల్లోడు ఏడుపుకు దీసినాడు.

అప్పటిక్యూడ గేర్లో యింకా అంతా లెయ్యలేదు.

సన్నగ మంచు కురుస్తా బరువుగ ఉన్న ఆ టయాన బజారి అరుపులతో, పిల్లోని ఏడుపుతో అంతా కెల్లగిచ్చినట్లయింది.

"ఏందిరా! ఏమైంది?" అని డొక్కోడు అదలబాదల బజారికంటే ముందే వాళ్ళ కొట్టంకెల్లి ఉరికినాడు.

మంచంలో అనర రోకలిబండ పురుగులెక్క చుట్ట చుట్టుకొని కడుపు పిసుక్కుంటా ఏడుస్తాఉంది.

పిల్లోడు తల్లిమీద పాకుతా ఓ.... అంటా ఉంటే అనరగొంతు వాని గొంతులో కలిసిపోయి బైటికి యినిపిచ్చడంలా.

అంత చల్లపొద్దునకూడా ఆ అక్కయ్యనట్ల చూచి డొక్కోనికి చెమటలు గమ్మినై. బజారి అగదాట్లకెల్లి వచ్చి "రోడ్డు దాంక అట్ల పట్టుకొన్నా, ఆటోలో పెద్దాసుపత్రికి ఏసకపోతా" అన్నాడు.

బజారి అరుపులకు 'ఏమైందీ...., ఆమయిన అరుచ్చాండు...' అని గేర్లోవాల్లు అటుతిరిగి చూచినారు. కొంతమంది యింటికాడికి వచ్చినారు.

ఒక్కరుగూడ వాకిలి కాడికి రాలా

డొక్కోనికి ఏదో మతికొచ్చింది

నిలబడ్నసాట్నే తలదిప్పి బైటికి చూచినాడు.

జనమంతా అట్లా చూస్తా నిలబడుకోయిన్నారు

కొడుకుని పక్కకు గుంజిపడేసి, "అన్నా... అట్లపట్టుకున్నా..." అని మళ్లా అన్నాడు బజారి.

ఈ తూరు బంగపోతున్నెట్లుంది వాని గొంతు.

రోంతసేపు డొక్కోడు ఎనకముందాడె. అందరి మొగాల్లోకి చూచినాడు. 'లంగనాయల్లారా! ఆడకూతురు పానం మీదికొచ్చి తనకలాడుతుంటే చూస్తా నిలబడతారా' అని తిడదామనిపించింది. కాని నోటెంట మాటరాలేదు. అందరు అమయిన బిగదీసుకొని చూస్తా ఉంటే వాళ్ల చూపులకే డొక్కోనికి బెదురు పుట్టింది.

నాలుగేళ్ళనాడు జరిగిండేది కళ్ళ ముందుకు వచ్చింది.

అనర ఏడుపు ఎక్కువయింది.

ఏమనుకున్నాడో ఏమోగాని, 'యానాకొడుకు అడ్డమొస్తడోజూస్తా' అని పెదాల మీద గొనుక్కొని, తలాపుకెల్లిపోయి అనర రెట్టల కింద చేతులేసి లేవదీసినాడు.

కాల్లకెల్లి బజారి, తలకెల్లి డొక్కోడు... రోడ్డుమీదికి అట్లనే గొండబొయ్యినారు. యిద్దరు మనుషులు పక్కపక్కనే నడవనీకగూడ వీల్లేని దావలో డొక్కోడు రెండు రెట్టల కింద చేతులేసి పట్టుకొని ఎనిక్కి ఎనిక్కి నడుచుకుంటా పోతా ఉంటే అనర తలకాయ కిందికి యాలాడేసింది. కనుగుడ్లు పైకి పోయినాయి. నొప్పి తట్టుకోలేక కాళ్ళు జాడిస్తా ఉంటే బజారికి మొయ్యడం వల్లకావడంలా.

అప్పుడు అనర పైట దావెంబటి జీరాడుతానే ఉంది.

పిల్లోడు ఏడ్చుకుంటా ఎనికిడ్డి పోయినాడు. వాడికి మూడేండ్లుంటాయేమో.

రోడ్డు మీదికి పొయ్యేతాలకు ఎట్లనో ఆటో రడీగ ఉండె. కాళ్ళు అట్లనే పట్టుకొని బజారోడు అనరను ఆటోలోకి గుంజుకుండాడు.

డొక్కోడు పిల్లోన్ని ఎత్తి ఆటోలో కూచోపెట్టినాడు.

"న్నో... వాకిలెయ్యనీగ్గాలే...." అని బజారి చెప్పబోతే

"ఏంగాదులే... ముందు నువుపో.... నేనేస్తాలే" అన్నాడు.

ఈ గడిబిడికి నిద్రలేచినోల్లు గూడ రోడ్డుమీదికి వచ్చినారు.

ఆటోపోయినాక డొక్కోడు తిరిగిచూస్తే ఇరవై ముప్పై మందిదాక వరసగా నిలబడుకోనున్నారు.

అందరికంటే ఎనక రానూ.

రాత్రి పుల్లుగ తాగిండె. నిద్రకళ్ళతో మొగం గండుగ ఉంది.

డొక్కోనికి ఏంచేయాల్నో తోచుబడికాలా.

కాల్లూ చేతులు ఎనిక్కి యిరగదీసి కట్టినట్లు నిలబడిపోయినాడు. నోటెంట మాట రాలేదు. మామూలుగైతేనా?

తలకాయ ఎగిరేసి ఏం పెరుక్కుంటార్లో పెరుక్కోండి అని చరచరపోయేటోడే. సారాయి బుర్రమీదగిన ఉంటే యింగ పట్టనీక ఉండడు. మట్టసంగ ఎవరిపని వాల్లు చేసుకొనేటోల్లను కూడా లేవగొట్టి అల్లరి చేస్తాడు.

అట్లాంటిది గమ్మునైపోయినాడు.

యిందాక ఉన్న ధైర్యం ఇప్పుడు లేదు. తానేంజేసిందీ తెలిసొచ్చే కొద్దీ లోపల ఏదో కదిలినట్లయింది. 'వాడు ఉత్త మొండినాకొడుకు' అనిపించుకొనే డొక్కోడికి 'ఎట్లబ్బా!' అని ఎదారు పట్టుకుంది.

'ఈ మాదిగనాయాలు నన్నే యాల పిలిచె.... యింగెవరు లేనట్లు' అని బజారోన్ని తిట్టుకొనె.

మళ్ళీ అంతలోకే - 'ఆ పిల్ల ఆతరాన బాదపడ్తా ఉంటే...' అనుకొని, ఎట్లయ్యేదట్లయితది, తలదీసి మొలేస్తరా ఏంది, అది గూడ చూద్దాం అని మళ్ళీ అనుకొనె.

అయినా లోపల జరజర పాములెక్క భయం పొరాడుతున్నెట్లే ఉంది.

అనర, బజారి - గేర్లో ఉన్న మాటేగాని పలుకుదోడు ల్యాకుండ బతికినారు. కష్టమైనా, సుకమైనా ఒకరి వాకిట్లోకి పోనీక లేదు. అనర చేసిందానికి ఆయాల పెద్ద రగడయింది. ఒక దినమంత అర్చుకుండారు. కొందరైతే - అసలు వాళ్ళిద్దరు గేర్లో ఉన్నీకలేదన్నారు. నాయక్ లొంగ కళ్ళింతలావుజేసి అనరను నానాక మాటలన్నాడు. శికారి జాతిలో పుట్టి యిట్లాంటి గలీజుపనులు యాలజేస్తివే అని ఆడోల్లు బడబడకూసినారు. అంతా అయినాక లొంగ ఏమనుకొన్నో ఏమోగాని, "పోన్లే... యాడికిపోతారు. ఆ కొనాకు జాగ ఉన్నా, కొట్టమేసుకొని ఉంటారు" అని సర్దిచెప్పి ఒకటికి పదితూర్లు కట్టుబాటు గుర్తుచేసినాడు.

అందరు సవాస్సింగు దిక్కు చూచినారు.

వాయినకు లోపల మెలిబెట్టినట్లుందిగాని, ఏమనలేదు. తలావొకమాట అంటా ఉంటే తలకాయ నేలకేసుకొని కూచుండాడు. ఎవరో పిలిస్తే మొగమెత్తినపుడు గుడ్లనిండ కన్నీళ్ళు.

ఆ పొద్దు లీలగూడక కొట్కూరు నుండి వచ్చింది. 'ఆ పెళ్ళి చేయకపోయింటే ఈడిదనక వచ్చేదేకాదు, వాడా ఉత్త బేకారోడు...' అని అనర మొగున్ని అనుకుంది.

ఈ పిల్ల బతుకిట్లాయెనే అని దిగులుపన్నాది.

యింకొక్కల్లి సంబరపన్నాది.

'యింగ వాడొచ్చేదీ లేదు, దీంతో కాపరం చేసేదీ లేదు. ఒగ్గిసిపిల్ల.

ఆ పోరంబోకు నాబట్ట కోసరం యాల కాచుకొని కూచోవాల...' అనుకుంది.

బజారోనితో అనర కాపరం మొదలుపెట్టింది.

ఆ పిల్ల కానుపయినప్పుడు గూడ గేర్లో వాళ్ళెవరూ తొక్కి చూల్లేదు. పెండ్లయి బైటికి పోయింది గావట్టి లీల రావచ్చు. అనరను, పిల్లోన్ని చూచిపోయింది.

"బజారోడు ఆ పిల్ల మొదటి మొగునికి పెళ్ళికర్చులు యియ్యకనే పాయెగదరా. ఈ పొద్దటికి ఆ పెండ్లి కతేందో తేలకనేపాయె. అసలు వాడు ఉండాడో లేదో చెప్పేవాళ్లే లేకపోయిరి. ఇదేమో ఈనితో సంసారం చేస్తాఉండె, పిల్లల్ను కంటా ఉండె...."

ఒక ముసిల్ది యాసిరికి పడతా, డొక్కోని కండ్లల్లోకి చూడకుండ లోపల్లోపల వొదురుకున్నెట్ల అంది.

అది అందరికీ యినిపిచ్చింది.

మామూలుగైతే లడలడ అరిచేటోల్లు గూడ గమ్మున ఉండిపోయినారు - అందరి మాట అదే అన్నట్ల.

ఆ మాట అని ముసలామె దూరంగపోయి రోడ్డుమీద గొంతు కూచ్చుంది.

తక్కినోల్లు చిన్నగా కదులుతా ఉంటే. ఎట్లా తెలిసెనోగాని ఒక దిక్కు నుంచి లొంగ, యింకొక్కల్లి నుండి సవాస్సింగు ఒగేతూరి వచ్చినారు.

అంతా లొంగకెల్లి చూచినారు

వాయిన ఉరింజూసుకుంట నిలబడెగాని, నోరిప్పి ఒకమాట గూడ అన్లా.

సవాస్సింగు "ఏమాయెరా!" అని అడిగినాడు

కాని ఎవ్వరు బదులు పలకలేదు.

వాయినకు యింటికాన్నే అంతా తెలిసింది. 'ఈ పిల్లకు రాత్రిదనక బానె ఉండెగదా, యింతలోకే ఏమైంది...?' అని ఆదల బాదల వచ్చినాడు. ఆ భయం వాయిన కండ్లల్లో కనిపిస్తా ఉంది.

సవాస్సింగు మళ్ళీ అడిగినాడు.

"యాలాలే...!" అని డొక్కోడు కసురుకుండాడు.

ఆ మాట అర్థిగ రాలేదు. లోపల్నుండి బరువంత దించుకోనీక అన్నాడు. ఊపిరి తీసుకోనీకుండ తలావొక మాట అంటారనుకున్నడొక్కోనికి ఎవ్వరు చప్పిడిచేయకపొయ్యేతాలకు ధైర్యం వచ్చింది. పంచాయితీ కాడికి పోతదేమో అని లోపల పితపితమంటా ఉంది. అరిచి, కూసిపోతే ఏంగాదు... పంచాతంటే

యింగేమన్నా ఉండదా?

డొక్కోనికి బాగా గుర్తు. ఒకాడామె - యిట్లనే చేస్తే, రావిఆకు అరిచేతుల మీద పెట్టి ఎర్రగకాల్చిన గొడ్డలితో వాతలు పెట్టినారు.

డొక్కోడు అరిచేతులు నలుచుకుంటా అందరి కళ్ళలోకి చూచినాడు. లొంగమొగంలో ఏమీ కనిపిచ్చడంలేదు. ఎటో చూస్తున్నాడు.

యిదే సందని డొక్కోడు చరచరా రోడ్డుదాటుకొని పోయినాడు.

రామూ ఎదబడి చూసింది.

* * *

"గేర్లో అంతమందికి కావట్టనిది వీడికే ఎందుకంట!" నానా సుంకులమ్మ కట్టమీద రాత్రంత చలిలో తడుస్తా ముదరజుట్టుకోని పడుకోనుంటే గుమ్మి నిదర్లేపి చెప్పంది.

అప్పటికి అంత పొద్దయింది.

నానా విన్నడేగాని ఉలకలా, పలకలా.

ఇంట్లో నుంచి జీరంగి మాదిరి సన్నదాని ఏడుపు వినిపిస్తా ఉంటే, గుమ్మి దాన్నో, మొగున్నో తిట్టుకుంటా పోయింది.

ఆ తర్వాతగాని నానా ఈ లోకంలోకిరాలా. కూతురు ఏం చెప్పిందా! అని ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. అరుగు మీది నుండి కాళ్లు కిందికి జారిడిసి చిన్నగ ఊగుతా కూచుండాడు.

ఎప్పటికో లేచి సవాస్సింగు కొట్టుదిక్కు నడిచినాడు.

పూజారిషాహు, సవాస్సింగు నేలమీద కూచోని మాట్లాడుకుంటుండారు.

నానాపోయి చేతులు ఎనిక్కి కట్టుకొని నిలబన్నాడు. వాళ్లిద్దరూ ఒకేతూరి తలెత్తి చూచి మొదలఖుండా ఉండారు.

మళ్లీ మాటల్లోపడినారు.

'డొక్కోడు అట్ల కనబడతాడుగాని, మంచోడే. యింకోల్లయితే ఎనకముందుల జూసుకోరా...' అని లోపల అనుకుంటానే - "డొక్కోనికి తప్పేదికాదు..." అన్నాడు సవాస్సింగు దిగులుగా.

షాహూకు సర్రన కోపమొచ్చింది.

"యహో... ఏమైతదిరా? వాడేం చేసినాడని? నేనుగిన ఉండింటే, అప్పుడే చెప్పేటోన్ని..." అన్నాడు.

నానాపోయి వాళ్ళిద్దరికీ ఎదురుగా కూచుండాడు.

"అదంతా యాపొద్దటి మాట. ఆ గాలి నాయాలు యాడికో దెంకపాయె. ఆడికీ ఎతికి ఎతికి రొండుతూర్లు పట్టుకోనొస్తిమి. కట్టేసి కాపరం చేయిస్తమా ఏంది! అనర వాన్ని వొద్దనలాగదా. వాడే దేశం మీద తిరగబట్టె. పెద్ద పోతుమొగోడని... యింగ వానికోసమే ఎదురు చూడాలా? బజారికేమైంది? ఒకర్నొకరు ఇష్టపడ్డాక, మొదటి పెండ్లి సంగతి తేలాల అంటే ఎట్లా? అయినా ఎప్పుడో చేసిందానికి ఎల్లకాలం పొడుస్తానే ఉండాలా?...." షాహూ చెప్తా పోయినాడు.

"అట్లయినా... యిది బైటి కులానికి పాయెగదరా".

'ఈ పిల్ల ఎంత పనిజేసె - మాదిగోల్ల పొట్టిగాన్ని చేసుకోని. గేర్లో ఒక్క పురుగు పలకరిచ్చకపోయినా, ఈన్నే కాపరం బెట్టె. యింకో తానకుబోతే కొట్టమేసుకొను ఉసిరిలేనోడు...' సవాస్సింగును యిన్నేండ్ల నుండి అదే పీకుతా ఉంది. ఆమాట అన్నప్పుడు వాయిన గొంతులో బాధతోపాటు, 'యిట్లాంటియి జేస్తే కులం ఎట్ల ఊరుకుంటది, మనంగూడ పెద్దమనుషులమే గదా!' అనే మాటలు గూడ వినిపించినై.

షాహూ అంతకంటే మొండిగా "అయితే ఏంబొయ్యింది. నువ్వేమన్నా సాకిస్తాంతరిస్తుండవా? వాళ్లు బతుకువాల్లు బతుకుతుండారు. యింకోరి జోలికి రాడంలా గదా..." అన్నాడు.

షాహూ ఏదైనా అనుకుంటే యింగ ఎనిక్కి తగ్గేదిలా. ఎంతకాడికైనా మాట్లాడేదే. 'నువ్వేకాదు, నేనుకూడ పెద్దమనిషినే...' అనే గొంతుతో అన్నాడు.

షాహూకు నలభై ఏండ్లు గూడా ఉండవు. పూజారి కాబట్టి పంచాయితీల్లో కూచోబెడతారు.

వాళ్ళిద్దర్లో ఎవరు మాట్లాడుతుంటే వాల్ల మొగంలోకి జూస్తా, మెడ కొంచెం ముందుకు సాచి, కండ్లింత చేసి విన్నాడు - నానా.

గుమ్మి చెప్పినప్పుడు ఎక్కలాగాని, యిప్పుడంతా తెలిసింది.

షాహూ మాటలు కాగానే,

"నా పిల్లప్పటి నుండి చూస్తుండా. పేటలో ఎన్ని మారల్యా" ఆ వొక్క మాట అని నానా ఆగిపోయినాడు.

వెంటనే ఏమనాలో సవాస్సింగుకూ తోచలా.

"లొంగగూడక పట్టించ్చుకోడులే" బరూసగా అన్నాడు షాహూ. నానాకు ఆ మాట అక్కరనిపించలేదు.

'డొక్కోనికల సరేగాని, యిప్పుడు ఆ అక్కయ్యకు ఎట్టుందంట' అని అనర గురించి అడిగినాడు.

"ఏమో... ఈడికే యింతయింది. యింగ అదేం కనుక్కుంది. కడుపులో నొప్పంట, ఏకున ఉన్నట్లుండి లబ్బలబ్బ లేచిందంట. ఆస్పత్రిలో గులిగెలు, సూదులు ఏపించింటండులే. ఎవరి పొట్టిగాడైతేనేంగాని - బజారోనికి ఆ పిల్లంటే బో బెమ... పానంలెక్క జూసుకుంటాడు..." అన్నాడు సవాస్సింగు.

యిన్నేండ్లలో కూతురు, అల్లుడు గురించి యాపొద్దేగాని బైటికి ఒకరితో ఒగమాటని ఎర్గడు. కడాకి అనర కానుపయినప్పుడు మనవన్నీ చూస్నీక, గుల్చారుతో మాట్లాడే సొడ్డు పెట్టుకొని వాడి యింటికి పోయినాడు. కానిగె చెట్టుకింద ఎవరాలు పెట్టి, అన్నుంచే బజారి కొట్టంకెల్లి చూచినాడు. సరిగ్గ ఆ టయానికి అనర బైటి పిల్లోన్ని కాల్లమీదేసుకొని నీల్లుపోస్తా కనిపిచ్చింది.

అట్లా మనవన్ని చూచినాడు.

అదంత తలుచుకుంటే సవాస్సింగు కండ్లలో నీల్లు తిరిగినాయి.

అది నానా కనిపెట్టినాండు.

'మనిషికి ఎంత బయం! శికారోడు కొడతాడనీ, చంపుతాడనీ బైటి జనాలు ఊకె బయపడతారుగాని, శికారోని బయం గురించి ఎవరికి తెలుసు? కడాకు కులం కట్టుబాట్లే శికారోన్ని ఎంత బెదరగొడుతుండాయి. పగలు రాత్రి బయమంటే ఏందో తెలేకుండా అడవిలో యాటకు తిరిగినోడికి బయం ఒక్కటే మిగిల్నట్టుంది'.

తల్చుకుంటే నానా గొంతు పూడకపోయింది

"వాడికి ఆ దుడ్లు నేనే యిద్దామనుకొంటిగాని ఉసిల్యాకపాయె..." సవాస్సింగు ఎటో చూస్తూ అన్నాడు.

అవి యిచ్చింటే ఈ పీకులాటే ఉండేది కాదుగదా.... అని.

"నువ్విద్దామనుకున్నా, వాడు రావాలా లేదా? పోనీ... వాడి అమ్మా నాయినకైనా యిద్దామంటే, వాల్లు చచ్చిపోయిరి..."

సవాస్సింగు సాగదియ్యడం షాహూకు గిట్టలేదు.

అనర అంటే షాహూకు జాలి. ఆ పిల్ల పుటకలోనే తల్లి కాయిలాబడి, మంచంలో ఏండ్లు పుండ్లు నరకం అనుబగించి చచ్చిపాయె. అక్క ఉందంటే - దీనికి అయిదారేండ్లప్పుడే పెండ్లయి మొగునింటికి పోయింది. పాపం! ఎట్టికి పెరిగినట్టే. చూస్నీక ఎంత బాగుంటది పిల్ల! ఆనిగానితో ఆర్నెల్లు కాపరం చేసిందేమో. అంతలోకే వానికి గాలి దగులుకొనె. ఏం చేసినా తగ్గకపాయె. బవానీ తల్లికే మర్లబడె... అనుకుంటాడు.

వీళ్ళు మాట్లాడుకుంటా ఉంటే పిల్లోన్ని చంకనేసుకొని గుమ్మి వచ్చింది. వామెకు డొక్కోని గురించి చింత లేదు. పెద్ద మనుషులు వాన్ని మూడో, అయిదో కొరడా దెబ్బలు కొడతారని, గొడ్డలితో వాతలు పెడతారని కాదు. రామూను చేసుకున్నాకే యిట్లయిందని మంట. డొక్కోని మీద కోపం 'యిన్ని దినాలయినాక వాల్లను మళ్లీ తిట్టనీకి సందు'దొరకింది.

యింట్లోంచి లడ లడ అరుచుకుంటా బైటికొచ్చి చూస్తే గేర్లో వీల్లు ముగ్గురూ కనిపిచ్చినారు. సారాయి బట్టీలో నిప్పురాజే నీకట్టమీదికి పోదామనుకొని

గూడ, వీల్ల దిక్కు నడిచింది.

'యిదొచ్చిందంటే వొగతాయాన తెగదు....' అనుకున్నాడు షాహు. అప్పటికి ఎండ మీదికొచ్చింది. మంగలారం గావట్టి దీపం పెట్టనీక గుడికి పోవాల. ముసల్దానికి చేతగాకుండుంది - పద్దినాల్నుంచి జరం. ల్యాకపోతే వామే పోతుంది. దావనబొయ్యేటోల్లెవరైనా వనంలోకి వచ్చి దండంపెట్టుకొని అద్దురూపాయో, రూపాయో యిస్తే టీ తాగొచ్చని ఆశబడతది.

గుమ్లి అక్కన్నుంచే రానూను గలీజు మాటలు అంటూ వస్తుంటే...

'యాడున్నా దీని కూతలు దానికి యినిపిస్తాయి. ఒకరికొకరు తీసిపోరు. దుమ్మెలెయ్యాల్సిందే....' అనుకుంటా షాహూ కదిల్నాడు.

* * *

యాడనో సంబరానికి పోయివస్తా కర్నూల్లో దిగినప్పుడు అనరను ఆస్పత్రికి గొండబొయ్యినారని పవారికి తెలిసింది.

యింటికొచ్చి పెండ్లానికి చెప్పినాడు.

లీలకు చెల్లెలంటే బో ప్రేమ.

తల్లి ఉన్నా అనర అక్క చంకలోనే పెరిగింది. యాడాదికిందటి దాకా తల్లి ఉందన్నమాటే గాని బజార్ని చేసుకొని ఎడిగల పొయ్యేవరకు వామెకు చాకిరీ చెయ్యటమే సరిపోయింది.

లీల చెల్లెల్ని చూస్నీక పోదామనుకుంది.

కాకపోతే రొండుదినాల్నుంచి యింట్లో రగడ జరుగుతావుంది.

'ముసల్దాన్ని కల్లునీల్లకు ఆశపెట్టి చేని కాజేసిరే, ఎట్ల జేయాల్నా' అని పవారి ఎదారుపడుతున్నాడు.

పవారి వాల్ల జేజినాయనకు ఎట్లొచ్చెనోగాని కొట్కూరు-ఆత్మకూరు రస్తాలో అరెకరా ఎలిపొలం ఉంది. సేద్యం చెయ్యనీకరాదుగాబట్టి యాపొద్దేగాని అటుదిక్కు పొయినోల్లుగాదు. ఎవరోఒకరికి గుత్తకియ్యడమే. పవారికి తెలివొచ్చే వరకు గూడ గట్టారెడ్డి యాడాదికి ఆర్నూల్లో, ఎనిమిదినూర్లో యిచ్చేటోడు. రెండేళ్ల నుండి మూడువేల లెక్కన యిస్తాండు. ముసలోడు సారాయి గాస్తుండెగాని, పవారికి అది అచ్చిరాలా. దినాం ఈ పోలీసులేంది, కేసులేంది? యిట్లయితే ఎక్కిరామని బ్యాండుమేలాలు పెట్టుకుండాడు. యాడాడ్నో దొరికిన సొటల్లా అప్పులు పీక్కొచ్చి కొన్నాడు. పెండ్లిండ్లకు, సంబరాలకు నలుగుర్ని ఎంటేసుకుని పోతాడు. ఈ నడమ కడకులాల్లో శికారోల్ల బ్యాండుమేలాల మీద మోజు పెరిగింది. అంతకుముందు మేకతోలుతో చేసిండే తప్పెట్లు, డోల్లు ఉండేటియి. ఎతికినా ఇప్పుడయి కనబడవు. అన్నీ కొత్తవే. సినిమాపాటల వరసలో దనాదనా వాయిస్తారు. పెండ్లికి పోయినా, సంబరానికి పోయినా పిలిచినోల్ల స్తోమతను బట్టి పైసలు వస్తాయి.

మూడుదినాలకింద గట్టారెడ్డి నేరుగా గేర్లోకొచ్చి కొట్టంముందు నిలబడి పవారీ... పవారీ అని పిలిచినాడు.

"ఏందినా, యిట్లొస్తివి. యిందాకనే నేను మీ యింటికాన్నించి వచ్చినా. నిన్ను కలుద్దామనుకొని గూడ ఏదో కాయిలామీదుండి ఎనిక్కొస్తి..." అన్నాడు పవారి.

"నేను యింటికాడ లేకుంటి లేరా, బ్యాంకుకు పోయింటి. నేరుగా యిటే వస్తుండా... అవును గాని, మీయమ్మేది...?" అని అడిగినాడు గట్టారెడ్డి.

లీల బైటికొచ్చి "ఈడ్లనక ఉండెనే..." అని అటిటు ఎతికింది.

"ఏందినా... ముసిల్దిగాని మల్లా దుడ్లడిగెనా?" కొంచెం యాసిరికపడతా అడిగినాడు పవారి.

"ల్యాలే... నేనే చేని దుడ్లియ్యనీక వచ్చినా. మీయమ్మగూడ ఉంటే మంచిదిగదా. మీ శికారోల్లతో ఏదైనా లెక్కాచారం ఉంటేనే. అంకచారికి గలాటకు దిగుతారు. మీతోని అరవడం మాకేదైతది?" అన్నాడు.

'చేని దుడ్లేంది? మొన్ననే మూడువేలిచ్చెగదా. అదిగూడ యింటి చుట్టా తిరిగి తిరిగి బంగపోతే రెండుతూర్లు రెండింతలు చేతిలోపెట్టె...' అనుకుంటా ఉంటే గౌర తూలుకుంటా వచ్చింది.

గాలి ఎటుదోస్తే అటు పోతుంటది గౌర.

"ఏందే! రొడ్డి నీకోసరం వచ్చినాడు?" అని గద్దించినాడు పవారి.

గౌర మూతబడుతున్న కండ్లు కొంచెం పైకెత్తి కొడుక్కెల్లి చూచెగాని ఏం మాట్లాడలేదు.

"ఆఁ... మీయమ్మ వచ్చిందిగా. యిదుగో నీకియ్యాల్సిన ఇరబైవేలు. దేనికన్నా అక్కరకొస్తాయని ఎప్పట్నించో దాపెట్టి ఉంటి. యిట్ల అక్కరకొచ్చినాయి" అని అడ్డగుడ్డ పక్కకుతీసి నిక్కర జేబులోంచి రొండు కట్టలు బైటికి తీసినాడు.

పవారికి దిక్కు తెలేలా.

"ఏం దుడ్లునా..." అని మల్లీ అడిగినాడు.

"మీ అమ్మలెక్క నువ్వుగూడ తాగినవా ఏంది?" అని గౌరకెల్లిచూస్తా "ఏందిరా! అట్లంటవ్! మీయమ్మ చేని అమ్మిందానికి నేను యియ్యాలా లేదా? మీరిట్లాంటి తిక్కనాయాల్లు గావట్టే..."

గట్టారెడ్డి చెప్త ఉంటేనే మజ్జిలో లీల అందుకుని "మేమెప్పుడు చేనమ్మినం?" అని మొగునిదిక్కు, అత్తదిక్కు సూటిగా చూసింది.

పవారికి సరసరా మండుకొచ్చింది.

"మట్టసంగ మాట్లాడు రొడ్డీ! నేనాపొద్దు నీకమ్మినా..." అన్నాడు.

గట్టారెడ్డి కావల్నే బిత్తరపోయినెట్ల మొగం పెట్టినాడు.

"శికారినాయాల్లు తాగినప్పుడొకమాట, తాగనప్పుడొకమాట మాట్లాడతారనే కాయిదం కూడ తెచ్చినా. పోయిన సోమారంనాడు మీయమ్మ అమ్మింది. నవ్వుగూడ ఏలు ముద్దరేసినవ్..." అని మల్లా నిక్కర జేబులో చెయిపెట్టి ఏదో కాయిదం బైటికి లాగినాడు.

పవారికి తల తిరిగిపోయింది.

ఒక్క అంగలో అల్లంతదూరాన ఉన్న గౌరమీదపడి "నియ్యమ్మ! కల్లుకు ఆశబడి ఎవుడు లాపిస్తే వాడికి చేనమ్ముతావా? నరుకుతాసూడు...." అని ముసల్దాన్ని దుమ్మలు యిరగ దొబ్బినాడు.

తాగిన మొబ్బులో తల అటిటు ఊపుకుంటా నిలబడ్డ గౌరకి ఈమాటలేవీ ఎక్కలా.

పవారి దెబ్బకు యిరుసుకొనిపోయి పడింది.

ఓ... అని గొంతు చిట్లిపోయేతట్ల అరిచి తిట్లకుదిగింది.

"వాడు...వీడు అని దుబారకూతలు కూసినావంటే పెండ్లాం పిల్లలకు కరువైతవ్! నీయట్లాంటోల్లకు బయపడేవాన్నిగాను... యామనుకుండావో..." కిందికి జారిపోయిన అడ్డగుడ్డపైకి ఎగ్గట్టుకుంట గట్టారెడ్డి అరిచినాడు.

వాయనకు మల్యాలరస్తాలో ఎకరాచేను తప్ప యింకేంలేదు. అదిగాక, కులంలోనే గుత్తకు చేస్తాడు. పవారివాల్ల నాయన ఉన్నప్పట్నుంచి వీల్లదిగూడ చేస్తుండాడు. ఏకున లేస్తే పెండ్లాంపిల్లలతో చేలకాన్నే ఉంటాడు. ఈ నడమ రోడ్డుపక్కనుండే చేల రేట్లు లక్షలకు పెరిగినాక పవారి వాల్లది కాజెయ్యనీక ఎత్తేసినాడు.

గౌరకు నిండా కల్లుబోయించి "యాపొద్దన్నుంచో నీచేని గుత్తకు చేస్తుండగదా. అట్ల చేస్తున్నెట్ల కాయిదం రాసుకుందాం..." అని ఏలుముద్ర ఏపించుకున్నాడు. పవారితో అదేమాట చెప్ప "మీయమ్మ గుద్దింది నీవుగూడ గుద్దినావంటే నీ చేని పండినా, ఎండినా నీకు సమ్మందం లేదు. యాటా నీకు మూడువేలు అప్పపన్నట్లే. నా యింటికాడకొచ్చి చొక్కాపట్టుకాని వసూలు చేసుకోవచ్చు..." అన్నాడు.

'ఈ నాకొడుకు అన్నోటు మంచిమాటలు చెప్పి నయనారంగ కాజేసినాడే...' అనుకుంటా ఉంటే గట్టారెడ్డి డబ్బుకట్టలు గౌర చేతుల్లోపెట్టి అదేపత ఎల్లిపోయినాడు.

లీలకు యిదేం తెలియదు.

యిద్దరు కలిసి పిల్లల నోటికాడిది పోగొట్టిరే అనే బాధతో యిద్దరిమీదకి పోయింది. పవారి తల్లిని తిడుతుంటే "దాన్ని అంటున్నవ్, నువ్వేంజేసినావు..." అంది.

గౌర చేతిలోంచి డబ్బు కట్టలు తీసుకొని పైటల్లో దాపెట్టుకుంది.

ముగ్గురు ఒకటేమైన అరుచుకోడం, తిట్టుకోడం.

గేర్లో అందరు గుంపైనారు.

గౌర అరిచినకాడికి అరిచి బైటికిపోయింది.

మర్నాడు కొట్కూర్లోనే ఒక పెండ్లికి డ్రమ్ములు వాయించనీక పోవాల్సి ఉండె. కాని ఈ దిగులుతో పోలేక వేరేవాల్లను అంపించినాడు. యింటికాడ ఉన్నందుకు అరుచుకోవడమే పని.

అదట్లా ఉండగానే అనర సంగతి తెలిసింది.

సన్నదాన్ని తీసుకొని బయల్దేరింది.

పెద్దాసుపత్రి కాన్నే బస్సుదిగి లోనికిపోతా ఉంటే బజారి ఎదురైనాడు. పొద్దన్నుంచి తిండిల్యాక మనిషి బెట్టకొట్టినాడు.

"ఏందినా! ఏమైంది ఆ పిల్లకు?" అని అడిగింది ఆదుర్దాగా.

బజారి గుండెలమీద అరిచేత్తో రాసుకుంటా నేల చూపులు చూసినాడు.

లీలకు లోన గుబగుబలాడింది.

రొంచేపయినాక

"ఏం ల్యాలే... కడుపులో గడ్డంట. దాంతోనే అంత నొప్పి. మనిషి తల్లకిందులైపాయె. బెరీత వచ్చినం గావట్టి సరిపోయింది. ల్యాకపోతే..." యింగేం చెప్పలేకపోయినాడు.

"యిప్పుడెట్లుండది?"

"ఆపరేసన్ చేసినారు... మత్తిస్తరుగదా, యింకా లెయ్యలా".

లీల కుదుటపడింది.

"పిల్లప్పన్నుంచి దీన్ని ఆయమ్మ కనిపెట్టుకొని ఉండది. యిట్ల ఎన్ని గండాలు గడిచినాయో. పదేల్లప్పుడు - బాగున్నపిల్ల ఆడుకుంట ఆడుకుంట వాయిగమ్మి పడిపోయింది. ఎవరికైనా వాయిలేస్తే, రొంచేపయినాక వాల్లే లేచి కూచుంటరు గదా. చేతిలో బీగం పెడితిమి, యింగా ఏమేమో చేస్తిమి. అయినా యిది లెయ్యకపాయె. గంట రెండు గంటలయినా కండ్లు తెరసకపొయ్యేతలకు ఈడికేసుకొచ్చినం. అదేమి కాయిలో ఏమో! వారం దినాలుంచుకున్నరు. అప్పటిగ్గాని మనిషిగాలె..." లీల చెప్పుకుంటాపోయింది.

బజారి టీ తాగనీక పొయ్యేటోడు గూడ ఎనక్కి తిరిగినాడు.

యిద్దరూ లోనికి పోయినారు.

అనరను చూచినాక బైట చెట్లకాడ నేలమీద కూచ్చుండారు.

పలుకుతోడుల్యాక పొద్దన్నుంచి ఎంత యిబ్బందిపడిందీ బజారి చెప్తా ఉంటే లీలకు కండ్లల్లో నీల్లు తిరిగినై.

బజారికి అమ్మనాయన్లుగాని, తోడబుట్టినోల్లుగాని లేరు. నాలుగైదు తరగతుల కాడికి చదువుకున్నడేమో. రోజుకు యాభైరూపాయల్లెక్కన కూలిపని చేసి సంపాయిస్తాడు.

అంతా అయినాక, పొద్దున డాక్కోడు చేసిన సాయం గురిచ్చి కూడా చెప్పినాడు. పెద్దమనుషులు వాన్ని దండిస్తరేమో! అన్నెట్ల చూచినాడు.

లీల బయపడింది.

కొంచేపయినాక, "పేటకు పోతుండాలే" అనింది.

ఆ మాటలో బజారికి బరూస కనిపిచ్చింది.

'మనకోసం వాడు యాల దెబ్బలు తినాల' అని.

చీకటి పడుతున్నప్పుడు లీల గేర్లోకి వచ్చింది.

పేటంత అరుపులతో, కేకలతో గడిబిడిగా ఉంది. బైటోల్లు, గేర్లోవాల్లు తాగినకాడికి తాగి సవాల్లు విసురుకుంటున్నారు. మొగం కనిపిచ్చకుండ గడ్డం పెరిగిన ఒకాయన సంకులమ్మ కట్టమీద నిలబడి చేతులు ఊపూపి, మజ్జలో అబ్బిల్లుపట్టి బెదిరిస్తా మాట్లాడుతున్నాడు. కులమోల్లల్లో ఎవరితోనో వాయినకు కొట్లాటయింది. వాల్లను గలీజు తిట్లు తిడతా 'అడ్డమొచ్చిన ఒక్కోనాకొడుకుని అందిట్లో బూంచిపెడత....' అంటున్నాడు.

ఆడ యింకో పురుగులేదు. ఒక్కడే అరుసుకుంటాండు.

ఎవరో ఒక ముసిల్ది తాగి నిదర్లో నడిచినట్లు నడుచుకుంటా వచ్చి లీల మొగంలో మొగం పెట్టి ఎగాదిగా చూచింది.

ఎవరు? అని గుచ్చి అడిగింది.

"సవాస్సింగు బిడ్డనుగాను..." అనింది లీల.

"ఆ నాకొడుకెవడు.....?" కండ్లు పైకెత్తి అడిగింది.

లీలకు కిసుక్కున నవ్వొచ్చింది.

"ఎవడోఒకడులేయే... రాగానే తగులుకుండవు...." అని ముందుకు పోయింది. కొట్టంకాడ సవాస్సింగు లేడు. వాకిలిగూడ ఎయ్యలేదు. లోపల అంతా గలీజుగ ఉండది. అన్నం సరవలు పాకరబట్టినై. ఈనడను పొయ్యి ముట్టిచ్చినట్లులా. బజారితో అనరపోయినాక యింట్లో దిక్కు లేకుండైంది. పెండ్లాంకు ఉరువు చేతగాకపాయె, అప్పుడా యిప్పుడా అన్నట్ల మంచంలో ఉండటాన వామెకే ఎదురు చేయబడింది.

సవార్సింగుకు అవన్నీ యాడ చేతనైతయి!

దినాం హోటల్ నుండి అన్నం పొట్లాలు కొనక్కొచ్చేటోడు. యిగ అంతే. అది తిని ఊకోవాల. కాయిలామీద పెండ్లానికి ఏమేమో తినాలని అనిపిచ్చేది. అయన్నీ తేవాలంటే ఎన్ని దుడ్లుగావాల!

వామె అదిగావాల, యిదిగావాల అని కలవరిచ్చి చచ్చిపోయింది.

పెండ్లాం పోయినాక సవార్సింగుకు దిక్కుల్యాకుండై పోయింది.

లీల తల్లి సచ్చిపోయినప్పుడు వచ్చిందే. మల్లా రాలేదు.

ఆడ బస్సెక్కితే గంటసేపట్లో దిగే దూరం. కాని యిప్పటికిట్లా వచ్చింది

కొట్టంలో ఒక మూల పడిన్న బొంత, దుప్పటి చూచేతలకు లీలకు తల్లి మతికొచ్చింది. ఆ గుడ్డల్లో తల్లి కాల్లూ, చేతులు కదిలిచ్చలేకుండా యింకా ఉన్నట్టే అనిపించింది.

బొటబొట కండ్లంబడి నీల్లుకారినై.

ఆడ ఉండబుద్దిగాక వాకిట్లో కొచ్చి నిలబడింది. దావెంటపోతున్న నానా యిటుకెల్లి రొండడుగులు వేసి, లీలను గుర్తుపట్టి దగ్గరకొచ్చినాడు.

"ఎప్పుడొచ్చినావే! నీ మొగుడు, పిల్లోలు బాగుండరా" అని పలకరిచ్చినాడు.

వాకిలికాడ కింద మట్టిలో ఆడుకుంటున్న సన్నదాని తలమీద చెయిపెట్టి నిమిరినాడు.

అప్పుడు నానా కండ్లు తడయినాయి.

బైటికి చెప్పుకోనీకరాదుగాని, నానాకు లీలనుజూస్తే లోపల పేరకపోయిందంత కెల్లగిచ్చినట్లయితది.

లీలకు అది ఎరికే...

"కొంచేపాయె వచ్చి. అనరకు ఆపరేసన్ చేసినారంట..." లీల మాటలు కాకముందే, "నువు చూసొస్తివా! ఎట్లుండది?" అని నానా అడిగినాడు.

"అన్నుంచే రావడం... ఏందో... ఆ పిల్లకన్నీ యిట్లాంటియే..." అంటా ఉంటే డాక్కోని సంగతి మతికొచ్చి,

అదేమాట నానాను అడిగింది.

"వాడేమన్నా బేకనై పంచాతీని కాదన్నడా ఏంది. ఆ పిల్లకు పానం మీది కొచ్చె. చూస్తా చూస్తా మనిషిని చంపుకుంటమా ఏంది? చేత సాయం జేస్తం!..." అన్నాడు గట్టిగా.

లీల ఊకుండిపోయింది.

"దాని గురిచ్చి నువ్వూ... నేను అనుకుంటున్నం గాని, వాడేపొద్దో అది మర్చిపోయింటడు. యాన్నో యింతతాగి పడిపోయింటాడు... అసలు లొంగ

కూడ పట్టిచ్చుకోలా..." అన్నాడు.

అంతలోకి సవాస్సింగు వచ్చినాడు.

లీలను జూసి కండ్లింతయినాయి.

పొద్దన్నుంచి అనుకుంటానే ఉండాడు, అప్పుడో యిప్పుడో లీల వస్తది అని. పైటాలప్పుడు కొట్నూరుకు ఎవరో పోతా ఉంటే చెప్పంపినాడు. లీల అప్పటికే బస్సెక్కింది.

సన్నదాన్ని చేతుల్లోకి తీసుకుండాడు.

దానికి కొత్తనిపించి ఉదరపేక్కొని లీలకాడికిపోయింది.

ఆ పిల్ల కండ్లలోకి లోతుగా జూసినాడు.

అచ్చం పెండ్లాం ముక్కు మొగమే.

ఈడ అందిట్లో కలసిపోయి, ఆడ లీల కడుపులో పడిందా? అనిపిచ్చింది.

చూస్తుండగనే నాలుగుదిక్కుల చీకటి కమ్ముకోని వచ్చింది. గేర్లో కరెంటు బుగ్గలు వెలిగినాయి. తాగినోళ్ల గడిబిడి మందమైంది.

లీల వాకిట్లో కూచోనుంటే సవాస్సింగు లోనికిపొయ్యి గడ్డినూనె సీసా అంటించినాడు. యింట్లో కరెంటుల్యాక ఎన్నాళ్లయిందో.

నానా లోపల బైట ఏదో వాదురుకుంటా రోడ్డుమీదికి పోయినాడు.

సారాయికోసరం నాలిక ఒకటేమైన పీకుతా ఉంది. అంచున నాలుగు రూపాయలు గూడ లేవు. అడిగితే గుమ్లినే అడగాలి. పొద్దన్నంచి గుమ్లి చిటపట లాడతానే ఉండె. అడగనీక నానాకు గుండెలు చాల్లేదు.

తినర గురిచ్చి లీల చెప్పకొచ్చింది.

మసక వెలుతుర్లో గూడ తండ్రి కళ్ళలో తడి కనిపిచ్చింది లీలకు.

గేర్లో అరుపులు, కేకలు తగ్గిపోయినై. దూరంగా ఎవరో ఉండుండి గబ్బు తిట్లన్ని తిడుతుండాడు. అదొక్కటే.

కొట్టం కాన్నుంచి ఎడం దిక్కు జూస్తే అంతా చీకటే.

కానిగెచెట్లు, సర్కారు తుమ్మ చెట్లు దాటుకునిపోతే కెనాలు కట్ట. పల్చగ పిండారబోసినట్లు వెన్నెల కురుస్తా ఉంది.

సవాస్సింగు, లీల గుండెల్లో మాత్రం గుబులు గుబులుగా ఉంది. ఒగటి కాదు, రొండుకాదు... తల్లి అనుబగించిన నరకం లీలను వదిలిపెట్టకుండ తరుముతానే ఉంది. మజ్జలో యింటికాడి గడిబిడి మతికొచ్చింది. పవారి తాగనప్పుడు కూడా తగినట్లే ఉంటడు. అవే మొబ్బుకండ్లు. మెతక మనిషి బైటి జనాలకాడ మట్లాన్నీక నోరు తిరగదు.

నాయినకు అన్నీ చెప్పకొచ్చింది.

ఆడకూతురికి పెండ్లిచేసి పంపించడంతో అన్నీ అయిపోయినట్టే. గేర్లో అయితే కండ్లముందున్నట్టుగాని, బైటి సమ్మందమయితే మంచి చెడు పట్టచ్చుకోనీక గాదు.

లీల బైటికెల్లిపాయె.

పేటలోనే ఉన్నట్టుగాని అనరను పలకరించనీక లేకపాయె.

సవాస్సింగు అన్నీ వింటా ఉన్నాడేగాని తలాడించడం గూడలేదు.

వాయినకు లోన ఏవేవో ఎగిసిపడుతుండాయి.

లీల వాటన్నిటినీ దగ్గరిగా చూస్తానే ఉంది. ల్యాకపోతే చుట్టుతా గేర్లో పరుచుకున్న చీకటివెలుగులు, దూరంగా కెనాలు మీద వెన్నెల జాడలు.

(యింకా ఉంది)

పొద్దు

- మార్వాడి గంగరాజు

తెల్లారితె పెత్తరమాస
కోడిపుంజుల కూతలతో
పిట్టల అరుపులతో
పల్లె తెల్లారింది

నిన్న మొన్నటి వరకు
పిల్లల అరుపులతో
కోలాటం పాటలతో
ముసలవ్వల ముసిముసి నవ్వులతో
తెల్లారిన పల్లె
ఇయ్యల్ల దుఃఖంతో
బీరిపోయిన ముఖంతో
భయం భయంగా ఉంది
పేపరు మోసుకచ్చిన
వార్తను ఫోటోను చూసి
పల్లె ఉలిక్కి పడింది

అసలు ఏం జరిగిందో
ఎవరికి తెలువది
ఎవరిని చూసినా అర్థంకాని మొకాలు
ఒకరి మొఖం ఒకరు చూసుకుంటుండ్రు

గుంపులు గుంపులుగా
పల్లె గుసగుసలాడుతుంది

గుంపులో ఎవరో దుఃఖం
ఆపుకొని ఆపుకొని ఆగలేక
అంటున్న మాటలు వినబడ్డై

బంగార మసొంటి పోరడు
ఎవల కేం పాపం జేసిండు
పేదల బతుకు పాట పాడిండు
పేదల మెతుకు మాట మాట్లాడిండు

కొడుకును గప్పుడు జూసినం
మల్ల గీపేపర్ల జూత్తున్నం
ఉన్నోల్లకు ఎదురు మాట్లాడినందుకు
మల్ల మాట్లాడెందుకు లేకుంట జేసిండ్రు.

మా ఎతలను కథలుగా జెప్పె
కొడుకు ఇక మాకు లేడని
కొడుకు శవం దగ్గర తల్లి
శాపనార్థాలు పెడుతుంది

తల్లికి తెలుసు
కొడుకు సావు పొద్దు గూకుడే అని
ఏ తల్లి కడుపులనో
మళ్ళీ పొద్దు పొడుస్తదని

*

లేఖ

మన సాహిత్యం సామ్రాజ్యవాదాన్ని గురి చూడాలి

అరుణతార సంపాదకవర్గానికి నమస్తే!

వర్గ సమాజంలో ప్రతి అంశంలో వర్గ ప్రయోజనాలు ఇమిడి ఉంటాయి. ఆ సమాజంలో ఉన్న ప్రతిది ఏ వర్గానికి ఉపయోగపడుతుందనే దానిని బట్టే చూడాల్సి ఉంటది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు నుండి సామ్రాజ్యవాదం తీవ్ర వొడిదుడుకులను ఎదుర్కొంటుంది. అది మొదట తన సంక్షోభాన్ని పరిష్కరించుకోవడానికి యుద్ధాన్ని ఎంచుకుంది. సామ్రాజ్యమంటే యుద్ధమని, మార్కెట్‌కోసం, ఆధిపత్యం కోసం ఎంతటి కౄరానికైనా తలపడుతుందని కా॥ లెనిన్ చెప్పింది అక్షరాల నిరూపించ బడింది. తన ప్రత్యర్థి అయిన సామ్యవాదాన్ని, సామ్యవాద ఆర్థిక విధానాలను ఎదుర్కొవడానికి సామ్రాజ్యవాదుల మధ్య అనేక ఒప్పందాలు, కలయికలు, ద్రవ్య సంస్థలు నెలకొల్పడం జరిగింది. యుద్ధంలో ఓడిపోయిన దేశాలకు అప్పులు ఇవ్వడం, సహాయపడటం ద్వారా మళ్ళీ నిలదొక్కుకొనేలా చేయడము ద్వారా జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ మొదలైన దేశాలు అమెరికాను మించిపోయాయి. ఆయా దేశాల గుత్త సంస్థలు మరింత కేంద్రీకరించి ఇ.యు., జి6 తదితర కూటముగా ఏర్పడినవి. అప్పటివరకు జంరల్ మోటార్ సంస్థ లాంటి అగ్రగామి పారిశ్రామిక, ద్రవ్య సంస్థలను మించి అభివృద్ధి చెందడంలో పారిశ్రామిక ఉత్పత్తి రంగంలో నుండి సేవారంగంలోకి, చట్టా వ్యాపారం, రియలెస్టేట్ లోకి మారాయి. సూపర్ 301, స్పెషల్ 301 పేర అమెరికా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాలపై ఆంక్షలు విధిస్తూ వ్యవసాయ రంగంలో సబ్సిడీలు తగ్గించాలంటూ తన దేశంలో అధిక సబ్సిడీలు ఇవ్వడం ద్వారా వాణిజ్య యుద్ధాలు జరుగుతున్నాయి. వివిధ సమయాలలో వారి మధ్య పోటీ తలెత్తుతున్నప్పటికీ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సామ్రాజ్యవాదులకు నష్టం జరుగకుండా దాదాపు 140 వరకు ప్రాంతీయ యుద్ధాలకు తలపడ్డాయి. వాటి మధ్య ఎన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికి ప్రజాపోరాటాలు, జాతి పోరాటాలు, సామ్రాజ్యవాద విధానాలను వ్యతిరేకిస్తున్న దేశాల, ప్రభుత్వాలపై ఆంక్షలు విధించడం, హెచ్చరికలు చేయడం, అణు ఆయుధాలు, రసాయనిక ఆయుధాల పేరుతో దాడులకు పాల్పడుతున్నాయి. పార్టీలు, ప్రజా సంఘాలపై నిషేధాలు విధిస్తున్నాయి. ఒకవైపు సైనిక బలాన్ని ప్రయోగించి. తక్కువ స్థాయి తీవ్రత కల్గిన యుద్ధాన్ని (ఎల్.ఐ.సి) కొనసాగిస్తూ ప్రపంచీకరణ ముందుకు తెస్తూ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలోని వనరులను, శ్రమశక్తిని కొల్లగొడుతూ సామ్రాజ్యవాద సంక్షోభాన్ని పరిష్కరించుకోవడానికి వలస-అర్థవలస దేశాలుగా ఉన్న మూడవ ప్రపంచ దేశాలను గ్యాట్, ప్రపంచ బ్యాంక్, ఐ.ఎమ్.ఎఫ్, డబ్ల్యూ.టి.ఓ ద్వారా నయావలసగా మార్చుకొని రాజకీయ, సైనిక, ఆర్థిక విధానాలను నిర్దేశిస్తున్నారు. ప్రజా ఉద్యమాలను వాటికి నాయకత్వం వహిస్తున్న ప్రజాసంఘాల, పార్టీల అణచివేయడంలో పాలక, ప్రతిపక్షాలు సామ్రాజ్యవాదంతో గొంతు కల్పుతున్నాయి. మొత్తం ఈ పరిణామాలు మనదేశంలో చేతివృత్తులు అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక విధానానికి మధ్యన ఉన్న వైరుధ్యం మూలంగా బలహీనపడుతూ వచ్చాయి. పర్యవసానంగా పెరిగిన నిరుద్యోగ సైన్యం, వ్యవసాయ రంగంపై ఎక్కువ భాగం ఆధారపడ్డాయి. వ్యవసాయ రంగం కూడా నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటూ వస్తుంది. వ్యాపార- వాణిజ్య రంగాలలో తీవ్ర మార్పులు వచ్చేస్తున్నాయి. రిటైల్.వ్యాపారంలో విదేశీ, స్వదేశీ గుత్త సంస్థల పరుగులు, ఎగుమతి, దిగుమతి విధానాలు దేశీయ ఉత్పత్తిని తీవ్రంగా నష్టపర్చుతున్నాయి. సేవారంగం వివిధ రూపాలలో పుట్టుకొచ్చి విస్తరిస్తుంది. ఉత్పత్తిశక్తుల ధ్వంసం చేసి మన సంస్కృతి, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల ధ్వంసం చేయడమే. విచ్చలవిడి విశృంఖల, వ్యక్తిత్వవాద అరాచక విధానాలను పెంపొందిస్తున్నారు. వీటి ప్రభావం ప్రజలలోని తీవ్ర వ్యతిరేకత పోరాటాలుగా మారుతున్నాయి. ఇరాక్‌పై అమెరికా, ఇంగ్లాండ్ బలగాలు ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్‌పై దాడులు చేసినప్పుడు, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడిచేసినప్పుడు ఆయా దేశాలలోని ప్రజలు తీవ్ర నిరసనను తెలియజేయడం మనకు తెలిసిందే. గ్యాట్ డబ్ల్యూ.టి.ఒ. విధానాలను వ్యతిరేకిస్తూ ఆయా సమావేశాల సందర్భంగా పెద్ద ఎత్తున ప్రతిఘటించారు. ఫ్రాన్స్‌లో జరిగిన తిరుగుబాట్లు నేడు ప్రజలలో నెలకొన్న వ్యతిరేకత ప్రభావాన్ని తెలియజేస్తుంది. పై వాటితో పోల్చుకున్నప్పుడు మనదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో బలహీనంగా ఉన్నాం. వివిధ సందర్భాలలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, డాక్టర్లు, ఇంజనీర్లు స్పాంటేనియస్‌గా ఆందోళనలకు దిగినప్పటికి ప్రజలలో గూడుకట్టుకొని ఉన్న శక్తి వెలికితీయడంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల మధ్య ఐక్యత లోపించడం, ప్రజాతంత్ర, విప్లవ శక్తులు బాధ్యతగా ఆలోచించాల్సిన తరుణం. ప్రాజెక్టుల నిర్మాణం, ఖనిజ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేట్ పరం చేయడం, వివిధ రంగాలపై వాటి ప్రభావాన్ని కూడగట్టాల్సిన అవసరం ఉంది. ఈ విధంగా నేడు మనదేశంలోని శాస్త్ర విజ్ఞానం, పరిశ్రమలు, విద్య, పారిశ్రామిక, వ్యవసాయక, అటవి విధానాలను చూసినట్లయితే దేశీయ ఉత్పత్తి శక్తులకు గొప్ప నష్టాన్ని కల్గిస్తూ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గ ప్రయోజనాన్ని నెరవేర్చేవేనని స్పష్టం. ఈ దృష్ట్యా చూసినట్లయితే అరుణతార ఈ ఆర్థిక రాజకీయ పరిణామాలను సాహిత్య సాంస్కృతిక రూపాల్లో బలంగా ప్రచారం చేయవలసి ఉంది. వివిధ ప్రక్రియల్లో ఈ పరిణామాల సారాంశాన్ని చిత్రించే రచనలకు చోటు కల్పించాలి. నేరుగా రాజకీయ ఆర్థిక విశ్లేషణకు పూనుకోవాలి. యిప్పటిదాక చేస్తున్న కృషిని యింకా పెంచాలని దాని పాఠకుడిగా అరుణతార మరింతగా కృషి చేస్తుందని ఆశిస్తూ

విప్లవాభివందనాలతో
సముద్రుడు

(..... రెండవ కవర్ పేజి తరువాయి)

ఆమె గోదావరిఖని దగ్గర జనగామలో ఒక సామాన్య రెడ్డి కుటుంబంలో పుట్టింది. కాలేజి దాకా మేనమామ చదివించాడు. ముగ్గురన్న చెల్లెళ్లు. ఒకతమ్ముడు. మేనత్త కొడుకు జయపాల్‌రెడ్డి, విద్యార్థిగానే రాడికల్ ఉద్యమంవైపు ఆకర్షింపబడ్డాడు. ఆయన ప్రభావం ఆమెపై ఉంది. ఈ ఇద్దరికీ పెళ్లి చేస్తే ఊళ్లో ఈ 'సంఘోద్ధారణ' పనులు కట్టిపెట్టి సంసారం చేసుకుంటారని మేనమామ పెళ్లి చేసాడు. ఊళ్లో వాళ్లంతా అంటూనే ఉన్నాడట. 'వాళ్ళను ఇంటికి కట్టి పడేయాలని పెళ్లి చేస్తే ఇద్దరూ ఇల్లు వదిలిపోతారు చూడండి' అని, అట్లాగే అయింది. జయపాల్ విశాఖ నగర ఉద్యమ బాధ్యుడుగా ఉన్నప్పుడు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. కొంతకాలం తర్వాత విజయలక్ష్మి చంద్రమౌళి సహచరి అయింది. చంద్రమౌళి అంచెలంచెలుగా గోదావరి ఏజెన్సీ నుండి తూర్పు డివిజన్‌కు ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు విప్లవోద్యమానికి నాయకుడయి, ఆంధ్రప్రదేశ్ పీపుల్స్‌వార్ ఉద్యమం మూడు పోరాట ప్రాంతాలుగా వేరయినపుడు ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రత్యేక గెరిల్లా జోన్ మొదటి కార్యదర్శి అయ్యాడు. 2000 సంవత్సరంలో ఆ తర్వాత పూర్తికాలపు కేంద్ర కమిటీ సభ్యుడు, మిలిటరీ కమీషన్ సభ్యుడు వంటి కీలక బాధ్యతల్లోకి వెళ్లాడు. ఆ విధంగా ఆయన అరెస్టు కూడ ఏ జబల్పూర్‌లోనో, జంషెడ్‌పూర్‌లోనో అయిందని, ఆమె అనారోగ్యం గురించి ఒక చోట ఆశ్రయం తీసుకున్నపుడు ఎవరో శత్రువుకు సమాచారం ఇస్తే తీసుకొచ్చి విశాఖ అడవుల్లో ఒకచోట కొండపై కాల్చేసి ఇంకోచోట ప్రకటించారని, నర్సీపట్నం ఆసుపత్రిలో తప్ప మృతదేహాలను పత్రికలవాళ్లకుకూడ చూపలేదని ఎపిసిఎల్‌సి నిజ నిర్థారణలో వాస్తవాలు బయటికి వచ్చాయి. ప్రకటించిన లోయలోకాకర్, కాల్చేసిన కొండమీద నెత్తుటి మరకలు, గ్రేహౌండ్స్ తిని పారేసిన బిర్యానీ పొట్లాలు కనిపించాయి. శవాలను కొండ మీంచి కింద చేర్చడానికి కింద ఆదివాసులతో వెదురు కర్రలతో పాడెలు కట్టించి పోలీసులే స్వయంగా పైకి తీసుకువెళ్ళి, శవాలు తెచ్చి కింద వాహనాలో ఆసుపత్రికి తరలించారని అక్కడి ఆదివాసులు చెప్పారు.

విజయలక్ష్మి తూర్పు కనుమల్లో ఆదివాసీ మహిళలను సంఘటిత పరచి, చదువు చెప్పి, వారి సమస్యలపై పోరాటాలకు ఆయత్తం చేసి ఇరవై సంవత్సరాలు వాళ్లలో తాను ఒక ఆదివాసీ మహిళగా జీవించి డివిజన్ స్థాయి నాయకురాలయింది. ఆమె నేపథ్యం విని, మృత్యువు తర్వాత కూడ ఎంతో ప్రశాంతంగా కోమలంగా ఉన్న ఆమె మొహమూ, పాదాలు చూస్తూ ఉంటే సమాజం పట్ల బాధ్యత, పీడితులపట్ల ప్రేమ ఉన్న మనుషులను చైతన్యం ఎంత కఠినమైన మార్గాలను నడిపిస్తుంది. చివరకు ప్రాణత్యాగాలకు కూడ సిద్ధం చేస్తుంది అనిపించింది.

1977-78 నుంచి దాదాపు ముప్పై ఏళ్ళు గడిచిపోయాయి. ఈ ముప్పై ఏళ్లలో లక్ష్మీరాజ్యం, పోశెట్టి మొదలు, సాయిని ప్రభాకర్ వంటి జగిత్యాల విప్లవోద్యమ నిర్మాత మొదలు చంద్రమౌళి, విజయలక్ష్మి వరకు ఒక్క కరీంనగర్ జిల్లాలోనే వందలాదిమంది అమరులయి ఉంటారు. 1990లో హుస్నాబాద్‌లో కరీంనగర్ అమరుల స్థూప నిర్మాణం నాటికే లెక్కకొచ్చిన జిల్లా అమరుల సంఖ్య 93. జరిగిన దారుణ మారణకాండంతా అభివృద్ధి పేరిట విధ్వంసంగా 1991లో ప్రపంచీకరణ ప్రారంభమైన దగ్గర్నించే. అందులోనూ 92లో నేదురుమల్లి పాలన, 95లో చంద్రబాబు పాలన ప్రారంభమైన దగ్గర్నించే. అమరులందరి సగటు వయసు 30 మించదు. ఇటీవలి కాలంలోనయితే మహిళల సంఖ్య కూడా తక్కువేమీ కాదు, సామాజిక వర్గాలుగా చూసినప్పుడు అందరూ దళిత బహుజనులు, కష్టం చేసుకునే కులాల నుంచి, వృత్తులనుంచి వచ్చినవాళ్ళు - విద్యార్థులుగా యువకులుగా తమ తమ గ్రామాల్లో అన్ని రకాల పెత్తనాలకు, అణచివేతలకు, పీడనకు వ్యతిరేకంగా గళమెత్తి, తోటి వారిని కూడగట్టి సంఘాలు పెట్టినవాళ్లు, పోరాడినవాళ్లు.

ఎనభైలలో ఎన్‌కౌంటర్లు, రాడికల్ యువకుల ఇళ్లు కూలగొట్టడాలు, వ్యవసాయాలు, పశువులకు నష్టం చేయడం వంటి పనులు పోలీసులు మొదలు పెట్టాక క్రమంగా గ్రామాల్లో కాశ్మీరు వంటి పరిస్థితి ఏర్పడింది. 1985-89 అటువంటి గడ్డుకాలం. గోపగాని ఐలయ్య, దగ్గురాయలింగం అటువంటి గడ్డుకాలంలో నిలబడి ఉత్తర తెలంగాణ ఉద్యమ నిర్మాణానికి ఊపిరిపోశారని చెప్తారు. ఆ రోజులు ఏ యువకుడు రాత్రి ఇంట్లో పడుకోలేని స్థితి. చంద్రమౌళిగానీ, జయపాల్‌గానీ, విజయలక్ష్మిగానీ, ఇంకెందరో ఈ జిల్లా నుండి ఇప్పటికీ ఆజ్ఞాతంలో ఉన్నవాళ్లు, ఇప్పటికే అమరులయినవాళ్లు - దాదాపు అందరూ అటు దండకారణ్యం ఇటు దక్షిణ తెలంగాణ, రాయలసీమ, తూర్పు కనుమలకు విప్లవోద్యమ విస్తృతికై వెళ్ళిన వాళ్లే. వీళ్లు వెళ్ళిన చోట ఎటువంటి నిర్మాణాలు చేసి, ఎట్లా విప్లవోద్యమాన్ని విస్తరింపచేసారుఅన్నది ఒక అంశమైతే, ఇట్లా అమరులైన వారి మృతదేహాలతోపాటు వాళ్ల గ్రామాలకు వెళ్తే ఒక చిన్నయ్య (మాధవ్) కావచ్చు, ఒక చంద్రమౌళి కావచ్చు, ఇరవై, ఇరవై అయిదేళ్ల క్రితం వాళ్లు ఊళ్లు వదలి వెళ్లే ముందు అక్కడి స్థితి గతులేమిటి, అవి మార్చడానికి వాళ్లు చేసిన పోరాటాలు ఎటువంటివి, ఎటువంటి జనసమీకరణ చేసి, ఎటువంటి విశాల ఉద్యమాలు నిర్మించారు, ఇవ్వాల్టికే ఆ గ్రామాల్లో ఎన్నో మార్పులు వచ్చిన తర్వాత కూడా ఆ ప్రభావమూ, ఆ ముద్ర ఎంత స్పష్టంగా కనిపిస్తుందో పరిశీలిస్తే తెలంగాణ ఎంత విలువయిన వర్తమాన, భవిష్యత్ నాయకత్వాలను కోల్పోయిందో, పాలకులు, రాజ్యం ఎంత కుట్రపూరితంగా ఇటువంటి విత్తనం పగిలి నేల నుంచి మొలకెత్తే నాయకత్వాన్ని ధ్వంసం చేయాలని పూనుకున్నదో స్పష్టంగా అర్థమవుతుంది.

చంద్రమౌళి ఇంకో పార్శ్వం చెప్పకుండా ఇది ముగించలేను. 1990 వరంగల్ రైతు కూలీ సంఘం సభల తర్వాత అప్పటిదాకా వరంగల్ జిల్లా పీపుల్స్‌వార్ కార్యదర్శిగ ఉన్న రణదేవ్ కూడ గోదావరి ఏజెన్సీకి మారాడు. చంద్రమౌళి, రణదేవ్, అనల (నా రెండవ కూతురు) తూర్పు అడవుల్లో, మల్కన్‌గిరి ప్రాంతంలో కొంతకాలం పనిచేసారు. రణదేవ్ దండకారణ్యంలో మోటు పోలీసుస్టేషన్‌పై దాడిలో ప్రమాదవశాత్తు చేతిలో బాంబుపేలి అమరుడయ్యాడు. చంద్రమౌళి పాటలు, కవిత్వం విరివిగా రాసేవాడని అనల చెప్పింది. ఆయనది ఎప్పుడూ చిరునవ్వు వెలిగే మొహం. ఆయన మొహం చూస్తే ఇతడేనా మిలిటరీ యోధుడు అనిపిస్తుంది. ఎందుకంటే ఇరవై ఏళ్ల విప్లవోద్యమ సైనిక చర్యల్లో ఆయన నాయకత్వం వహించింది ఒక్కటీ విఫలం కాలేదు. అది చెప్పడానికి కాదు నేను రాసేది - ఆయన తూర్పు కనుమల్లో పని చేస్తున్నపుడు అజ్ఞాత జననాట్యమండలి 'తూర్పు కనుమలు' అనే సాహిత్య సాంస్కృతిక పత్రిక తెచ్చేది. దాని వెనుక చోదక శక్తి ఆయనే. 99 నుంచే ఆయన విప్లవ సాహిత్య సాంస్కృతికోద్యమానికి కూడ మార్గదర్శకత్వం వహించాడు. చర్చల కాలానికి కోందుభాషలో చాల పాటల క్యాసెట్లు, సిడిలు వచ్చాయి. చర్చల కాలంలో అవి హైదరాబాదు నగరానికి కూడ వచ్చి ప్రచారమయ్యాయి. ఆ కోందు భాషలో వచ్చిన పాటల్లో ఆయన రాసినవి ఎన్నో చెప్పగలిగిన వారు ఆయనతో పనిచేసినవాళ్లే.

కవులు, కళాకారులు, రచయితలు విడిగా ఉండే బయటి ప్రపంచంలో విప్లవోద్యమంలోనికి సామాన్యులుగా వెళ్ళినవాళ్లు విప్లవ సైనికులుగానే కాకుండా సాహిత్య, సాంస్కృతిక సైనికులుగా కూడ మారి కవులు, కళాకారులు రచయితలుగా పరిణతి చెందడం ఊహించుకోవడం కష్టం. పైగా అవి అక్కడి గాలి వలె, వెలుగువలె, వెన్నెల వలె, నీళ్లవలె, మట్టివలె, బహుశా అక్కడ చీకటి వలె, అజ్ఞాతం వలె అందరివీ అయి కూడ ఉంటాయి. గనుక ఎవరిదేదో ఒకరి ప్రత్యేక వ్యక్తిత్వాలుగా ప్రచారం కావు. నా ఉద్దేశ్యం కూడ చంద్రమౌళిని ఒక ఇరవై అయిదేళ్ల విప్లవ జీవితానికి ఒక పరిణామంగా, పరిణతిగా పరిచయం చేయాలనే తప్ప, వ్యక్తిగా చేయాలని కానేకాదు.

KLVA101M136

ARUNATARA
RNI REGISTERED NO. 21152/72 January-February-2007



కా. మల్లేల నారాయణకు
జోహార్లు

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M136
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	77
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	No
తయారు చేసినది	Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Priyanka
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good